తుమ్మల సీతారామమూర్తి

కనకాభిషేక సన్మాన సంచిక 1948

Teluguthejam.com



పరిచయం

పెద్ది సాంబశివరావు

జననం - 1943

ప్రాధమిక విద్యాభ్యాసం - స్వగ్రామం, ఉన్నవ, యడ్లపాడు మం. గుంటూరు జిల్లా,

ఉన్నత పాఠశాల - జగ్గాపురం , గుంటూరు జిల్లా

ఉద్యోగం – రాష్ట్ర ప్రభుత్వం, వైద్య ఆరోగ్యశాఖ

కుష్ఠు నివారణ/నిర్మూలన శాఖలో కార్యకర్త, పర్యవేక్షకుడు, అధికారి

రచనలు -ప్రముఖ జాతీయ/అంతర్జాతీయ కుష్ఠు సేవకుల జీవితచరిత్రలు

నిఘంటువులు - 6 భాషల్లో 50 నిఘంటువుల నిర్మాణం

తాళ్లపాక వారి కీర్తనల పట్టిక తయారు

గ్రంథాలయ లక్ష గ్రంథాల పట్టిక రూపకల్పన

అభిరుచులు - వ్యక్తి వికాసము, మృదునైపుణ్యాల శిక్షణ, గ్రంథ రచన,

అనువాదం - కొన్ని వేల పేజీల ఆంగ్ల-ఆంధ్ర అనువాదం.

తెలుగు కవులలో పేరెన్నిక గన్న తుమ్మల సీతారామమూర్తి గారు గాంధీ కవిగా, దేశభక్తునిగా విశేష ప్రఖ్యాతులు గడించారు. వారికి యువప్రాయంలోనే విశేష కనకాభిషేకము, గజారోహణము 1945లో గుంటూరు జిల్లా పొన్నూరు పట్టణమున జరిపారు.

ఆ సందర్భముగా ఒక జ్ఞాపకసంచికను ప్రచురించారు. అందు 150 మంది, నాటి ప్రముఖ కవులు, రచయితలు తమ సందేశాలను అందించారు.

లక్షకు పైగా పుస్తకాల నిలయం, గుంటూరు, అన్నమయ్య గ్రంథాలయములో మనసు ఫౌండేషన్ వారు అందజేసిన దాదాపు 40 వేల పుస్తకాలు, వాటి పట్టిక ఉన్నది. అందులో ఈ సంచిక లభించింది. దీనిని యూనికోడ్ రూపంలోకి మార్చి తెలుగు వారికి అందిస్తున్నాము. ఇందుకు సహకరించిన తుమ్మల కళాపీఠం, అధ్యక్షులు డా. కొండబోలు బసవపున్నయ్య గారికి, తప్పులు సరిదిద్దిన డా.సూర్యదేవర రవికుమార్ గారికి ధన్యవాదములు.

పెద్ది సాంబశివరావు

నవోదయము

శ్రీ కుఖ్టా వేంకట సుబ్బారావు

పలుకు   పలుకు పలుకు
మా యాంధ్రవాణి పలుకు
మా తెలుగుతల్లి పలుకు

రాజమహేంద్రపురీ పురందరుడు
రాజరాజ పేరోలగమ్ములో
నాట్యముచేసిననాటి వైభవము
నేటిక హో! యీ చోటగంటినని..పలు.

పేరుగన్న నెల్లూరు పురంబున
మనుమసిద్ధి రాణ్మౌళి కొలువులో
శంఖనాదముల సంరంభములో
ఝుంకృతిచేసిన సౌఖ్యమబ్బెనని.పలు.

హరిహరరాయ ధరాధినాయకుని
కనకస్నానము నేటికబ్బెనని.పలు.
కంచుఢక్క భేదించి గడించిన
తళుకుతళ్కుముత్యాలశాలలో
కృష్ణరాయ భూకాంతుని సభలో
అష్టదిగ్గజా లమరినసభలో

ఘల్లు ఘల్లుమని గర్జలు సల్పిన
మంజీరధ్వని మరలవింటినని ..పలు.
రఘునాథుని యాస్థానవీధిలో
రత్నహారములు కాన్కలుగాగొని
భద్రగజముపై వాడవాడలను
పయనము సల్పినఠీవి గంటినని..పలు.

అభినవతిక్కన సన్మానములో
ఆద్యగౌరవము లెల్ల దక్కెనని
తక్కిట తథిగిణ తకథై యంచును
తాండవించి రాణించితి నేడని.పలు.

తొలిపలుకు

సమాజవికాసము కల్గించు వారిలో కవియొకడు. అంతే కాదు, ప్రముఖుడు కూడ. అతడు ద్రష్ట. అతనిచూపు విశ్వవ్యాపకము.

అతనిసృష్టి సత్యము, శివము, సుందరము. అతడు నిద్రాణమైయున్న జాతిని మేలుకొల్పు వైతాళికుడు. అతని వాణి ప్రజానీకము నున్నతోన్నత శిఖరముల కెక్కించు నిశ్రేణి. అతడు లేని సంఘము నిర్జీవము. అతని నారాధింపని జాతి నిస్తేజము.

తరతరాల దాస్యముచే తన సంస్కృతిని గోల్పోయి క్రుంగి కుమిలిన మన సంఘము నేటికి - స్వతంత్రమై పురోగమించుచున్నది. అది ఉత్తమ మార్గములో పయనించి, విశ్వకల్యాణకారి యగునట్లు, తోడ్పడవలసిన బాధ్యత, అధికారము కవులకు హెచ్చుగా కలదు. అట్టి వారిని గుర్తించి, గౌరవించి వారి సందేశమును శిరసావహించి ఓజస్సు, తేజస్సు సమార్జించుకొనుట సంఘమున కవశ్యకర్తవ్యము. కావున వర్తమానాంధ్ర కవులలో సుప్రసిద్ధులై చిరకాలికమైన సారస్వత సేవచే తెలుగుజాతికి జాగృతి కల్గించుచున్న అభినవ తిక్కన, శ్రీ తుమ్మల సీతారామమూర్తి చౌదరిగారిని సత్కరించుట సముచిత ధర్మమని తలంచితిమి. తెలుగునాడెల్ల మా యుద్యమముపట్ల నాదరాభిమానములు చూపి మాకు జవము, జీవము ప్రసాదించుట - ప్రశంసనీయము.

ఈ సందర్భమున మా విజ్ఞప్తిని పాలించి యీ సంచికకు అమూల్య రచనల నంపి తమ సౌజన్యమును ప్రకటించిన రచయితల కందఱకు మా నమోవాకములు.

వినీతుడు, వెలువోలు సీతారామయ్య, సన్మానసంఘాధ్యక్షులు

50 మందితో సన్మాన కమిటీ ఏర్పాటు చేశారు.

150 మంది కవులు, రచయితలు సందేశాలు పంపారు.

ఇతడు దేవరకోట రాజ్యేందిరా మ
నః ప్రియుడు శివరామ భూనాయకుండు
పేర్మిమై జాళువా గండపెండెరంబు
తొడిగి నవతిక్కనకు సొంపు లిడినవాడు

....

అధ్యక్షోపన్యాసము

శ్రీ తుమ్మల సీతారామమూర్తి గారియెడ నాకు గౌరవాభిమానము లెక్కువ. వారియొక్కకృతిని గాంధీగారి యాత్మకథను జదివినప్పుడు నాకుగల్గిన యానందా శ్చర్యములకు మేరలేదు. అప్పుడు వారితో నాకు బరిచయము సున్న. వారిపేరైన విన్నవాడనుగాను. అయిననేమి? "నిక్కమైన మంచినీలము" చూపుతోడన హృదయము నాకర్షించును. స్వయంప్రకాశమున్నచోట దూతికలేల? ఒకరుచెప్పి చూపవలయునా? "కనులుండిన గాంతసొగసు కనబడదొక్కో" ఆటవస్తువుల యెడను, వ్యక్తులయెడను మెప్పు స్వయంభవము.

గాంధీగారి యాత్మకథను జదివినవెంటనే శ్రీ చౌదరిగారికి నాయొక్క మహదామోదమును దెలుపుచు లేఖ వ్రాసితిని. వారడిగికాదు. ఒకరి ప్రేరేపణమిద గాదు. అనివార్యమైన స్వేచ్ఛ స్వేచ్ఛమై నాటినుండి నేటివఱకు వారికవిత్వమునెడ నాకు నుండు గౌరవ భావమును, దానినుండి నే బడయు హృదయాహ్లాదమును దినదిన ప్రవర్ధ మానములగుచున్నవి. పరిమితి లేదు. అమితత్వ దోషమును లేదు. కొనసాగుచున్నదిగాని కొననంట లేదు.

నిజమైన కవిత్వముయొక్క గుణములలో నిది యొకటి. ఎన్నిమార్లు చదివినను విసుగు పుట్టదు. క్రొత్తక్రొత్త రసములు స్ఫురించును. ఎంతదినిన నాకలి తీరదు. రోయింపు పుట్టదు. ఇంకను దినగోరుదుము.

వీరి గ్రంథములయందెల్ల నాత్మకథ యగ్రగణ్యము. తక్కినయవి సామాన్యములు కావు. కాని వానియందలి

విషయములు గాంధీగారి జీవితముతో దులదూగ జాలినంత గొప్పవికావని నాయభిప్రాయము. శైలికి దగినట్లు విషయముండవలయును. లేనిచో నది పదాడంబర ప్రకటనమగును. విషయమునకు దగినట్లు శైలి యుండవలయును. లేనిచో జీవముండినను నాకృతి సౌందర్యముండదు. రసవంతము కానేరదు. ఆకర్షింపదు. ఆత్మకథయందు రచన మనోహరము. గాథ

లోకోత్తరము. ఇంత ప్రశస్తముగ రెండును దక్కిన గ్రంథములలో నలపడెనో లేదో నేను దృఢముగ జెప్పజాలను. దేశభక్తి, యాంధ్రాభ్యుదయ రక్తి, పితృపూజ యివన్నియు మన జీవితమున నఖండములైన జ్యోతులు! వాని వెలుగుచే మనల నావరించియుండు తమము కొంతకు గొంత విరియును. అయినను వీనికిని మించిన యితివృత్తములు లేకపోలేదు. యావన్మానవుల యాత్మలను బరవశములజేసి హృదయము నగలించి మనసులకు నిశ్చైతన్య మొసంగెడు కావ్యములు, భారత రామాయణముల వంటివి పుట్టవా యికముందు? హైందవ భావనాశక్తి యడుగంటి యింకి పోలేదు. దేశమునకు స్వతంత్ర పరిపాలనాభాగ్యము సంభవించినది. ఈ గొప్పకథకు దగినట్టి వీరకావ్యములను వ్రాయజాలిన వారలలో సీతారామమూర్తి యున్నాడా? లేడా? ఉన్నాడని నా నమ్మిక. నా నమ్మిక వమ్ముచేయడనియు నా విశ్వాసము. సీతారామా! విశ్వాస ఘాతుకుడవు కాకుము.

మన చౌదరి యతిప్రాసములకై భంగపాటుచెంది తలగోకికొనుచు బలాత్కార పదప్రయోగములు చేసి, యర్థము ననుసరించి పదములువాడక, పదములబట్టి యర్థమును వంపులుపెట్టి వంగజేయు నీరసుడుగాడు. భావ మనర్గళముగ బ్రవహించు చందాన వ్రాయు మహనీయుడు. యతి పదాదియందేకాక మధ్యమునను గొనను వ్రాలును. ప్రాసమునకు, యతికినై పద్యము యొక్క నడక నిలిచి దాటవలసిన యిబ్బందిలేదు. అర్థమును బట్టి పదములు, పదములలో లీనమైనరీతిని యతిప్రాసములు ననాయాసముగ, నప్రయత్నముగ, స్వచ్ఛందముగ వచ్చి చేరుచుండును. ఈ సిద్ధియందు బ్రసిద్ధుడు తిక్కన. ఈ వర్గమున దిక్కన్నతో సజాతీయుడైనవాడు మన చౌదరి. అనగా సరిసమానుడని యతిశయోక్తి బలికి యపాయము దేను. ఆ వర్గమున నగ్రాసనత్త్వము లేకున్నను నాసనత్వముకలవాడని నా మనవి.

నన్నయ సాంస్కృతిక దీర్ఘసమాసముల వెదచల్లినాఁడు భారతములో, కాని యవి యన్వయ సౌకర్యమున నర్థ సౌలభ్యమున సాధారణమైన పదములకంటె నేమాత్రము కఠినములు కావు. మఱి యవన్నియు శ్రావ్యములు, సరళములు పామరులకు సయితము సులభ వేద్యములు కాగలవి. మన చౌదరియు నిట్టిసమాసముల రచించుటయందును నిజముగ భారతీయుఁడ ! నన్నయయందు బోలె, బేరునకు మాత్రము సాంస్కృతికములు: నిజమున కాంధ్రములు. కవితాకళలో నద్భుతానందముల సమకూర్చు నంశములలో నిదియొకటి. ఎఱ్ఱనయుఁ, దిక్కనయు నన్నయ్యకు నీడుజోడులే. యీ మహత్తరశక్తిని. వారు వ్రాసిన దందరకు నర్థమగుటకొరకు. అందఱి మనసులు కరఁగుటకునై. ఆ సంప్రదాయము నుద్ధరించిన యాధునికుడు సీతారామమూర్తి.

స్వయముగ నీ యుత్సవ సభలకువచ్చి కన్నారఁ జూచి చేతులారఁ జేయుభాగ్యము విధికృతంబుచే నాకు లభించినది కాదు. కారణములు తెలుపలేను. ప్రకృతము నాది శోకపూరితమైన బతుకు. శాంతి లేదు. సౌఖ్యమంతకు మున్నె లేదు. “తన చేసినదానం బడకపోవ శివునకు వశమే?'' అనుభవింపకతప్పదు. నే రానందున సీతారామమూర్తికి గలుగు సేగి, లోటు లెవ్వియు లేవు. ఆ నష్టములు నావి. మనఃకష్టములును.

శ్రీ సీతారామమూర్తి యొక్క గొప్పతనమును గ్రహించి యుక్తరీతి నీ యుత్సవములచే గౌరవించిన యాంధ్రులు తమకర్తవ్యమును నెఱవేర్చిన ధన్యులు. వారికిని నా యభినందనములు.

మదరాసు 25-12-48

విధేయుడు,

కట్టమంచి రామలింగారెడ్డి

రచయితలు

శ్రీ పాతూరి నాగభూషణము
శ్రీ అంబి వేంకటప్పయ్య
శ్రీ అడ్డాడ వీరభద్రాచార్యులు
శ్రీ అద్దేపల్లి నాగగోపాలరావు
శ్రీ అన్నమరాజు వేంకటేశ్వరరావు
శ్రీ అయితం కాళీవరప్రసాదరావు
శ్రీ ఐనంపూడి ప్రసాదరావుచౌదరి
శ్రీ అయ్యంకి వేంకటరమణయ్య
శ్రీ ఇనగంటి పున్నయ్య చౌదరి
శ్రీ ఇనగంటి వేంకటప్పయ్యచౌదరి
శ్రీ ఉపాధ్యాయ మిత్రుడు
శ్రీ ఉప్పల నాగయ్యచౌదరి
శ్రీ ఏటుకూరి వేంకటనరసయ్య
శ్రీ ఏలేశ్వరాచార్యులు
శ్రీ ఓగేటి పశుపతి
శ్రీ కడివేటి నరసారెడ్డి
శ్రీ కన్నెకంటి వీరభద్రాచార్యులు
శ్రీ కరుణశ్రీ
శ్రీ కాటూరి వేంకటేశ్వరరావు
శ్రీ కుప్లా వేంకటసుబ్బారావు
శ్రీ కె.వి.సుబ్బయ్య
శ్రీ కొండవీటి వేంకటకవి
శ్రీ కొండూరువీరరాఘవాచార్యులు
శ్రీ కొడాలి చక్రపాణి
శ్రీ కొణిదెన బాలకృష్ణయ్య
శ్రీ కొప్పరపు మల్లికార్జునరావు కవి
శ్రీ కొమ్మినేని వేంకటరామయ్య
శ్రీ కొసరాజు రాఘవయ్య చౌదరి
శ్రీ కోగంటి దుర్గామల్లికార్జునరావు
శ్రీ కోట వీరాంజనేయశర్మ
శ్రీ కోన ప్రసాదరావు
శ్రీ కోపల్లె శ్రీనివాసరావు
శ్రీ కోలవెన్ను రామకోటేశ్వరరావు
కోళ్ళపూడి మల్లికార్జునకవి
శ్రీ కోవెలమూడి వేంకటేశ్వరులు
శ్రీ క్రొత్తపల్లి వేంకటరత్నము
శ్రీ గడియారం వేంకటశేషశాస్త్రి
శ్రీ గవిని గోపాలకృష్ణచౌదరి
శ్రీ గిద్దలూరి చెంచుబసవరాజు
శ్రీ గూడూరి నమశ్శివాయ
శ్రీ గొర్రెపాటి వెంకటసుబ్బయ్య
శ్రీ చల్లా పిచ్చయ్య శాస్త్రి
శ్రీ చింతలపూడి శేషగిరిరావు
శ్రీ చిన్నము రామయ్య చౌదరి

శ్రీ చిరంజీవి కొండయ్య
శ్రీ చెళ్ళపిళ్ల వేంకటశాస్త్రి
శ్రీ జంపాల వేంకటనృసింహము
శ్రీ జాస్తి చల్లయ్య
శ్రీ జాస్తి వేంకటనరసయ్య
శ్రీ జాస్తి శ్రీరాములు
శ్రీ జాస్తి సూర్యనారాయణ
శ్రీ జి. జాషువ
శ్రీ జి. జోసఫు
శ్రీ జొన్నలగడ్డ సత్యనారాయణ
శ్రీ తాడేపల్లి సాంబమూర్తి శాస్త్రి
శ్రీ తాళ్లూరి కృష్ణమోహనదాసు
శ్రీ తుమ్మల కోటయ్య
శ్రీ తోటకూర వేంకటేశ్వరరావు
శ్రీ దండిపల్లి వేంకటసుబ్బాశాస్త్రి
శ్రీ దీపాల పిచ్చయ్యశాస్త్రి
శ్రీ దుగ్గిరాల బలరామకృష్ణయ్య
శ్రీ దురిశేటి వేంకటరామాచార్యులు
శ్రీ దువ్వూరి వేంకటరమణశాస్త్రి
శ్రీ దేవినేని సూరయ్య
శ్రీ దేవులపల్లి రామానుజరావు
శ్రీ దేసు సత్యనారాయణ
శ్రీ దొప్పలపూడి అనసూయాదేవి
శ్రీ దోమా వేంకటస్వామిగుప్త
శ్రీ ధనేకులబుచ్చివెంకటకృష్ణచౌదరి
శ్రీ ధూళిపాళ వేంకటసుబ్రహ్మణ్యం
శ్రీ నందివెల్గు వేంకటేశ్వరశర్మ
శ్రీ నాగళ్ళ గురుప్రసాదరావు
శ్రీ నామతీర్థాల పుల్లయ్య
శ్రీ నార్ల వెంకటేశ్వరరావు
శ్రీ నిమ్మగడ్డ రామకోటేశ్వరశాస్త్రి
శ్రీ నూతలపాటిశంకరావు
శ్రీ పంద్యారం వేంకటసుబ్బయ్య
శ్రీ పగడాల నాసరాచార్య సిద్ధాంతి
శ్రీ పరుచూరి వెంకయ్యచౌదరి
శ్రీ పల్లెకొండ రంగయ్య
శ్రీ పి.వేం.గోపాలరావు
శ్రీ పిశుపాటి నారాయణ శాస్త్రి
శ్రీ పులిపర్తి సుబ్రహ్మణ్యాచార్యులు
శ్రీ పూతలపట్టు శ్రీరాములరెడ్డి
శ్రీ పెండ్యాల సత్యనారాయణ
శ్రీ పెనుమర్తి వేంకటేశ్వరశాస్త్రి
శ్రీ ప్రతాప రామకోటయ్య
శ్రీ ప్రయాగ
శ్రీ బాచిమంచి శ్రీహరిశాస్త్రి
శ్రీ బి.వి.వరప్రసాదరాయ శర్మ
శ్రీ బి.వి.సత్యనారాయణ
శ్రీ బులుసు వేంకటేశ్వరులు
శ్రీ బూదూరు రామానుజులురెడ్డి
శ్రీ బృందావనం రంగాచార్యులు

శ్రీ బొడ్డుపల్లి పురుషోత్తం
శ్రీ బోడేపూడి వేంకటరావు
శ్రీ బ్రహ్మాండం రామకోటేశ్వరరావు
శ్రీ భమిడిపాటి అయ్యప్పశాస్త్రి
శ్రీ భీమిరెడ్డి వేంకటప్పారెడ్డి
శ్రీ మంగళగిరి దాశరథి
శ్రీ మధునాపంతుల
శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మ
శ్రీ మల్లాది వేంకటకృష్ణయ్య
శ్రీ మారుపూడి వెంకటేశ్వరులు
శ్రీ ముక్కామల రాఘవయ్య
శ్రీ ముక్తినూతలపాటి సీతారామయ్య
శ్రీ ముదిగొండ వీరభద్రమూర్తి
శ్రీ ముసునూరి భాస్కరరావు
శ్రీ మేడికొండ శ్రీరాములు
శ్రీ యడ్లపల్లి దేవయ్య చౌదరి
శ్రీ యన్.వి.రత్నం
శ్రీ యర్రోజు మాధవాచార్యులు
శ్రీ యాచమనేని మాధవరావు
శ్రీ యార్లగడ్డ వెంకటసుబ్బారావు
శ్రీ రాయప్రోలు సుబ్బారావు
శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ
శ్రీ లేళ్ళ వేంకటరామారావు
శ్రీ వడ్డెపాటి విద్యానంథశర్మ
శ్రీ వడ్లమూడి వేంకటరత్నము
శ్రీ వల్లూరి శంకరయ్య
శ్రీ వల్లూరి సత్యనారాయణచౌదరి
శ్రీ వాకాటి పెంచలరెడ్డి
శ్రీ వారణాసి వేంకటసుబ్బారావు
శ్రీ వాసిరెడ్డి వేంకటసుబ్బయ్య
శ్రీ వాసిలి రామకృష్ణశర్మ
శ్రీ వింజమూరి శివరామరావు
శ్రీ విశ్వనాథ వేంకటేశ్వరులు
శ్రీ విశ్వనాథ సత్యనారాయణ
శ్రీ వెంపటి పురుషోత్తం
శ్రీ వెలగపూడి దానయ్యచౌదరి
శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి
శ్రీ వేదాంతం గోపాలాచార్యులు
శ్రీ వేదాంతం జగన్నాథాచార్యులు
శ్రీ వేదాంతకవి
శ్రీ వేలూరి శివరామశాస్త్రి
శ్రీ శేషాద్రిరమణకవులు
శ్రీ శోభనరావు
శ్రీ సుంకర శివరామయ్యచౌదరి
శ్రీ సుసర్ల వేంకటేశ్వరశాస్త్రి
శ్రీపొన్నలూరి సూర్యనారాయణ శర్మ
శ్రీమాధవపెద్దిబుచ్చిసుందరరామశాస్త్రి
శ్రీశిష్టా సత్యనారాయణరాజశేఖరము
సత్యనారాయణశాస్త్రి

ఆశీస్సు — శ్రీ చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి, శతావధాని

సీతారామయచౌదరి
ఖ్యాతి గణించెన్ గవిత్వ కల్పనయందున్
నూతన తిక్కన యన్నా
రీతని సమకాలికులు కవీశ్వరు లెలమిన్
విద్యయున్న లేదు వినయంబు, వినయమ్ము
కలదయేని విద్యగలుగు టరిది
ఇతని పట్ల నుభయ మెసకమ్మెసంగె ది
క్కన్న బలెనె కీర్తిగాంచుగాక
కలవాడీతడు శిరమున
గలవాని ధరించు వేల్పుకరుణన్ శ్రీయున్
గలయున్ జిరాయువున్ వ
ర్ధిల వర్తిలుగాక సుకవిధీరులు మెచ్చన్
దోసతోట బోలు తోకమ్ముతో సిరి
తో యశమ్ముతో నితోధికమగు
గరిమతోడ మెచ్చు గాంచుత గవులెల్ల
దనదు విభవమున కెద న్నుతింప
వచ్చునట్టి వయసు వార్ధకమ్ముగదా! ని
రామయతయ దాని కమరవలయు
గాన సభ్యులేక కంఠులై యీయన
కర్థి గోరుడెపు డనామయంబు

కృతీ!   వేలూరి శివరామశాస్త్రి

నారీతిం గవనంబు చెప్పగల యంతస్సారముం గల్గు వీ
డౌరా వీనికి బోలు గౌరవము నీయాంధ్రప్రజల్ చేయుచు
న్నా రంచుం గని తిక్కయజ్వ కవితానాథుండు దీవించెడుం
దారామండలమందు నుండి యిదె సీతారామమూర్తీ! నినున్
ఏనా డక్షయమౌ కటాక్షముల నిన్వీక్షించెనో వాణి నీ
వానాడే మరి యేను గెక్కితివి విద్యాకేతు హస్తుండవై
యానాడే కనకాభిషిక్తుడవు నీ వైనాడ వీ రెండు న
ద్దానన్ నేడు విడంబనమ్ము చుమి సీతారామమూర్తీ! కృతీ!
తపనీయేష్టకలన్ భవజ్జనకు డే ధర్మంబు ముం దంతికో
లపతుల్యంబుగ దూచి యిచ్చె నవలీలం జూచి యాధర్మమే
యిపు డీ నీ కనకభాభిషేకమున కెంతే బీజ మీ నీ కవి
త్వపు భాండారము తచ్ఛరీర మగు సీతారామ కవ్యగ్రణీ!
ఏనుం గెక్కుట రాజలక్షణ మహో హేమాభిషేకోత్సవో
త్సానందం బది సార్వభౌములకు దా నంకంబు నీ రెంటి సం
ధానం బుండుట 'బూర్జువా' కవియె సీతారామకవ్య గ్రియుం
డౌనం చాడెడువా రుపాయనము చేయన్ లగ్గు 'నోబెల్' వలెన్
కమ్మ కవిత్వము చెప్పెడి
కమ్మ కవీశ్వరుని చేత గర్మకులంబౌ
కమ్మ కులమ్మిప్పుడుగా
కమ్మ కులంబాయె వాణికమ్మలు తొలుకన్

ఆశిషః

శ్రీమాన్ పండితశిరోమణి, మహావిద్వాన్,
వేదాన్తం జగన్నాథాచార్యులు

సీతారామకవే! కవీన్ద్ర సమితావస్యాం మహార్థాన్వితా
నిర్దోషా సరసా సుకోమలపదన్యాసా గభీరాశయా
సద్వృత్తా కవితావధూ ర్జనపదాన్ సర్వాన్ చరిత్వా తవ
ప్రీత్యా యా కనకాభిషేకమకరోత్సా వర్ధతాం వర్ధతామ్
సభాస్వనేకాసు విహాయభీరుతాం
కవే! చరన్తీ కవితాసరస్వతీ
అభేదబుద్ధిం త్వయి కుర్వతీపదే
దధాతి మంజీరమితి ప్రబుధ్యతే
విహాయ హంసం కవితాసరస్వతీ
బహూపభోగా దధునా కుతూహలాత్
గజం, చజైష్ణుం విబుధేన్ద్ర మానితా
కవీశ్వరారుక్షదితి ప్రమన్యతే
హృద్యాయా కవితా రసోర్మిలవితా లిద్వన్నృపాలాలితా
ధీమంస్తే నవతిక్కనాఖ్యభిరుదం స్వార్ణం రణన్నూపురం
ప్రాదిత్సత్కనకాభిషేక మధునా శ్రీమద్గజారోహణం
తాభ్యాం శ్రీపరమేశ్వరః కరుణయా దద్యా త్సదా మంగళమ్
విష్ణుం దాశ్రితగోపగోపటల గోపీయౌవతానందవ
ర్తిష్ణుం దార్తియుత ప్రపన్న జనతాశ్రేయఃఫలాకల్పరో
చిష్ణుం దార్తియుత ప్రపన్న జనతాశ్రేయః ఫలాకల్పరో
కృష్ణుం డీ నవతిక్కనాఖ్యకవికిన్ క్షేమంబులం గూర్చుతన్

సాప్తపదీనము

శ్రీ విశ్వనాథ సత్యనారాయణ

కనకాభిషేకంబు కావింతురే కాని, యొక స్కూలు హెడ్మాస్టరౌసగ బోరు
గండపెండేరంబు కాలనుంతురె కాని, యే పెద్దపదవికి నెక్కనీరు
ఏనుగుపైన నూరేగింతురే కాని, రాజ్యాంగములదెస రా నొసగరు
అభినవతిక్కన్న యని పిల్చెదరు కాని, రాయబారముల తీర్పంగ నీరు
వ్యక్తిపై బులుపో బాసపైని వలపొ
తల్లి బాస పైపైని యాదరము కలిమి
యుప్పుగంజియు నింటిలో దెప్పుటయును
మాతృభక్తి మహాసభామండపముల.
ఒక యన్యాయము చేయజాలమి మహోద్యోగానికిన్, భేద భా
వకధీసంపుటిలేమి నాధునిక సంపద్దీప్తికిన్, ధర్మక
ర్షకమౌబుద్ధియు గల్మి లోకమమతారంభాప్తికిం గాని చా
లక నీ వచ్చ తెలుంగు బాసకవి వేలా కావు ధీమన్మణీ!
పికముల్ కూయు శుకంబులున్ మొఱయు తీవిన్ గేకులున్ మ్రోయు నీ
సకలోద్యానము నందు నాంధ్రమయభాషాభారతామ్నాయ శ
బ్దకవిబ్రహ్మరహస్యసంగ్రథనశ క్తం బొక్క నీ వాక్కె, కొం
తకు తత్వజ్ఞులు కాని వారల వసంతంబుల్ వచోధోరణుల్
నాచేగానివి నీ వెఱుంగుదవ యన్నా! బట్టుకైవారముల్
నా చేతంబున శక్తి చాలదని యన్నం గాని కావచ్చు; నే
దాఁచం దోచినయంతవట్టు, భవదుద్యత్సాధునిర్దుష్ట శ
య్యాచిత్రం బెసలారు దిక్కకవిదీవ్యద్భారత స్వచ్ఛమై

ఎనసి పరీక్షచేసి యిది యింత వెలంచును నిర్ణయంబు చా
లని తెలుగుం గవిత్వపుబొలాల నహో ప్రతివాడు కాళిదా
సునకును మేనమామ ననుచు న్నటియించును గాని వేడు స
జ్జనుడని చెప్పరాదు కవిచంద్రమ! ని న్నొకనిన్ ద్యజించినన్
అన్నమాటకు దిరుగాడ వంటకును నీ గొప్పేమి నీ తండ్రి గుణము వచ్చె
మివుల తీవి నెసంగు మేలైన మూర్తి నీ యెక్కు వేమి కులాననే కల దది
నిర్దుష్టరచన నిండిన పెల్లదేమి తిక్కన గురుమూర్తి నేర్పినది కాక
యెడద మెత్తదనంబు కడిది యే మధికంబు సహజమౌ కవియైన జన్మఫలము
ఆత్మకథ తెన్గుసేసితి వంతకంటె
నెవడు నచ్చును బోసివా డెవడొ కాక
నిన్ను మెచ్చుద మన్న గన్పించ దేది
భవదపఘన నిర్మాణ సంపత్తి తక్క

నినుబట్టి తెలుగు నుడిపొలమున దుమ్మలలోన బ్రొద్దు పొడిచెను సఖుడా!
నినిచిన తమ్మి వెలందుక కనుదమ్ముల వెలుగు రేక కదలు కొనంగా

చౌదరీ

శ్రీ దీపాల పిచ్చయ్యశాస్త్రి

పరమాప్తులయిన మీకు గజారోహణాది సన్మానము జరుగనున్న వార్త నన్నానందభరితుని గావించినది. అనితర సాధారణమైన కమ్మదనము సహజముగనే కల మీ కవిత్వమున తిక్కన రసాభ్యుచితబంధము, శ్రీనాథుని శైలీ సౌభాగ్యము, పెద్దన ప్రసాదగుణమును ఇరవుకొన్నవి. కావుననే రసికలోకము మిమ్ము 'అభినవతిక్కన' యనియు, పేర్కొనవచ్చునని నా తలపు. సుహృన్మణీ! విద్వత్కవిబృందారక బృందసుందరమగుటచేత కనులకును, కవితా కళామర్మవిదులును చతురవచో నిధులును నగు అధ్యక్షుల చమత్కారపు చెణుకులతో వీనులకును విందుసేయు మీ సన్మానసభాశోభ అపూర్వానంద సంధాయక మగును గదా!

\- - - - - - - - - - - - - - - - - -

కాన్క

శ్రీ జి.జాషువ

ముగ్గురు సత్కవుల్ కరగిపోసిన భారత కావ్యసృష్టిలో
నిగ్గను ఘంటికాగ్రమున నిల్పిన చౌదరి తిక్కయజ్వ! నీ
పగ్గియ యేన్గు నెక్కి వలపాదమునందు పసందు జాళువా
గగ్గెర దాల్చు నన్నునుడి గర్వము గూర్చె కవీంద్ర కోటికిన్
పులకల్ గూర్చు తెలుంగు వీరుల కథాపుష్పాంజలిన్ జల్లి మే
ల్కొలుపుల్ పాడిన రాష్ట్రగాన మిపుడుగ్గుంబాలతో నాంధ్ర కాం
తలు ద్రావింతు రనుంగుబిడ్డలకు సీతారామవిద్మన్మణీ!
వలచె న్నిన్ను పసిండిపెండియరముల్ బంగారు గంగాపగల్
మును ముత్యాలమహాళ్ళలోన గనకంపుం బుగ్గలం దానమా
డిన శ్రీనాథకవి ప్రభూత్తమునకంటెన్ దొడ్డమర్యాద లం
దిన దివ్యత్కవితాకళానిధివి సందేహంబులే దాంధ్ర నం
దన! దీర్ఘాయువు నీకు చౌదరి కవీంద్రా! శారదా విగ్రహా!

\- - - - - - - - - - - - -

సందేశములు

శ్రీ సీతారామమూర్తి చౌదరిగారి కనకాభిషేకాది సత్కారములకు జాలసంతోషించుచున్నాను. సౌశీల్యము, సత్కవిత, సత్కవితకుదగిన సద్వస్తుగ్రహణము, వారియెడ నాకు గౌరవమాపాదించినవి. నిరాటంకముగా వారి సత్కారోత్సవములు సాగుcగాక.

-శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి

శ్రీ అభినవతిక్కన బిరుదభాగులైన సీతారామమూర్తి చౌదరిగారికి తాము జరుపనెంచిన మహాసన్మానము చాలా ప్రమోదావహమైన విషయము, ఆంధ్ర దేశీయసంప్రదాయమును తాము చక్కగా నిర్వహింప సంకల్పించితిరి. నా హార్ధాభినందనములు. తమ సంకల్పించిన యుత్సవం మహోదయముగా నెర వేరుcగాక !

-శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

మహాకవినేత

శ్రీ మాధవపెద్ది బుచ్చిసుందరరామశాస్త్రి

ఏపరిమేష్ఠినాట జనయించెనొ యీ కవితాకుమారి నీ
ప్రోపున జేసి సర్వవిధభూషణభూషితయై లసద్ర సో
ద్దీపితయయ్యె నీకు సరిదీటు మహాకవినేత యెన్ని యె
న్నో పురుషాంతరమ్ములకు నొక్కొక డుద్భవమందు చౌదరీ!
సుహృత్తమా! శ్రీ గడియారము వేంకటశేషశాస్త్రి
కవివరుడు దేవతాంశసంభవు డటంచు
సింధురారోహ కనకాభిషేకబిరుద
లాంఛనముల బూజించు కాలంబు మరల
వచ్చినటు నేటి సన్మాన వార్త దెలుపు
వరవాచావిభవంబు రంజిలగ భావస్ఫూర్తి దైవార సుం
దరబంధంబుగ బద్యగద్యరచనాధౌరేయులౌ వారిలో
ధరబేర్వాసి గడించినాడు గద సీతారామమూర్త్యాఖ్య 'చౌ
దరి' సౌందర్యము నించు కార్యమగుగాదా! వారి సత్కారమున్
తరతమవిజ్ఞతన్ హితమితప్రియభాషల నేరినైన సా
దరముగ గౌరవించునుచితజ్ఞుడు భావపదార్థ బంధ బం
ధురముగ భావనాబలముతో రససృష్టి యొనర్చు సత్క వీ
శ్వరుడు వినీతుడుత్తముడు చౌదరి సత్కృతుజేయుటొప్పదే!
కవియు మహానుభావుడగు గాక జనుల్ తదుదారకావ్యవై
భవములకున్ గరంగు ననుభావముబొందక యున్న బొందియా
కవికొక మంచిమాటయిన గానుక పెట్టకయున్న నెందు కా
కవియు గవిత్వ ? మిందురసిక ప్రవరుల్ సుమి యాంధ్రసోదరుల్
తమ సత్కారమహోత్సవాకలన సీతారామమూర్తీ! సుహృ
త్తమ! యాహ్లాదముగూర్చెనయ్య! విపులాంధ్రక్షోణి నీ భవ్య కా
వ్యములన్ డెందమువిచ్చెనయ్య! కవివర్యా ! యిట్లె సత్కావ్య పు
ష్పములన్ గొల్వుమువాణి; మీకమరతన్ సంపచ్చిరాయుష్యముల్

దువ్వూరి వేంకటరమణశాస్త్రి

సీతారామమూర్తి చౌదరిగారికి జరుగుచున్న యీ సన్మానము మీలో నెక్కువ మంది కంటెనో యందఱకంటెనో నాకెక్కుడుగ నానందదాయకము. ఆయనకును నాకును గల యనుబంధము తాదృశము. ఈ కవివర్యుడు సరసుల హృదయసీమలందు నిరంతరము, సలక్షణమగు కమ్మని కవితాప్రసంగముల వెలయించుచు నమూల్యమగు యశోలక్ష్మి నందగల్గుటకు దగిన యారోగ్యమును భాస్కరుడనుగ హించుగాత మని నాకోరిక. -శ్రీ

* * *

కోలవెన్ను రామకోటేశ్వరరావు

పండితులు, సరసకవులు, సత్పురుషులు అయిన సీతారామమూర్తి చౌదరిగారికి ఇంతటి సత్కారం జరుగుతున్నదంటే ఎంతో సంతోషం కలుగుతూఉంది. చౌదరిగారి రాష్ట్ర గానం ఆంధ్రులకు మేలుకొలుపులు పాడింది. ధర్మజ్యోతి మొదలయిన వారికృతులు సజీవ రచనలు. పూర్వకవుల పోకడలన్నీ పుడికి పుచ్చుకున్నారు చౌదరిగారు. గాంధిజీ ఆత్మకథను చౌదరిగారు నిరుపమానంగా రచించారు. కృష్ణరాయాదిచక్రవర్తుల కాలంలో ఆంధ్రభాష అనుభవించిన మహాభోగాన్ని తలపునకు దెచ్చే నేటిసత్కారమును ఆంధ్ర ప్రజలే చౌదరిగారికి జరపటం ఎంతైనా కాలోచితంగా ఉండి, ఆంధ్ర సారస్వతవృద్ధిని కాంక్షించే మాబోంట్ల కభినందనీయ మవుతున్నది. -శ్రీ

* * *

శ్రీనార్ల వెంకటేశ్వరరావు. తెలుగుతీపి, తెలుగుపస "అభినవ తిక్కన " కృతులలో తొణికిస లాడుచున్నది. ఆయనను సన్మానించడం ద్వారా ఆంధ్ర దేశం తనను తానే సన్మానించుకొంటున్నది. -శ్రీ

* * *

కనకాభిషేకము

శ్రీ విశ్వనాథ వేంకటేశ్వరులు

సమతాబంధురమై ప్రసాదగుణవర్చస్వంతమై చారువా
క్సుమనస్సౌరభపూర్ణమై కవిజనాకూతిప్రియం భావుక
త్వములన్ నీమన సట్లు నీకవితయున్ భాసిల్లు నిర్దుష్టము
త్తమకక్ష్యాగణనీయమై యెసగి సీతారామ సన్మిత్రమా!

మాయల్ బూటకముల్ మృషాభినయముల్ మచ్చుల్ పరోచ్ఛిష్టముల్
హేయ క్షుద్రకలావికారములు నోరెత్తన్ వడంకాడు నీ
శ్రీయుక్సత్త్వకలావదాత కవితాసీమంతినీస్వచ్ఛ వృ
త్తాయుష్మత్తలఁగాంచి ప్రాజ్ఞపరిషగ్గాణేయ కవ్యగ్రణీ !
ఆవేశంబున రాష్ట్రగానములు నీవాలాపనల్ సేయ నాం
ధ్రీ వైదగ్ధ్యము చూర లిచ్చితివి సధ్రీచీన శృంగార వీ
రావర్త ప్రవహద్రసాంబునిధి సర్వాంధ్రంబు నిండారె జ్యో
త్స్నావిర్భావము తెల్గుతల్లి కిదు నారార్తిప్రభన్ వెల్గగన్
కమ్మచ్చునందీయు కరణివచ్చెడు పద్య తతి తిక్కనార్యుని ధైర్య ముడుప
ఆలప్తరాష్ట్రగానామృతశైలికి సార్వభౌములును మర్ఘూయనంగ
తెనుఁగుజాతిపసందు దిద్ది తీర్చెడుపట్ల చేమకూరాదులు చెడివడంక
పితృభక్తి మత్కావ్యవిధిఁ బ్రవచించుచో ధర్మదూరుల మనోదార్ఢ్య ముడుగ
సంప్రదాయశుద్ధి సద్వృత్త మీలువ
తనము వొల్చు కులముతన్వివోలె
నీదుకైత నెగడు నిర్మలాంతఃకర
ణాత్మరూపబింబ మగుచు సఖుడ !
ఓయీ యభినవతిక్కన ! జే.యగుతన్ నీదుకైతసింగారికి దీ
ర్ఘాయుష్మంతుడవై యాం ధ్రాయతనంబులను బేరు నందుము వర్మీ !

సానలు దీరిన స్వజాతిపంచరత్నములు

కవిరాజశిరోమణి, శ్రీమాన్ ఇనగంటి పున్నయ్యచౌదరి,

అప్పికట్ల, బాపట్ల తాలూకా

కవిసార్వభౌమా!
ఆదినన్నయకవి యానతిచ్చినపూలు, తిక్కనెజ్జిన్నలు తెలుపుపూలు
శ్రీనాథకవిరాజు సింగారములపూలు, పోతనయమృతంపు పోతపూలు
పెద్దన్నకవివర్యు విద్దంపు జిగిపూలు, భట్టుమూర్తి మెరుంగు పసిడిపూలు
చేమకూర్వేంకన్న జిలుగుజల్తరుపూలు, పింగళి సూరన్న బెళుకు పూలు
లలిత శోభితదివ్యనిర్మల సుగంధ
రాజితానందభోగపరాగ మలర
బూచుచుండును నీ తెల్గుపూలతోట
దివ్యగుణధుర్య ! అభినవ తిక్కనార్య !
కమ్మ తెమ్మరవీవ గుమ్ము గుమ్మున తావి జల్లి పిసాళించు మల్లెపూలు,
మెరుగు బంగరుచాయ మించు నిగారంపు
పసిమివన్నియ ముద్దబంతిపూలు
మంచుచుక్కల ధిక్కరించి
చెలాయించి సోబించు తెల్లగులాబిపూలు
పగడంపు కెంజాయ సొగసు దుబారించి
ధగధగల్ కురిపించు పొగడపూలు
హంగు రంగుల గేరు సంపంగిపూలు
చక్కదనముల నదలించు జాజిపూలు
ముద్దులను మూటగట్టెడి పొన్నపూలు
వెరచు నీ తెల్గుపూల సుందరము జూచి
గండుతుమ్మెద రెక్క గసరు కస్తురిచుక్క నిద్దంపుమోమున నిగ్గుదీర
చిగురాకు వెడలించు నిగనిగల్ సవరించు కమ్మ తెమ్మరమోవి చెమ్మలూర

మిసిమిమీగడతీరు మెరుగు టద్దము గేరు చొక్కంపు చెక్కిలి సొబగువార
పసగుల్కి రేయెండ ప్రసరించు తళతళల్ తూలించు చిరునవ్వు జాలువార
దేశ దేశాలు గాలించి తెలుగుతల్లి
పరిమళంబుల ఘుమఘుమల్ పరుగు లిడగ
విసరి విరజిమ్ము రత్నాల పసిడిపూలు
పూచుచుండును నీ తెల్గు పూలతోట
జిలిబిలినాణెంపు జిగిపల్కు జటిలంపు షేక్స్పియ రింగ్లీషు జిలుగు వెలుగు
నీటునిగారంపు నిగ్గు టొయారంపు పిరదౌసి పారసీ బెళుకు తళుకు
రకరకంబుల భావరసబిందువులు చిల్కు ఠాకూరు బెంగాలి ఠీకుపోకు
కమ్మ తావులు చిమ్ము తుమ్మల యభినవతిక్కన యాంధ్రంపు తీరుసొరు
గాంచి విద్యావధూటివిళాసమిళిత
లలితకోమల పదసుమగళితసరస
భావ ఘుం ఘుమపరిమళ వరవిలాస
విసరశోభితయై నలుదెసల మెఱసె
సారసారితుషార శారదచంద్రికా నవకుంద సమశోభనావిలాస
మందారమాలతీ మల్లికా చంపక సుమబృంద పరిమళ సమవికాస
వై కాంతమరకత వైదూర్యమాణిక్య సందర్శనానంద సమవిభాస
రజతాదిసదన నీరజ సంభవాచ్యుత చాతుర్యసామర్ధ్యసమవి శేష
లలిత తుమ్మల కులసుధాజలధిచంద్ర!
నిర్మలానంద బుధజన నిలయ కేంద్ర!
సకల సుకళావినోద విస్తార సాంద్ర!
అమలగుణ సీతరామయాహ్వాయ సుధీంద్ర !

కనకాభిషేకము

శ్రీ అద్దేపల్లి నాగగోపాలరావు

జయ ! జయ! భారతీవిమల చారుపదద్వయ సేవనప్రియా!
జయ ! జయ ! రాష్ట్రగాన విలసత్కవితాప్రతిభావిశేషణా!
జయ ! నవతిక్కనా ! విజయసంపద నీ కనకాభిషేక వ
త్క్రియలకు సొంపునింపుత ! పరిష్కృతకావ్యచయాభిశోభితా !
శ్రీనాథుం బరితుష్టు జేసె కవితాసీమంతినీ సేవక
క్ష్మానాథుం డొకరుండుమున్ కొలువులో స్వర్ణాభిషేకమ్ముచే
నీనాడీగతి నీ ప్రజాళియు బ్రియంబేపార నిన్ కాంచన
స్నానశ్రీరుచిరాంగుఁ జేయుట మహోత్సాహమ్ము మాకయ్యెడున్.
నవనవమై వినూత్నమయి నాటికి నేటికి తెన్గునాటిలో
ధవళ సుధాంశుమూర్తి వలె తావకకీర్తిపతాక మున్నత
స్తవముల నందికొన్న యది ధన్యుడ వీ విటు జీవితమ్ములో
కవిజన మిట్టి గౌరవము గాంచుట చిత్రము సూవె మిత్రమా !
తెలుగునాట లసత్కీర్తి వెలయుటనిన
అలతికార్యంబు కాదు ఈర్ష్యాళువులకు
నిలయ మీ నేల దీనిలో నెగ్గుటనిన
కోర్కెల నవారి పండించుకొన్నయట్లె !
పెక్కురు పెక్కు చందముల ప్రీతివహింతురు నీదు కైతలో
మక్కువ మాకు తావక సమాసమ్మృదుత్యమునందుజూవె పే
రెక్కిన నిన్ను వంటి గుణవృద్ధుల బుద్ధులు సుద్దులింత చే
జిక్కినజాలు నీ తెలుగు చిన్నలకున్ పరితోషదమ్ములై !

సువర్ణపుష్ప సన్మానము

కవిచక్రవర్తి, శతావధాని, శ్రీదోమా వేంకటస్వామిగుప్త

శ్రీరాజితాభినవ తిక్కోరుబిరుద మొందినట్టి యో తుమ్మలసీ
తారామమూర్తి చౌదరి ! నీరాజన మొసగు నాంధ్రనిచయము నీకున్
ఎదలో మందున కేని గర్వ మనుమాటే లేక దేశీయసం
పదనుం బెంచు మనోజ్ఞభావములచే బా గొందుకైతన్ జగ
న్ముదముం గూర్చుచు నాంధ్రమాతపదముల్ పూజించు నీదైన భా
గ్య దశన్ గౌరవముం బొనర్చు టదియుం గర్తవ్య మెవ్వారికిన్
ఒక నిముసంబు నీదు కడ నోలిని భాషణముం బొనర్చువా
డిక నిరతంబు నీ చెలిమి నెక్కటి గోరెడి నిట్టి మేలి రీ
తి కడిది నొప్పు నీ కయిత దీవ్య దమర్త్యవనాంతరస్థ దీ
ర్ఘిక రకమౌ సుధారసముఁ గ్రిం దొనరింపఁగఁ జాలదే ! సఖా
నా యవధాన సత్సభకు నాయకతం దగినప్డు మానసా
ప్యాయనమైన నీ కయిత నారసి బంగరు పూజ కర్హుడౌ
నీ యనఘుం డటంచు నెద నెంచితి నీగొన మా శుభంబు నే
డీ యిటు నాకు సొంపు నిడె నిప్పుడు నీ కనకాభిషేకమై.
ప్రేమింపందగు దాంధ్ర భారత సవిత్రీపాదకంజాతసే
వామాధుర్య రసైక ధుర్య కవనప్రావీణ్యముం జేసి యు
ద్దామ త్వత్తదుదారతం గనిన తద్ జ్ఞశ్రేణి నీకున్ సుప
ర్ణామోదార్చనముం బొనర్చు టది యత్యంతంబు నర్హంబగున్
శ్రీనాథుండు కవీంద్రచంద్రముఁడు తొల్లిం బంగరుం బూల స
న్మానంబు న్నృపు చెంత నొందె నిపుడుం దాదృజ్నృపుల్లేమిఁ దద్
జ్ఞానీకంబు సువర్ణ పుష్పముల నీ కారాధనం బిచ్చు మే
ధానైర్మల్య నిధీ ! యశోఽర్హుఁడవు సీతారామ కవ్యగ్రణీ!
సీతారామ ! సువర్ణ పుష్పముల నీ చెల్మిం దగన్ మించు సు
శ్రీతీ ఁబొప్పిన వారు సల్పు నెడ నర్థిన్ సత్కవిత్వోల్ల స
చ్ఛీతారామ సువర్ణ పుష్పముల రక్తిన్ మేము నర్పింతు మెం
తో తాత్పర్యముతో గొనం దనరు గాదో ? మిత్ర చూడామణీ !
సర్వ సంపచ్ఛమాయుక్తః సర్వదా విభవాంచితః
సీతారామ స్సదా జీయాత్ సూత్న తిక్కనసత్కవి!!

ఉపద
శ్రీ యర్రోజు మాధవాచార్యులు

తీయని జాను తెన్గు నుడి తేనెల సోనలు జాలువారగా
సోయగముల్ వెలార్చి సొగసుందనముల్ పచరించుచున్ శ్రవః
పేయ సుధామనోజ్ఞ సుమపేశల మంజులకావ్యకల్పనల్
స్వీయము చేసికొన్న రససిద్ధులు తుమ్మలసత్కవీశ్వరుల్.
అభినవసుందరమ్ములగు నాంధ్ర కవిత్వ మహోదయప్రభా
విభవసుగంధి గంధవహవీచుల దోగుచు రాష్ట్రగానమం
దభిరుచి వాసనల్ గఱపి యాంధ్రజనావళి మేలుకొల్పి రీ
యభినవతిక్క నార్య బిరుదాంకులు తుమ్మల సత్కవీశ్వరుల్.
తుమ్మలవారి కావ్యరసధోరణి లాంధ్రరసజ్ఞలోకమం
దిమ్ముగ జైత్రయాత్ర ముగియించి జయేందిరతోడ నీ సద
స్యమ్మున కేగుదెంచె విజయాంకములన్ రచియించి సత్కవి
త్వమ్ముల స్వస్తి వాక్ శ్రుతి పదమ్ములు పల్కు - డహో ! కవీశ్వరుల్.
స్వర్ణాభిషేకంబు సలుప బూనుట యన, కవ్యాత్మ దర్శింప గల్గియేమొ
ఏను గంబారీల నెక్కింప దలచుట, కవిభావమూహింపగలిగియేమొ
గండ పెండారాలు కాళ్లదొడుగుట యన, కవిశిల్పమును గాంచగలిగియేమొ
పల్లకీ లతమకేల బట్టి యెత్తుట యన, కవిగౌరవము గాంచగల్గియేమొ
ఏకసుముహూర్త స్వర్ణాభిషేక విభవ
గజసమారోహణోత్సవ గండపెండ
రాదిసత్కారతన్మయం బయ్యెనాంధ్రి
విశ్వరూపసందర్శనావిష్టయేమొ.
ఆనీ తాంధ్రధరాధినాయక కవిత్వారాధనై కోజ్జ్వలా
స్థానోదీర్ణ మహాసభాంగణలసత్ స్వర్ణాభిషేకోత్సవ
శ్రీనాథుల్ కవిగండపెండెర మహత్ శ్రీలాంఛనోల్లాసితుల్
ఆనందప్రభు లొక్కరూపమున ప్రత్యక్షంబు ఖాయం బిటన్.

అఖండగౌరవము   కవిరత్న శ్రీ కొసరాజు రాఘవయ్యచౌదరి

అభినవ తిక్కనా! వినుతి కర్హుడవయ్య సవాలుచేసి నా
డుభయ కవీంద్రమిత్రపద మూనిన తిక్కమనీషి కీడుగా
సభల సనర్గళమ్మయిన సాహితిఁజూపి యఖండగౌరవ
ప్రభల సమాహరించితివి పండితలోకము వెన్నుదట్టగన్.
అలసాని పెద్దన్న నవల బెట్టెదవులే, కావ్యనిర్మాణైక కౌశలమున
భట్టుమూర్తిశ్లేష పలుకరించెదవులే, ప్రతిపద్యపద రసాస్ఫాలమున
శ్రీనాథకవిరాజు చేయిగల్పెదవులే, మంజుల జటిల సమాసఘటన
తిక్కన్న కవి నచ్చుదింపివేసెదవులే, తేటతేనియ లూరు తెల్గు నుడుల
పుణికి పుచ్చుకొందువు భక్తపోతరాజు
రమ్య సాహిత్య మనువాదరంగమందు
సుధలఁజిందించు సిద్ధహస్తుఁడవు నీవు
అలఘుతరకీర్తిసాంద్ర! తుమ్మలకవీంద్ర !
బాపుజీకథ రసోల్బణముగా విరచించి, దేశిమార్గము దీర్చి దిద్దినావు
రాష్ట్రగానము మనోరంజకమ్ముగ వితర్కించి, దేశము నూదరించినావు
తంద్రి ధర్మప్రవృత్తము సానలన్ దీర్చి, కావ్యజగత్తులోఁ గల్పినావు
పఱిగపంటను పెద్ద పంటకాపును జేసి, నాల్గుమూలల ఖ్యాతి నాటినావు.
తెనుగుకవులందు మేటిపందెమ్ము చఱచి
సారమైన జాతీయత నూరిపోసి
కాంచితివి గండ పెండార గౌరవమ్ము
కీర్తినిధివి సీతారామమూర్తి సుకవి

ఒక నిరుపేదజీవి తనకున్న సమస్తము నొడ్డి బాల బా
లికలకళాభివృద్ధికని లేమిని దా వరియించు గాథ నీ
వొక రసయుక్త ఘట్టమున నూది జగమ్ముల మేలుకొల్పితో
సుకవివరేణ్య ! నీ కవిత సూనృతవృత్తిని రాణ కెక్కెరా !
పలుచ పలుచగ రాలు కంకులని మట్ట
బఱిగపంటయె యంత గొప్పగ ఫలించె
తీర్చి వేసిన కుప్పలు నూర్చునపుడు
ఎన్ని ధాన్యరాసులు మిన్ను దన్నఁగలవో
కనకాభి షేకగౌరవ మన నసదే ?
దీనిఁబడయ నందఱ కగునే
మొనగాడవు నీ కవితాధుని నభినందింపవలదె ? తుమ్మలసుకవీ!
శ్రీనాథుని మున్నెవరో, భూనాథుఁడు పసిఁడితోడ పూజించెను ని
న్నీ నాడాంధ్రప్రజ స న్మానమ్ములఁ దేల్చుట నుపమానము గాదే?

కవిచంద్రా!

కవిబ్రహ్మ, శ్రీ ఏటుకూరి వేంకటనరసయ్య

కనకాభిషేక మహమున్
గని, పెండారమ్ము తొడుగ గాగాంచి, గజ
మ్మును నెక్కు టరసి శ్రీనా
థుని బెద్దన్నను స్మరించుదుము కవిచంద్రా!
కవిపదము సార్థకముగా
భువి మంటివి పూర్వజన్మ పుణ్యముకతనన్
కవి వైతివి నీకు శుభ
మ్మవు గావుత మన్ని యెడల నంధ్రకవీంద్రా!
ప్రగతికి సుగతి కనారత
మగుకావ్యము లెస్ససేతు రార్యులు నీవా
తగ వెఱిగి రచించెద వా
వగఁ గూర్పనివానికేల వన్నె ఘటిల్లున్ ?
నీకవితా సంభావన
కీకానుక లంపినాడ హీరతుషార
శ్రీకమనీయంబై యశ
మాకల్పమ్మెసక మెసగు నంధ్రావనిలో.

అభినందనము

శ్రీ బులుసు వేంకటేశ్వర్లు, బి.ఏ

శ్రీరాము, డాంధ్రకవి లో కారాధ్యుని, సత్కవీశు నమలాత్ముని సీ
తారామమూర్తి చౌదరి నారోగ్యాయువుల నిచ్చి యరయుం గాతన్.
తెలుఁగుందల్లికి గావ్యభూష లిడి భక్తిన్ గొల్చుచున్ దత్పదా
మలసేవానిరతిన్ మహార్యజనసంభావ్యంబుగా బ్రాక్కవీ
శులఫక్కిన్ విడనాడ కద్భుతముగా సొంపెక్కు సత్కావ్యముల్
పలుకం జాలిన మిత్రరత్నమును సంభావింతు నత్యంతమున్.
సరసకవితా చమత్కార సౌష్ఠవంబు, పరమనిర్దుష్టమై మించుభాష తెలుగు
తీరుఁదీయము లెఱింగిన నేరిమియును, వెల్లివిరిసిన వితనికవిత్వమందు.
ఆర్యసమ్మతముగ నధునాతన విషయములను గైతసెప్పి తలల నూప
చేయు జాణ కిపుడు సేయు గౌరవమెంత, విధిని దీర్చికొనెడి విధముగాక.
అభినవ తిక్కన యనగా, నభినుతి గన్నట్టి మిత్రు నభినందింతున్
శుభకవితన్ వాచస్పతినిభుడని కనకాభిషేక నిరుపమవేళన్
'ఆత్మకథ'యు నవల 'నాత్మార్పణంబు'ను ఇతనికీర్తి కెల్ల నెల్ల లగును
'పఱిగపంట' తోడఁ బరఁగు 'ధర్మజ్యోతి' అమరకీర్తి యితని కలరఁజేయు
'రాష్ట్రగానంబు' నాంధ్రరాష్ట్రంబు వచ్చుదనుక కనుమూయనీయదు తమమడంచి
ఆంధ్రజనులకు నుద్బోధమై యెసంగు సత్కవీశ్వరువాక్కు లసత్యమగునె
కనకాభిషేకనామక ఘనగౌరవ మంది గండపెండేరము నీ
వును దాల్చి యేనుఁగెక్కెడు ననువగు వేళన్ గవీశ! అభినందింతున్

కవిలోకవంద్య
పండిత, శ్రీ వడ్లమూడి వేంకటరత్నం

కనకాభిషేకంబు గారవించినయట్టి శ్రీనాథకవిరాజు చెలిమికాడు
గండ పెండరము డాకాల సమ్మానించు పెద్దన్న యన్న నీ పెద్దయన్న
తెనుగు గన్నెకు మేల్మి తీరు దియ్యము దిద్దు తిక్కనార్యుండు నీ దేశికుండు
గజరాజుపై మెట్టి కడలంటయళమందు కృష్ణరాయండు నీ కించుతేడు
బళిర! భవదీయభాగ్యసౌభాగ్యగరిమ
కాంచినాడవు వారలఘనత లొకట
పుత్రికారత్నములనిట్టి పొలుపుగనుట
నీక చెల్లునురా కవిలోకవంద్య !
తారామార్గము నాదరించి సురకాంతా మందహాసంబు పెం
పారం గూర్చిన స్వీయజాతి విమలఖ్యాతుల్వెలారించి వ్య
ర్థారావంబుల గాలముం గడపు నంధ్రాళిం బ్రబోధింప వే
ధారోదారత రాష్ట్రగానమున సీతారామమూర్తీ! తగన్.
గజిబిజి యల్లు పెట్టు గిజిగాడుల జూడగబోదు, పూర్తికై
గిజగిజలాడు కాకవుల గేలికి జాలిదలంచు, స్ఫూర్తికై
గుజగుజవోవు మూకలకు గూడులపోడిమి చక్కదిద్దు నే
యజనఫలాతిరేకమున నందితొ యీ కవితాకుమారికన్
యెంకీనొ గొంకినో వలచి యీరినొ పేరినొ కోరి హేమప
ల్యంకతలంబునం దిడి బళాబళులొప్పు సవారిమోతకుం
జంకలు గొట్టుకొంట జయ శబ్దములం బలుకంగ శారదం
గింకరిసేతయు న్మదికి గిట్టని సత్కవికౌను భద్రముల్.

చదివింపులు

శ్రీ కుఱ్ఱా వేంకటసుబ్బారావు

గ్రామమా విశ్వ విఖ్యాతి నార్జించిన, జగదేకవీరుల జన్మభూమి
ఆహ్వానసంఘమా యాంధ్రభారతిదీప్తి జీర్ణించుకొన్నట్టి శిష్టగణము
అధ్యక్షుడా ద్రావిడాంధ్ర గీర్వాణాంగ్ల, సాహితీకవితా విశారదుండు
కవిలోకమా కళాకమనీయ రాజ్యమ్ము, శాసించు ప్రతిభా ప్రశంసితంబు.
సీమయా తిక్కనకవి ప్రసిద్ధజనన
మానితంబైన గుంటూరు మండలంబు
ధన్యయైనది నీ కవితాకుమారి
అందుకొనుమయ్య సుకవి ! సుస్వాగతంబు.
సర్వ సర్వంసహాచక్రంబుపాలించు, ప్రాజ్ఞులౌ రాజనీతిజ్ఞు లొకట
రసవత్ప్రబంధ సామ్రాజ్యాధినాథులౌ, కవిరాజరాజేంద్రగణము లొకట
విశ్వగీతిక నాలపించి ఖండాంతర, ప్రథ గన్న గాయక పటల మొకట
మధురకావ్య వసంతమకరందరసపాన, లోలమౌ ప్రేక్షకలోక మొకట
భావ ముప్పొంగ మోదబాష్పములు రాల్చి
పూలదోసిళ్ళు పట్టి నీ పూజ సేయ
జీరుచున్నారు కనకాభిషేకమునకు
గదలి రావయ్య నీ కీర్తికాంత తోడ.
భూరిగౌరవములు పొంద నన్నయభట్టు, చాళుక్యపతియాజ్ఞ సమ్మతించె
అగ్రహారంబుల నంద దిక్కనయజ్వ మనుమసిద్ధి నృపాలు చనువు పెంచె
కనకాభిషేకంబు గైకొన శ్రీనాథు డన వేమభూపాలు నాశ్రయించె
గండపెండెరమును గ్రహియింప బెద్దన్న కృష్ణరాయనరేంద్రు కీర్తిపొగడె

అంతయేకాని యిట్టు లయాచితముగ
గండపెండేర మొసగి యేకవిని మెచ్చి

శీర్షములు వంచి కనకాభిషిక్తు జేసి
యారతిచ్చిరి ? ముక్కోటి యాంధ్రజనులు.
గంభీర వారాశి గర్భగోళంబులో, బడబానలజ్వాల ప్రబలురీతి
చల్లగా వీచెడి పిల్ల తెమ్మెరలలో, ఝంఝానిలము గర్జ సల్పురీతి
ప్రకృతి సొంపులుగుల్కు పర్వతశ్రేణిలోఁ, బ్రళయలావాకీల వెలయురీతి
అమృతమ్ము వర్షించు నభమండలములో ఘోరనిర్ఘాతమ్ము జారురీతి
కుమతియై నిన్నుదార్కొను కుకవి గనిన
విలయనాట్యంబు సేయు నీ కలము రేగి
భళిరె! అభినవతిక్కనా ! ప్రాక్కవీంద్ర
పథము నిల్పంగ నూ రేండ్లు బ్రతుకుమయ్య !
వాగనుశాసను వర్ణింపఁబూనిన, నాచనసోమన్న నడుము విరుగు
సోమనాథుని కైత సొంపులు వినుతింప, శ్రీనాథకవి మోము జేవురించు
శ్రీనాథకవిరాజు సీసముల్ నుతియింప, నలసాని పెద్దన్న యాగ్రహించు
పెద్దన్న కవితకుఁ బెద్దపీకం బీయ, రామకృష్ణుని గుండె రగిలి మండు

కవులలో నీర్ష్యలీరీతి గానుపింప
గణన కెక్కిన యీనాటికవులు నిన్ను
నాత్మ బంధువుగా నెంచి యాదరింతు
రెంత సౌజన్యరాశివోయీ ! కవీంద్ర!

రాష్ట్రగానకవి - శ్రీ కొడాలి చక్రపాణి
పాడిదప్పనికవుల నెప్పటికి నైన
ప్రజలు శిరసావహింతురు భక్తితోడ
ననెడు సత్యంబు ఋజువైన దయ్య నేడు
రాష్ట్రగానకవీ ! సీతరామమూర్తి!

శకుంతాలు

శ్రీ వేదాంతకవి

విలసత్కీర్తినిధీ ! తు
మ్మల సీతారామమూర్తి ! మంజులమలయా
నిలచక్రవర్తి ! బహు కో
మలకవితావన వసంతమాధుర్యపతీ !
ఈ నాజూకు యుగాన నింత కవిమత్తేభాలు దండెత్తి సం
స్థానాలన్ని కుదించుచున్న నవవిశ్వంబందు నీరీతిగా
నానాకావ్య విమర్శనార్ణవుని చెంతం గండ పెండేర మె
ద్దానం దాల్చినవాడు లేఁడుగద సీతారామమూర్త్యాహ్వయా!
కవిభూపా ! కవితాబ్ధిలో శ్రవణసౌఖ్య శ్రీ సుధం దీసి ది
వ్యవచోవిస్ఫురణైక భావరమణీయ స్ఫూర్తి విఖ్యాతి శ
బ్ద విధాతృండయి రామలింగడు సభాధ్యక్షుండుగా వచ్చి మె
చ్చి విభూతిన్ కనకాభి షేక మొనరించెన్ నీ కమోఘంబుగాన్.
ఆంధ్ర కావ్యకళాపురంధ్రికి భంగిమం, బెంతయో గరపిన పంతులయ్య
ఆంధ్రప్రతాప శౌర్యజ్వాల లార ని వ్వని దేవదత్తమ్ము వట్టి నయ్య
ఆంధ్రజయ స్తంభ మంభోధు లేడింటి కడపటి కొండపై గాంచినయ్య
ఆంధ్రగంధర్వగానామృతవృష్టితో మన్ను మిన్నిక దుక్కి దున్నినయ్య
యావదాంధ్ర భువన హావ భావ శత స
హస్ర కోటిహిమాలయాలన్ని యెక్కి
రాష్ట్రగాన మిచ్చుట ధార్తరాష్ట్రతతికి
చక్కగా ధారబోసితి చౌదరయ్య !

కమ్మని తెల్గు బాస, గిజిగాం(డకు మే ల్నగిషీల గూండ్లకై
తుమ్మలతోపు కొండొకటి తొల్కరి కుల్కున లేచి పై డిపూ
గొమ్మలు కొప్పులో ముడుచుకొన్నది బమ్మెరపోతరాజు సే
ద్యమ్మున దుక్కిటెద్దలసి యచ్చటి తుమ్మలబీడు జొచ్చెరా !
అభినవ తిక్కయజ్వబిరుదాంకితుడై (శుతిపక్వమైన వా
క్కభిరుచిగా ధ్వనించెడి మహావిభ వైకమనోజ్ఞభావ దుం
దుభి దిశకెక్కజేయుచు కృతుల్ (క్రతువుల్ కవితాఘృత ప్లుతుల్
శుభముగ దేల్చినందున శుచుల్ మన చౌదరి కెక్కువయ్యెనా?
అరవలు చిళ్లకంచె లయి ఆంగ్లజు లెల్లడ మంగలమ్ములై
దొరతనముం దురా(క్రమణధూర్త పరా(క్రమమున్ మదించి మ
చ్చిరముల నెంతకాల మికఁ జేతు రటంచు మతే మహాకవీ
శ్వరుఁ డిల చౌదరయ్యవలె శౌర్యకళారణధుర్యుడయ్యెరా !
భాండము లెన్ని కోట్లయిన వల్లక చెల్లక యీ యఖండ (బ
హ్మాండము పట్టకుండెడి మహాత్ముని యాత్మకథాసుధాబ్ది నీ
తం డెటులుంచెనో గద సుతారముగా తన చిన్ని బొజ్జలో
పాండితి చౌదరయ్య కిటువంటిది యే సుకృతాన దక్కెనో !
నా పలుకుల్ సమస్త భువన స్తవనీయ మనీషులార ! శా
స్త్రాపగలో మునింగి మడియైనవియో పొడియైనవో వృథా
లాప కథాకలాపధనలాభవిలేపనిరూపణంబులో
లేపి పసిండిగగ్గెర బలిష్ఠుని కాలికివేసి చూడుడీ !

మహాకవివతంస! - శ్రీ ముసునూరి భాస్కరరావు

చేయించువాడాంధ్రశేముషీ సంపద్వి, భాసి విద్వత్కవివరుడు రెడ్డి
చేసెడివాడయాచితదానకర్ణుడు, నేననుచున్ గోగినేని బుధుడు
కార్యకర్తలు పేరుగల రైతుబిడ్డల, భ్యుదయకాములు తెల్లుభూమివారు
స్వీకరించెడికవి శేఖరు లభినవ, తిక్కనాభిధులు పండితులు మీరు
చేయుచున్నది స్వర్ణాభి షేక మదిర !
తెలుగులచరిత్రపుటలను ద్రిప్పితనదు
సోయగంబాంధ్రవాణి తా జూచుకొనుట
గాక ! వేరౌనె? యిది మహాకవివతంస !
బిరుదులు పెద్దవై తమకవిత్వపు టాయువు కొద్దిదై తలల్
తరుగ సహమ్ముపెంచుకవితండము బండ్లకునెత్తెచెత్త సం
కరమతి సౌష్ఠవంబని వికారము పేర్చి కృతుల్ రవంతయున్
గరువము లేని సజ్జనుని గాంచితి నిన్నొకని మహాకవీ !
కాళిదాసులకీ తెల్గు గడ్డపైన
కొదువయున్నను లేకున్న కొంపమునిగి
పోవ, దీసు సహంభావమును విసర్జ
జేసి మిముబోంట్లు సాహితీ సేవ సలుప.
కట్టమంచి సెబాసని గౌరవించి
నట్టి కృతుల కెవ్వారు జోహారు లీరు?
తప్పదని తుదకీ శ్రీశుతల్పమైన
వేయి పడగలవాడె చేదోయి మోడ్చు.
ఏనుగు నెక్కి పెద్దన కవీశుడవై కనకాభిషేక స
న్మానము రెడ్డిపండితు సమక్షమునన్ కవిసార్వభౌము చం
దానగ్రహించి, ఆంధ్రకవితా విభవోన్నతి మాకు జ్ఞప్తికిన్
రా నిదుబ్రోలు హంపి గవిరాణ్మణి! సాహితి సత్కరింపుమా

మిత్రమణి

శ్రీ వెలగపూడి దానయ్యచౌదరి

నాడు నేడు తిక్కనార్యుని దెల్గులు
మేటి సుకవి యంచు మెచ్చుకొందు
రతని వోలెఁ గవిత నమరిచి యభినవ
తిక్కనాఖ్య గొన్న దిట్ట వీవు
లలిత భావపూర్ణ కలశంబులన గృతుల్
వెలయజేయు సత్కవీంద్రు నిన్ను
గవితతోడ దెలుప గడగు టసాధ్యమం
చెద దలంతు నెవ్వ రెట్టులనిన.
హృదయ మొకటి తక్క నొదవు భాగ్యంబు నా
కేమికలదు సర్వమెఱుగు దీవు
అమలభ క్తి హృదయ కమల మర్పించితి
నందికొని ముదంబు నందుకొనుమ.
హృదయ మెఱిఁగి మధుర హృదయంబు దీపింపఁ
గావ్య కన్య నొసంగి గారవించు
నీకు మిత్రమణికి నీ సువర్ణాభిషే
కోత్సవమున నిదియె యుపద సఖుఁడ !

మహాకవి
శ్రీ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి

శ్రీ సీతారామమూర్తి చౌదరిగారితో నాకుఁ బెక్కునాళ్ల పరిచయము. ప్రతిష్ఠితులయిన నేటికవులలో, ఆయన గొప్పస్థాన మాక్రమించుకొని రనఁగా, అది వారి కలములో గల మెలకువ వెనుక వారు వాసిన రాష్ట్రగానము, ధర్మజ్యోతి ఇత్యాదు లొక సారి పంపగా జదివి "అభినవ తిక్కన" బిరుద మీయన యెడల నన్వర్థ మనుకొంటిని.

తరువాత దరువాత వారి యితర కృతులు సమగ్రముగా జూడ జూడ నిపుడు కనకాభిషేకాదికమైన యేయుదాత్తగౌరవము నందుటకైన వారు తగిన వారని భావించుచున్నాను. యద్యపి, ఊలు విత్తి వరాలగుత్తులు పండించు మహాకవి యుత్తమర్ణత జగత్తు ఎట్టి సత్కారముచేసియు దీర్పరానిది. శ్రీ రెడ్డిగారి దివ్యసమక్షమున జరుగు మహామహిత సన్మానము దిగ్విజయము కాగలదు.

ఆశీః ప్రశంస
శ్రీ పూతలపట్టు శ్రీరాములరెడ్డి

తమ పెండ్లి వేళ వేదిక
దమి నొండొరుగాంచి సిగ్గుతలయెత్తఁగ సొం
పమరిన సీతారాములు
తమ పేరిటి సుకవిచంద్రు దనిపెదు గాతన్.

గండపెండేరంబు గనియె బెద్దన, కాని కనకాభి షేకంబు గాంచ లేదు
కనకాభిషేకమ్ము గాంచిన శ్రీనాథుఁ, డేనుఁగునెక్కి యూరేగ లేదు

ద్విరదంబు నెక్కిన తిరుపతి వేంకట కవులును విజయాశఁ దవిలినారు
ఎన్నియో బిరుదంబు లెంద ఱందిఱొకాని తిక్కనగురుత సాధింపరైరి
ఏగి ప్రభువుల వేడి చేయించుకొనగ
గారవంబు లేరేరికో గలిగెగాని
యిన్నియును పిల్చి కవులె నీకీయ గంటి
సుగుణసాంద్ర ! సీతారామ సుకవిచంద్ర !
అకలంకమగు గుణనికురుంబ మమరస్ర, వంతికి మిక్కిలి వన్నె పెట్టు
బ్రవిమల ధీరవర్తనమది గణ్యమై, ఫణి భూషణునకేని వంకదిద్దు
సత్త్వ సంస్థిత సుకవిత్వ మాధుర్యంబు, తేనె కేఁజవినించు తీపినిచ్చు
నొనరించు సుకృతులు ఘన సుమనస్సుల, కత్యధికామోద మమరగూర్చు

నట్టి నీ కిట్టి సన్మానమెచ్చుగాదు
సరస! యభినవతిక్కన బిరుదవిభవ !
తుమ్మలాన్వయ కలశాబ్ధి తుహినకరణ !
సుగుణసాంద్ర ! సీతారామ సుకవిచంద్ర !
జనవినుత ప్రశస్త గుణ సంగతి నొప్పెడి కావ్యమన్నచో
ఘనకవి భావనాగురుత గాంచు నమూల్య సజీవరక్తమే
యనుదురు పెద్ద లట్టి భవదస్రకణాలి మహాత్మరూపజీ
వన చరితాత్మకం బగుచుఁబావనతన్ భజియించె నయ్యరే !

ఆదర్శకవి
శ్రీ గొర్రెపాటివెంకటసుబ్బయ్య

ఆధునిక కవులలోనేగాక, ఆంధ్రకవులలోనే ఒక విలక్షణకవి చౌదరిగారు. ఆయన ప్రతిభావంతుడే కాదు, వ్యుత్పన్నుడుకూడ. పరిశోధకుడగుటతో పాటు చరిత్ర కారుడుకూడ. ధర్మ ప్రబోధకుడైన శిల్పి. స్వస్థాన వేషభాషాభిమానే కాడు. మూర్తీభవించిన ఆంధ్రమాతృస్థానీయుడు. స్వరాష్ట్రాభిమానే కాదు, స్వాతంత్ర్య ప్రియుడు. అంకితములో ఆదర్శమూర్తి.

ఆయన విశిష్టత యేమి? ఆయన గ్రంథాలలోని గుణ మెద్ది? ఆయన రచనలలో గొప్ప వేవి? ఆయన గొప్పతన మెందున్నది? ఈ ప్రశ్నలకు సమాధానమే యీ వ్యాసములోని ముఖ్య విషయము.

విశిష్టత

ప్రఖ్యాతులైన ప్రతివారిలోనూ యేదో విశిష్టత వుంటుంది. అయితే చౌదరిగారిలోని విశిష్టత యెద్ది ? ఆయన సంప్రదాయబద్ధుడైన కవి యయ్యు, సంస్కరణాభిలాషి. ప్రాచీన కావ్యములలోని పదములు వాడుటలో ప్రవీణుడైనట్లే. దేశీయములు వాడుటలో నేర్పరి. ఆవేశమే కాదు. భావుకత్వముకూడా ఆయనలో బాగుగా గలదు. ఆయనలో దీక్షతో పాటు దక్షతవున్నది. ప్రాచీనుల కవితా శిల్పముతోబాటు ఆధునికుల భావాలుకూడా గలవు. అనుభవముతోపాటు ఆదర్శాన్ని కూడా చూపెట్టగలడు. ప్రాచీనుల ప్రాభవాన్ని ప్రస్తుతించుటతో పాటు ఆధునికుల ఆధిక్యాన్ని చెప్పుటలో గూడా చతురుడు.

ఆయనలో దైన్యము, యాచనా లేనట్లే, ఆయన రచనలలోనూ, అవి కన్పించవు. నిర్జీవ పదములు, పడికట్టురాళ్ళు. ఆయన రచనల్లో, పట్టుకుందామన్నా పట్టుబడవు.

వస్తువరణములో యెంత జాగ్రతపడునో, రచనా విధానములోనూ, అంత మెలకువతోను, ప్రవర్తించును. వేయేల? ఆయన రచనలు స్వయంపాక మువలె పవిత్రములైనవేగాక, నలభీమ పాకమువలె స్వాధిష్టములు గూడ.

ఆయన శక్తిసంపన్నుడేగాదు. ఆశావాదిగూడ. ఆధునిక కవులలో కొందరకు ప్రాచీన సాహిత్యములో ప్రవేశములేదు. మరికొందరకు ప్రజాసముదాయముతో సంబంధము లేదు. ఇవి రెండువుంటే గాని కవి రాణించదు. చౌదరి గారు సవ్యసాచి.

ఆయన రచనలన్నీ జాతీయములే. విజాతీయ వస్తువుగానీ, సంప్రదాయములుగాని భావములు గాని లేవు. ఆయన రచనలలో తెలుగుపలుకుబడి కావలసి నంత ఆలదు. చౌదరిగారి కవిత్వములో తేటదనముతో పాటు, చాటుదనముకూడ కలదు.

ధర్మ బోధాత్మక శిల్పము

కవిత్వమున కానందము పరమ ప్రయోజనమందురు కొందరు. ఆ గుణము సంగీతానిది కాని కవిత్వానిది కాదని నా వినీతాభిప్రాయము. అయితే సాహిత్యములో కూడా ఆ గుణము లేకపోలేదు.

చౌదరి గారి రచనమునకు మొత్తంమీద ధర్మబోధాత్మక కవిత్వమని పేరు పెట్టదగును. ఆ ధర్మము దేశధర్మము కావచ్చు. జాతిధర్మము కావచ్చు. స్వధర్మము కావచ్చు. అందుచేత ఆయన రచన అంతా గణబద్ధమైన బోధ అని అనుకొనరాదు. చౌదరి గారి ధర్మబోధకు శిల్పచాతుర్యమే కావ్యత్వ మిచ్చినది.

రచనలలో గొప్పవి

ఏకవినైనా నీ రచనలలో గొప్పవి యేవి అని ప్రశ్నిస్తే సహజముగా అన్నీ సమానమేనంటాడు. తల్లి తన సంతానాన్ని సమదృష్టిని భావించినట్లే కవి భావమున్నూ; కాని విమర్శకుని దృష్టిలో అవి అన్ని యేకరాశికి చెందవు. ఎట్టి

విఖ్యాతకవి యైనా ఆయన రచనలు సమానాదరణ భాజనములుగావు. కవి కులగురువగు కాళిదాసు కావ్యాలన్నీ గౌరవింపబడుచున్నవా? కాళిదాసత్రయమన్నారు. కొందరు. కాళిదాసును ప్రపంచ విఖ్యాతునిగా చేసినది అభిజ్ఞాన శాకుంతలమే. "కాళిదాసస్య సర్వస్వమభిజ్ఞాన శాకుం తలమ్" అన్నారుగదా.

చౌదరిగారు 'పెద్దకాపు'తోను, 'పరిగపంట' తోను తృప్తినందక 'ఆత్మార్పణము' కావించి 'ధర్మజ్యోతి' వెలిగించి, 'రాష్ట్ర గానము' చేసి 'ఆత్మకథ' నల్లుటతో నాగక 'అమరజ్యోతి' కూడా వెలిగించారు.

అయితే ఆయన సప్తసంతానములలో ప్రశస్తిగాంచినది రాష్ట్రగానము, 'అద్దిరా!' అనిపించినది, ఆంధ్రావళిని మోదమును పొందించినదియు అదియే.

రాష్ట్రగానము కేవలము ఆంధ్రరాష్ట్రవాంఛ గాదు. అది ఆంధ్రుల సర్వస్వము. ఆంధ్రుల సర్వస్వముతోబాటు సీతారామమూర్తిగారి సర్వస్వము కూడా. సీతారామమూర్తిగారికి తెలుగుబాస అన్నను తెలుగువారన్నను అధికాభిమానము. అభిమానమేకాదు ఆవేశముకూడా అధికము. ఆయన ఆంధ్రులలో తాను ఒక్కడుగా తలచడు. ఆంధ్రమాతృస్థానము పొందగలిగా డాయన. అందుచేతనే ఆయనకు కమ్మ, కాపు, బ్రాహ్మణ, అబ్రాహ్మణ, సాగరాంధ్ర, పార్వతాంధ్ర, స్వదేశాంధ్ర, ఖండాంతరాంధ్ర అనే భేదము లేదు. రాజకీయపాక్షికతలేని ఆంధ్రాభిమాని. ఆయన అందుచేతనే రాష్ట్రగానము అంత వుజ్జ్వలముగా వ్రాయగలిగాడు. పండితులు ప్రజలు, సరిసరి అని తలలూపిన సాటిలేని మేటిగ్రంథ మది. ఆయన రచనల్లోనే కాదు, ఆంధ్రులను గురించి వెలువడిన సాహిత్య సృష్టిలో సానలుదీరిన జాతిరత్న మది.

అటు తర్వాత ప్రాముఖ్యమైనది ఆత్మకథ. మహాత్ముని గురించి యెంద రెందరో యెన్నెన్నో, కృతులు. కల్పించారు. కాని ఆ అహింసామూర్తిని, ఆసియా

జ్యోతిని, జాతిజనకుని, విశ్వకళ్యాణమూర్తిని, గురించి కావ్యముగా వ్రాయతలరపెట్టినవారు చౌదరిగారు తక్క మరొక్కరు లేరు. వస్తు విశిష్టతతోపాటు శిల్ప చాతుర్యము కూడా చెన్నారుటచే పసిడికి పరిమళ మబ్బినట్లయినది.

ఆత్మకథ మన ఆంధ్రభాషకు అలంకార మన్నారు. మన విశ్వకళా పరిషదుపాధ్యకక్షులు.

గొప్పతనము:- ఆంధ్రసాహిత్య స్రవంతి దేశి కవిత, మార్గకవిత, అను రెండుపాయలుగా ప్రవహించినది. ప్రజాసాహిత్యమైన దేశికవిత, ప్రజాశ్రేయమై ప్రవర్తిల్లినది. పండిత సాహిత్యమైన మార్గకవిత, రాజాశ్రయమున రాణించినవి. తొల్లింటి మార్గకవులలో ప్రథమకవి రాజగురువు. మధ్యమకవి రాజమిత్రుడు, తుదికవి రాజ సేవకుడు.

కవులలో కొందరు భుక్తికి, మరికొందరు ముక్తికి ఆశ పడి అంకితము నిచ్చారు. నరాంకితము యివ్వ రాదన్న వారికి భగవంతుడు బాధిస్తాడని భయంతప్ప మరొక మహదాకాంక్ష లేదు. కొందరు యిహానికి ఆశ పడ్డట్లే, మరికొందరు పరానికి పాటుపడ్డారు. చౌదరిగారు ఆంధ్రకవులందరిలోనూ, అంకితములో ఆదర్శమైన మార్గమవలంబించారు. ఆయన గ్రంథాలు అన్నీ నరాంకితములేగాని, స్వార్థ ప్రేరితములుగావు. సజ్జనులకు, త్యాగులకు, అంకితమిచ్చాడు. వారు ఆయనను అందలా లెక్కిస్తారనిగాని, అగ్రహారా లిస్తారని గాని ఆశతో యివ్వలేదు.

''కృత మెఱుక చాలునస్మ
న్మతి కింపగు, కబ్బమిచ్చి మణి గొంట జగ
ద్ధిత శీలుండొదవ నయా
చితముగనే నిడుదు నా సృజించిన కవితన్.
''నరునకు గబ్బమిచ్చుట యనాదృతకృత్యమటంచు సత్కవీ

శ్వరులు పురాతనుల్ నుడువుచంద మదేమొ రుచింప దింతయున్
సిరులకు నాశజెంది యొక చెన్నికిచ్చుట మచ్చగాని, స్వా
ర్థరహిత బుద్ధి నిర్ధగుణరాశి కొసంగిన దోసమున్నదే ?"

స్వీయాంకిత ధర్మమును, ధర్మజ్యోతి ద్వారా ద్యోతకం చేశాడు చౌదరిగారు. కాసులకు దాసులైన కవులనుండి మనము యేమి వున్నత భావముల ఆశించి పొందగలము? తన కవితవలన తాను తరించ లేనివాడు యితరులను యేమి తరింపజేయగలడు?

ఈ సత్యమే కవిరాజు కలమునుండి కమనీయముగ జాలువారినది.

"కవుల స్వాతంత్ర్యమే మంటగలసిపోయె
పొట్టకూటికి వరువట్లు పుట్టినపుడే
యడ్డమైన దేవురుగొట్టు నాశ్రయించి
భయములేకుండ కవులెట్లు వ్రాయగలరు?"

సీతారామమూర్తిగారితోపాటు ప్రజాశ్రేయోభిలాషులయిన కవులనందరను సన్మానించుట సముచితమైన ప్రజాధర్మము.

ఇట్టి కవుల 'సన్మానించకుంటే స్వతంత్రకవు లెట్లు ఉద్భవిల్లగలరు.

"దోయిలిడిపత్ర ఫలపుష్ప తోయమైన
నీయనేరని దేశమందే విధాన
పుట్టగలరు స్వతంత్రులౌ దిట్టకవులు
లేరు లేరంచు గునిసిన లేచిరారు."

అని సూతపురాణము సూచించుచున్నది..

నేటికైనా యీకవికి సముచితమైన సన్మానము చేయుట సంతోషించదగిన సంగతి. ఇట్టి కవులను గౌరవించుట మనలను మనము గౌరవించుటగా యెంచుట మంచిది.

కవులు, కర్షకులు, లోక శ్రేయోభిలాషులే, కవులు కలాన్ని బడితే, కర్షకులు హలాన్ని పట్టారు. ఒకరు క్షేత్రాలను దున్నే వారు, మరొకరు హృదయ క్షేత్రాలను దున్నే వారు.

కర్షకులు నవధాన్యాలు పండించి భౌతిక దేహాన్ని పోషిస్తారు. కవులు నవరసాలు సృష్టించి, ఆత్మోన్నతి గల్గిస్తారు. విచారకరవిషయమేమంటే, యీ యిరువురకు లోగడ మన దేశములో సంబంధం లేకుండా పోయింది. కర్షకుడు, కత్తిగలవాడికి లోబడ్డాడు, కవి కాసులుగలవాడికి దాసుడయ్యాడు. అయినదేమో అయినది. యికనైనా వీరిర్వురు, పరస్పర శ్రేయోభిలాషులై ప్రవర్తిల్లిన లోకకళ్యాణము చేకూరగలదు,

నేడు కవులు' కష్టజీవులను గురించి కథలల్లుతున్నారు. కృషీవలుడు, పల్లెపట్టు, కష్టజీవి, క్షేత్రలక్ష్మి, పరిగ పంట, యిట్టివి. ఇది సంతసింప తగినదే కాని చేయతగినపని యింతకంటె అనేకము గలదు.

మనజాతిపిత గుజరాతీ రచయితలకొక సలహా యిచ్చాడు. వారు వూహాగానము చేయక, 'రైతుజీవితానికి సంబంధించిన సాహిత్యాన్ని సృష్టిస్తూ వారి ఆలోచనలు పవిత్రమగునట్లు వారిసంపద, పెంపొందునట్లు, ప్రయత్నిస్తూ సజీవమగుభాషలో వారికి పాటలు, పద్యాలు రచించి వారిని అభివృద్ధి పంధాలోనికి తెమ్మని తెలిపాడు.

బాపూజీ ఆశయములం దభిమానముగల చౌదరి గారు తదాశయసిద్ధికై కృషి యొనర్చ కర్షకుల అభిలాష.

అభ్యుదయము

ఉపాధ్యాయమిత్రుడు

శ్రీయుం దేజము, కవితా
స్ఫాయదఖండాంధ్రభూయశః పరిపూర్ణ
శ్రేయమ్ములు, దీర్ఘాయు
ర్దాయము నుంగల్గి మనగదయ్యా సుకవీ !
అరవిచ్చు విరులతీయఁదనమ్ము చిలికించు, నెత్తావిమత్తిల్ల నేర్చెనేమొ
సోకినంతన మేను సోలించుపండు వె న్నెల రేలలో బ్రయాణించెనేమొ
సెలయేటిజల్లులో జెలువారుచల్లంద నమ్ముఁ జేకొని వెలిజిమ్మునేమొ
కనుల పండువు గూర్పగా జాలునామని, యందాల జాలులో నలరె నేమొ
నీకవిత్వ లతాంగి అన్నింట జాణ, యౌచు పాఠకహృదయ సింహాసనముల
రాణియై నవ్యభావ సామ్రాజ్యసీమ, పాలనము సేయుఁగీర్తి సౌభాగ్యగరిమ.

మణిత్రయము

శ్రీ పెనుమర్తి వేంకటేశ్వరశాస్త్రి

రచియించితివి లెస్స రాష్ట్రగానము దెల్గు, బిడ్డల హృదయాల బెరిమ పెరుగ
ఆర్జించితివి రాణ నభినవ తిక్కన్న, విఖ్యాతి రచనలో వెలుగు జూపి
సంతరించితి వెందు సత్కవీంద్రుల కీర్తి
బరువైన కవుల యాదరము వడసి
సంతసించితిలోన సన్మానసభలలో గొప్పగా నెల్లూర నప్పికట్ల
వ్యాధులాధుల బైకొన్న పట్టులందు
సరస కవితామతల్లి యౌషధముగాగ
నూతనోత్సాహశక్తుల నూత్నమనగ
వెల్లడించుచు శేముషి వేవిధాల

ప్రౌఢి కెక్కితి విచ్చ బ్రాచీన సంస్కృతి బాటించి కావ్యాల బ్రథితసరణి
పాటింపవైతివి ప్రాచీన భావాలు కులవర్గదృష్టి సంకుచితమంచు
సేవించితివి పెల్చ శ్రీకరంబనియెంచి ప్రజల దేశంబు దెప్పరముగాగ
సత్కరించితివీవె సత్కారమందక కృతికన్య నొరుల కంకితమునిచ్చి
యౌర వర్ణింప దరమె యుదారగరిమ
చౌదరీ ! నీ తలపు సువిశాల మవని
సాగి యీరీతి కవితా ప్రశస్తి వెలసి
చల్లగానుండు మీ పురుషాయుషమ్ము

మంచిచెడ్డల జూచి మహితత్వ మొనగూర్చు సత్యజీవిక నీకు నిత్యతృప్తి

కష్టసుఖాలెంచకయె దయన్నించుట జీవితంబందు నీశిష్ట గుణము
లాభనష్టములకు లాతియై సుఖమిచ్చు విథినిర్వహణ నీదు నిధియె సుమ్ము
ముందు వెన్కలంగూర్చి యందంబు సమకూర్చు ముద్దైన కయిత నీయొద్ద గలదు
కొదువ లేదింత గౌనముల గొప్పగలదు
కలదు సామగ్రి వసుధలో వలయునదియు
అదియు నవ్వారిగాగ బూర్ణాయు వొసగి
యొసగి భాగ్యంబు భాగ్యంబు నోము నిన్ను,

అభినుతి

శ్రీ వారణాసి వెంకటసుబ్బారావు

ఆంధ్రుని సన్మానమత్యుదాత్తముగ
ఆంధ్ర దేశములోన ఆచరింపగను
అభిలషించిరి నేటికాంధ్రులేయన్న
శుభవార్త విన మాకు శ్రుతిపర్వ మాయె.

అభివృద్ధి అభివృద్ధి అభివృద్ధి కలిగె
అభినందనార్హమౌ అభివృద్ధి కలిగె
అభినవతిక్కనా ! అభినుతు లివిగొ
అభిషేక వేళ నీ వందుకోవోయి.
పండిత సభలోన వైభవమ్మలర
గండ పెండేరమ్ము కాలికిన్ దొడిగి
ఇభరాజుపై నెక్కి ఏతెంచువేళ
అభినవతిక్కనా ! అభినుతు లివిగొ

సమతత్త్వమ్మును రూపుమాపు మతపాషండత్వమున్ జూచి యా
కమనీయమ్మగు భారతీముఖము దుఃఖచ్ఛన్న మౌటన్ గ్రహిం
చు మహాత్మున్ వధియించె నొక్కడన సంక్షోభించి వెల్లించితీ
వమరజ్యోతిని గాంధికై హృదయమందారాత్రి కమ్మట్లుగాన్.
విజ్ఞాన బీజముల్ బీళ్లలో వెదజల్లి, కష్టించి పండించు కర్షకుండు,
కవితలో కమ్మని కస్తూరికాగురు, గంధమ్ము కల్పించు కవివరుండు,
తీయని తెనుఁగులో తెలుగుల వెలుగులన్, గానమ్ము సేసిన గాయకుండు
దోషమ్ము చూపించి దోషిని క్షమియించు, భాషలో పేర్వడ పండితుండు

ఇన్ని దినములనుండియు మిన్నకుండి
సాటివార లెఱింగి రీ నాటికైన
కలిగె కనకాభిషేక మీకవి కటంచు
సంతసమ్మంది రాంధ్రు లత్యంతముగను.

సోదరి కానుక

శ్రీమతి దొప్పలపూడి అనసూయాదేవి

పండిన మేడిపండ్లవలె బైకి గనంబడి దోషజాలమున్
నిండుగ మోయు పండితులనేకులు కల్గగ వచ్చుగాక యా
పాండితి యేటికో సుగుణపాలన ! నీవలె నీతిబద్ధులై
యుండెడు పండిత ప్రవరు లుండరు నేడిల నూటికొక్కరున్
ధర్మజ్యోతి ముఖంబున
ధర్మాత్ముండైన తండ్రితత్త్వము తెలిపెన్

ధార్మిక గుణబీజంబుల
నిర్మాణంబయ్యె దౌలుత నే నీలోనన్
శీలసంరక్షణ చిత్తంబుననె కాదు, కవితాగమనమందు దవిలియుండు
వేషమే సాంకర్యదోషశూన్యముకాదు, బాసలోనన్ గానబడుచునుండు
కలముతో నీతులు గఱపబూనుటె కాదు, మనములోగూడ నేమరక యుండు
విద్దెనేర్పుటయందె పెద్దపంతులు కాదు, సౌజన్యమందు నౌజ్జనము వెలయు
ధాన్యరాసులగాంచు చౌదరియెకాదు
కావ్యరాసులు పెంచు సత్కవివరుండు
కర్షక కులంబునన్ బుట్టి కవికులమున
వన్నె కెక్కిన మేటిమా యన్న గారు.
పొలము పంటకు దోడుగా గలము పంట
కలము పంటకు దోడుగా గడుపు పంట
కలిసివచ్చిన నీ పెద్ద కాపుదనము
లెల్ల వారికి గల్గుట కల్లమాట.

నవరత్నాలు

శ్రీ చింతలపూడి శేషగిరిరావు

ఎన్నడొ రెడ్డిరాజుల కవీశ్వరునిన్ గనకాభిషేక సం
పన్నునిగా నొనర్చె నొక పార్థివసత్తముడంచు మున్ను మా
విన్నది కాని, కన్నులకు విందొనరింపదు; కంటి మిప్పుడే
పున్నియ మేమొ? రెడ్డికులభూషణుఁ డిచ్చు సువర్ణ పూజలన్
ఆంధ్రాళి సమ్మోదమందగాఁ బల్కిన, కుండలీంద్ర కవి యకుంఠితోక్తి
స్వర్ణాభిషేక సంపద గాంచి మించిన, శ్రీనాథ సుకవి విశిష్ట శైలి
గండ పెండేరంపు గాన్క గాంచిన యట్టి, పెద్దన్నగారి కవిత్వ మహిమ
ఏనుంగు నెక్కి పృథ్వీశులు మొక్క ని, క్కిన తిర్రుతికవుల తెనుగుసౌరు
అన్నియును నేకరూపమై యలరుకతన
నందఱును నన్ని విధముల నందినట్టి
నిరుపమాన సమ్మానముల్ నీకె దక్కె
క్రమగుణగణ్య! తుమ్మల కవివరేణ్య !
రాజుల దేమిలెక్క ? కవిరాజులె ప్రీతిపురస్సరంబు నీ
రాజన మిచ్చినారలు; స్వరాష్ట్ర పవిత్ర చరిత్రయందు నీ
రాజితనామరాజ మపరంజి మెఱుంగుల శాశ్వతంబుగా
రాజిలునోయి మిత్రకవిరాజ ! విరాజిత కాంతు లీనుచున్
ఆత్మార్పణంబున నాతిథ్యమహిమంబు, కొండాడితివి బుధుల్ కొసరి మెచ్చ
సానలుదీరిన జాతిరత్నంబుల, గురియింపఁ జాలితి పరిగపంట
సమలోష్ట హేమమన్ సదమలధర్మంబు, నిలిపి ధర్మజ్యోతి పలుకగంటి
నీ గాంగనిర్ఝరధార గాంధేయచరితంబు, వెలయింపఁ జేసితి తెలుగునాట
పెద్దరికమిచ్చె నీకు నీ పెద్దకాపు

ఆఱునే యమరజ్యోతి యాక్షయంబు
పిక్కిలె రాష్ట్రగానాన దిక్కు లెల్ల
ధన్యుఁడవు నీవు తుమ్మల మాన్యసుకవి !
ఆఱుగాలము పోతన్న యరక దున్ని
విడిచె నెద్దుల, దుమ్మల బీడు మేయ
బాదరాయణసంబంధ మేదొలేక
కవనమాధుర్యసామ్యంబు కలుగు టెట్లు ?
పులకండంబుల నేఱి తెచ్చి; సుధతో బొర్లించి, పూదేనె వా
కలలో ముంచియు, ద్రాక్షపానకము లందుంగల్సి గ్రుచ్చెత్తి, వె
న్నెలలోఁజేరిచి యాహరింతువట; అంతేకాని లేకున్న నీ
లలితాటోప కవిత్వశైలి యెటులల్లన్ జాలెదో చౌదరీ !
ఆంధ్రమానస చోరత్వమనెడి నేర
మీవు సల్పితి పాత కేడీవి గావె ?
పొన్నుసంకెల పొన్నూరు పురము చెంత
వేసినారన్న నిందులో వింతయేమి ?
ఇంటిపేరు కస్తురి వారు ఇల్లు గబ్బి
లాలకంపను లోకోక్తి లాతియయ్యె
ఇంటిపేరు వగరె కాని హృదయ మధిక
మధురము కవిత యంతకున్ మధురతరము.
ఆమయమొండులేక యిటు లామెత లందుచు నాంధ్రజాతికిన్
గోమలకావ్యకన్యకల గోరినరీతి సృజించుచుండి నా
నామహిమోన్నతు ల్వడసి నాటికి నాటికి జియ్యపట్టి, శ్రీ
రాము కటాక్షవీక్షణపరంపరచే విలసిల్లు మగ్రజా !

సత్కవీశ్వరా!

శ్రీ పల్లెకొండ రంగయ్య

శ్రవణానందకరంబుగ
దవిలెన్ కమ్మకులవార్ధి దనరు కవీంద్రుం
డవిరళ కాంతిసుధాంశుడు
భువి దుర్లభ గౌరవంబు పొందె ననంగన్
తుమ్మలవంశవారినిధి తోయజవైరి విధానదోచి లో
కమ్మున సత్కవిత్వకళ క్రమముగా వెదజల్లి యెందు బా
రమ్మును లేనిశక్తి దనరారిన యిట్టి, సీతరామనా
మమ్మును దాల్చు పండితుడు మాన్యుడు మాకిట నన్ని భంగులన్.
నీ కవి తారసంబు ధరణీధవపూజితమై తనర్చి య
స్తోకకళాజితామృతము శోభనమున్ సకలైకరమ్యమున్
ప్రాకటమైనకీర్తి రుచి రాజిలె, ధన్యము నీదుజన్మ నీ
వేకడనైన భాగ్యనిధివే కద ! ఎంచగ సత్కవీశ్వరా !
దివ్యంబు నీదు గాంధీమహాత్ముని కృతి, దానికి సాటియీ ధరణి లేదు
రాష్ట్రగానము, సుధారమ్యంబు, తత్కీర్తి, నిఖల దిక్కుల యందు నిండిపోయె
గంధగజారోహ గౌరవంబును గన, కాభిషేకంబు నీ కయ్యె నేడు
గండరగండని ఘనతతో గండపెం, డేరంబు దాల్చితి చారుభంగి
కవిత కెంతటి పూజ్యత భువిని గలదొ
యంతపూజ్యత గొంటి వీ వఖిలగతుల
రవివి నీవు నిన్ గూరిచి భువిని నేను
వేఱె పల్కంగనేల! యో విబుధవర్య !
అభినవ తిక్కనా! సదమలామృత సత్కవితామృతాంశ ! నీ
విభవము నీ యశంబు జనవిశ్రుతశక్తియు నాడు నాటికిన్
ప్రభలను దెల్గు దేశమున భ్రాంచితలీలను వృద్ధి బొందగా
ప్రభుతను నీదు వాగ్గరిమ రాజిలు గావుత మెల్లకాలమున్

నానృషిః కురుతేకావ్యమ్

శ్రీ కొణిదెన బాలకృష్ణయ్య

నెచ్చెలియగు తుమ్మల సీతారామమూర్తి కవీశ్వరుని సన్మానవార్త ఆనందము కలిగించినది. ఆకులచాటు పిందె చందమున; సాధుపద్ధతి నవలంబించి, సత్త్వభావసంపదచే బొంపిరివోపు సరసవచనరచనాచతు రిమఁ జెలువొంది, సాహిత్యోపాసన మొనర్చుచున్న యీ ఋషికల్పుని జిరకాలమునకు సమకాలిక భాషాభిమానులు గురుతించి సత్కరింప బద్ధకంకణా లగుట స్తవనీయమగు సంగతి. ఈ కార్యసన్నాహ మాంధ్రభారతికి జయభేరి మోయించుటగా మఱి యొకటి యగునా? మన యిలువేలుపగు సీతారాముడు శాంత గుణాభిరాముఁడు. నే డాంధ్ర పండితకవి మండల మధ్యమున నలంకార శోభితమగు "శారదా పీఠము" నధిష్ఠించి కనకాభిషేకము గాంచుచుండిన యీ సీతారామమూర్తి కవిభూషణుఁడును శాంత స్వభావముద్రితుఁడు. కావున నీ సత్కారకల్పనమున మనము ధన్యులము. యథార్థ కవిశబ్దవాచ్యుఁడగు సీతారామచౌదరి (కవీశ్వరు)ని యధాశక్తి సంభావించి సుకృతుల మైతిమి. సమానాధిక రహితముగు కవి పట్టము గొన్న యీ యనఘుని నామమునకు "చౌదరి" శబ్దము జేర్చుట యిఁకమీద భారకారణము. కావునఁ గవియనియే పిలుతము,

సీతారామమూర్తికవి ఉభయకవిమిత్రుఁడు. అంతియ కాదు. ఉభయ కులోద్ధారకుడు. తుమ్మలవారి వంశ మాయనఘుని జనికారణమున నజరామరమగు యశస్సంపద నార్జించినది. కవిజనకల్పిత కావ్యసంతానము నిరుపాధికముగదా! అందుచేత సప్తసంతానములఁ గావ్యసంతానము పేరెన్నికఁగన్నది.శాశ్వతస్థాయిగొనుచున్నది. కవిని చిరంజీవినిఁ జేయు చున్నది. ఆయా కారణముల చేత నస్మన్మిత్ర వరేణ్యుఁడు సీతారామమూర్తి కవిచంద్రుఁడు

చిరంజీవియై నిరాడంబర సహజ వాగ్విలాసవిన్యాసముల సొంపునింపు కావ్యకుసుమముల తెలుగు బలుకుల వెలఁది నలరించుచుఁ దన కీర్తిచంద్రికలచే త్రిలింగసీమ నలుదెసల గైసేయు గావుత.

ఋష్యంశ సంభూతులు మహాకవులు 'కావున ఋషి కానివాడు కావ్యకర్త కాలేడన్నారు లాక్షణికులు, అనగా గవితాలక్షణముతోడ ఋషి జనసహజములగు శాంతశమదమాదిక సాత్వికలక్షణములుగూడ గవికి అమరి యుండిననాడు మాత్రమే అతఁడు కవినామ వాచ్యుఁ డగుచున్నాడు. ఇట్టి యోగ్యలక్షణ లక్షితుడగు వాని రచనలు నిత్యములు. తక్కురచనలఁగూర్చి చెప్పఁబని లేదుగదా! కవులని పిలిపించుకొనవచ్చును. చెప్పుకొనవచ్చును. పద్యములల్లవచ్చును. అవియన్నియు నస్థిరములు. నీటిబుడగలు. చిరస్థాయి గాంచజాలవు. మన సీతారామ మూర్తికవితోడ సన్నిహితమైత్రిగల వారు ఆయన అసూయామత్సరాదిక హేయగుణమలీ మసహృదయుడు కాడని నిస్సంశయముగ జాటంగలరు. ఆ వేసము, ఆ భాష, ఆ నమ్ర భావముతోడి సామాన్య వస్త్రాద్యలంకరణము, ఆ చిఱునగవు సోయగము బ్రకటించు ప్రసన్న ముఖము ఆ యాజానుబాహు శరీరముతోడి నిరాడంబరవర్తనము ఆ సర్వసులభ మధుర సంభాషణము,కల్ల యెఱుగని జీవనము, కపటమెఱుంగని కవనము ఇవి సీతారామమూర్తి కవివరునకు బెట్టని సొమ్ములు.ఈ కవీశ్వరుని రచనల యందంతట నట్టి యుత్తమ భావ తరంగములు తుఱంగలించు చుండును. కావ్య వస్తువును స్వీకరించుట యందే సీతారామమూర్తి కవీంద్రుని యొక్క పరిశుద్ధ భావౌన్నత్యము తేటతెల్లముగ దెలియనగును. దైవభక్తి, దేశభక్తి స్వస్థాన వేషభాషాభిమానము లీ కైసరి కబ్బముల దీయనగుమాటలలో దొణికిసలాడుచుండును.

కవులు తృణీకృతబ్రహ్మపురందరులు. మానవజీవితమునకు సూర్యచంద్రుల ప్రకాశమును బోలి కవిజన సుభాషితము లత్యవసరములు. అవి

లేనినాడు సూర్యచంద్ర తేజస్సంపదయు నక్కరకు రాదు. ప్రపంచ వ్యవస్థయంతయు నజ్ఞానాంధకారమున మునిగిపోవును. కవి జ్ఞానప్రదాత. బ్రహ్మదేవుని యంతటివాడు దివ్యవాణీ చోదితుఁడై గాని సృష్టి క్రమము నారంభింప జాలఁడయ్యెను. వాణీ పరావతారమూర్తులగు సుకవివరులు ప్రపంచమున నత్యున్నత స్థానము నాక్రమించి యున్నారు. నిర్మత్సరులు, నిరహంకారులు, నిత్యతృప్తులు, విశ్వశ్రేయః ప్రదాతలునగు మహాకవులఁ బూజించుట పరమధర్మము. వారు అజాత శత్రువులు చూడండి.

చం.. మనమున గొన్న నెవ్వగల మాన్పి ఘటింతురకాండ సమ్ముదం
బనఘ కథాముఖంబున హితాహిత బోధమొనర్తు రింపుగా
గనుగొను కన్న నద్భుతముగా నెటిగింతు రతీంద్రియార్థముల్
గనుగొన నెల్లవారల కకారణ మిత్రులుగారె సత్కవుల్"

సంకుసోల నరసింహకవి

కవిధర్మము నీ పై పద్యము దెల్పుచున్నది. కవి బాధ్యతను మనము గుర్తింప నీ పద్యము తోడ్పడుచున్నది. ఈ యోగ్యత సంపాదించిన మహాకవులు పలచ పలచగానున్నారు నేడు. ఇట్టి వర్గమునకు జెందిన "ఎల్లవారల కకారణమిత్రుడు" మన సీతారామమూర్తి కవీశ్వరుడు. సాహిత్యోపాసన, రచనము, ఇవి యీ యనఘుని కృత్యములు. ఆత్మస్తుతి, పరదూషణలీ మహనీయునికి దెలియనే తెలియవు. కవిత్వయోగ పట్టభద్రుడగు దిట్ట, హేయప్రత్యాఖ్యాతములగు విషయములకు దన రచనలయందు దావు నొసంగునా! అవి సామాన్యుల గుణములు మిన్ను విఱిగి మీద బడవచ్చినను సీతారామమూర్తి కవితిలకుఁడు నిజధర్మము నుజ్జగించు పజ్జం జన నొల్లడు. దీని కాయన రచనలే నిదర్శనములు,

పరమేశ్వరుఁడు దనలీలా నాటకము నభివర్ణించి యజ్ఞుల బోధించుటకుఁ గవీశ్వరులను సృజించును. అందుచేత బరమాత్ముని యనంతశక్తి వైభవముల

సంస్తుతించి వివిధార్ధముల మానవధర్మమును నిర్వచించి లోక సంగ్రహమునకు మార్గము జూపుట నిజమగు కవికి విధి. మానవజీవితయాత్రకు కవీశ్వరుడు మార్గదర్శకుడు. దైవభక్తిని, నీతియావశ్యకతను, సత్యవ్రత మును, పురుషార్ధములను, మానవునియందు నిగూఢమైయున్న శక్తులను, జక్కగ వ్యక్తపరుచు రచనల రుచిగొల్పు చందమున రచించుచు బ్రకృతి నిదర్శనముల జూపుచు, సర్వజన జేగీయమానకవిత్వపటుత్వమహత్వమును జూపి, వంశపావనుడై, చిరకాల జీవియై కవీశ్వరుడు రాణించుట పరమధర్మము. పరమేశ్వర మహిమావిశేషముల గొలిచి చూచుటకు గవి కొలగాడట. ఈ క్రింది పద్యభాగమును చిత్తగింపుడు.

చ. కవి కొలగాడు, కావ్యములు గాదెలు కుంచము వాని బుద్ధి యీ
భువనము పంటకళ్ళమట బ్రోవగు రాసులు నీ విలాసముల్ ...."

అనవసరాందోళనల పొంత బోవక అరిషడ్వర్గములచే మేధస్సును బాధించక మనశ్శాంతిని వీడక పై నుడివిన కవిధర్మముల బాటించి యీ కాలమున కావ్యకల్పన మొనర్చుచున్న పుణ్య మూర్తులయందీ సీతారామమూర్తి కవిగారును సెన్నికగన్న వారు. ' బోద్ధారో మత్సరగ్రస్తాః' అను భర్తృహరి వాక్యమీ సత్యకవియందు జెల్లుబడి కానేరదు. ఇతడు నిర్వికారుడు కావున ఋషి, కావ్యరచనమున కర్షుడు. అట్టి వానిని సన్మానించుట ప్రాజ్ఞులకు విధి గదా! ప్రభుత్వ ఆస్థాన కవీశ్వరస్థానమున కీ సుకవి పుంగవుడెంతేని తగినవాడు. ఇతడు వ్రతి. ఏ ఎండ కాగొడుగు వేయు చపలులలో జేర్పదగడు, అహమహమికలతో బరపాండిత్యాదికముల దిట్టి దిగ పాఱబోయు స్వభావము నెఱుంగని యీ సాధుపుంగవుని బ్రభుత్వమువారు ఆస్థాన కవీశ్వర స్థానప్రదానమున సంభావించి, సత్పాత్రసత్కార ఫలవిశేషము నార్జింతురు గావుత, దేశీయులీ సన్మానముతో దనిసి మిన్నకుండక యేకగ్రీవముగ సీతారామమూర్తి కవి గారిని ప్రభుత్వమువారు

ఆస్థానకవీశ్వరునిగ స్వీకరింపదగు విధానము నవలంబించి కార్యాచరణమున కుపక్రమింతురుగాత.

మహాకవులదృష్టియందు త్రిభువన సామ్రాజ్యము గూడ దృణప్రాయము. అట్టిచో నిట్టి సామాన్య సన్మానము లాత్మీయులమగు మనము సంతృప్తి చెందుటకే యగుగాక "సుకవితా యద్యస్తి రాజ్యే నకి" మ్మను సూక్తికి లక్ష్యభూతులైన మహాకవులు అనాప్త సమస్తకాములుగదా! వారి యంతరువుకు దగిన సన్మానము వారి కావ్యరసాస్వాదన మొనర్చి ఆ యుపదేశముల బాటించి సజ్జనులమై నడచుటయగు గాక మఱియొకటి యగునా?

శ్రీ సీతారామచంద్రస్వామియనుగ్రహము సీతారామమూర్తి కవీశ్వరున కాయురారోగ్యై శ్వర్యముల బ్రసాదించి యనవరతము రక్షించుచుండు గావుత. మంగళప్రదమగు నీ సన్మాన మహోత్సవము కవిగారి భవిష్యదభ్యుదయమంగళ ద్వారమై సీతారామమూర్తి కవిసత్తముని గృహము నిత్యమంగళభాసితమై వెలయు గారణమగుగాత. ఇతోధిక సరళచమత్కారభావ బంధురరస సమంచితవాక్సంపదల బ్రసాదించి సర్వ జనస్తుతిపాత్రమగు కావ్యసృష్టి యొనర్చు ప్రతిభావిశేషముల దయచేసి వాణీ హిరణ్యగర్భులీ కవీశ్వరుని గాక్షించుచుందురు గావుత. సమధికోత్సాహాదిక దివ్యశక్తియుక్తునిఁ గావించి సకలసంపదలను సత్సంతతినిఁ గూర్చి సర్వమంగళాశర్వు లీ సుకృతిని సర్వదా కాపాడుచుందురు గావుత.

మా యూరికవి

శ్రీ నాగళ్ళ గురుప్రసాదరావు

కవితాసింహులు బండితేంద్రులు మహాకావ్యాళి నిర్మాత లీ
భువి పైనుండిరికాని నీదు కవితాపూరంబు మాధుర్య మా
కవిబృందానికిఁ జిక్కబోదుగద వాక్చాతుర్యభావాలతో
నవ సౌందర్యము పొందుపర్చితివి యాంధ్రబ్రాహ్మికిన్ చౌదరీ !

మాధుర్యధుర్యమై మానసంబునకింపు, గలుగ జేయును నీదు కావ్యఫణితి
పాటవంబునుగల్గి పరవీరవారమున్, బరుగెత్తజేయు నీ పలుకు ములికి
పరసంస్కృతిని మెచ్చు ప్రజలలో బూర్తిగా, నింపు జాతీయత నీదుకలము
అప్రతిమానమై యాంధ్రులలో వేడి,నెత్తురు జిందించు నీదు ప్రతిభ
తెలుగువారల దీనత తీరిపోయె
కొఱతలన్నియు మీరుంటఁ బఱియలయ్యె
తెలుగు నాడెల్ల జేజేలు పలుకుచుండ
రమ్ము గైకొమ్ము భక్తి నీరాజనమ్ము,
మూలనొదిగియుండి మూల్గుచునున్నట్టి
తెలుఁగుజాతి కపర తిక్కనార్య !
ప్రాణ మిచ్చినావు రాష్ట్రగానము వ్రాసి
తుమ్మలాన్వయాబ్ధి తుహినకిరణ !
కమ్మని కైతను జెప్పుచు, కమ్మకులంబునకు బేరుగావించుచు తె
ల్గమ్మకు బెంపును గూర్చుచు నిమ్మహి విలసిల్లుమయ్య హే కవిచంద్రా!

హైమపూజలు

శ్రీ అయితం కాళీవరప్రసాదరావు

ధారారమ్యము నీకవిత్వఝురి, సీతారామమూర్తీ! మహో
దారప్రక్రియ గండపెండెరముచేతన్ భద్రశుండాల వా
హారోహోత్సవ వైభవస్ఫురణచే హైమాభిషేకంబుచే
సూరుల్ ధీరులు గౌరవించి రిచటన్ చోద్యంబు లేదేమియున్.

కవనతపంబు దుర్లభము కాకలు తీఱిన వాడవందు భూ
ధవులకు లేని కీర్తిరమ తావకలాలనపాలనంబులన్
దవిలి సుఖించె నాంధ్రభువి, దానిని గాంచియె గాదె అర్హవై
భవమున గౌరవించె నిటు; ప్రజ్ఞలు వంద్యము లెందు మిత్రమా!

తపమున వ్రాసి, యెట్టులనొ దానిని వెల్వరుపంగ జేసి య
చ్చపు మది బంపిగూడ నొక జాబున కేనియు నోచనట్టి పెన్
తపసులు సత్కవీశ్వరు లుదారులు ధీరులు గల్గుభూమి, నీ
దుపదము హైమపూజలకుఁ దోచుట కెంతయు మిన్ను ముట్టితిన్

నీ కవితారసాభ్యుదయ నీరధియై యతుల ప్రకార కీ
ర్త్యాకరమై త్రిలింగ భువిహర్షమునందుత ! నీ గృహంబు ల
క్ష్మీకలితంబు, దివ్యకవి శేఖరజాలక జన్మభూమియై
మాకు నితాంతహర్షమును మాటికిఁ గూర్చుత దైవసత్కృపన్

సుకవివి పాండితీ విభవశోభితమూర్తివి నీకృతంబులై
సకలదిశావకాశముల సన్నుతకావ్య సుగంధవీచికల్
ప్రకటములయ్యె; నేడిచటఁ బండితవర్గము రాజసత్కవి
ప్రకరము సేయు గౌరవము ప్రాజ్యము పూజ్యము స్తుత్య మారయన్

అంతియగాదు వర్తనమునందున నీవు విశాలబుద్ధివై
యెంతయు నొప్పుసత్క వివి, యేమియు దంభము లేద; యల్పదు
స్స్వాంతుల వేడ బోవని వచఃపరిపూతుడ వీవు, వాక్కళా
కాంత ! మదీయమిత్ర ! కవిగౌరవభూషణ ! స్వస్తి నీకగున్.

కల్యాణమస్తు

శ్రీ బోడేపూడి వేంకటరావు

ఏ యుగాల నాడొ స్మృతిపథంబున గూడ
జాఱిపోయి యున్న గౌరవంబు
నాంచికొంటివమ్మ! యాంధ్రీ మహాదేవి !
స్వర్ణయుగము తెల్గుజాతి కిద్ది.
ఏనాడో యలకృష్ణభూధవుడు భద్రేభంబు నెక్కించి స
న్మానించెన్, గనకాభిషేకమున సంభావించె మా తెల్గు ధా
త్రీ నాథుండని యెంచి హర్షరసవార్ధిం దేలు నాంధ్రాళి నే
త్రానందంబుగఁ గాంచు నేడు భవదీయ ప్రాజ్యసమ్మానముల్.
బాసట సుంత లేక పరభాషల రాయిడి కోడి వన్నెకుం
బాసిన యాంధ్రభారతి నభంగురగౌరవదివ్యభర్మసిం
హాసనమందు నిల్పిన మహామహిమన్ మహనీయ వైభవ
శ్రీ సముదీర్ఘ గౌరవసమృద్ధుల నందగ గంటి సత్కవీ !
ప్రాచీన ప్రథితాంధ్రకావ్యకలనాభంగీప్రసంగంబు ల
ర్వాచీనోజ్జ్వల భావబంధములచే రంజిల్లగా జేసి స
ధ్రీచీనంబగు నవ్య కావ్యరచనారీతుల్ ప్రపంచించు వా
గ్వైచిత్రుల్ భవదీయకీర్తిలతికం బ్రాకించె నాంధ్రావనిన్
బహుభాషార్ణవ మంథనక్రమవిధాపారీణు డాంధ్రావనీ
బహుకాలార్జిత పుణ్యమూర్తి, కవితాప్రాశస్త్యనిర్ణాయక
స్పృహణీయుండల కట్టమంచి కులవర్ధిష్ణుండు నిర్ణేతయై
బహుమానించుట చాటదే భవదపారప్రౌఢకావ్యప్రథన్.

కల్యాణమస్తు తిక్కన మహాబిరుద వి, ద్యోతిత కవితా మహోదయునకు
దీర్ఘాయురస్తు గాంధీ పూజ్యపాదు గా, థా ప్రపంచైక వైతాళికునకు
ఆరోగ్యమస్తు రాష్ట్రాందోళన క్రియా, బహుధావి నిర్ణయ పండితునకు
ఫలసిద్ధిరస్తు సంకలిత ధర్మజ్యోతి, సందీపితోత్తమ చరిత నుతికి.
అనవరత కనకాభిషేకాది వివిధ
బహుళ సమ్మాన సంతతిప్రాప్తిరస్తు
సారసాహిత్యమహిత కేదారభూమి
బఱిగపంటల గూర్చి సత్పండితాళి
కామెత లొసంగు, సరసహృదంతరునకు
తుమ్మలాన్వయుండ ! కమ్మని తెలుగులో
సరసకవితలల్లఁ జాలువాడ !
సీతరామమూర్తి! చెలిమి మై మాయిచ్చు
నమృతసూక్తి మణులనందికొనుము.

చౌదరీ

శ్రీ కొండవీటివేంకటకవి

మా్రోగినది దివ్యమంజీర ఝణఝణ త్కారమ్ము నై రాష్ట్రగానరవళి
ఉరవణించినది భావోచితమ్మగుచు, సత్యాహింసదయల మహాత్మగాథ
శబ్దించి మించె నజాండభాండమునిండి కఱకైన మీ పెద్ద కాపుగొంతు
ఏరించినది దివ్యహృదయాల రత్నాల పదజాల మెల్ల మీ పఱిగెపంట
అష్టదిగ్గంతిదంతనీహార హీర
సారడిండీరమల్లికా సదృశకీర్తి
శ్రావ్యమై, భావ్యమయ్యె మీ కావ్యసరణి,
ఆంధ్రకవిచంద్ర ! జోహారు లందికొమ్ము.
తెలుగుం జోదుల కోరమీసముల నుద్దీపించు శౌర్యమ్ము, నీ
కలమందు న్వెలయించి నాడవు భళీ, కవ్యగ్రణీ! నిండు వె
న్నెల సెల్లా ధరియింపజేసితివి, యాంధ్రిన్, నీకవిత్వమ్ము, తె
ల్గుల జైతన్యుల జేసి వేసినది నిగ్గుం గూర్చుచుం చౌదరీ !

కళానిధి

శ్రీ కొప్పరపు మల్లికార్జునరావుకవి (శతావధాని)

తుమ్మలవంశవార్నిధి విధుప్రధ ! నీ కవితాస్రవంతిగా
నమ్మ రసజ్ఞ మానస వనమ్ముల గ్రమ్మి, సుగంధభావభా
రమ్మున మత్తిలించి, మధురమ్మగు శాబ్దికవీచికానికా
యమ్మున డోలగట్టి యనయమ్ము సుఖమ్ముల నిద్ర దేల్చెడిన్.

పదలాలిత్యమునందు బోతనకవి బ్రహ్మంబుతో, భావనా
భ్యుదయప్రజ్ఞను సూరనార్యునకు, శబ్దోదారగాంభీర్య సం
పద శ్రీనాథునకుం దెలుంగుబొలుపుం బ్రాప్తింప దిక్కన్నయొ
ప్పిదముల్ రాయగనేర్పు నీకయిత హృద్యోధిం బ్రచారించెడున్

పరువౌ సత్కవితాపథమ్మున కవిబ్రహ్మాంకముంజెంది, యా
దరణీయంపు గుణంబులన్ సుజనతాత్పర్యంబు నార్జించి, యాం
ధ్రరసన్ జీవనయుక్తజేయు ధిషణగ్రైవేయు నీపాటి స
త్కరణీయంబున గౌరవించుట యలంకారంబె యాంధ్రాళికిన్.

అరిశిలాభిదపవిస్ఫురణ నాశ్రితజనా నందమౌ రాష్ట్రగానంపు సొంపు
ఖలమానసాఘనిర్దళనభావాంభఃపవి, త్రమ్ము నాత్మకథానకమ్ము టిమ్ము
జవరాలి సవరంపు నవుమో మివతళించు, చిఱునవ్వు పంటయా పఱిగెపంట
కాయమానలతావితాన మీనుసుమప్ర, తానపేయము గవితాపథమ్ము
నట్టి సుగుణంబులం బురాయించి, నీదు
కీర్తివెలయించి రసికహృద్యర్తిత మగు
గౌరవము బాహిరము జేసె గాక నేడు
నంత కెక్కు డదేమి? కవ్యగ్రగణ్య!

తగునయ్యా ! భవదీయసారకవితా తన్వీ రుచిప్లావితం
బగు నీ యాంధ్రధరాతలంబు హృదయాప్యాయంబుగా, నూలుపో
వుగ నీకుం గయి సేయు నీదృశవిధంబున్, ధీనిధీ ! కొండయం
తగఁ బత్రిం దెమలింతురే హరిని ! సీతారామకవ్యగ్రణీ!

కవికులచంద్రా!
శ్రీ కోవెలమూడి వేంకటేశ్వర్లు
శ్రీ వాణీనిలయంబగు
కావూరి సుకృతఫలంబ ! కవికులచంద్రా!
నీ వాక్చతురత, మధురత
లావణ్యము నీదుకృతుల లాస్య మొనర్చున్.
తిక్కనకవనం బభినవ
తిక్కన ! నీ హృదయసీమ దిరపడి మొలకై
మొక్కై ఘనభూరుహమై
యక్కజముగ మధురతరఫలావళి విరిసెన్.
అనుభవించుకొలది నతి మధురం బయి
జుంటి తేనెవోలె జున్నువోలె
దృప్తినొసగు కవిత ప్రాప్తించె నీకహో!
మూర్తి కవివరేణ్య! కీర్తిగణ్య !
తెలిసి రాంధ్రులు నిన్ను దీయని కైతలో, రాష్ట్రగానాదులు వ్రాసినపుడె
ముక్కోటితెలుగులు ముక్తకంఠముతోడ నభినవతిక్కన్న వనిరి మురిసి
కొదువేమి నీకింక గొమ్ము టేనుఁగు నెక్కి కవిచక్రవర్తివై ఘనతగాంచ
తఱుఁగేమి నీకు, నీ ధర్మకావ్యములకు గనకాభిషేకముల్ గలుగు టందు
గండపెండేరంపు గాంతులు దిగ్వీథి
హెచ్చ దాండవింపవచ్చు నీవు
కావ్యకన్య లెలమి శ్రావ్యగానము సేయ
నాంధ్రక వనరంగమందుఁ జేరి.
శ్రీ సీతారామకవీ!
నీ సత్కృతు లాంధ్రవాణి నిలిచినదాకన్
భాసిల్లుచు దేశమ్మున
వాసియు వన్నెయుఁ గడించి వంద్యము లవుతన్.

విప్లవకవి

శ్రీ చల్లయ్య

"అధ్యాత్మవిద్యావిద్యానామ్" అను సూత్రము ననుసరించి ప్రాచీను లన్ని విద్యలకన్న బ్రహ్మవిద్య కగ్రస్థానమిచ్చిరి. బాహ్య స్వరూప మన్నమయ, జడ, భౌతికములుగా నగుపడు చున్నను అభ్యంతరమం దనిర్వచనీయచిచ్ఛక్తి, చైతన్య, ఆనందములు గలవను విషయమును బోధించునదే యధ్యాత్మ శాస్త్రమనియు వచించినారు.

ఈ యధ్యాత్మశాస్త్రమే ప్రపంచాదికారణ శాస్త్రమగుటచే దీనినే యెల్ల రంగీకరించిరి. మానవ జీవన సిద్ధాంతము లేక నీతిశాస్త్రము దీని ననుసరించియె నిర్ణయింపబడినది. సమస్తశాస్త్రములకు, కళలకు నీ యుభయ శాస్త్రాధిపత్యము తప్పనిసరిగా నుండవలెను. లేకున్న మానవజీవన అభివృద్ధి, ఔన్నత్య, సఫలత, లనునవి గగనకుసుమములే యగును. కనుకనే వ్యాసుడు మొదలు బాణకవివరకును తరువాత భారతీయకవులలో శ్రేష్టులగు వారంద రీ రీతిగనే తమ సాహిత్యమును, ప్రజాజీవనానుకూలముగా రచించి సమాజ సేవకులై యఖండకీ ర్తి గాంచిరి.

తిక్కనాదులు పెక్కు రాంధ్రకవిశిఖామణులీత్రోవనే కావ్యరచన గావించి ఆంధ్ర ప్రజానీకమున కౌన్నత్య సఫలతాభివృద్ధుల నాస్వాదింపజేసిరి.

కాని యీ 20 వ శతాబ్దములో ప్రపంచమున జరిగిన పరిణామము ననుసరించి భారతదేశమును తదంత ర్భాగమగు మన యాంధ్రమాతయు "డైలెక్ట్రికల్ మెటీరియలిజం" అను మార్క్స సిద్ధాంతముచే ప్రభావితమై శాస్త్రముకొఱకె శాస్త్రమనియు, కళకొరకే కళయనియు జీవితమునకును కళకును సంబంధము లేదనియు భేదభావాభివృద్ధియే యభివృద్ధికి మూలకంద మనియు బోధించుచు మానవులలో క్రోధ, మోహ, మద, మాత్సర్యముల రెచ్చగొట్టి

సమాజమును రక్తరంజితము గావించు సాహిత్యమె యభ్యుదయసాహిత్యమని పొలికేక లిడువారే మహాదేశభక్తులనియు తదన్యులు విప్లవసాహిత్యకులు గారనియు తామె విప్లవ సాహిత్యపరుల మనియు తమకు తామె ఢంకా బజాయించుకొన నారంభించి ధన, దౌర్జన్య, ద్వేషగుణో పాసకులై పేర్గాంచుచున్నారు.

విప్లవసాహిత్యమనగా హింసాద్వేషములు పురికొల్పునదే యగుచో నందుకు సాహిత్య మవసరమా? ఎలుకను భక్షింపుమనిపిల్లికి, కప్పను తినుమని పాముకు, పామును చంపమని ముంగిసకు శాస్త్ర సాహిత్యము లుపదేశింపవలెనా? ఇట్లుపదేశించు సాహిత్యము ప్రతీపమా ! అభ్యుదయమా? విప్లవమా? ముమ్మాటికి ప్రతీపసాహిత్యమే యగును. డార్విన్ సిద్ధాంతము ననుసరించి మానవుడభివృద్ధికి వచ్చిన జంతువగుచో వానికి పాతగుణములనే బోధించుట ప్రతీపసాహిత్యముగాక పురోగామి సాహిత్య మెట్లగును?

పురోగామి లేక విప్లవసాహిత్య మనగా నీతి శాస్త్రాంకుశముగలదై మానవజీవన లక్ష్యమును బోధించి దానియందు భక్తి శ్రద్దలు గల్గించి, యింద్రియ సుఖముల త్యజించి, కామినీ కాంచనముల కధీనులుగాక అరిషడ్వర్గముల జయింప ప్రేరేపించి ధర్మప్రధానముగా పురుషార్థముల సాధింపుడనియు, దండమును తిరస్కరించి దయను బోధించుటయగాక పరిస్థితుల జయింప నుత్సాహపరచి కర్తవ్యానందమును బోధించును.

ఇట్టి పురోగామి సాహిత్యకవులలో నగ్రగణ్యు లభినవతిక్కనగా రనుటకు ధర్మజ్యోతిలో కర్తవ్యానందుడగు చెలికానిచే

ఆ. నింద లేవిలేక నీసొమ్ము నీచేత
నిడు ముహూర్త మెప్పు డెప్పు డంచు
గలవరించు నన్ను గరుణించి నేటికా
రంగశాయి మది కొసంగె హాయి

అని అనిపింపగలుగుట నిదర్శనము. ప్రతిమానవుడిట్లే తనవంతుకు వచ్చిన కర్తవ్యమును నెరవేర్చి కర్తవ్యానందము ననుభవింప నీపద్యము బోధించుట పురోగామి సాహిత్యముగాక మరేమగును?

ఇట్టి కర్తవ్యనిష్ఠులగువారు పరహృదయమున సాత్విక పరిణామమును గావింపగలరు గనుకనే

క. ఈ పసిడి నెల్లఁ గొనఁగా
నోపుణ్యనిధీ ! మదీయ ముల్లము వెఱచున్
నాపల్కు గుఱుచ సేయక
యేపారిన పేర్మినందు మిందొక ముక్కన్.

అని బేహారి యనవలసివచ్చినది. అన్నంతమాత్రముచే - చెలికాని హృదయ ముబ్బి తబ్బిబ్బులు గాక వినయముగా తన యల్పసేవకై యిట్లనశక్యమా?

శిబివలె మేనికండలను జీల్చితి నెట్లు! మరున్నదీ కుమారు
బలె నఖండ రాజ్యరమ రోసితి నొక్కొ? దధీచిమౌని య
ట్ల బెదరు లేక వెన్నెముక లాగితి నోటు త్రిశంకుసూతు భం
బలుకరాని కష్టముల గీడ్పడి సుక్కితినేమి? సెప్పుమా.

అని యనహంకారముగా బలికించుటయ గాక జీవనలక్ష్యశుద్ధి నుద్ఘాటించెను. సమాజ సేవకు లీ పద్యమును చదివినంతనే తమ మనము నందలి యహంకారమును కుంచపఱచు కొనవలయునని యభిలషింపరా? ఇట్టి కోరిక శాంతికి మూలముగాదా? యీ భావము అలవర్చుకొన్న నాడు సత్యశివసుందర జీవితముల్ మొదల్కొనుట అసంభవమా!

ఒక పుట్టుగుంక తన తా
లికి వచ్చిన రెండురూకలే డెబ్బది వే
లకు బెంచె, బెంచినది హా
టకమా? వివరింపు ముత్కటం బగు నఘమా!

అనుటలో కవిగా రెంత ముణ్ణముగా ప్రస్తుత పరిస్థితుల నవగత మొనరించుకొనియున్నారో లెస్సగ తెలియబడుచున్నది. ఇంతియెగాక, పేదతనముఁ జూచి కవి ఎంత సంతప్తహృదయు డయ్యెనో చూడుడు,

గీ. ఎవనియెముక లీ మేడల కిటుకలయ్యె
నెవని రక్తంబుచే గోడలిట్లు బిగిసె
నతనికా యిట్టి పరమ హేయంపు బ్రతుకు
వానికా యట్టి దుర్మరణానుభూతి!

ఈరీతి పరబాధానుభవ మెరుగు కవి యయ్యును, సత్త్వగుణాభి వర్ధితుండగుటచే మాల్కొ మాయా భౌతికవాదము ననుసరింపక సాత్త్విక పరిణామకాంక్షి.తుడగుట వలననే

ఆ చెమటనోడ్చి నరుడు జీవింపదగుగాని
తేరసొమ్ము మెక్కి త్రేపరాదు
బానిసీడు కుడుచు పరమాన్నమునకంటే
నుచిత మిచ్చకొలది నొదవు గంజి

యని ఉత్తమమానవజీవన లక్ష్యమును బోధింప గల్గొన్నాడు. ఇట్టికవులే సమాజ సేవకులు వీరి కావ్యము లే సంఘకళ్యాణ కారకములు. ఇట్టికళలే జీవనోప యోగకరములు. కావున నట్టి కళాసష్టలకు కనకాభిషేకములేగాదు వజాభి షేకములు గావించినను సమాజము తమ ఋణమును తీర్చుకొన జాలదన్నచో నత్యుక్తిగా నేరదు. ఆంధ్ర ప్రజానీక మింతద్విగుణీకృతోత్సా హముతో వీరికి కనకాభిషేకము గావించుచున్నందుకు తోడియాంధ్రులను ఆంధ్రమాత యనుంగు ముద్దు బిడ్డడగు నీయభినవతిక్కనను హృదయపూర్వకముగా నభినందించుచు వీరికి భగవంతు డాయురారోగ్య ఐశ్వర్యముల నొసగుగాకని ప్రార్థింతును.★

అభినవతిక్కయజ్వ

శ్రీ బూదూరు రామానుజులు రెడ్డి

"అభినవ తిక్కయజ్వ" బిరుదాంకము నంది, తెనుంగు జాతికిన్
శుభముల గూర్చినారలు; వసుంధరకున్ భవదీయసత్కృతుల్
విభవములై చెలంగు; సుకవీశ్వర ! యీ కనకాభిషేకమున్
ప్రభుత గజాధిరోహణము భద్రము లౌత ! యశఃప్రదంబులై
తుమ్మలవంశ వారిధి విధుండవు సత్కవితాప్రభావమున్
కమ్మని తెన్గుతీరు నుడికారపు సొంపులు; కొత్త కొత్త శ
బ్దమ్ములు పూర్వజన్మ సుకృతంబులు భావము లద్దిరయ్య ! మీ
సొమ్ము తెనుంగు వాణి కవిసుందర ! యింక జయంబుఁ గాంచుమా!
పరుగులువారు భావపరిపాకరసామృతసారవాహినీ
స్ఫురణము; గానమాధురి యపూర్వగుణ శ్రవణానురంజకం
బరయ, పదార్థ సంపద మహామహిమాన్విత మద్దిరా, కవి
త్వరమ వరించె కోరి నిను వర్ధిలు మార్య ! చిరాయురున్నతిన్
లలితపదన్యాస మలఘుభావోల్లాస, మనుపమరచన "మాత్మార్పణమ్ము"
ప్రథిత విఖ్యాతమ్ము పృథుగుణోపేతమ్ము, కల్యాణచరిత మా "గాంధిచరిత"
నిత్యనిర్మల నీతినియతి "ధర్మజ్యోతి" పలుసరకుల పంట "పరిగ పంట"
దేశభాషాసక్తి దేశీయగుణరక్తి, రంజిల్లు గానమ్ము "రాష్ట్ర గాన"
మౌర కవిచంద్ర! వినుత మహాకవీంద్ర !
కొనుము సన్మాన మిట్టులే ఘనత గనుము
భవ్యగుణపూత స్వాతంత్ర్య భరతమాత
సకల శుభముల నొసంగి నిన్ సాకుగాత !
సభ మహాకవి సన్మానసంచితంబు
అతిథి "యభినవ తిక్కనయజ్వ" సుకవి'
గద్దె నమరిన మహిముండు కట్టమంచి
విభుడు భాగ్యంబు లిక వేర వెదకనేల ?

పూలమాల

శ్రీ దేవులపల్లి రామానుజరావు

తిక్కనామాత్యుని తెలుగు పందిళ్ళలో, విరబూచుపూవుల మురిపమరసి
పొందామరాకులో పొదవి పోతన యీయ, అల్లన నవనీత మందుకొనుచు
కవిసార్వభౌముని కావ్యవీధులనొప్పు, కస్తూరి వాసన ప్రస్తుతించి
పేశలోక్తులు పల్కు పెద్దనార్యుని పద్య సంగీతమాధురిన్ పొంగిపోయి
ఆంధ్రభారతి భవ్య దేవాలయాన
సాహితీతోరణంబుల సంచరించు
నీదు విన్నాణమునుగాంచి చౌదరీంద్ర
ఆచరింతురు ప్రణతుల నందుకొమ్ము.
ఆంధ్రుల సర్వంకషాభివృద్ధినిదెల్పి తెలుగుబిడ్డల ప్రబోధించినావు
ఐకమత్యంబున నలరు భాగ్యంబుల, తెలుగునేలకు నీవు దెలిపినావు
జీవచ్ఛవంబులై చివుకు నాంధ్రుల కీవు, ఉత్సాహమంత్రంబు నూదినావు
అరవమూకల నేల ననుకరింప నటంచు, చాటినా వాంధ్రుల శౌర్యచరిత
తెలుగువారల కెల్లప్డు తెలుగుదనమె
ఆశ్రయం బని పల్కి నీ వాంధ్రజనని
గౌరవంబును గాపాడ గోరినావు
మాయు రే మాతృప్రేమ ! తుమ్మలకవీశ !
భారత ప్రతిబింబగౌరవం బార్జించె, కలికి పల్కుల నీదు తెలుగుకవిత
బోసినోటి మహర్షి పూతచారిత్రంబు వర్ణించి నీనాణి వన్నె కెక్కె
భారత జాతీయ భావసంపద లెల్ల, అలరుచున్నవి నీదు కలము నందు
సకలాంధ్ర దేశమున్ సమ్మోదమున దేల్చె, కళలకల్యాణి నీ కావ్యకన్య
అన్ని విధముల ధన్యుడ వౌదు వీవు

ఆయురారోగ్య విభవంబు లందుమయ్య
దీవన లొసంగు నీకిదే తెలుగుతల్లి
సత్కవీ ! నేటిసన్మానసమయమందు.
ఆర్ద్రహృదయులు మనసోదరాంధ్రు లచట
కవిని పూజింప మా తెలంగాణ సీమ
భక్తి ప్రేమల నీరీతి బంపుచుండె
అఖిత దాల్పుము ఇయ్యదే అలరుదండ.
అభ్యుదయము
ఉపాధ్యాయమిత్రుడు

స్వాగత మనూసభావనా బలనిధాన !
స్వస్తి రసవత్కవిత్వ విద్యావినోద !
జయము నయ దయా పౌరుపోజ్జ్వలమనీష !
అభ్యుదయ మభినవతిక్కనార్య ! నీకు.
రాజితసత్కృతుల్ సుకవిరాజులు మెచ్చ రచించి భాషకున్
దేజము గూర్చునిన్ను నవతిక్కన సద్బిరుదాంకు బంగరుం
బూజ లొనర్చి, బ్రహ్మరథమున్ ఘటియించి యనన్యభక్తి నీ
రాజనమిచ్చి యాంధ్రులకళాదృతి ధన్యతఁ గాంచె సత్కవీ!
ఆత్మకథ లమరజ్యోతులై వెలుంగ
మాతృభాషాభివృద్ధి కాత్మార్పణంబు
సలుపు మీవంటి సత్కవీశ్వరుల నరసి
సత్కరించుటే జూతి విజ్ఞతకు సాటి.
ప్రవిమలోన్నత దివ్యభావాంబరవిహారి, కరినెక్కి వాడలం దిరుగుటేమి
అనిశబోధాసువర్ణాబ్ది దేలెడుదణి, పుత్తడి నీటిలో బ్రుంగుటేమి
అచ్చంపు మడి కైత కందె వైచినచేయి పొన్నుగుల్ల కడెంబుఁ బొదుగు టేమి

అఖిలాంధ్ర హృదయవీరారాధ్యుఁడగు సూరి చిఱుగద్దె పూజల మురియుటేమి
యని హసించెదవేమొ? మా యాత్మ నలరు
మితి యెఱుంగని గౌరవోన్నతికి వీని
స్మృతిపతాకమాత్రములుగా నెంచికొనవె
పుణ్యకీర్తి ! సీతారామమూర్తి సుకవి!
ఆంధ్రకవి పితామహు కాలియందియ శ్రుతి
అగ్రహార యాచ్ఞాగానమం దడంగె?
సార్వభౌముని బంగారు జలకపు మడి
శాలిసంకెలత్రుప్పుతో మైలబడియె.
ధీరగమ్యాపరిగ్రహదీక్షితు నిను
నండ జేరి యీ సన్మానమండనములు
సార్థకత జెందుగాత విశంకటగతి
పూజ్యవర్తి! సీతారామమూర్తి సుకవి !
పూతకవిత్వమాధ్వీరసపుష్టిని మత్తిడి భ్రాతృమానసా
బ్జాతములన్ హరించెడు ప్రజాహితచోరుని నిన్ను బట్టి కా
ల్సేతులు క్రొంబసిండి నును శృంఖల గూరిచి కొమ్ము తేజిపై
మ్రోతలెసంగ ద్రిప్పి నిదుర్బోలిటు శిక్ష విధింప న్యాయమే ?
తాము కళాప్రధానకవితా మధుకోశ మొకింత మూసి, ని
స్సీమ గతిన్ సజీవమృతి జెంది కృశించెడు నాంధ్రజాతిపై
ప్రేమఁ బ్రబోధవాఙ్మయఝురిన్ దొరలింపు డుదారధర్మబో
ధామహితాత్మ ! భావిచరితల్ గుఱుతించు సువర్ణ రేఖలన్.
మీదు సన్మానగరిమ నామోదభరము పంచుకొని యభినందించు పరమహితులు
సుకవిరాజు సీతారామసూరిముఖుల, దివ్యవాణి మిమ్మాశీర్వదించుగాక.

సత్కళానిధీ

శ్రీ దురిశేటి వేంకటరామాచార్యులు

జాను తెనుంగునందుగల చక్కదనంబులు జాలువారు నీ
మానితమైన కైత రసమంజులమై అవధాత కెంతయుం
దేనెల సోనలన్ విరిసి తీయని భావములిచ్చునంచు నే
వీనుల విందులౌ నుడులు వింటిని కంటిని సత్కళానిధీ !
సకలాంధ్రావని సత్కవిత్వరచనాచాతుర్య ధీశక్తి నే
యొకరో నిన్ బురుడింతు రిట్టి ప్రతిభావ్యుత్పత్తులన్ సాధ్యమా ?
అకలంకమ్ము నమోఘమైన పదవిన్యాసంబునం గల్గు పొం
దికయుం దూకము నీవెఱింగితివిపో తిక్కన్నకుం దీటుగన్.

కర్ణాటేశుని ప్రౌఢరాయని సమక్షంబందు మిన్నందుచున్
స్వర్ణ స్నానము లాచరించిన కవిత్వస్వామి నీక్షింపమిన్
శీర్ణంబైన త్రిలింగసోదర తపశ్శ్ర లెంతయు న్నేడు సం
పూర్ణంబయ్యె నిటొక్క కాలమున నేమున్నీవు జీవించుటన్.

మహాకవీ!

శ్రీ చిన్నము రామయ్యచౌదరి

నీ వొకనాడు భవ్యతపనీయ మణీమయ చారు సౌధరా
జావళి బ్రొద్దుపుచ్చిన మహాకవిమండలిలోనివాడవో
పావనకావ్యసార సుధపానము చేసిన దివ్యమూర్తివో
యేవిధి లేక యెట్లు సృజియింతు మనోహర కావ్యహర్మ్యముల్.
ఓ కవిపుంగవా! విమలమూర్జితమైన మహత్తరాంధ్ర భా
షాకవితావిలాసము విశాలదిశాఫలకమ్ము లందు జి
త్రీకృతమయ్యె తావకము, దీవ్యదఖండకళాప్రభూతమా
ధ్వీకమనీయమాధురికధీతివి నీ జని యెంతధన్యమో?
ఏ సుముహూర్తమున్ వెదకి ఏరిచి కూరిచినారొ మీమహో
ల్లాసము రాష్ట్రగానమున లాస్యము చేసినది, ఆంధ్రరాజ్య ల
క్ష్మీ సముదీర్ణవైభవవిశేషము హారతు లందుకొన్నదా
యాసము దీర్చు దివ్యకవితామృత మద్భుతమై, స్రవింపగా.
రమణీయమ్ములు యుష్మదన్వయచరిత్రల్, భావగాంభీర్య ని
ర్మమతాశాలి త్వదీయపూజ్యపిత ధర్మజ్యోతియైవెల్గె; నీ
వమరజ్యోతివి తెల్గుభారతికినేలా యాత్మగాధామహ
త్త్వము లాత్మార్పణ పూర్వకమ్మల గవీంద్రా !: ప్రస్తుతుల్ సేయగన్.
ఎపుడో వింటిమి గండ పెండరములన్ హేమాభిషేకమ్ములన్
నృపసింహమ్ములు సత్కరించిన కథానీకమ్ము: నే డాంధ్రకా
శ్యపి నీరాజన మిచ్చుచున్నది కవీశా ! తన్మహాసత్కృతిన్
విపులానంతవిశాలవీధుల బ్రధావింపన్ దదీయ ప్రభల్.

ఓ గణనీయదివ్యకవితోజ్జ్వలసుందరమూర్తి! నీ మహా
భాగత మిన్నుముట్టి మదవారణ మెక్కిన దాంధ్రసాహితీ
భోగము వన్నె కెక్కి పరువుల్ పచరించిన దీ మహాద్భుత
స్వాగతసత్కృతుల్ చిఱు నివాళిగదా ! భవదీయ సేవకున్
ఓయి మహాకవీ! సుకవితోర్మిపరంపర మిన్నువాకయై
పాయలు పాయలై భువనపావనమైనది తెల్గు దోటలో
దీయని పూవుదేనియల తేటలు కాల్వలుగట్టిపారగా
గోయిల గొంతుతో మధురకూజితముల్ పొనరింపు మింపుగా.
సరస పరిహాస మధుర ప్రసంగములకు
జొక్కి మెచ్చనివారు మచ్చునకు లేరు
సత్కవి శిఖామణీ ! నమస్కారమయ్య
అమరజీవివి నీకు దీర్ఘాయురస్తు!

బంగారపు వాన

శ్రీ వంద్యారం వేంకటసుబ్బయ్య

ఆరు గాలము వ్యవసాయదారు నట్లు
వాఙ్మయ క్షేత్రమున బాటుపడితి వీవు
పంటలక్ష్మి బంగారపువానజల్లు
గురిసెడిని నేడు నీమీద గ్రొత్త సిరులు
రెడ్డిరాజుల ప్రీతి సమృద్ధివలన
మున్ను శ్రీనాథకవి మౌళికన్న ప్రథిమ
రెడ్డికులమాళి నీకు నర్పించె నిప్పు
డిది స్వభావము రెడ్లకు విదితమయ్యె.
సారస్వతాభిమాన మ
పారమ్ముగ వెల్లివొడిచె బహుళాంధ్రము సీ
తారామమూర్తినేఁ డిటు
కూరుచు నిది యెల్లకవులకున్ సంతసమున్.ఏ
శ్రుతిరమ్యకవిత్వశాలివై
సతత ప్రీతి బ్రజల్ భజింపగా
హితకోటిప్రమోద మందగా
శతవర్షంబు లెసంగు చౌదరీ!

కనకాభిషేకము

శ్రీ భీమిరెడ్డి వేంకటప్పారెడ్డి

చిత్రవిచిత్రరీతులను సృష్టి నొనర్చి తదీయమైన వై
చిత్రికి సాద్భుతుం డగుచు జిత్తమునన్ స్మరియించుశక్తి నీ
ధాత్రిని నొక్కమర్త్యునకె తద్దయునిచ్చిన స్వామిసత్కృపా
నేత్రములం గనుంగొనుచు నిచ్చలు నీ కవివర్య ప్రోవుతన్.
బుధజనవంద్య ! పూర్వకృతపుణ్యమునన్ సుజనాభినంద్యమై
ప్రథ సమకూర్పజాలు ప్రభవంబును గాంచితి యింతకుం గడుం
బ్రధితము లైన గౌరవపరంపరలన్ లభియింప జేయు స
త్కథల జగద్ధితంబు లయి గ్రాల రచింపుము సత్ప్రబంధముల్
కడుపునఁ బుట్టినంతనే జగంబున సంతతి సార్ధకత్వముం
బడయదు తల్లి దండ్రుల సపర్య యొనర్పక మీకవిత్వపుం
బుడుత కృతజ్ఞ సర్వగుణ పూజితయై పితృభక్తి గూర్చె జే
పడ సభ గండపెండేరము పావనమౌ కనకాభిషేకమున్.
మనుజేంద్రు ల్ధనసాంద్రులుం బడయ సామాన్యంబె యీదృక్సుధీ
జనమాన్యం బసదృక్షమై నెగడు నీ సన్మాన మెచ్చోటనో
యనఘా ! గోచరమయ్యె సూ "సుకవితా యద్యస్తి రాజ్యేన కి
మ్మ" నునార్యోక్తి ప్రసిద్ధ గౌరవము మీ రందంగ మర్త్యాళికిన్.
కవు లీసంసది మిమ్ము గూర్చి యనురాగం బూర నానావిధ
స్తవముల్ చేసి పని న్ముగించిరవి మీస్వాంతంబునం దుంచి స
ద్వ్యవహారంబునఁ బెంపొనర్చుటయె ధీరా ! యుండె శేషంబు సం
స్తవనం బార్యు లొనర్ప వర్ధిలుము సీతారామమూర్తీ ! తగన్.

సిరు లింపొందియు సౌమనస్యము భజించె న్ని న్ను భాషాద్వయీ
వరపాండిత్యము సత్కవిత్వరచనాప్రౌఢత్వముం జేరి వి
స్తరకీర్తిస్ఫురణాలతావితతి నాశారాశి బ్రాకించె ని
ద్దర లోటున్న దె తుమ్మలాన్వయజ ! సీతారామమూర్త్యగ్రణీ !
అది యేమో వివరింపజాలము సరోజామోదముల్ గ్రమ్మిన
ట్లు దితేందూపలనిస్సరజ్జలములం దోలాడిన ట్లెంతయున్
మదికిం జల్లనయుం గగుర్పొడుపు సంపాదించు నీ కైత లిం
త దురాపం బొకొ శైలి యన్యులకు సీతారామమూర్త్యగ్రణీ !
ఎచట న్నేపదమె ట్లిలముద్పఁదగు నే యే పద్య మెచ్చోట న
భ్యుచితంబౌ నెటువంటి భావముల నే భూముల్ విరాజిల్లు ద
ద్రచనా నైపుణి నీకు బ్రాక్తన కవీంద్ర శ్రేణికిం బోలె నిం
త చిరాభ్యస్తముగాగ నొప్పెడినె సీతారామమూర్త్యగ్రణీ !
బలిజేపల్లియు రాయప్రోలు మతి కొప్రం బేటుకూ రింక తు
మ్మల మున్నైన మహాస్వయాంబుధు లిటుల్ మాణిక్యముల్ గాంచి కీ
ర్తి లసద్రోచుల దిక్కులన్ నెఱప బేర్మిం బ్రోచు గుంటూరు మం
డల తేజం బిది యింత యొప్పెడినె సీతారామమూర్త్య గ్రణీ!
ఘన భావంబులకై శిర స్తలములం గావింప వా ప్రాస బం
ధన విశ్రాంతులకై తడంబడవు విన్నాణంపు శబ్దాళికై
పనిబూనం గమకింప వాశుకవితాప్రావీణ్యగణ్యుండవై
తనరం గూర్చెదు హృద్యపద్యతతి సీతారామమూర్త్యగ్రణీ!
కమనీయంపుఁ గపోతయుగ్మము కథం గావించి యాతిథ్య ము
త్తమమ న్నీతిని బేరుకొంటివి పరద్రవ్యం బహార్యంబుగాఁ
గ్రమమౌ తంద్రిచరిత్ర జెప్పితి వహో; గాంధీయచారిత్ర మా

త్మముదం బొంద రచించి మించితివి సీతారామమూర్త్యగ్రణీ!
అమల యశంబు కబ్బముల నబ్బిన దెంతయు; నాంధ్రతాభిమా
నము దళుకొంద నెల్లరమనంబుల రంజిలజేయు రాష్ట్రగా
నము రచియించినాడ వది నాణెపుగబ్బముగాగ నాంధ్రదే
శమున ఓస్థిరత్వముం జిరయశంబు గడించిన దెంచి చూడగన్.
అభినవతిక్క నాహ్వాయబిరుదంబు నందితివి నెల్లూరి పండితుల వలన
రాష్ట్రగానము శివరామనృపాలున కంకితం బొనరించి తప్పికట్ల
దానయ్యకవికి సత్కారంబు సేసి ధర్మజ్యోతి నొసగితి మహిత సభను
గనకాభిషేకంబు గండపెండరమును నిడుబోల గొంటి పండితుల యెదుట
నీదు భాగ్యంబు నెంత వర్ణింపగలము
కృతిపతుల బిల్చికొని సత్కరించువితము
నేగురులు నేర్పిరో నీకహీనమైన
కీర్తి గొంటివి సీతారామమూర్తి సుకవి !
ఆనంద మందెద మసమప్రబంధ సం, బంధ బంధములనిర్మాణమునకు
హర్షంబు నొందెద మమర తరంగిణీ, జలసేకసమమైన శైలిగాంచి
మోదంబు గాంతుము మురరిపు వేణుగా,నము బోని రచనసంధానమునకు
బ్రమదంబు గనుగొందు మమలశబ్దార్థ సంపదల బొంపిరి వోవు భావములకు
సమ్మదము జెందెదము పంకజాతవిమల
మధురమకరందబిందుసంగ్రథిత తావ
కీనసంభాషణములకు గృతివి నీవు
కీర్తనీయ ! సీతారామమూర్తి సుకవి !

ప్రశంస

శ్రీ చల్లా పిచ్చయ్యశాస్త్రి

శ్రీదా సరోజమ్మృదుపాదా జగత్త్రయరసౌదార్యదివ్యసుపదా
స్వాదా శ్రుతిస్మృతికలాది ప్రమోదపదవీదానదీక్షితపదా
మేధోలసత్సౌధపాదస్ఫురత్సుకవితాదిత్యదీప్తివిశదా
నేదీయసీభవతు భౌదా పనోదనిపుణా దివ్యశారదళలా
కవి సామాన్యుడు కాడు మాన్యుడగు నెక్కాలంబు శ్రీ విక్రమా
ర్కవిభుం డాదిగ దొంటిఱేండ్లు భయవాక్కల్యాణ సంధాయకుల్
కవితన్ రాజ్యము నొక్కమాదిరిగ నేలంజాలీ రీమధ్యవే
ళ విలోపించెను తద్విధాన మిపుడుల్లాసంబుఁ గొల్పెంగడున్.
ఔచిత్యమ్మును గుర్తెఱింగి సువిమర్యాదర్శమందున్ సదా
ప్రాచీనాదృత నాంధ్రవాఙ్మయములన్ బ్రాధాన్యముం దెల్పువా
గ్వైచిత్రీనిధి "రామలింగ" సుమనఃకల్పంబు మోచాఫల
త్ప్రాచుర్యోక్తు లెసంగె సత్కృతిని సీతారామ మేల్కైసరీ!
రసధారాప్లుతి దంత్యశోభయును సారప్రక్రియాంచద్గతుల్
పొసగన్ భారతికిన్ నిరంతరముబొల్పున్ భద్రమత్తేభముల్
పసగై సేసి యొసంగు నీకొకటియౌ భద్రేభ రాజోత్సవో
త్కసమం బెట్లగు "రాష్ట్రగాన" కృతి సీతారామమేల్కైసరీ !
మెఱుఁగుల్ క్రిక్కిఱియించు భావమణులన్ మేకొల్పి పల్మెల్పునన్
దెఱగుల్ భవ్యసువర్ణ భూషలను వాగ్దేవీమనఃప్రీతి కే
ర్పఱుపం జాలిన నీకు నియ్యెడల సత్స్వర్ణాభిషేకాదు లి
త్తఱి నిట్టుల్ రచియించుటల్ తగును సీతారామ మేల్కైసరీ !
సమతాదేశము దేశసేవకలభాషాసేవ గావించి ధీ
రమణీయం బగు కైతతీవె ఏపువులన్ గ్రంథంబులం గూర్చి స
ర్వమనోజ్ఞంబగు కీర్తినొప్పు నిను శ్రీ రామప్రభుం డేలు ని
త్యము దీర్ఘాయు వనామయం బొసఁగి సీతారామ మేల్కైసరీ !

విరిదండ

శ్రీ యార్లగడ్డ వేంకటసుబ్బారావు

చండ భుజార్గళోద్ధతి కజాండము బెగ్గడిలంగ నాంధ్ర భూ
మండల మేలినట్టి బుధమాన్యుడు రాజనరేంద్రు కొల్వులో
బండెను తెల్గుపంట మనభాగ్యము స్వర్ణ ముహూర్త మద్ధి, నా
డుండినవారు ధన్యులు మహోజ్జ్వలభారతగాధ ద్రవ్వి ది
గ్భాండము నిండబోసె ననపార్యుడు, తిక్కన ప్రెగ్గడార్యుడున్
డిండిమభట్టు సాముగరిడీ లొనరింపగ కంచుఢక్క వా
గ్భండన మందు వ్రచ్చి కనకంబున తీర్థములాడె సార్వభౌ
ముండు ! నిశాతఖడ్గపరిభూత తురుష్కధరాధినాథుడౌ
గండరగండపోటు మొనగాడు కవీంద్రుడు కృష్ణరాయడే
పెండెరముం దగుల్ప పురవీధిని తా నెదురైనచోట వే
దండము నాపి కేలొసగ దర్పముతో దిరుగాడె పెద్దనా
ర్యుండును; తత్కథ ల్వినగ రోమములెల్లను నిక్కు, నిట్టు లె
న్నండొకొ! చూచుటీ తెలుగునాట మనోహర కావ్యరంగ మా
ర్తండుడు పూర్వ శైల శిఖరంబును బోని మదేభ మెక్కి పూ
దండల ముస్గ నాంధ్రకవితావనితాలలితోపహారముల్
మండెలుగాగ దిక్కరులమాడ్కి మహాకవు లెల్లచోట గై
దండ లొసంగ దేవగురుదర్ప మడంపగజాలు పండితా
ఖండలు నెల దిక్కుల జకాచకబారులుదీర్చి నిల్వ బ్ర
హ్మాండము తూర్యశంఖపటహధ్వని ఘూర్ణిలజేయు నిట్టి యీ
పండువు జూచు భాగ్య మని భావపరంపర గ్రుద్దులాడ నా
గుండియలోన మ్రోగినది గుబ్బపు డెక్కల సవ్వ డిప్పుడో
నిండె సుధాస్రవంతి రవణించెను తెల్గుపొలంతి గజ్జియల్
పండువునేడు నిన్ను కడుపారగ గన్న తెలుంగుతల్లికిన్

* * *

కమ్మని తెల్గుబాస చిరకాలము నోచిన నోము పండె నీ
తుమ్మల వంశమందు; పెడత్రోవల బట్టిన యాంధ్రజాతి బ
మ్ముల బట్టి తెచ్చుటకుగా విరచించితి పౌర రాష్ట్రగా
నమ్ము మహోజ్జ్వలాంధ్రజన నాయకవృత్తము లెల్ల నెత్తి లో
కమ్మున గ్రుమ్మరించితివి; కాలరథమ్మున కగ్గమైన శి
ల్పమ్ముల జూపినావు ! పరభాషలకై పరువెత్తు వారి లో
పమ్ముల నెత్తి చూపితివి పశ్చిమమండలవాసు లొండు రా
ష్ట్రమ్మును గోర దెల్పితి విచారమ్ము నాంధ్రులలోన నైకమ
త్యమ్ము తిరమ్ముగా వలయుదాస్యము ద్రోయుట కంటి; లోకదా
స్యమ్మునడంపబుట్టిన మహాత్ముని వృత్తము జెప్పినావు; పా
ర్య మ్మది యాంధ్రచెన్ననగరాన్నమలాది కళాలయంబులన్
మమ్ము క్షమింపగావలయు మామకు నల్లుడు స్వీయమాతృవం
శమ్మునుగూర్చి చెప్పినటు సర్వధరోజ్జ్వలదీపసూర్యబిం
బమ్మును దివ్వె జూపినటు వల్కితి నల్లుడగాన ఏల నీ
కమ్మయు గబ్బమౌ తెలుగు కావ్యసుమంబులఁ గమ్మ పుప్పొడుల్
చిమ్మగ, లోక మెల్ల మధుసింధువు కుత్తుకబంటి గాగ భృం
గమ్మయి దోగి తన్మధురకంఠము నెత్తి పఠింపసాగె గీ
తమ్ములు రోళ్ళరోకళుల దద్ధిమి తద్దిమిమ్రోగు నీదు కా
వ్యమ్ములు తెల్గుపూవుల సువాసన లెల్లెడ బర్వుగావుతన్.

* * *

ఏర్ల గడ్డమీదనేపుగా బెరుగుట, కతన వక్రవృత్తి గలుగలేదు
చిగురు గొమ్మయందు జేవయే గనుపించు, కంటకమ్ము లిచట గానరావు
దానయాదులకే కావ్యదాతవయ్యు, కమ్మవిలుకాని నల్లునిగాగ బడసి
పుచ్చుకొనుమాట యెఱుగని పుణ్యమూర్తి!, అందుకొనవయ్య! కపురంపు టారతులను
సర్వవిశ్వసృష్టిసాధకం బగుశక్తి, సర్వలోకములను సాకుశక్తి
సర్వభూతములను సంధించు పరశక్తి, శతశరత్తులవని సాకు గాత.

అన్న

శ్రీ వోగేటి పశుపతి

నీవు నీత్రోవ వెంబడి పోవునప్పు డెన్నొమారులు చూచియు నేను వచ్చి
పలుకరించను నిను నాదు దలపునందు, వేయి యూహలలో నిండిపోయి నిలుతు.
ఒక పునీత సంబంధ మెదోయెదో మనకు గలదని లోలోన దవ్వుకొనుచుందు
నింతలో దోచుబో ! మన యిర్వురకును మధ్య, మన "మహాపిత " అహింసా వ్రతనిధి.
అన్న వనుకొందు నప్పుడే అన్నవ్రాసి కొనెను తండ్రి పుణ్యకథను తెనుగులోన
అన్న పితృభక్తిపరుడన్న ఆస్తికుడు క, డుంగడు గృతార్థుడనుకొని పొంగిపోదు.
అపుడేమో యొక బుద్ధిపుట్టు కవినై ఆంధ్రావనీదిగ్గిగం
తపరివ్యాప్త మహాప్రశస్తి గనువిన్నాణమ్ము నాకెట్లు, లే
ద పితృస్వామికథా సుధావచన హృద్యంబైన నీయింటియం
దెపుడున్ నేను ప్రతిధ్వనించుకొనరాదే ! యంచు భిత్తిస్థితిన్.
నీహృదయోన్నతిం దెలియనేరని వారికిగాక ఈ గజా
రోహణమేల నీకు ? కవిలోమణీ! కనకాభిషేక పు
ణ్యాహము తెచ్చిపెట్టగలదా ? సరిక్రొత్త మెఱుంగు నీకు ఓ
హోహో ! ఇవెల్ల తెల్గుప్రజ యుష్మ దుదాత్తత కిచ్చు కానుకల్.
తనకేమొ బ్రహ్మరథమ్ము పట్టినది లో, కమ్ములోకమ్ము తద్గౌరవమ్ము
తనకు గాదని తండ్రి తనలోని రాముని, జూచుకొన్నాడు లో జూపులోన
విశ్వహృదయ మహావిపులసామ్రాజ్యమ్ము, చెఱగులు నాల్గింట మెఱసినట్టి
నిశిత తత్పితృదేవ నిష్కామఖడ్గంబు, కవిరాజ ! నీకు రక్ష నిడుగాక.
తత్ప్రభావ దీప్తి తప్తమౌ నీయెడం
దయు గడింది కూర్చు తమ్ముగుట్ట
లేము కవులు తండ్రి యేగిన నిష్కామ
పథము నడువ తోడుపడును గాక !

పొలి గలగాలి

శ్రీ శిష్ట్లా సత్యనారాయణరాజశేఖరము

కలుముల కయిదాలుపు కా
పుల కిల వేలుపు తెలుంగు పొలివేలుపు క
న్నుల చల్వ బొలిగలుగు తు
మ్మల సీతారామసుధికి మా పొలికవికిన్.

పట్టణ నాగరీకతకు బానిసలై మనురీతి మాని యీ
పుట్టు పురోహితుల్ నకలు భూపతులుం గుహనావణిగ్వరుల్
మొట్టమొదంటి కాపు లటుపోయిన గాంధియుగమ్ములోన నీ
కట్టిన కాపు గైతలకు గమ్మని జోత లివే మహాకవీ!

కవి చేతిబట్టి నాగలి దున్ను కాలాన దోచిన ఋక్కులతో మహర్షి
నాగ నొప్పినమాట నాడును నేడును దథ్యంబ తద్దివ్యదర్శనమున
లోకోత్తరాద్భుతానైక వ్యానీకముల సృష్టిచేసి మీబోంట్లు ఋషుల
తావు మెట్టిరి నేడు ధర్మంబు సత్యంబు పోకడవోయిన పుణ్యనిధులు
ఋషుల దేశానబుట్టి తద్రీతి నెఱిగి
నానృషిః "కురుతే కావ్య" మనెడు సూక్తి
యెరిగి యెరిగి కన్దోయికి నెట్టయెదుట
జెలగు ఋషికల్పు మిమ్మలక్షింప జాల.

తెలుగుం బల్కుల పాలవెల్లి నిలువుల్ తెర్లించి తెర్లించి నీ
వలె నింపౌ నుడికారముం జిలుక నేర్వం డింకొకం డౌర ! ని
ర్మలనిత్యార్జవనీతిబద్ధరచనామాత్రైక దీక్షల్ సుశో
భిల సత్కావ్యసుధన్ విదల్చుదని గర్వింతున్ మదిన్ మద్గురూ !

గుమ్మలసత్కవీ ! భవ దతుల్యపవిత్ర కవిత్వ సేవలో
కమ్మదనంబు నీగొనము కమ్మదనంబును నెంద ఱెందఱో
నమ్మిన నాదుబోంట్లకు ఘనంబుగ వెన్నెల వెల్గు లీనగా
ని మ్మిక బ్రాహ్మణత్వమున కెంచము లెమ్ము కులమ్ము బుట్టువున్.

కవీశ్వర!

శ్రీ పి.వేం.గోపాలరావు, బి.ఎ

ఇది యూరూరుల పొర్లు నిన్నన గవీ యేతెంచు ! భూరిప్రజా
నది; ముం దల్లదె, మిత్రపండిత కవీంద్రశ్రేణి వచ్చెన్ సభా
సదులారా ! నవతిక్కనార్యుడు భవత్సన్మానసంలక్ష్యసం
పద భూపాలకరామలింగముఖ విద్వద్గాఢ సంశ్లేషుడున్.
కోమలమైన నీ పరిగ గువ్వలబొమ్మ లమర్చివేది ధ
ర్మామరదీపముల్ నిలిపి యాత్మకథన్ గరిగించి రాష్ట్ర గా
నామలశోభ నర్తిలుచు నాంధ్రి శుభాక్షత లంది పొల్చెనో
యీా, ముదమారగంటివె కవీశ్వర ధన్యభవుల్ భవాదృశుల్.
రాయలకొల్వు లందు గవిరాజులు వెల్గిరి తొల్లి యిర్వురీ
చాయల రెండురీతులగు సత్కృతు లొంది యవెల్ల గుప్పగా
నీ యొడిజేరజూచితిమి నేడిట ఇట్టి ముహూర్త దర్శనా
ప్యాయితులైన తెల్గులకు బర్వదినంబులు నాడు నేడుగా
వెగటై కొందఱు చూడలేని కనులన్ వీక్షింతురా ? రోగి దృ
ష్టిగుణం బట్టిది పైడిలోమునిగి పెండేరమ్ము గైసేసి భ
ద్రగజారోహణసల్పి హారతులు వొందన్ లెమ్ము ముమ్మాటికిన్
దగు నీపాల గళారసానుభవ ! ఏతద్గౌరవాభ్యున్నతుల్.
కవితాకాంత మరింత దాల్చి భవదుద్గ్రంథప్రసూనావళిన్
నవ సౌందర్య నిధానయై చెలగుతన్ తత్కంకణాందోళనా
రవగీతంబుల హాయిలో నొడలు మర్వన్ జేసి నీ వంశమున్
భవ దుర్విన్ గరుణాశరణ్యయగుచున్ బాలించి లాలించుతన్.

పుణ్యమూర్తి!

శ్రీ ముక్తినూతలపాటి శీతారామయ్య

శ్రీనివాసంబయి చెలగు శ్రీ తుమ్మల, వంశాబ్ది శశిభంగి వరలినావు
ఉభయభాషాజ్ఞాన విభవంబు గడియించి, పండిత పట్టంబు బడసినావు
అలరు కృతులగూర్చి యభినవతిక్కన, యను దివ్యబిరుదంబు నందినావు
గురుడవై సద్విద్య గరపి విద్యార్థుల, పట్ల వాత్సల్యంబు బఱపినావు
సభల నవధానములు పెక్కు జరిపిజరిపి, యార్జన మొనర్చినావు యశోర్ధరాశి
సద్గుణుడవీవు త్యాగివి చతురమతివి, పుణ్యమూర్తి! సీతారామమూర్తి సుకవి!
సద పేక్షంగని నీకృతుల్ చదివితిన్ స్థాలీపులాకక్రియన్
పదలాలిత్యము కల్పనాగరిమ భావ ప్రౌఢిమం బెంతయో
ముదమున్ గూరిచె "రాష్ట్రగానమును" సొంపుల్ మీర నిర్మించినా
వది గాంచన్ భవదాంధ్రభక్తి విశదంబౌగాదె యెవ్వారికిన్
కూరిమి బెద్దనార్యునకు గూర్చె నొకానొకనాడు గొప్ప స
త్కారము కృష్ణరాయ లటు కావ్యము చేకొనువేళ గండపెం
డేరము నిచ్చెనంచు వినుటేకద ! అట్టిమహోత్సవంబు గ
న్నారము నీకుగల్గ సుదినం బిదిగాదె తలంప సత్కవీ!
ఒనరు కనకాభిషేకమహోత్సవంబు, మున్నహో కవిసార్వభౌమునకు జరిగె
నట్టి సన్మానసిద్ధియు నమరె నీకు, ధన్యుడవు తెల్గుతల్లి కీర్తనము కతన.
సత్యలోకాశేష సౌభాగ్య మెందాక, భారతీనిలయమై పరిఢవిల్లు
వైకుంఠమందిరవైభవ మెందాక, నిందిరాసదనమై యిం పెసంగు
రజత శైలోన్నత ప్రాభవ మెందాక, గౌరీనివాసమై పేరుగాంచు
రవితుహినాంశుతారాగణ మ్మెందాక, దివ్యప్రభలతోడ దేజరిల్లు
నవని నందాక నీకృతు లలరుగాత ! విజయమే ప్రొద్దు నీకు లభించుగాత!
ఆయురారోగ్య సంపద లావహిల్ల శ్రీనివాసుండు నిన్ను రక్షించుగాత !

కవిరాణ్మౌళి

శ్రీ కడివేటి నరసారెడ్డి

సౌగంధికాసూనసౌరభసంపద, బిసశిరీషవినూత్న పేశలంబు
మంజులపీయూషమాధుర్యవిభవంబు, హిమకౌముదీ శైత్యసమరసంబు
కమనీయపాథోధిగంభీరభావంబు, కరుణామృత ప్రవాహరమవిభూతి
పరిపూర్ణవిజ్ఞానబంధురగరిమంబు సుమనససౌభాగ్యశోభనంబు
నచలనిజబోధతత్త్వమం దనువుకొల్పి
యాంధ్రజనులకు దెల్పు వేమన్న యోగి
కీర్తివిధుని సీతారామమూర్తికవిని
మనుచుగావుత నానందమగ్న జేసి.
కమ్మనిరాష్ట్రగానసుధ కర్ణపుటంబుల సోక నాంధ్రలో
కమ్మున గొప్పగా సరసకావ్యముఖంబునఁ గూర్చి యిచ్చె మా
తుమ్మలవంశదుగ్ధ ఘనతో యధిచంద్రుడు సత్కవీంద్రబృం
దమ్ముల మేటిచౌదరి గుణంబుల పేటి విశాలదృష్టితోన్
అభినవ శ్రీతిక్కనాభిఖ్యబిరుదాంక,శోభితుం డత్యంత సూక్ష్మబుద్ధి
గాంధీమహాత్మాత్మగాధకల్పితధాత, రాష్ట్రగాన కవిత్వరచననేత
పావనతుమ్మలపాథోధిశశి బహు, గ్రంథనిర్మాత సత్కవినుతుండు
పూజ్యసీతారామమూర్తిచౌదరి కవి, రాణ్మౌళి పాండిత్యరవిసమాను
డగుచుఁ గవి గండపెండేరమందు వేళ
నొప్పి కనకాభిషేకమహోత్సవంబు
భద్రదంత్యుత్సవము నేత్ర పర్వమయ్యె
నహహ ! యాంధ్రుల భాగ్య మేమనగవచ్చు?
సుకవుల్ తెలుగున గౌరవ
నికర శ్రీగాంచి మనగ నెగడిరి గద ! పూ
నిక తుమ్మలసీతారా
మకవిప్రవరుం డనూనమహిమ జెలంగన్.

అభినందనము

శ్రీ అంబి వేంకటప్పయ్య

ప్రభుడయి యెల్లలోకముల బాలనసేయుచు నాత్మ రాజ్యస
ద్విభవము బొందజాలక మదిన్ దురపిల్లెడు మానవాళి దు
ష్ప్రభవముగాంచి జాలిగొను శాశ్వత తేజము మేలుగూర్చి మా
యభినవ తిక్కనార్యుని సమంచితరీతుల బ్రోచుగావుతన్.
జిలిబిలి తేనెపల్కుల నూత్నభావంబు, లతిప్రౌఢముగ జెప్పు ననువు గలిగి
సొంపైన నడకల నింపుగూర్చెడు నట్టి తీరుతీయని మంచిధార గలిగి
వినువారి కాహ్లాదమును నొసంగెడు సర, సం బగు పాత్రపోషణము గలిగి
యర్థగాంభీర్యంబు ననుపమవ్యంగ్యంబు నెఱిజూపనేర్చిన నేర్పుగలిగి
పండితులు పామరులుగూడ బహువిధముల
జెలగునట్లుగ గవితను జెప్పినాడ
వౌర ! తుమ్మలవంశక్షీరాబ్ధిచంద్ర
బుధవిధేయ ! సీతారామమూర్తివర్య !
తొలిభాషాప్రియులైన భూపతులు సంతోషంబులో సత్కవీం
ద్రులకుం గాన్కలొసంగి వాహముల నారోహించి యూరేగ జే
సి లసత్కీర్తుల గాంచి రట్టి ఘనతం జేకూర్చి దిగ్వ్యాప్త కీ
ర్తుల బెంపొందిరి యాంధ్రభూప్రజలె సూరుల్ మిమ్ము సేవించుటన్.
శబ్దశాసనమహాశబ్దశోభితుఁడు న, న్నయ రాజరాజేంద్రనరవిభుండు
కవిబ్రహ్మతిక్కన కవివరేణ్యుండును, మనుమసిద్ధి నృపాలమండితుండు
కవిసార్వభౌమవిఖ్యాతుండు శ్రీనాథు డల, కొండవీటి ధరాధిపుండు
ధన్యాంధ్రకవితాపితామహుం డలసాని యమలుండు కృష్ణరాయ ప్రభుండు
నొకరిచేత మరొక్క రీయుర్వియందు, స్థిరతరంబగు సత్కీర్తి జెందినటుల
నధికులగు వారు మీ కనకాభిషేక, సంఘమును బొందు ధరణి శాశ్వతయశంబు
తెలుగుభాషకు వన్నెల దీర్చి దిద్ది యిట్టి కనకాభిషేకంబు లెన్ని యేని
పలుప్రదేశంబులందున బడయునటుల మీకు దీర్ఘాయు వొసగుత లోకవిభుడు

కవిసార్వభౌముదు

శ్రీ తుమ్మల కోటయ్య

ఉద్ది కవిసార్వభౌమున
కెద్దీ ? కనకాభిషేక మెపుడెపు డనుమా,
బుద్ధిగల కోర్కెలెల్లను
సిద్ధించెగదన్న యిపుడు సీతారామా!
కాకవి బ్రహ్మారాకాసిమూకలదోల దరి, కొన్న సుకవి సుదర్శనమ్ము
సరస సత్కవులకు సచివాగ్రగణ్యుండు, భాషావధూళిరోభూషణమ్ము
రాష్ట్ర ప్రజా మనోరాజవీధుల వెంట, బ్రియమార నూరేగు పెండ్లికొడుకు
రసవత్ప్రబంధసారసగంధులనుగూడి, క్రీడించి మోదించు కోడెకాడు
గాక ఎవ్వాడు కనకాభి షేక మొంది
గండపెండేర మీరీతి గాల మెరయ
జేయనోపును సత్కవిశ్రేణియందు
ధన్యు డీతని బొగడ నాతరమె భరము
వ్యాస వాల్మీకి శ్రీకాళిదాసు మాఘు
తిక్కనార్యుని నన్నయ దక్కుగలుగు
మేటికవులను జూడనిలోటు మాకు
తీరె నినుజూడ నభినవతిక్కనార్య!
ఝుమ్మని యమృతము దొణికెడి
కమ్మని నీ రాష్ట్రగాన కవితాశక్తిన్
తుమ్మలవంశమునకు పే
రిమ్మహి సమకూర్చితౌర యిద్ధ చరిత్రా!
పుర మేగన్ గజ మెక్కి తక్కుకవులున్ బుణ్యాత్ము లెల్లెత్తి నీ
బిరుదుల్ చాటగ గండ పెండియరం మీ పేరోలగమ్మందు నీ
చరణాబ్జంబును నాశ్రయించుటయు నీ స్వర్ణాభిషేకం బహో!
తరమా నీయశ ముగ్గడింప నిల ? సీతారామమూర్తీ ! తగన్

ధీరోదాత్తుడు

శ్రీ సుంకర శివరామయ్య చౌదరి

జయము అభినవ తిక్కనార్యా!
జయము తుమ్మల వంశవర్యా!
జయము అతులిత యశోధుర్యా!
జయము గురువర్యా!
కమ్మ బిడ్డవు తెనుగు జోదువు
తెలుగు వెలుగుల దెసల జిమ్ముచు
కమ్మ కయితల నల్ల నేర్చిన
కయిసరుండవురా!
అందుకోవోయి సుకవీ! అం
దుకోవోయీ సుమపూజలన్
ఆంధ్ర సంతతి గజముపై నిడి
యతులనుతు లొసగన్.
మిన్ను వాకను బురుడించు మేలిసొగసు
తేనేతేటల నొలికించు తియ్యదనము
సరసహృదయుల మెప్పించు చారుకవిత
కలదు కవివర ! మీకావ్యకళలయందు.
కలదు కల దొక ప్రగతి నీ కలమునందు
అద్ది సమ్మోహినీమంత్రశక్తి యేమొ
సరససాహితీ మాధురీ సాధురీతి
యేమొ యాంధ్రితపఃఫలమేమొ వంద్య!
ధీరుడ వుదాత్తుడ వతి గంభీరుడవును
కంచుకాగడా వేసి గాలించుకొన్న
యాచనాదైన్య మిసుమంతయైన లేని
ధన్యుడవునీవు సుకవిమూర్ధన్య మాన్య !

కవిరాజు

శ్రీ పెండ్యాల సత్యనారాయణ

ఓ కవిరాజ ! తావళరసోల్బణసత్కవితాసుధాంబుధా
రాకమనీయ భావగుణ రంగదభంగ తరంగ ఫేనమా
లాకృత ధాతసీమ సకలంబు త్రిలింగ ధరాతలంబు ది
వ్యాకృతులైరిపో యశము నాయువు లంది భవత్కృతీశ్వరుల్.

శారద శర్వరీ ధవళచంద్రికలున్ మలయానిలమ్ములున్
కైరవకామినీ ముఖవికాసములున్ తదగారభృంగ ఝం
కారములున్ నవాంగనల కంకణని, క్వణముల్ సువాసనా
పూరములున్ మహోద్ధతిగ పొల్చు భవత్కవితా వనమ్ములోన్.
చెలువు గురిపించు కవిత సృష్టించునపుడు
తేనెలూరెడు మందార సూనములతొ
వ్రాసితీవొ యేమొ ? లేకున్న ప్రతిపదమున
భావవాహిని వెల్లువై పొటు నొక్కొ!

మామా!

శ్రీ జాస్తి శ్రీరాములు

నీ మాన్యత్వము నీయశోగరిమ నీ ని స్తంద్ర వాణీసప
ర్యామర్యాదయు నీయనల్పమగు మూర్తాంధ్రాభిమానమ్ము మా
మా! మేనల్లుడౌనట నా కెఱుక కౌమారంబునం దుండియున్
దామీ యాంధ్రులు గుర్తెఱింగిరిట సీతారామమూర్తీ! కవీ !
పండితకవిగా సంభావింపబడితివి సింహపురీ రెడ్ల సీమయందు
అతిలోకమాన్యమహాత్ముచరిత పద్య, మున నచ్చువోసితి వినుతి కెక్క
ఆర్తరక్షాదక్ష   మోదతు మఖిలభారత భూమి, యంచు నిర్మించి తాత్మార్పణంబు
వీణా సముత్థ మాధ్వీకనిస్వానమౌ రాష్ట్రగానమ్మును వ్రాయగంటి
ఆంధ్ర భాషాపరాకాష్ఠ నంది లలిత, కళల నిష్ణాతులైనట్టి కట్టమంచి
వారె అభినవ తిక్కయజ్వా యటంచు, బిలువ బిరుదందితివి నీవు విమలహృదయ!
ఏయే ఘట్టము పట్టి చూచినను నెంతేనిన్ రసోత్సేకమై
పీయూషాంజలి గ్రోలినట్టు లగు నావిర్భూతమా కైత భా
షాయోషామణి దిద్ది తీర్చితికదా సత్కావ్యసాహిత్యధౌ
రేయా! ఆత్మకథాదిసత్కృతులు కీర్తిం దెచ్చె నీ కెంతయున్.
పరభాషాపరకీయవేషములు సంప్రాపించి పైకెక్కి దు
ర్భరదాస్యాంధతం జిమ్ముచీకటులు గప్పన్ గుప్పలై పశ్యతో
హరులౌ నన్ములు దోచుచుండి రని స్వీయమ్మైన రాష్ట్రమ్మునన్
వరగానాజ్య సుదీపితం బగు ప్రదీపం బుంచి వెల్గించితౌ.
అహరహంబును దలపించు నాంధ్రమాతృ
పాదపూజా శుభోదయపారవశ్య
మంది నీహృది యెంత యానందపడునొ
భువిని గృతకృత్యుడవు నీవు కవివతంస !

సుకవిచంద్ర

శ్రీ దేవినేని సూరయ్య

శ్రీరమ్య తుమ్మలకుల
క్షీరాంబుధిచంద్ర ! విబుధ శేఖర ! వినుతో
దారగుణ ప్రోజ్జ్వల ! సీ
తారామకవీంద్ర ! భూషితయశోరుంద్రా !
కనకాభిషేకంబు గావించుకొనె గవి,సార్వభౌములు మహోత్సాహమంద
గండపెండేరంబు గైసేసికొనె నాంధ్ర,కవితాపితామహుల్ గణుతి సేయ
అభినవతిక్కనాద్యద్భుతబిరుదమ్ము లందె, నాంధ్రప్రజ యభినుతింప
భద్రగజము నెక్కి భాసిల్లుచు జగాన, నిజయశోదీధితుల్ నింపుకొనియె
ఔర ! తావక కవితాకుమారి పూర్వ, జన్మమున నెట్టి సుకృతంబు సలిపెనొక్కొ
కానిచో నట్టి మహిమంబు గాంచగలదె? సుగుణసాంద్ర ! సీతారామ సుకవిచంద్ర!
పినతన మాదిగా నెటుల బెంచితివో కవితాకుమారినిం
గనన నఘాత్మ! ప్రోడయయి కమ్మని తేనియబొట్లు పల్కు ప
ల్కున జిలుకంగ బల్కు, రసికు ల్మది మెచ్చ నటించు జూచినం
తనె గలిగించు మోజు పరదా మరువున్న నెలంత కైవడిన్ :
ఆస్థానపదవియం దలరారుగావుత తావక, ప్రియకవితాకుమారి
ఇట్టి సత్కారంబు లెన్నేనిఁ గాంచుత తానకప్రియ కవితాకుమారి
నూత్న పద్ధతుల వినోదంబు గూర్చుత, తావక! ప్రియ కవితాకుమారి
పుడమి నాచంద్రార్కముగ బెంపు నొందుత, తావకప్రియ కవితాకుమారి
తన సుధామయసూక్తులఁ దనిపి సకలmజనుల కన్యోన్య మొనగూర్చు చనుపమాన
కీర్తిగాంచుత సుజనానువర్తిని యయి, ధన్యగుణహారి త్వత్కవితాకుమారి.
సర్వలోకైకనాథుడీశ్వరుడు మీకు, జిరతరాయురారోగ్యవిశేషభాగ్య
భోగ్యము లొసంగి ప్రోచుగావుత సతంబు, కీర్తిసాంద్ర ! సీతారామమూర్తి సుకవి!

జోహారులు

శ్రీ బొడ్డుపల్లి పురుషోత్తం

ఆంధ్రవీరుల కదనపాండితి
ఆంధ్రజాతి పురా ప్రభావము
అమరగాన మొనర్చి నేర్పిన
ఆంధ్రగురుమూర్తీ!
దేశ భాషల తెలుగు లెస్సని
తెలియ జెప్పితి మేటియొజ్జగ
అట్టి నీ మృదుమధురబోధన
హత్తుకొనె నెదలన్!
తియ్యనైన తెలుంగుకూర్పుల
తీర్చిదిద్ది యనుంగుతల్లికి
భక్తి మీర సపర్య సలిపిన
ధన్యతమజీవీ !
కవిత లల్లిన కవివరేణ్యులు
కలరు పెక్కురు తెలుగునేలను
కాని నీ యసమానమార్గము
కానిపింపదుగా!
పొల్లెరుంగని నీదుపల్కులు
డంబమెరుగని నీదునడవడి
విన్న కన్నను వింతగొల్పుచు
గారవము కూర్చున్!

నిస్తులం బగు నీదు ప్రతిభకు
నాల్గు చెరగుల' తెల్గు నేలయు
పొంగి 'అభినవ తిక్కనా' యని
అభినుతించె గదా!
కట్టమంచియె సభకు పెద్దలు
గండపెండేరమ్ము తొడగగ
కన్నుగవ నానందబాష్పపు
కడలి ప్రవహించెన్
నేడు నీ కనకాభిషేకము
నేడు నీదు గజాధిరోహణ
మూడుకోట్ల మహాంధ్రజాతికి
ముద్దుముచ్చటలే!
మద్గురూత్తము భాగ్యరాశియు
మద్గురూత్తము పుణ్యరాశియు
మామకీనమహాంధ్రమాతకు
మాన్యతను గూర్చున్
ఆయురారోగ్యమ్ములందుచు
అచిరకాల మపూర్వ సేవల
ఆంధ్రమాతకు నంద జేయుము
జయము గురుదేవా!

కవివర్యా ! శ్రీ జాస్తి సూర్యనారాయణ

మీకబ్బుత దీర్ఘాయువు, మీకబ్బుత మెల్ల సిరులు మేరలు మీరన్
మీ కబ్బంబుల నెప్పుడు, నా కాంక్షించెదరుగాక యాంధ్రులు నెమ్మిన్
కళదప్పిన మనజాతికి, గళ దిద్దగ గలము బట్టి కంకణధరులై
భళి ! రాష్ట్రగాన మొనరిచి, కలకాలము వెలయు మీకు గలుగుత శుభముల్.
ఆంధ్రావళి మోదముకై, యాంధ్రత్వము, వెలయునట్టు లాంధ్రుల చరితన్
ఆంధ్రమ్మున రచియించిన యాంధ్రుడ! మిము; దిక్కనార్యుడనుటకు గొఱతే?
నీఱు గవిసెను మనజాతి పౌరుషమ్ము, ఆర లేదింక నెన్నడు నారఁబోదు
అనుచు చాటిన మీబోటి యాంధ్రకవికి, నాంధ్రలోకమ్ము హారతు లంపు టరుదె?
ఈ రీతిగ జిరకాలము, మీరలు పలుకావ్యములను మెఱుగులు మీరన్
ధీరగుణా ! రచియింపుచు, సారస్వత సేవ సలుపు సత్క వివర్యా!

అభినవ తిక్కనా!
శ్రీ కోగంటి దుర్గామల్లికార్జునరావు

ఎపుడో నీ వీనాటను
ద్విపమెక్కుట జరుగవలసె ధీనిధి ! లోక
ద్విపములు హర్షింప నిపుడు
ద్విపవర మెక్కితి వభినవ తిక్కన ! సుకవీ!
ధరియించెను మును పెద్దన
ధరియించిరి మొన్న మొన్న ధరలోన: గవీ
శ్వరులు నలుగురొ ముగ్గురొ
ధరియించితి నేడు నీవు దగబెండెరమున్
కవితామాధుర్యంబును
జవిచూపించితివి నీవు సద్బుధలోకం
బవురాయని నుతియింపగ
గవివర్యా ! రామమూర్తి కమనీయాఖ్యా !

ప్రాతఃస్మరణీయుడు

బౌద్ధవాఙ్మయబ్రహ్మ, శ్రీ దుగ్గిరాల బలరామకృష్ణయ్య

ఆంధ్ర జగతికి చిరకాల పరిచితులు పూజ్యులు 'నగు అభినవతిక్కన తుమ్మల సీతారామమూర్తి చౌదరి గారిని గూర్చి నాకు గల అభిప్రాయమును వెల్లడించుట పరమవిధిగా భావించుచున్నాను.

చౌదరిగారు సాహితీరంగమున ప్రవేశించిన దాదిని వారిని నే నెఱుంగుదును. ఆంధ్ర సాహిత్యమున పూర్ణాభినివేశమును బడయకమున్నె ఆయన జీవిత వృత్తము జాతీయముగ నిరాడంబరముగ నుండెడిది. ఆయన సామాన్య కర్షక కుటుంబమున జన్మించి స్వయంకృషిచే తన చిత్తసీమను దాగియున్న కవితా బీజమును మహోన్నత వృక్షముగ గావించి ఆంధ్ర జగతీ తలమున మహాకవి తిక్కన దిద్ది తీర్చిన తెలుగు కవితయొక్క సొంపును ఇంపును వెలార్చి విద్వత్కవుల ప్రశంసలకు బాత్రుడైన స్వయంప్రకాశుడు. ఒకరి తోడు ఆదరణ లేకుండినను తన స్వయంకల్పిత కవితా కుటీరమున గూర్చుండి ప్రాచీన ప్రాభవమును గోల్పోయి ప్రభు సత్కారమునకు దూరమై నిర్జీవమగుచున్న ఆంధ్ర కావ్యకళకు కన్నీరు గార్చి ఆత్మోపాసనా శక్తిచే ఆంధ్రకవితా కన్యకు నూతన జీవకళలను ఆపాదించుటలో అతని విశిష్ట పాండితి, భావనాశక్తి, ఉపాసనాబలము; ఆంధ్ర జగద్విదితములు. ఆంధ్ర విజ్ఞాన ప్రాభవమును, జాతీయ జీవనవిధానమును దేశభక్తిని, ఆంధ్ర విశిష్ట వైదగ్ధ్యమును శ్రీ చౌదరి గారు తన రచనల యందు తొణికిసలాడ జేసిన సహజ ప్రతిభా సముపేతుడగు కవిచంద్రుడు. అన్నపూర్ణా మందిరమగు పల్లెపట్టు చిరకాలానుగత దాస్య ప్రభావముచే నిర్జీవమై తొల్లింటి వైభవము దక్కి, కొనయూపిరితో నున్న విషయమును తన శిల్పకళా చాతుర్యముచే నభినవ తిక్కన హృదయంగమముగ తన శిరీషకుసుమ పేశల కవితా రచనలచే చిత్రించి భావుకుల చిత్తప్రవృత్తిని గ్రామ సేవాయత్త మొనరించుటలో అభినవతిక్కన మేటి.

కవి శిల్పి గాయకుల రచనా ప్రశస్తి వారి ఆత్మశుద్ధి ననుసరించి యుండుట కద్దు. ఆత్మ నుఖ్ఖూత లూప గలిగి పరవశత్వమును విహ్వలత్వమును గలిగింపగల రసార్ద్రఘట్టముల సృష్టింపగల అనంతభావనా ద్రఢిమగల లేఖిని మన యభినవతిక్కన్న గారిది. జడుడగు మానవుని సంస్కారశూన్యమగు చిత్తము నేని కదల్పగల సమ్మోహనశక్తి అభినవతిక్కనగారి ప్రతి పదమునుండి ప్రదర్శితము కాగలదు. వంగ సాహిత్య మున రవీంద్రకవి కల్గించిన విప్లవము వంటి విప్లవమును అభినవతిక్కన ఆంధ్రకవితారంగమున కలిగించినాడన్న నతిశయోక్తి కాదు. వేషమున రూపమున జీవన విధానమున అసామాన్య కర్షకకుమారునివలె కాన నగు నీ కవిచంద్రుఁడు పోతనవలె హాలికవృత్తియందాసక్తి గలిగి కేవల కర్షకుడుగ జీవించి ఆంధ్ర కావ్యజగత్తు నందింతటి మహోన్నతస్థానము నందుటకు అతని పవిత్ర చరిత్రయే ప్రబల హేతువు.

ఇతడు గాంధిభక్తుడు, శుద్ధఖద్దరు ధారి, నిరాడంబర నిగర్వచూడామణి; కాయకష్ట జీవి, మితభాషి, కాని మృదుభాషి. నిరంతర మేకాంతమున జపించి తపించి ఉపాసించి సరస్వతీ వర ప్రసాద లబ్ధసహజమృదు మధుర కావ్యశిల్పముచే ఆంధ్ర భాషావధూటిని నిత్య నవయౌవన సంశోభితగ జేయుట యందే తన జీవిత చరితార్థతను గన నుత్సహించు మహాకవిచంద్రుడు. ఈయన రచనలు తేనెతేటల నొలికించుచు కలకండ తీయందనమును నుప్పతిల చేయుచు తెలుగు నుడికారమును భావనాస్ఫూర్తిని వెల్లివిరియ జేయుచు రసవాహిని బొంగించుచు జీవమును జీవకళల నుట్టి పడజేయు నుత్తమశ్రేణికి చెందిన సహజ కవితా జగత్తునకు అపూర్వాభరణములు.

ప్రపంచము మానవ సహాయకరమగు సమరరంగమున మనుష్యత్వమును గోల్పోవుచున్న దినము లివి. సత్యాహింసలచే గాంధీ మహాత్ముడు నరాధముని నరోత్తముని గావింప గృషి సలిపిన విప్లవసంధికాల మిది. ఇట్టి కాలమున గాంధేయ మహోన్నత భావములను ఉత్తమ కవితాశిల్పమున ఆంధ్రజగతికి తొలుదొల్త సమర్పించిన పుణ్యధను డీ కవిరాజు. ఇఱువదవ శతాబ్దికి

దగినట్టుగ నజరామరములగు భారత రామాయణముల వలె నాచంద్రతారార్కస్థాయిగ మహాత్ముని ఆత్మకథను జదివి మననము చేసి జీర్ణింపజేసికొని భక్తివిహ్వలుడై ఈ కవివతంసుడు తన అమృత సమానమగు కవితాఝురిలో ఆంధ్రరసజ్ఞ ప్రపంచము నీదు లాడింపగలిగిన ధన్యచరితుడు. రవీంద్రునివలె తన రాష్ట్రగానముచే నాంధ్రుల చిత్త సీమను ఆంధ్ర జాతీ యతాపరిపక్వభావసంస్కారబీజముల హత్తుకొన జేసిన ఆంధ్రరాష్ట్రోద్యమాభిమాని. జడుడై నిర్వీర్యుడై నిర్జీవ ప్రతిమయై దేశభక్తి శూన్యుడుగ నున్న ఆంధ్రుని యందు నిద్రాణ మైయున్న దేశభక్తిని, క్షాత్రమును, విజ్ఞానమును దట్టి లేపగల ఉద్దీపితాంధ్ర శౌర్య భావనాచిలసిత మగు పటుతరశ్రావ్య గేయముల సలిపిన ఆంధ్రభావోత్ఫుల్లకవీంద్రు డితడు.

ఉత్తముడు భక్తుడు, ప్రకృతి సౌందర్యరసలోలుడు, సాత్వికుడు, కార్మికకర్షక సహజ సరళ సాధుజీవనా సక్తుడు నగు ఈ అభినవతిక్కనగారి మహోత్తమ కవితా ప్రశస్తికి ఆంధ్రరసజ్ఞ ప్రపంచము తన్మయత్వ మంది ఆయనకు కనకాభిషేకము చేయు సందర్భమున ఆయన అమృతధారవంటి కవితా స్రవంతిలో నిత్యా నందము ననుభవించిన నే నీ నాలుగు ప్రశంసా వాక్యములను పలుకుట పరమవిధిగా భావించితిని. కనకాభిషేకము నందిన ఈ కవిరాజేంద్రుని అపూర్వ ప్రతిభా సంపద్విలసిత స్వయంకల్పిత భావనా జగత్తునుండి నానాట రసార్ద్రములు, సజీవములు, జాతీయములు జాతితన్మయత్వ హేతుభూతములగు మహోత్తమరచనలు తామర తంపరలుగ నాంధ్రజగతికి లభించి ఈ యభినవతిక్కనను ఆంధ్రజగతికి ప్రాతఃస్మరణీయునిగ నొనరింప బుద్ధదేవుని పదేపదే ప్రార్థించుచున్నాను.

పూలపూజ

శ్రీ కోన ప్రసాదరావు

సకలభాషలకంటె జవిగూర్చి మధురతల్, చిల్కు పల్కున గైత పల్కు వాడు
పదపదమ్మున మృగీమదము లందుచు, గావ్యకాంతకు సుఖ మిచ్చు కవివరుండు
రమణీయకృతుల కారాటించు వాణికి, బెద్ద కాపును జూపు ప్రేమజీవి
కవితలో సొగసులు కల్గించి 'యభినవతిక్కన' బిరుదాన దేలు మేటి
ధనము నాశింపకే కృతి ధారవోసి
కీర్తి గొన్నట్టి పోతన్న కేలుపట్టి
వాసి కెక్కిన యట్టి నా దేశికేంద్రు
డేలపొందదు బంగారుపూల పూజ?

గురూత్తమా!

శ్రీ లేళ్ళ వేంకటరామారావు

కల్లలు బొల్లు లెవ్వియును గన్గొన నేరవు బాపుజీ బలెం
బిల్లలలోన బిన్నవయి పెద్దలలోనను బెద్దవాడవై
నల్లన లేని జీవితమునన్ వెలు గొందెద వొక్క రీతిగా
నుల్లమునందు జూచెద వహో సుఖదుఃఖముల! గురూత్తమా!
కమ్మనికైత లల్లు మొనగాఁడవు నీ రచనంబులో గడుం
గమ్మని తీపిజల్లులు వికాసము నందె విశాలవిశ్వమున్
గ్రమ్మిన నీయశమ్ము గని కాన్కలు రాసులుగాగ నిచ్చి దే
శమ్ములవారు నిన్ను గడు సన్నుతి సల్పుదు రయ్య ! సత్కవీ!
తేటిగుంపు లానెడి పూవుదేనియలును
గరగరని జిలేబిని నూరు కండతీపి
దిరిసెనపు బూల జారిన తేటనునుపు
కలిసి ముద్దుగొన్నవి నీదు కావ్యరమను.
తెట్టలు గట్టుకొన్నవయ ! తీయని తేటతెనుంగుకబ్బముల్
దిట్టతనమ్ముచే జిలుగు దేనియతుంపురువాన నాని నీ
ట్టినపట్టు క్టిాావడివంకలు లేవు తెలుంగువారు నీ
యిట్టి మహాకవిం బడసి హర్షము చెందిరి తుమ్మలాన్వయా !

ప్రస్తుతి

శ్రీ వల్లూరి సత్యనారాయణచౌదరి

గజరాజుమూపున ప్రజ లొహోయనుచుండ, ఉత్సవంబ నిను గూర్చుండ జేసి
గండపెండేరమా పండితాగ్రేసరుల్, మదిమెచ్చి నినుగూర్చి ముదము జెంద
కనకాభిషేకమా కమ్మకులోద్భవా! తలయూపి కవిలోక మలరుచుండ
కటమంచితిలకుడా కార్యకలాపంబు, జరిపింప సభ కబ్బె జనులు మెచ్చ
మేలు తుమ్మలాన్వయచంద్ర మిత్రరత్న, మలరె నిఖిలాంధ్రలోకంబు లవనిలోన
నీదు భాషామతల్లికి నీవు సేయు, సేవకుందగు ఫల మబ్బె శ్రీశుకరుణ.

నేత్రపర్వము

శ్రీ జొన్నలగడ్డ సత్యనారాయణ

సోమయాజుల వారింటి సుభగరూప
ఆంధ్రభారతి పంకిలయగుట గాంచి
అంకమున జేర్చి సరిక్రొత్తలన్ని నేర్పి
ఉద్ధరించినమూర్తి మా యూరివాడు
పసగల రైతులోకమున బ్రాభవజన్మము గాంచి ఆంధ్రి కిం
పెసగగ గావ్యసూనముల నెన్నొ సువాసన లుప్పతిల్లగా
వెస సమకూర్చి నల్దెసల బేరు వహించిన రామమూర్తి! నీ
కొసగెడి గండ పెండరపు టుత్సవ మెంతయు నేత్రపర్వమౌ
పులకండముల నొక్కి పుక్కిటి బిళ్ళుగా, రస మప్పళించెడి రామచిలుక
గున్నమావిచిగుళ్ళు గుత్త బేరము చేసి,కొన్నట్టి కోయిల కులుకులాడి
సంజజామున బాలసంద్రమ్ములో బుట్టి, చల్లగా నడయాడు పిల్లగాలి
తూరుపుగొండపై బారాడు సఖు గాంచి, పక పకలాడెడి పరువుదమ్మి
పల్కులును బాటలును ముద్దులొల్కు నడలు, మోము జిగి నీదుకవనమ్ము ముందు
నిల్వ జాలవని సేతువాదిగా జాటుచుండి, చేరి రేనాడొ అచ్చరల్ శీతగిరికి.

ఉడుగర

శ్రీ బ్రహ్మాండం రామకోటేశ్వరరావు

చతురత వెల్గు తెల్గుకవి చౌదరి కైతకదేల గల్గెనో
యతులితమాధురీపిమ ? యాంధ్రుల యాదరణాభిమానముల్
సతమును తిక్కయజ్వ పదసంజ్ఞలవర్తి విదేశభక్తి సం
యుతజనతోపయుక్తకృతు లుత్సుకతన్ విరచించుట స్గదా !
గంధగజోత్సవంబు కనకంబభిషేకము గండపెండేరం
బందిరి పెద్దనాదులన నచ్చెరు వేల ? భవాదృశుల్ మహా
నందము గూర్చు కబ్బముల నల్లి యశేషజనాళి గారవ
మ్మందగ నేడు పండ్లు పులియం దిలకించిరి సత్కవీశ్వరుల్.

ఎవరా యేనుగు పైన ?

శ్రీ నిమ్మగడ్డ రామకోటేశ్వరశాస్త్రి

ఎవరాయేనుగు పైన గన్పడు ? మహీ శేంద్రుడు గాబోలు; నౌ
నవె మీసంబులు కట్టి బొట్టుగనగా నాటీవి దర్శింపగా
నవకాశం బగు నెట్టు శంకకు ? గవిత్వారామపీఠస్థలిన్
నవపట్టప్రతిషిక్తుడై యెడద నానందంబు పొంగించెడిన్
తెనుగు తల్లి కడుపు తీపిగాబుట్టెను, దెనుగు పాలుత్రాగి తేజరిల్లె
దెనుగుదనము కొఱకె దినము వ్యాహారించు, దెనుగుగడ్డ కితడు దివ్విటీయె
ఆ ముఖము శాంతియోగసమావృతమ్ము, దెలుపు చున్నది కవితలో దివ్యగాంగ
ఝరము పొంగులు వాటింప సత్సమాధి, లోన మునిగిన మనసు లోలోని లోతు
సీతారామకవీశున కింతటి సన్మాన మిడగ నెంచిన తెనుగుం
భూతలము క్ష్మాతలంబున, స్వాతంత్ర్యము తోడ వెలుగ జాలెడు నింకన్

సుకవీ!

శ్రీ కొమ్మినేని వేంకటరామయ్య

కమ్మని తేనె లూరు నుడికారపుసొంపును నింపుచుండి స
త్యమ్మును జాటనేర్చి కడు ధన్యుడనౌదు వెఱాని యీ మహిన్
స్వమ్మును గోరఁబోవు మఱి శారదమెప్పుల నందు దొర! యో
తుమ్మలవంశధీమణి! యితోధికమన్నన లందుమా తగన్.
శబ్దసాధుత్వ రూపాన సంతరిల్లు, అర్ధసౌలభ్యభాగ్యాన నతిశయిల్లు
భావగాంభీర్యదీప్తులన్ పరిఢవిల్లు చతురకవితయె నీదిగా చౌదరీంద్ర!
చల దుత్తుంగ తరంగ మాలిక మహోజ్జ్వల్య భావంబులే
వలగొన్నట్టుల నీదు నవ్యకవితావాక్చాతురీ గుంఫనల్
విలయం బందెడిజాతి కైన సతమున్ విజ్ఞాన సంపాద్యమై
ఇలవర్తించునుగాదె మాదు సుకవీ! ఇంకేల సందేహముల్.
సంతతానంద సంధానశక్తి గలిగి, రాజితానూన కవితానురక్తి గలిగి
సర్వజనశోషితాశేషశక్తియుక్త, ధన్యజీవివి సుకవీశ ! ధరణి నేడు.

సత్కారము

శ్రీ నామతీర్థాల పుల్లయ్య

నినుబోల్పండితచక్రవర్తులిలపై నేర్పు లెసంగించినన్
ఘనమాహాత్మ్యము లాంధ్రజాతి కొదవు న్గల్యాణభాక్కై సదా
మనయాంధ్రావని అంధత న్విడుతు రీమర్త్యుల్వివేకాత్ములై
అనఘా ! తుమ్మల సీతరామ ! గొనుమయ్యా ! మాన్యసత్కారముల్.

కవిచంద్ర!
శ్రీ వడ్డెపాటివిద్యానందశర్మ

తెలుగుల శౌర్యమున్ దెలిపి దీక్షను జూపియు బౌరుషంబు మే
ల్కొలిపిన మీ యనర్ఘపదగుంఫిత గానరస స్రవంతిచే
పులకితులైన యాంధ్రులొక భూరిసువర్ణ మహాభిషేకమున్
సలుపుట యబ్రమౌనె కవిచంద్ర ! శతంబును గూర్చుగావుతన్.

ఆంధ్రవైతాళికుడు
శ్రీ కోపల్లె శ్రీనివాసరావు

ఓ మహేంద్ర సత్కవి సార్వభౌమ ! నీదు
మృదుమధురభావ నవరసామృతము చిందు
రాష్ట్రగానకృతిని పరప్రాభవమున
తెలివిదప్పి నిద్రాణమౌ తెలుగుజాతి
మేలుకొల్పితి వాంధ్రవైతాళికుడవు.
పలుకులనింపు సొంపు మృదుభావపరంపరలందు ముద్దులన్
గులుకు నలంకృతుల్ లసదకుంఠితధారణశక్తి గుండియల్
చిలికెడి వీర్వతత్వము విశిష్టపుహాస్యరసపు లబ్ది నీ
కలవడె గాక ఏరి కిల నబ్బును సత్కవి రాజశేఖరా !
గంగోత్తుంగతరంగ భంగిమల పోకల్ పోవు వాగ్ధారలో
రంగుల్ దేరిన కావ్యపద్మమణిహారాల్ భక్తి నిండార బల్
సింగారించితి వాంధ్రవాఙ్మయకళా సీమంతినిన్ ని న్గళా
రంగంబం దెదిరించి నిల్వంగల ధైర్యం బున్నవాఁ డుండెనా?
ఎదివచియించినన్ మధువు లీనునటుల్ వచియింతు వెప్పు డె
య్యది రచియింతు వేని సకలాంధ్రజగజ్జనగేయమౌను నీ
హృది పదిలించుకొన్న దెదియేని బహిర్గతమాట నేరికే
న్నెదరవు ధన్యమూర్తివి వినిర్మలశీలుడవో కవీశ్వరా !

కైవారము

శ్రీ జాస్తి వెంకటనరసయ్య, శ్రీ ధూళ్ళిపాళ వేంకట సుబ్రహ్మణ్యము

తెనుగుందోట వసంతకాలమున నుత్తేజంబుగా లేజిగుళ్ళను
నింపారగ మెక్కి, పాంథులకు నుల్లాసంబుగా విశ్వమో
హనగీతాదుల గానము న్సలుపు సీతారామపుంస్కోకిలం
బును వేనోళ్ళ నుతించుచుంద్రు రసలుబ్ధుల్ మోద మింపొందగన్.
నిదురించు సింగపుం గొదమల బోలిన, యాంధ్రుల మేల్కొల్పునట్టి సుకవి
నివురుగప్పిన యట్టి నిప్పునాన్ లోనున్న, శౌర్యాగ్ని రగులింప జాలు సుమతి
నిద్రాణమైయున్న నిజరాష్ట్రవాంఛాల, తల బెంపు నొందింప దగిన మేటి
గాఢసుషుప్తిలో గనిన బంగారుస్వ, ప్నముల కాకృతినిచ్చు జ్ఞానమూర్తి
తెనుగుబొలమును నలుగడ దీర్చి దిద్ది, సరసజాతీయభావబీజముల జల్లి
గౌరవం బందు వ్యవసాయ సూరివర్య, డితడు హాలికకువలయామృతకరుండు.
సరసకవితకు వెలగట్టజాలు నెవడు
గండపెండేరములెగాదు కనకవర్ష
ములను గురియించినను సరి మూల్య మగునె?
తెలియ నివియెల్ల మనదు దిదృక్షకొఱకె.
దివ్యసందేశంబు నవ్యంబుగా నిచ్చు, జాతీయరచనల జదివి చదివి
కనకాభిషేకంబు గావించి ఘనముగా, గండపెండెరమిచ్చి నిండుభక్తి
గజముపై గూర్చుండ గావించి యుత్సవాల్, కవితల నుతియించి కరముప్రీతి
సన్మానసంచిక చక్కగా గైసేసి, భవ్యకవిత్వప్రభావ మెంచి
ఆంధ్రదేశమ్ము ముదముతో నమలదీక్ష కట్టమంచి రెడ్డ్యగ్రణి యెట్టయెదుట
నీకు సత్కారమున్ జేసె నిర్మలాత్మ!, సజ్జనవిధేయ! సుకవీశ సార్వభౌమ !
అభినవతిక్కన బిరుదము
సభయందుం బండి తాళి సరసత్వముతో
నభినుతి సేయంబడసిన
విభవము నీపాలి దయ్యె విశ్రుతకీర్తీ !

కవిప్రశంస

శ్రీ మేడికొండ శ్రీరాములు

శ్రీ తుమ్మల సీతారామమూర్తి చౌదరిగా రాంధ్రకవితా ప్రపంచములో గణుతికెక్కినవారు. అభినవతిక్కన బిరుదాంకితులు. 'లేజవరాలి మోవికి జిలేబి రసాలమార్దవ శ్రీజనయిత్రికిన్ రుచులు చిందెదు నాంధ్రవాణీ' ముఖ్యోపాసకులు. వీరి యాదర్శకవి తిక్కయజ్వ ' సరసులెల్ల మెచ్చ మెఱయింతు గవితలో గమ్మదనము మత్కులమ్మున వలె' నన్న ధీమాతో సాగించిన ఆత్మకథ, ధర్మజ్యోతి, ఆత్మార్పణము, రాష్ట్రగానము, అమరజ్యోతి మున్నగురచనలు వీరి యుపాసనా బలసంలభ్యములు. వీరి పద్యరచన ఆధునిక సంప్రదాయముల నలవరచుకొన్నను గద్యము మాతము పెద్దన ననుసరించినది. వీరి కవితాధోరణి తిక్కనరచనా విధానము స్ఫురింప జేయుచుండును. శ్రీనాథ, పెద్దనల ఛాయలు వీరి రచనములో కన్పించును.

వీరి 'ఆత్మకథ , శివరామశాస్త్రి, గాంధీచరిత్రమునకు పద్యానువాదము, వీరి కృతులలో నిది యుత్తమోత్తమము, సుందరమునయినది, తమ రచనాప్రాగల్భ్యముతో చౌదరి గారు ఉత్తమపురుషుని జీవితవృత్తాంతమును ఉత్తమకావ్యరూపమున వెల్వరించినారు.

వీరి 'రాష్ట్రగానము' పైత్య మెసరేగి కింకి భ్రమలు గ్రమ్మి, దిక్కు దెలియకయున్న తెలుగువానికి దారిజూపి స్వరాష్ట్రాందోళనాభిముఖుని గావించినది. శ్రీచౌదరిగారు 'రాష్ట్రగానము' లోని ప్రతి అక్షరమునకు జీవముపోసి తమ ఆశయములను ప్రతిబింబింపజేసినారు. 'యావదాంధ్ర విషయమ్ము నొక్క రాజ్యమ్ము జేసి పట్టి జయభేరి పై దెబ్బగొట్టువరకు తెలుగు పసిపాపకైన నిద్రింప దగునె' అని ప్రబోధము జేయుచు సుషుప్తిలో మునిగిన తెలుగుజాతిని మేల్కొల్పినారు. ''ఆంధ్రుడవై జన్మించితి వాంధ్రుడవై యనుభవింపు మాయుర్విభవం బాంధ్రుడవై మరణింపుము ఆంధ్రత్వము లేని బ్రతుకు నాశింపకుమా'' యని వీర సందేశ మంద జేసినది.

శ్రీ సీతారామమూర్తిగారి మాతృభాషాభిమానము వర్ణనాతీతము. తెలుగు పసదనమ్ము విడిచి పరభాషలకై ప్రాకులాడు దుర్బుద్ధులన్న వీరికి గిట్టదు. వీరి కవిత్వములో ఇట్టి ప్రబోధములు కోకొల్లలు. వీరి రాష్ట్రగానము కవి దేశభక్తినీ, కవితాశ క్తినీ నిరూపించజాలినది.

అక్షరాంజలి

శ్రీ వాసిలి రామకృష్ణశర్మ

శుద్ధఖద్దరులోన గూర్చున్నమూర్తి, ఎవ్వరాయని వేరె ప్రశ్నింపనేల ?
తిక్కనాదుల మరపించు దివ్యమూర్తి, ఆతడే నేటి తిక్కన్న అరయ రేమి ?
నాడు గొంతెత్తి మీరు గానమ్ము సేయ
ఆంధ్రిరతనాల భవనాలు అరగి కరగి
కరడుగట్టిన ఈతెన్గు కైత తోపు
లందు ప్రవహించి పల్లె పొలాలుచేరె
తెలుగుపొలాలపంట సిరి తీయదనాలు త్వదీయ లేఖనిన్
వలచి వసించెనేమొ కవివర్య ! సవా లొనరించు నీ కృతుల్
తొలకరిమబ్బులై కురియు తోయములన్ జలకంబు లాడి న
ట్లలరినయ్టి మాదు హృదయమ్ముల నిద్దుర మేలుకొల్పెడిన్
తాతలనాటి రెడ్డి సరదారుల పాలనలోన స్వేచ్ఛగా
పోతలు వ్రాతలై పెరిగిపోయిన వాంధ్రధరిత్రియందు ఏ
వో తలపోయనేటికి పవిత్రచరిత్ర! త్వదీయసాహితీ
రీతుల రైతులోకము వరించె నమస్సుల నందరా ప్రభూ!

సెబాసు ఉపాధ్యాయమిత్రుడు, వాసిలి కృష్ణమోహనదాసు

ఓ గురువర్య ! తెల్గుజగ ముమ్మడిగా నిడుబ్రోలులోన సు
స్వాగత మిచ్చె గైకొని యశమ్ము చిగుర్పగ నేస్గు నెక్కి యూ
రేగుము పండితుల్ సుకవు లెల్లరు నీ విభవంబు చూచి మేల్
బాగు! సెబాసు ! భేషనగ బంగరు పువ్వులలోన మున్గుమా !

ఉపహారము

శ్రీ యన్.వి.రత్నము

కొమ్ములు తిర్గినట్టి కవికుంజరు లెందరొ స్వాపతేయమం
దిమ్ముఘటిల్ల గీకెద రొకేపనిగా గవనమ్ము దాన బు
ణ్యమ్మును బూరుషార్థమును నభ్రసుమంబగు గాని నీవు వి
త్తమ్మును గడ్డిపోచలవిధంబున నెంతువుగాదె చౌదరీ !

సుధీమణీ

శ్రీ వేదాన్తం గోపాలకృష్ణాచార్యులు

జయజయ సత్కవీశ్వర ! విశాల వినూత్నవి శేషభావనా !
జయజయ నవ్యతిక్కన ! లసత్కవితాగుణ ! స్వాదుభాషణా!
జయజయ కమ్మవంశకవిచంద్ర ! విశేషయశోధనాలయా !
జయజయ రాష్ట్రగానమధుసారకవిత్వపటుత్వ వైభవా !
కమ్మని తేనెవాక తమకైత గుణాలయ ! భారతీ ప్రియా !
చిమ్మితి వీవు తెల్గువనసీమల పూవులచెండ్లు మ్రోగె నీ
గుమ్మముముందటన్ గొనబుకోర్కెలపంటకు కాలమౌట నో
తుమ్మలవంశవార్ధిశశి ! తూర్యజయారవముల్ సుధీమణీ !

ధీరాగ్రణీ

శ్రీ అడ్డాడ వీరభద్రాచార్యులు

విలసత్కోమలతాంఘ్రియై సుపథయై విఖ్యాతసద్భావయై
కలితాలంకృతయైన నీదు కవితాకన్యాలలామంబు స
త్కులకాంతామణి వోలె నెల్లరును దోడ్తో సన్నుతింపంగ వ
ర్తిలెడు న్నూతన తిక్కయజ్వ ! సుకవీ! ధీరాగ్రణీ ! నిచ్చలున్
సరసపదార్థముల్విసరి సంతసముం బొనరింతు వార్యులన్
ధరను వదాన్య డంచు నిను తద్దనుతింపగరాదె సత్కవీ
శ్వర ! విరసంపువాక్యము లవంబును గానగరాదు చూడ త్వ
ద్విరచితగ్రంథరాజముల వింతచవుల్ వెదజల్లు నిచ్చలున్
అభినవతిక్కనాహ్వయము నల్పమె దాల్పగ నేరికైన దు
ర్లభమది నీకు లభ్యపడె రమ్యతరం బగు పుష్పరాజికిన్
ప్రభవముతోన సౌరభము వర్తిలునట్టు నోసుహృద్వరా!
శుభమగుగాత ! నీ మధురసూక్తులకు న్మఱి నీకు నిచ్చలున్.

సువర్ణాభిషేకము

శ్రీ గిద్దలూరు చెంచుబసవరాజు

"అభినవతిక్కన" బిరుదము, శుభమతులు కవీంద్రులీయ సొంపుగ విద్వ
త్సభలను గణ్యత కెక్కిన సుభగచరిత్రుండ వీవు సుజనస్తుత్యా!
తిక్కనయజ్యపద్యముల తియ్యదనమ్మును మీకలమ్ము పె
న్మక్కువ, గోలి క్రోలి యసమాన మనోహర ఖండకావ్యముల్
తక్కక సృష్టిచేసిన ఫలమ్ము సువర్ణజలాభిషేకమై
గ్రక్కున రూపుదాల్పగ గరమ్ము ముదమ్ము జనించె నెమ్మదిన్.

పలుకు కవిత

శ్రీ మంగళగిరి దాశరథి

సత్కవీంద్రుల భక్తిని సత్కరింప
వాసిగాంచెను నిడుబ్రోలువారి సరణి
సకలసాహిత్య సమ్మానసభల యందు
గులుకు గావుత తుమ్మల పలుకు కవిత.

అపర తిక్కన

శ్రీ వల్లూరి శంకరయ్య

ఆంధ్రవిద్యార్థుల యాత్మ వీధులయందు, స్వర్ణాక్షరంబులు చల్లునెవడు
ఆంధ్రావనీ కవీశాంబుధి సోముడై, గణన కెక్కిన యట్టి ఘనుడెవండు
ఆంధ్రలోకంబున కాదర్శమౌ నమరజ్యోతి వెలిగించె రాణ నెవడు
ఆంధ్రసుధామధురాశరంబుల రాష్ట్ర, గానంబు గూర్చిన కవి యెవండు?
అపర తిక్కనయను బిరుదందె నెవడు, అతడు కమ్మకులోద్భవు డంచితుండు
సీతరామాఖ్యు డంబికానేకరుణ, నాయురారోగ్య సంపదలందుగాత.
పరుసములు పల్క డెప్పుడు పరులతోడ, ముచ్చించును మాటలో ముద్దులొల్క
మోమునందెప్డు చిఱునవ్వు మొలకలెత్తు, నౌర ! ఏమందు మాతని గౌరవంబు
మెచ్చటి మైత్రి కెందును నీతడె పాత్రుడనగ
బరుల కష్టాల భాగంబు పంచుకొనును
సౌఖ్యముల జూచి దనయాత్మ సంతసించు, ననుభవజ్ఞుండు మేధావి యమలమూర్తి.
సర్వమతసహన మతని సహజగుణము, సత్యసంధత యాతని నిత్యగుణము
సర్వసౌభ్రాత్రమతనిదౌ సరసగుణము, నిక్కముగ నార్జవమితని నిరతదీక్ష.
నిత్యసంతోషికెప్పుడు నెగడు సుఖమ టంచు బల్కు నార్యోక్తికి నాతడే తగి
యుండె గాన నట్టి కులోత్తమునకు, ఆయురారోగ్య సౌఖ్యమ్ము లమరుగాత!

జేజే

శ్రీ పులివర్తి సుబ్రహ్మణ్యాచార్యులు

శ్రీసత్పూతచరిత్ర ! భారతసవిత్రీ పుత్రరత్నంబ ! నీ
వే సౌభ్రాత్ర పవిత్రభావ కుసుమా లీయాంధ్రదేశమ్మునన్
భాసిల్లంగ నొనర్చినావొ అవి మాభాగ్యమ్ముగా నెంచెదన్
నీసన్మానమహోత్సవంబు కదు రాణింపన్ యశం బందుమా!

సత్కవీ

శ్రీ మారుపూడి వేంకటేశ్వర్లు

నీకమనీయ వాగ్ఝరులు నిబ్బరవుం గవనంబులున్ రసో
త్సేకము లౌచు నీ తెలుగుసీమల నెల్లడ జాలువారత
చ్ఛీకర వ్యా: ప్రపూరముల సేచనలం దనివొందుచుం బ్రజా
నీకము పట్టసాగినది నేడు నివాళులు నీకు సత్కవీ!

కవివతంసా!

శ్రీ యద్లపల్లి దేవయ్యచౌదరి

మతపు గై పునగన్ను గానక
మనమహాత్ముని హత్య చేసిన
నీతిహీనుని చెయ్ది 'మమర
జ్యోతి' చాటెను సత్కవీశ్వరా !
జగము పొగడిన తెలుగువాణికి
ప్రగతి చూపిన నీదు కబ్బము
లగణితములగు భూషణములై
యలరు తుమ్మల సుకవిచంద్రా!
తిక్కయజం కవిత్వ శైలిని
నిక్కువంబుగ దెలుగుగడ్డను
బిక్కటిల్ల నొనర్చి యుంటివి
పేరువొందిన చౌదరీంద్రా !
'ఆత్మకథ'యను కావ్యకన్యక
యాంధ్ర దేశము నాల్గు చెరగుల
దీరు తీరగు దీపి నొసగుచు
దేజరిల్లె యశోవిశాలా!
ముక్కలైన తెలుంగువారల
నొక్క బాటను రాష్ట్రగానము
మక్కువను నడిపించి యాంధ్రుల
మన్ననల గొనె సుకవిచంద్రా !
ప్రతిఫలంబున కాశ సేయక
కృతులు సత్పురుషుల కొసంగెడి

ప్రతిభ పెట్టని సొమ్ము నీకా
ప్రతిన తప్పకు కవివతంసా !
కమ్మకులమున బుట్టి యిమ్మగు
కమ్మదనమును జూపి కవితకు
నిమ్మ హీస్థలిదీరు తియ్యము
లెన్నొ దిద్దితివయ్య సుకవీ!
పట్టుదలతో నీకు నాంధ్రులు
మొట్టమొదటనే పూజసల్పిన
బట్టపగ్గము లేక మే మతి
పారవశ్యము సెందకుందుమె !
కనక మభివర్షించినను - పెను
గజముపై నెక్కించినను - నీ
సాహితీసేవాఋణమ్మే
సరణి దీర్తురు కవివరేణ్యా !
తెలుగు నుడికార మది ముద్దుగ
దెలుగు గవనము నందు నిలిపియు
గవితనము జూపించియుండిన
ఘనతనీదే కవివతంసా!
నారాయార్యుని త్యాగమహిమలు
సారెసారెకు గనుల మెఱయుచు
ఖ్యాతికెక్కిన నీదు 'ధర్మ
జ్యోతి' వెలిగెను సుకవిచంద్రా!

కనకాభిషేకము

శ్రీ కన్నెగంటి వీరభద్రాచార్యులు (పల్నాటిసోదరకవులు)

ఓ కవికర్షకా ! కురియుచున్నది నేడు మహామహుల్ నమో
వాకము సల్పగా గనకవర్షము నీ కవితాలతాతతుల్
పాకునుగాక నాలుగు చెఱంగుల జక్కని తెల్గుతల్లి నా
జూకులు ఖండఖండములు సోకి విశాలములై విరాజిలన్.
ఈ కనకాభిషేకము వహించిన కైసరు లెందరుండి ర
న్నా ! కవిసార్వభౌముడు వినా మన తెల్గుజగాన సుప్రజా
నీకము మెచ్చ నిప్పటికి నీవ కదా కనిపించి తద్దశన్
గైకొని నిల్పికొంటివి యఖండకవిత్వపటుత్వ సంపదన్
పలుకులరాణి నీమధురభావమునం దుదయించి యెన్ని యో
కులుకులు చూపుచుండె గవికోకిల ! నీ కిల నేరు సాటి? యీ
తెలుగు పొలంబుపై బసిడితీగల పందిరి వేసి హాయిగా
నిలిపిన బిడ్డ వాంధ్రజననీమణి ని న్గని పొంగిపోయెరా !
హాయిగ విశ్వవీధులవిహారమొనర్చెను మంచిగంధమున్
బూయుచు బాదపాదముల బుప్పొడిరాల్పుచు జీవశిల్పమున్
గీయుచు బల్కు దేనె లొలికించుచు నీకవితాకుమారి ఆ
దాయ మెఱుంగునా? యెఱుగదా? కవిరాజకులావతంసమా!
కమ్మని తెల్గునందు నుడికారము దీరిచి దిద్దునేర్పు నీ
సొమ్మది నిక్కువమ్ము పరిశోధన చేసిన సత్కవీంద్రులే
నమ్మిరి భావిభారత మనందగు నాత్మకథన్ రచించి యో
తుమ్మలవంశదీప ! వినుతుల్ గొనవే మును తెల్గుగడ్డపై
అన్యా ప్రాపగుణంబులం బడసి దేశారాధకుండౌ జగ
న్మాన్యున్ మెచ్చి దయానురక్తిగృతిసన్మానంబు గావింతువే
కన్యాశుల్కము నంటబోవు కవిలోకం బందు నీజన్మమే
ధన్యం బైనది వాస్తవంబునకు సీతారామకవ్యగ్రణీ !

జాతీయకవి – తుమ్మల
శ్రీ దేసు సత్యనారాయణ

యుగమునకు ప్రతినిధిత్వము వహించి, సంఘమునందలి వివిధ పరిస్థితులను చితించువాడే కవి. జీవనసంగ్రామమునకు భయపడి భావకవిత్వము రచియించువారలు సంఘ శ్రేయస్సునకు బాటుపడజాలరు. సంఘమునందలి వాస్తవిక పరిస్థితులను తన కావ్య మనెడి దర్పణమున ప్రతిబింబింపజేయువాడే జాతీయకవి కాగలడు.

మన తెలుగు సారస్వతము నందలి ప్రబంధకావ్యము లన్నియు నొకే ఫక్కిన ఉండినవి. భాషయందును, భావములందును శైలియందు రచనా విధానమునందును మార్పు ఇసుమంత గోచరింపదు. దేశము ప్రశాంతముగా నున్నపుడెట్టి సాహిత్యమైన నుచితమే. కాని విదేశ ప్రభుత్వము మన పై యధికారము చలాయించునపుడు మనభాషలు సంస్కృతి సభ్యతలు పతనావస్థను బొందినపుడు మనకు మానసిక పరివర్తనము కాకతప్పదు.

స్వజాత్యుద్ధరణకై స్వదేశాభిమానముచే ప్రేరితులై నడుము బిగించుకవులు చాల తక్కువ. నిద్రించుజాతిని మేల్కొల్పుటయే కవి ప్రథమకర్తవ్యము. శ్రీ తుమ్మల సీతారామమూర్తిగారు అట్టికవులలో ప్రథమ శ్రేణికి చెందినవారు.

స్వదేశాభిమానము, స్వభాషాభిలాష, దేశ స్వాతంత్ర్యము వంటి నుత్తమోత్తమగుణముల కాట పట్టగు వారి కావ్య సాహిత్య వాటిక వివిధ చిత్రవిచిత్రభావనా సుమములతో నొప్పారుచున్నది. వారు 1920 సం.. నుండియు సాహిత్య సేవయందే నిమగ్నులై తమ తమ జాతీయ రచనాసాహితీ సుమములచే ఆంధ్రసారస్వతసదనము నలంకరింప చేయుచున్నారు.

జాతీయకవులను (1) స్వజాత్యభ్యున్నతి నభిలషించు వారు 2) స్వదేశమునకు పాటుబడు వారు (3) విశ్వమానవకళ్యాణమును దృష్టియందిడు కొనువారని విభజింపవచ్చును. ఈ మూడింటిని తమ రచనలందు సుందరముగా శ్రీ తుమ్మలవారు సమన్వయము చేయకలిగిరి.

రాష్ట్రగానమునందు తెలుగువారిని ప్రబోధించుచు ప్రాచీనాంధ్ర వైభవ గౌరవపతనమునకు కన్నీరుగార్చి "పోతన్న కలముసొంపుల" నెరుంగుటకు

బొబ్బిలికథలో దెబ్బలను చూచుటకు "పూదండ సౌరభంబుల" బీల్చుటకును ఆహ్వానించెను.

గత జాతీయసంగ్రామమందు తెలుగువా రొనరించిన అనేక త్యాగములు గలవు. దేశ స్వాతంత్ర్యముకొఱకు తమ ఉడుకురక్తమును భారతమాత పాదారవిందముల కర్పణము చేసినవారనేకవీరయువకులును గలరు. కాని ఆంధ్ర రాష్ట్ర సంసిద్ధికై ఏకకంఠముతో ప్రయత్నము సల్పువారరిది. "నాయకులం దనేకులు వినాయకులైరి సమస్త విఘ్నసంధాయకులైరి" అని కవి వాపోయెను.

వీరి రాష్ట్రగానము హిందీసాహిత్యజాతీయకవి శ్రీ మైథిలీశరణగుప్త యొక్క "భారతభారతి" వంటి అది హిందీ సాహిత్య మందు తమజాతీయ కావ్యము. అందు ప్రాచీన భారతౌన్నత్యము, వర్తమాన సంఘపతనము భావిభాగత ఆదర్శసంఘనిరూషణము గావించి గుపజీ నిద్రిత భారత జాతిని మేల్కొల్పెను.తెలుఁగులో "జయభేరి" మున్నగు మరికొన్ని జాతీయ రచనలు ఇట్టివి గలవు.

వీరి అన్యరచనలు "ఆత్మకథ", "ధర్మజ్యోతి", "పఱిగపంట", "పెద్దకాపు", "అమరజ్యోతి" మున్నగునవి ప్రసిద్ధములు.

"ఆత్మకథ" యందు గాంధీజీ అమూల్యజీవితమును తన రసవత్తర శైలితో చిత్రించియుండెను. గాంధీజీ సిద్ధాంతములను కావ్య శైలియందు నిరూపించి పండితపామర లోకమున ప్రచారము సల్పిన గౌరవము తుమ్మలవారికే దక్కినది.

భారతదేశ స్వాతంత్ర్యోపలబ్ధికి మూలకారకుడైన గాంధీజీ నిధన సమయమున ప్రపంచమంతయు హృదయా వేదనను వెలిపుచ్చెను. మన జాతీయకవి తుమ్మలయు "అమర జ్యోతి" అను చిన్న కావ్యమున తన దుఃఖోద్వేగమును వ్యక్తపరచెను. వారి జాతీయ కావ్య కుసుమముల పరిమళము ఆంధ్ర కావ్య సాహిత్యవాటికలో మిక్కుటముగ వ్యాపించినది.

తన కావ్యముల కితివృత్తముగ ఆధునిక సమస్యలనే గ్రహించి వాని ప్రచారమునకై మహత్తర మైన కృషి సల్పుచున్న శ్రీ తుమ్మల వారెంతయు అభినందనీయులు. అభినవ తిక్కన సముజ్జ్వల కీర్తిచంద్రికలు సంకుచిత రాష్ట్రీయతను వీడి విశ్వజాతీయతాకాశమున ప్రసరించుచున్నవి.

కానుక

విద్వాన్ శ్రీ బి.వి.సత్యనారాయణ, బి.ఎ.,బి.యిడి.

శ్రీ అభినవతిక్కనగారి గజారోహణకనకాభిషేకాది సత్కార సందర్భ మాంధ్రులకుఁ బరమానంద సంధాయక సమయము. శక్త్యనుసారము కానుక లర్పించి కన్నుల వేడుకగా గాంచుకాలము.

1947 నకు బూర్వము శ్రీ చౌదరిగారిని దర్శించు భాగ్యము నేను బొందకున్నను పత్రికలలో వెలువడుచున్న వారి మధురకవితా మృతమును గోలి చొక్కి సోలినవాఁడనే. నేడు వారిసహవాససాహచర్యములు సంప్రాప్తింప జేసిన నా యదృష్ట దేవతకునే నెంతయు మ్రొక్కుచున్నాను. వారు నాకు బూజ్యులు, గురుతుల్యులు, సహాధ్యాపకులు, మిత్రులు నాదర్శపురుషులును. రసవత్తగమగు వారి కవితవలె నాదర్శప్రాయమగు వారి గుణగణంబును శీల సంపదయు సదా సర్వజనాకర్షణీయములుగదా!

ఆంధ్రావనింగల కవిపండితు లెల్ల రేకకంఠంబున వీరి కవితా ప్రాశస్త్యమును గొనియాడియున్నారు. ఉత్తమశ్రేణికిం జేరిన యాధునికాంధ్ర కవి శ్రేష్ఠులలో నున్నతస్థాన మలంకరింపదగువా రని "నభూతో న భవిష్యతి" యనురీతిని సర్వాంగ సుందరంబై సకలాంధ్ర సమర్పితంబగు నేటియీ సత్కారమే బహుధా స్థిరీకరించుచున్నది.

"స్వయం తీర్ణః పరాన్ తారయేత్"అను నార్యోక్తి చొప్పున దాను యశఃకామి యగుటయేకాక తన జాతివారినందరనున్న తాశయములతోను నుదారభావములతోను నింపి యశఃకాములం జేసి వారి సర్వాభివృద్ధికి దోడ్పడుటయే కవి కొకవిధి. అట్టి కవియే సారస్వత సేవామూలమున నిజమైన దేశసేవ జేసిన వాడుగా బరిగణింపబడగలడు. ఆనాడే "కావ్యం యశసేర్థకృతే వ్యవహారవిదే శివేతరక్షతయే సద్యః పరనిర్వృతయే కాంతాసమ్మితతయోపదేశయుజే" యను నాలంకారిక సూక్తిని దనకృతులం దాతడు సాధించిన వాడగును. అట్టివానికృతులే సారస్వతములోనగ్ర శ్రేణిం జేరి

చిరస్థాయిగా నిలువ గలవు. శ్రీ చౌదరిగారు పై నుదహరించిన కవిత్వ ప్రయోజనముల నన్నింటిని దమ కృతులలో సాధించి యున్నారనుటకు వారి యభినవతిక్కన బిరుదంబును, నభూతపూర్వంబైన నేటిసత్కారంబును నిదర్శనంబులు.

"చవియు సారంబు నెఱుగని చచ్చుకవులు" నేడు "వినగూడని కబ్బము లల్లి గ్రామ్యముల్ బండులు బండ్లుగా" నింపుటయే కాక "యీ కవిపాంసను" లాద్యకవీంద్రమార్గముల్ దుండటికమ్మునన్ దెగడుచున్నారు. కావున నేడభినవ తిక్కనగారు "తెల్గువాణి పాండువడంగు"నట్లును "పాషండమత ప్రచారములు స్రగ్గి జగద్ధితమబ్బు" నట్లు ఎన్నండో తొలంగిచన్ విలసనంబులు శారదకబ్బు" నట్లును రాష్ట్రవాణిని తీర్చిదిద్దుటయే తమ ధర్మముగాను కొనియున్నారు. నేటియాంధ్ర సారస్వతమున నిట్టి యుదాత్తాశయములను సాధింపబూనుకొనుట శ్రీచౌదరిగారి వంటి యసాధారణ ప్రజాధురీణులకే చెల్లును. చౌదరి గారు తమ కృతులం దాద్య కవీంద్రుల పోకడలజూపి యాంధ్రవాణి కమూల్యాలంకారములు దొడిగి యామెను సర్వలక్షణలక్ష్మి జ్ఞాతనుగా సర్వాంగసుందరిగా నిర్మించి నిరూపించిరి. నన్నపార్యుని ధారాశుద్ధి, తిక్కనగారి తెనుగుదనము, శంభుదాసుని 'ప్రబంధసరణులు' శ్రీనాథుని సీసపు బోకడలు పోతన్న మత్తేభ యానములు, రామరాజ వేంకటకవుల శ్లేషభంగిమలు, సూరనార్యుని చమత్కృతులు, పినవీరుని ప్రసాదమాధుర్యాది గుణములు, విన్నకోటవారి ఛందశ్శుద్ధయు నీ కవివరేణ్యుని కవితలో మూర్తీభవించి తాండవించుచుండును.

కవిత్రయములో దిక్కనయెఱ్ఱాప్రగడలు తమ తమ భారతభాగములందు దమపోకడల కనువగు ప్రత్యేక కవితారీతులు పెంపొందించినను కథాసంవిధానంబున రసవద్ఘట్టకల్పనంబున విశిష్టభాషాప్రయోగంబున వారు వాగనుశాసనుల యడుగుజాడలలోనే పోయిరని చెప్పవలసి యున్నది. కావుననే యాంధ్ర సారస్వతమున గవిత్రయమువారికి మఱి యేరికిని లేని సమష్టి విశిష్టత యేర్పడియున్నది. అభినవ తిక్కనగారును నన్నయయడుగుజాడలనే పోయి నేటికవులకు మార్గదర్శకులగుచున్నారు. "పరమ వివేక సౌరభ విభాసిత

సద్గుణపుంజ'' మగు పండిత బృందమును మెప్పించు కుంటువోని పవిత్ర కవితాధారయు "ప్రసన్నకథాకలితార్థయుక్తి"యు వీరి ధర్మజ్యోతిలో వెలయుచున్నవి. పామరులను రంజింపజేయు అక్షరరమ్యత యన్ననో వీరి కృతులం దెల్లెడల బ్రత్యక్షమగుచునే యుండును.

నన్నయ యడుగుజాడలలో నడచుటకే నన్నయ ప్రయుక్తంబులైన "నల్లవో" మున్నగు అచ్చాంధ్ర పదములు మఱుగుపడి మాసిపోకుండ తమ కృతులందు బ్రయోగించుచున్నారు. మన కవులలో దిక్కనకుంబలె నీ యభినవతిక్కనకును జాను తెనుగు పదములన గడుంగడు మక్కువ. నేటిప్రపంచ పరిణామములం బట్టి భాషలో నన్యదేశ్యపదములు తండోపతండములుగా వచ్చి చేరెడి యీ రోజులలో నిట్టి జాను తెనుగుపదములు సమసి పోకుండ సంరక్షించుట భాషాయోగ కపూర్వాంగ సౌష్ఠవ మొనగూర్పుటయే యగునుగదా ! రేడియో రాగములు, నాటకపు బాటలు సినిమాస్టైలు ఔత్తరాహుల బాణీలు ప్రబలి దేశీయగానము మఱుగుపడి నశించుచున్న నేడు జానపదుల గేయముల నుద్దరించుటచే దేశీయభాషకు గానమునకు నెట్టి పుష్టి, సౌష్ఠవము నేర్పడునని విజ్ఞులు భావించుచున్నారో యట్టి సౌష్టవమే పురాతనపు జాను తెనుగుపదములను ప్రచారములోనికి దెచ్చుటవలన భాషకు సమకూరుచున్న దనుటలో విప్రతిపత్తి యుండ నేరదు.

మఱియు నన్నయ ఆనాడాంధ్రుల వేష భాషాభిరుచులను గ్రహించి తదనుగుణమగు సారస్వత సృష్టి యొనర్చి వాగనుశాసనుడైనట్లే నే డాధునిక కవులలో చౌదరి గారును నాంధ్రుల సంస్కృతి ఆశయములు, పలుకుబడులు మున్నగున వెల్ల నిరూపించి యభినవ తిక్కన బిరుదముం గాంచిరి. "స్వస్థాన వేష భాషాభిమతాస్సంతో రసమలుధియః" అను నన్నపార్యుని రససూత్రరహస్యమును నేడు పాటించిన దిట్టకవి యీయభినవ తిక్కనయే. రసలుబ్ధ మానసమగు నాంధ్రమహాశయలోకము నన్నయకాలము నుండియు స్వస్థాన వేషభాషాభిమతాదులం దాదరాభిమానముల జూపుచున్నది. అట్టి స్వస్థానాదికము నుండి పాశ్చాత్య విద్యా నాగరకతాది సంపర్కముచే జ్యుతమైన యాంధ్రలోకమున

- తెలుగు వెలుంగులు, తెన్నులు, వన్నెలు తీర్చి దిద్ది స్వస్థాన గరిమం గ్రహింపజేయుటయే కవిగారి ముఖ్యాశయము. అట్టి యుత్తమాశయము తమ రాష్ట్ర గానమున సంపూర్ణముగా నిర్వహించుటం బట్టి యాంధ్రుల కృతజ్ఞత కెంతేని పాత్రులై యింకను నెన్నేని యిట్టి సత్కారములకు బిరుదులకు నర్హులగుచున్నారు. నవ్యాంధ్ర కవితా పితామహులు శ్రీ చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి గారి "గుణాఢ్యుం డితడే నెఱుంగుదు సదస్యుల్ మెచ్చి యే దిచ్చినన్ దగు నీతండటువంటి మేల్బిరుదమున్ దాల్పంగ ముమ్మాటికిన్" అను నీయాశీస్సులే పై యభిప్రాయమును ముమ్మాటికి ధృవపఱుచుచున్నవి గదా!

కవి రసభావపూరితుడై యున్న తాశయములపై దృష్టి సారించి పరవశుడై స్వానుభూతులనే సర్వ ప్రపంచానుభవములుగా మార్చివేయ గలుగుచున్నాడు. క్షణికమైన క్షుద్రప్రయోజనములకై తనశక్తిని ఉపయోగింపక లోకకల్యాణమే గుఱిగా తన కవితాశక్తిని, మహత్ప్రయోజనములను సాధించు పొంటె వినియోగించును. నాడే కావ్యోనిష్టములగు సత్య నిరూపణ సౌందర్యోపాసనాది మహాప్రయోజనములన్నియు, "ఉదారచరిత నిబంధనాప్రబంధ ప్రతిష్ఠా నాయకో యది వర్ణ్యేత లోకోత్తరగుణోత్తర" అనునాలంకారిక సూక్తికి గుఱియై సాధితములగుచున్నవి. అభినవ తిక్కన గారి కృతులన్నియు బైలక్షణమునకు లక్ష్యములైయున్న వనుట నిస్సంశయము. దేశభక్తుడు సత్పురుషుడు, సత్యద్రష్ట, ప్రతిభాశాలియునగు నీ కులశ్రేష్ఠుడు తన యున్నతాశయములచేత నుత్తేజితుడై సత్యనిరూపణ, కళోపాసన యను రెంటిపై దృష్టి సారించి తన మధురరచన కుద్యుక్తుండగును. వీరి కృతులం దెల్ల వీరి సత్యనిరూపణాసక్తియు గళోపాసనాతత్పరతయు సువ్యక్తములై యున్నవి.

పరిగపంట, పెద్దకాపు అనునవి రెండును ఖండ కావ్యముల సంపుటములు. అచ్చమైన రైతై పెరిగిన యీ కవి తనకైతపంట నేర్చి కూర్చి సంపుటీకరించగా నేర్పడిన కావ్యద్వయమునకీ పేర్ల నిడి తనబిరుదమును సార్థకము చేయుచున్నాడు.

పెద్ద కాపులోని కృత మెరుక యను రచనకు కవి జీవితములోని యొక యద్భుత సంఘటనము కారణము. ఇందు గవి తనపరిణామశూలను పది సేర్ల గోధుమల నంపి తాత్కాలికముగ నుపమింపఁచేసిన వారియెడ గృతజ్ఞత చూపుట విషయము. చేసిన మేలు అత్యల్పమైనను మఱవకుండుట యను కవి సౌజన్యమే కృత మెఱుకలోను, తదితర కృతులందును వెల్లివిరియు చుండును. "అడుగకయ మున్న పంపిన ఇట్టి యీవి కెంచి వెలకట్ట నోపువా డెవడుకలడు" అని లోకమున కుద్బోధించుటయే కృత మెఱుక యుద్దేశము.

ఇందలి నేతాజీ, స్వతంత్ర భారతము మున్నగున వెల్ల గవ్యుదిష్టములగు నాదర్శములనే వెలయించు చున్నవి.

"భవ్యభారత మధురమూర్తీ
దివ్యభారత సవ్యసాచీ
నవ్యభారత చక్రవర్తీ
నతులు నీ కివిగో"

అని కవి భక్త్యావేశముతో నేతాజీకి నమస్కరించును. మఱియు నాదేశభక్తి యినుమడింప,

"పూనవోయీ! మల్లెపూలదోసిళ్లు
పాడవోయీ ! వీరభక్తి గీతాలు
కులవర్గములు పెంచు క్రుళ్ళింత లేని
మతపిశాచంబుల మనుగడలేని
జీవత్సమాజంబు సృష్టి గావించి
తమ్ముడా! నీతేరు తరలింపవోయి"

అని వీరభ క్తి గీతాలు పాడుచు సమాజమునకు నూతన చైతన్యము కలిగించి క్రొంగ్రొత్త సందేశములచే దానిని సజీవము చేయును. ఇంక "మేలి పల్కు" లో "తోటకూర " వారిపై గల పద్యములు చేమకూర వారి పాకమున బడ్డవి. "ఇంత వెరవకమ్మ యితడు నీ చేతికి దొరకినట్టి లేత తోటకూర పులుసుపిండి నీకు వలసిన

చందాన వాడవచ్చు రుచులు చూడవచ్చు" ఇందలి నుడికారపుసొంపు శ్లేషభంగి చేమకూర వారిని త్రోసిరాజు చేయుచున్నవి.

ధర్మజ్యోతిలో యథార్థవిషయమును సంగ్రహించి కవి ధర్మపరాయణుడైన మానవుని ప్రవర్తన మెట్లుండవలెనొ విపులముగా వివరించియున్నాడు. కవిగారితండ్రి తన దాచిన ధనమును దాని యజమానున కొసంగగా నతడు ఈతని యాత్మపావిత్ర్యంబునకు విస్మయము జెంది వానిం గొనియాడెను. అందులకా ధర్మమూర్తి 'ఘనకార్య మేమి నెఱపితిని నీ సొమ్ము నీకొసంగితిని. ఈ సేతకు బసదనంబు లీయవలయునా" అని పలుకుచు వారించెను. "పర ధన వైముఖ్యము నిక్కరణిం" బ్రకటించిన ధర్మపరాయణు డసంఖ్యాకమగు మానవ సంఖ్యలో నెక్కడో లెక్కకొక్కడు కలుగుటయు దుర్లభముగదా! ఈతడు గీతానిరూపితాదర్శ కర్మయోగిం బోలి యున్నాడు. మిత్రుడగు దానయార్యుఁడు ధర్మజ్యోతి మదంకితము గాగ నొనరింపగదే" అని పేదలు కృతజ్ఞతయ కాక యేమి యిత్తురు కాన్కల్" అని కవిగారిని కోరగా "కృత మెఱుక చాలు"నని యీ కావ్యమును వారి కిచ్చుటయేకాక "కోరకమున్న యీ హితునకు గృతినిచ్చెడి భాగ్యరేఖ చేకూరమిఁ జేసి లజ్జయును గొందలమున్ " తలసూపుచున్నవని వగచెను.

తనపై దిరుగుబాటు చేసిన అవిడియన్ కాసియస్ యొక్క హత్యావార్తను విని తన కాతని లోబరచుకొని రక్షించి క్షమించెడి యానందము చేకూరదయ్యె గదాయని విచారించిన రోమన్ సమ్రాట్టు మార్కెస్ అరులియస్‌ను దలపించుచు నీ వాక్యములు కవిసౌజన్య సంపదకు బరమావధినే సూచించుచున్నవి.

ఆత్మార్పణ మను పేర రచింపబడిన కపోతో పాఖ్యానము తిక్కనవ్రాత కన్నింట దీటై యుండి భారతీయుల యతిథిపూజాతత్పరత, దాంపత్య ప్రేమావయు నిరూపించుచు గరుణరసమును జిప్పిల్లు చేయుచున్నది. మహాత్ముని యాత్మార్పణముతో వెలింగెడి "అమరజ్యోతి" కరుణరసమునం దీయాత్మార్పణమున కన్నింట మిన్నయై యున్నది. మహాత్ముని నిర్యాణము మానవ కోటికే మహోపద్రవకారియని గుర్తించిన యభినవతిక్కన "మహోర్మిన్ బోని - కన్నీటితోన్" గాంధీ నిర్యాణకృతిని రచించెను. ఆత్మకథ అమరజ్యోతులలో

మహాత్ముఁడు బ్రతుకులో మృతిలో" పీడిత ప్రజ సల్పిన యూడిగం బును జూపి యాతనిని గోముగా, సాధారణ భారతీయునిగా భావించిన వినాయక గోడ్సే నశ్వరమైనయాతని కాయమును గూల్పగల్గెను గాని శాశ్వతమైన యాత్మను నాశనముచేయ నసమర్థుడనియు నయ్యది శుభసంపదలతో సత్యసౌందర్యములతో నిరవధికామరజ్యోతియై లోకలోకముల వెల్గు జూపుననియు నిరూపించుటయ కవియాశయమై యున్నది. అభినవతిక్కనగారు తమ సారస్వత సేవారూపమున నాంధ్రులకు జేసిన సేవ యింతింతని చెప్పనలవికానిది. రాష్ట్రగానము రచించి యాంధ్ర లోకమునకు మహోపకార మొసరించిన వీరు ఆంధ్రుల కృతజ్ఞత కేం తేని పాతు లగుచున్నారు. ఎన్ని కనకాభిషేకములు చేసి, డాకాల నెన్ని గండ పెండరముల దొడిగి యెన్ని గజారోహణములు కల్పించినను నాంధ్రుల ఋణము తీఋనది కాదు. ఆంధ్ర లెల్లరు రాష్ట్రవిషయమున నేకమై నేటికొక తాటిపైని తీవ్ర సన్నాహములు సల్పుచుంట శ్రీ చౌదరిగారి రాష్ట్ర గాన ప్రభావము కాక యింకేమి కాగలదు. ఆంధ్రులెల్లరొక్కుమ్మడి "మఱు మ్రోయున్ గద తెల్గు వీణియలయుష్మ ద్రాష్ట్ర గానమ్ము మీ కొరడాదెబ్బకు దద్దటిల్లిపడి తెల్గుల్ మేలుకొన్నారహో!" అని కృతజ్ఞతా పూర్వకంబుగ వచించిన గొంత ఋణము తీరునేమోయని భావించుచు భక్తి పూర్వకముగ నమస్కరించి వారికీ కానుక నర్పించి సెలవు తీసికొనుచున్నాను.

సుకవి

శ్రీ చిరంజీవి కొండయ్య

నేను గోచి పెట్టనినాడె నీవు తెలుగు
నాట కవియన్న పేరొందినాడ విపుడు
నన్ను చెలికాని వలె చూచు నిన్ను జూచి
నిండుకుండ తొణక దని నిలచి తలతు.
ఎంతటి పూర్వపుణ్యము వహించినదో భవదీయజన్మ మా
ద్యంతవిముక్తకాలహృదయమ్మునభాసిలు రత్నమాల నా
శాంతము వెల్లు లీను మణి వై జనియించితి వాత్మబుద్ధమై
యెంతి వానికిం గలుగు నీయజరామర కావ్యభోగముల్.
తెలిపితి వాత్మార్పణమున్, పలికితి వాత్మకథ తెలుగుపలుకుబడుల నీ
వలకున్ బిలచి కవీ ! తు, మ్మల సీతారామమూర్తి మహితుడవయ్యా!
గత మనెడి మ్రాడు చివురించుకవులకడ, న
నాగతాతి కర్కశబీజ మంకురించు
కవులవాగ్ధార లందు శోకహత జగతి
కిని పునర్జీవ మొసగెడి ఘనులు కవులు.
ఆనాటిపెద్దనార్యుని, శ్రీనాథుని జ్ఞప్తి తెలయ జేసెదు జుమ్మీ
ఈనాటి నీమహోత్సవ, మేనాడును నీకు శుభములే యగు గాతన్.

పెద్దకాపు - శ్రీ పరుచూరి వెంకయ్యచౌదరి

కారకమద్భుతమ్ము నుడికార మనన్యధనమ్ము శబ్దసం
స్కారమశేష మాంధ్రజన సంస్కృతి పూర్ణ మహోరసంబు మం
దారమరంద మంచిత కథాసువిధాన ముదాత్త మౌచితీ
స్ఫారము లాత్మ కావ్యములు ప్రస్తుతిగన్నవి నవ్యతిక్కనా !
పిన్నటనాటగోలె మురిపెంబును భక్తియు దాండవింపగా
నన్నయతిక్కనాది కవినాథుల కావ్యకళావిశేషముల్
మన్ననేర్చి కూర్చి బహుమానముచేసితి తెన్గుతల్లికిన్
నిన్నిటబోలువార లవనీస్థలి నన్నయతిక్కనాదులే.
వేనకువేల నిత్తుమని వేడిన వారికి గాదుపొమ్ములై
మానుగ నంకితంబు లవి మాన్యులకైనవి లోకముబ్బఁగన్
సూనృతధర్మవర్తనలు సూరిజనావళి మెచ్చు తీరులున్
గానగవచ్చు జీవితము కావ్యము రెంటను నచ్చుకూర్పులై.
కంటిమి తెల్గునాటగల కావ్యములం గవిసార్వభౌములన్
గంటిమి నాడునేడు గల కావ్యకళారమణీయశిల్పమున్
వింటిమి పూర్వ వైభవము విశ్రుత కీర్తియు గాన మెందు నీ
వంటి కవీంద్రు నీ కవిత వంటి విశిష్టకవిత్వ శిల్పమున్.
బాపుజీకృతి కర్త బంగారుకొండకు, గనకాభిషేకంబు కాసుదండ
ఆత్మార్పణాదర్శ మందించు త్యాగికి, నంబారి సేవలు నందలములు
రాష్ట్రగాన సుకవిరాజ శేఖరునకు, గండపెండేరంబు కంచుఢక్క
ధర్మామరజ్యోతి నిర్మాణకర్తకు, నీరాజనంబులు నిలువు దొడుపు.
పఱిగపంటలతో బాసకఱవు దీర్చు
పెద్దకాపునకుం దెన్గు పెద్దఱికము
తెన్గువారిచ్చిరభినవ తిక్కనకును
ధరణి వర్ధిల్ల నాచంద్రతారకముగ

కవిశార్దూలా!

శ్రీ నందివెలుగు వేంకటేశ్వరశర్మ

చక్కని పదములతో, బెం
పెక్కిన రసధారల గవివృషభులు మెచ్చన్
దిక్కన ఫక్కిని సొగసుగ
జెక్కగలాడవు కయితను సీతారామా!
కాంతు లెగజిమ్ము నీ ప్రతి కావ్యమందు
మధుర రసభావముల నెట్లమర్చినావొ
చెరకురసమును బోసి గుచ్చెత్తినావొ
కండచక్కెర తేనియ కల్పినావొ.
రాష్ట్రగానమ్ము ఈ యాంధ్ర రాష్ట్ర మెల్ల
బూరి గుడిసెలలో గూడ మారు మ్రోగి
చాటుచుండెబో నీయశశ్చంద్రికలను
గడగి కనక మూర్ధాభిషేకమ్ముతోడ.

భావవిప్లవము - శ్రీ శోభనరావు

కవితయు గానము నృత్త్యము చిత్రము నిత్యాది లలితకళలకు రెండే
పరమ ప్రయోజనంబులు జాతికి నుద్బోధనంబు నానందంబున్
కళలలో రాణి కవితగా రసికవరులు విజ్ఞులును నిర్ణయించిరి నిజము నంతె!
కవిత రాజ్యాల నిల్పును గూలద్రోయు కవిత యిచ్చును నిస్తులానంద మహహా!
రెంట నేదియు గొరవడన్ గొరతయె సుమ! ఉభయసంపాదకంబున్ రాష్ట్రగాన
మాదిగా కావ్యరాజి భావాన విప్లవంబు నిడె భాషలో విప్లవంబు విడిచి.

రాష్ట్రకవి
శ్రీ కోల్లపూడి మల్లికార్జునకవి

స్వాతంత్ర్య భారతావని
జాతీయకవీంద్రుడన యశం బందితి శ్రీ
సీతారామ కవీ! వి
ఖ్యాతిన్ కనకాభిషేక మందుము సతమున్.

స్వర్ణాంజలి
శ్రీ సుసర్ల వేంకటేశ్వరశాస్త్రి

శ్రీమత్తుమ్మల వంశ వార్ధిశశినం విద్వద్యశోభూషితమ్
శ్రీ వాణీనిలయ ప్రవేశ రచనామాధుర్య ధుర్యాననమ్
శ్రీ హేలా సుమగుచ్ఛరంజిత పదావిర్భూతగానామృతమ్
శ్రీ సీతారామకవీన్ద్రపణిత మముం శ్రీ భారతీ పాతువై!
శ్రీనిధిం సుగుణోపేతం శ్రీవాణీవిలసన్మణిమ్
సీతారామ మముం ఖ్యాత మనిశం పాతు శఙ్కరః
శ్రీకరం తిక్క యజ్వానం దివ్య దేశామృతప్రదమ్
కనకాభిషేక సంయుక్తం ప్రజాదరణ భూషితమ్.

అభినవ తిక్కన - శ్రీ ప్రతాప రామకోటయ్య

చక్కని రసార్ద్రహృదయము, మిక్కిలి మోదమ్ముగూర్చు మృదుల కవిత్వం
బొక్కట నలవడె నీకిటు, అ క్కవితిక్కనకువలెనె అభినవతిక్కా!
జాతీయమ్ములె సొమ్మై రాతిని గిలగింత బెట్టు రసమే యసువై
జాతికిమానము వోయును ఆతతమౌ నీదు కవిత అభినవ తిక్కా!
కనకపు టభిషేకమ్మును, ఘనగజ మెక్కించి త్రిప్పి కై సేయుటయున్
పెను గండపెండెరమ్మును అనువౌనౌ నీదు కవిత కభినవతిక్కా!

యుగకవి

శ్రీ వాకాటి పెంచలరెడ్డి

అభినవతిక్కనా ! సలలితాధికసత్కవితావిలాస ! సం
ప్రభవయశఃప్రకారజిత వారిజ వైరి సుధా సురాపగా!
విభవము నాయువున్ సుఖము విశ్రుతలక్ష్మియుఁ బెక్కు భంగులన్
శుభగతిపొంది వర్ధిలుము సూరులు మాటికి సన్నుతింపగాన్
వాఙ్మయావని నీ కీర్తిభాస్వరంబు
హైమమయమైనయట్టి మహాక్షరంబు
నేటిసన్మానమే నీకు మేటిగాదు
ఎట్టి సన్మానమైన నీ కీయదగును.

కమ్మ తెలుగుంగవీ ! స్వాగతమ్ము నీకు

శ్రీ ముక్కామల రాఘవయ్య

ఇది కారణయుగము. ఇందేవిషయ ముగ్గడించినను లిఖించినను విపుల విమర్శనమున కగ్గమగుచున్నది. ప్రతివిషయము నొకరు నిర్ణయించుదాని కింకొకరు వ్యతిరేకులగుచున్నారు. అందువలన నీ నవీనయుగమున గవి యెవరో? కవిత్వ మెట్టిదో? యిదమిత్థమని తేల్చుట కయితిగాకున్నది. ఒక కవి, తనకొఱకే కవిత్వ మల్లుకొందుననియు మఱియొకడు కవిత్వ మానందదాయకము కాబట్టి యానందదాయకమగు రచనయంతయు గవిత్వమే యనియు నింకొకఁడు ప్రకృతి సౌందర్యవర్ణనమే కవిత్వమనియు నిట్లనేకులనేక రీతుల గవిత్వ లక్షణము లుగ్గడించుచున్నారు. మొత్తముమీద గవిత విషయమున బ్రాచీనుల లక్షణము

లొకపుంతకు నర్వాచీనుల లక్షణము లింకొకవంకకు నడుచుచున్నవి. ప్రాచీనులు కావ్యమునకు లక్షణము లేర్పఱిచి యీ హద్దులలోనే కావ్యముండవలయునని శాసించిరి. ఆ కవిత్వము కేవలము ప్రభువుల కొఱకు బండితుల కొరకు మాత్రమే యుపయోగపడినది. కాని ప్రజాసామాన్యమున కుపయోగ పడలేదని చెప్పక తప్పదు. అప్పటి కవులు స్వతంత్రులు కాక రాజాధిరాజుల యనుగ్రహమునకు లోనయి వారి యభిప్రాయము ననుసరించి కావ్య రచన మొనర్చుచు వచ్చిరి. అందుచే గవుల స్వకీయాభిప్రాయము లంతగా గ్రంథస్థములు చేయుటకు వలనుపడ లేదు.

ఇది ప్రజాయుగము. ఇందు ప్రజానీకమును రంజింపజాలని యెట్టి రచనలును సర్వ జనాంగీ కార్యములు గావు. ఈకాలమున బూర్వపద్ధతులతో రచింపబడిన కావ్యములు హాస్యాస్పదములు గాక తప్పవు. ఇప్పుడు ప్రజలలో భావపరివర్తనము, సంఘసంస్కారము, వర్గ చైతన్యము గలిగింపవలసిన బాధ్యత సాహిత్య పరులయందున్నది. సాహిత్యము ప్రజాభావ ప్రతిబింబము. సాహిత్యపరులయిన రచయితలు ప్రజాసామాన్యమునందు భావవిప్లవము గలిగింప నడుము గట్టవలసియున్నది. కవి దేశశాల పరిస్థితుల నెఱిగి సంఘ శ్రేయస్సు కొరకు నుత్తమకావ్యములను రచింపవలయును. ఇట్టి యుదాత్త రచన, మానవసంఘమెల్లను సాదరముగ శిరసావహించును.

ఈ పట్ల మన చౌదరిగారు ప్రాచీనార్వాచీనకవితారీతు లెఱింగినవారు. అసలు కావ్యమునకు వస్తువు ప్రధానమైనది. అందుచే లోకోత్తరపురుషుడును నుదాత్తుడును నగు గాంధీ మహాత్ముని నాయకునిగా నెన్నికొని వారి యాత్మకథను బద్యకావ్యముగా, రచించి తన కవితారీతి సార్థక పఱుచుకొనిరి.

దేశకాలములను గుర్తెఱిగినచౌదరిగారు రాష్ట్రగానమును రచించి తన రాష్ట్రాభిమానము నకుంఠిత దేశభ క్తియు వెల్లడించిరి.

ప్రత్యేకాంధ్రరాష్ట్రమును బడయవలయునని యువ్విళ్ళూరుచున్న యాంధ్రజాతి వీరి రాష్ట్రగానముపై నెంతయో యాదరాభిమానముల జూపినది. చౌదరిగారు రాష్ట్రగానమును రచించుటచే నాంధ్రదేశ మా బాలగోపాలమునకు నెఱుకపడి రనుట యతిశయోక్తి గానేరదు. చౌదరిగారి కపోతోపాఖ్యానమందలి యాతిథ్యగాధ పాఠక జనహృదయరంజకమై భూతదయార్ద్రతను వెల్లడించుచున్నది. ధర్మజ్యోతియను కావ్యము యథార్థ గాధాబోధకమై తన పితౄణమును దీర్చుకొనుట కెంతయు సాధనభూతమైనది. తక్కుగల వీరి ఖండకావ్యములు తన కవితాభిమానమును దేశభక్తిని దేట తెల్లము చేయుచున్నవి. తెలుగుదేశ మీ రీతి కవులను గుర్తించి సన్మానింప దొఱకొనుటెంతయు ముదావహము.

మా తిక్కన
శ్రీ అన్నంరాజు వేంకటేశ్వరరావు

ముమ్మరమైన సంస్కృతి సముజ్జ్వలనవ్యకవిత్వతత్త్వముల్
దిమ్ముకొనన్ తెలుంగుల హృదిం గయిసేసిన నీ యనన్య సా
ధ్యమ్మగు సత్కళారచన తథ్యము చాటెను నీ కులమ్ములో
కమ్మదనమ్ము నీకలము గైకొనె నంచును తెల్గు నేలలన్.
తీయమావిచివుళ్లు దిన్న కోయిలచిమ్ము, మధురగీతలలోని మార్దవమ్ము
పూవు దేనియ ద్రావి పొంగిభృంగము రేపు, పృథురాగములలోని మధురిమమ్ము
పరిపక్వఫలముల గరచి కీరముచిల్కు, పల్కు ముద్దులలోని ప్రాభవమ్ము
చిమ్మ చీకటి మెక్కి దిమ్ముగా నిలకోడి, తీయు నాదములోని దివ్యతత్త్వ
మెల్ల గరగించి నీ కైత నేర్పరించి

జగతి సమ్మోహనమ్ముగ సల్పినావు
తెల్గుభాషకు వన్నెలు దెచ్చినావు
ఆంధ్రకవిలోక సమ్రాట్టవయ్య నీవు
కళలు వెలార్చు నీ కలము కల్పన లెల్ల ననంతదీప్తితో
కలకలలాడె సత్కవితగన్న యశస్సులు నిన్ను జేరె ని
ష్కలుషమనస్సుతో సుకవికాండము బ్రహ్మరథంబుపట్టె ని
చ్చలును సదాశ్రయంబుగొనె శారద నీదు కళాముఖమ్మునన్.
ఎన్ని కనకాభిషేకంబు లెన్ని బిరుదు
లెన్ని దినోత్సవంబుల నెన్ని సేసి
నీ ఋణమ్మును దీర్చగా నేర్తుమయ్య
ప్రతిఫలంబుల కందని ప్రతిభ నీది.

బంగారుకలము

శ్రీ తోటకూర వేంకటేశ్వరరావు

ఎందరు సత్కవుల్ మహి జనించి చరించుట గాంచ లేదు వా
రందరు నిన్నునుంబలె ప్రజాదర మింతగ నొందియుండిరే?
ఉందురుగాక కోటికొకడుండునొ యుండడొ సత్కవీంద్ర ! నీ
చందము నందము న్గనిన, పొంగునుగాదె యెంతయున్ స్వాంతము.
మనుజుల కంకితం బిడుట మంచిదె, కాదని సత్కవుల్ పురా
తను లెటులో వచించిన విధంబు రుచింపక యే కసాయికో
ధనమున కాసచెంది కవితన్ వెల కమ్ముట కొల్ల కీడ్యవ
ర్తనగలచోట స్వార్థరహితమ్ముగ నంకిత మిత్తు సత్కవీ!

కలదు యుష్మద్రాష్ట్రగానమ్ము నిఖిలాంధ్ర, జనుల నుఝ్ఝాత లూపిన దినంబు
కలదు ధర్మజ్యోతి కనుసన్నలో తెలుం, గులు త్యాగమును నేర్చుకొన్న దినము
కల దాత్మకథలోన కదలి నన్నయ్యతి, క్కనకవుల్ నాట్యమాడిన దినంబు
కలదు కొందరు పెద్దకాపు రమ్యోక్తిని, కొనియాడి యారతిచ్చిన దినంబు
కలదు నీ చేతి బంగారు కలమునుండి
దివ్యకావ్యమ్ము లొదవి నర్తించుదినము
తెలుగువాణీతపమ్ముల ఫలముగాగ
నవతరించితి సీతరామాఖ్య నీవు.

సమ్మోదము

శ్రీ పడాల నాసరాచార్య సిద్ధాంతి

తుమ్మల సీతారామయ
కమ్మని కవనంబుపల్కి గౌరవములలో
నిమ్ముగ నూరేగుటచే
సమ్మోదము గల్గె తెల్గుజాతికి నెల్లన్.

పుష్పాంజలి

శ్రీ కొత్తపల్లి వేంకటరత్నం

"పూజ్యమూర్తి" శ్రీ సీతారామమూర్తి కవితారామమూర్తి. ఈ కవితారామమున గల్పతరువు కలదోయేమొ ! పూచి కాచి ఫలించి పరిపక్వ మంజులమై మనోరంజకమై యలరారుచున్నది.

వయస్సుమీరినను వన్నె కెక్కిన పద్యపుష్పములే యీ కల్పతరువున గలవు. పఠించిన బండ్లు తినినట్లే ! వాసించిన బూలసోన వర్షించినట్లే !

ఈ వైపరీత్యముం జూడుడు ! అమరలోకమున గల్పతరువుండి మహనీయుల మహిమాతి శయముచే గోర్కెల నందించువారి మహిమయే అమరజ్యోతియై వెలుగొందు. ఇందో ! కవితారామమున గల్పతరు వింతకుమున్ను దీనాతిదీనమై అమరలోకమున నాటలాడు జ్యోతియైనది. కాననే అమరజ్యోతి వీరిచేతి కవితాజ్యోతియైనది కన్నీటిధారచే ఈ జ్యోతి ఆరదు. దీరదు. అహింసాజ్యోతి ననుచు హింసావేత్తలకు హితమార్గములఁ జూపుచున్నది. చూడుడు!

నీ పరమోపవాస మశనిప్రతిమంబయి శైలసాగర
ద్వీపవిశిష్ట విశ్వజగతిన్ వడకించుతటిన్ భయార్తులై
పాపులు బల్లెముల్ మరతుపాకులు బాకులు పెట్టి తావక
శ్రీ పదపీఠిపై నొరగి సిగ్గలిరేమి తపస్సురా ప్రభూ !

అంతియగాదు ! ఈ తుమ్మలవారు తమ్ములమగు మాకుం ప్రేమమూర్తి. విద్యావేత్తల వినోదింప జేయు సరసులు. సామాన్యులకు సన్నిహితులై చక్కనిమాటల మక్కువతో జెప్పు సాహితీపరులు. మొక్కవోనిమాట, చిక్కు లేనిభాష, అంతులేని ఆదరము, చెంతచేర సాయము, వీరిపాలి నిజరూపము. కాననే సామాన్యముల మనముల వీరిపలుకులు ముద్దు లొలుకును.

ఈ కరుణామయుని కనకాభిషేకము భాషామతల్లి కత్యధిక ప్రేమాభిషేకము వీరి గజారోహణోత్సవము కవితాకోటికత్యంతోత్సాహకరము.

ఆశుకవిత వేనోళ్ల వినియుంటిమి. కాని వీరు కావ్యలక్షణ సమన్వితమై మహాకావ్య మా యనంబడు శైలిం బరగి సులభమై మధురమై శావ్యమై గంటకు నూటయిరువది పద్దెముల వేగము గల యాశువును, సీతా వివాహకథతో నొక్కుమ్మడి గ్రుమ్మరించి పెద్దలకు పారవశ్యము నందించిరి. శ్రీ భావనారాయణ స్వామి కళ్యాణ మహోత్సవ సందర్భాన పొన్నూరులో చౌదరిగారు ప్రజామోదముం బడసిన పెద్దకాపు. ఈ పెద్ద కాపే పెద్దకాపు కృతికర్త ఈ కృతికర్తే "రైతు" రాజ్యంబున కర్షుడను మహాత్ముని వాక్యంబును ప్రకటించిన రైతు. కవి కాపగుట కాలధర్మము కాలేదా? పోతనామాత్యుడు. ఇందు వైపరీత్యం బరికింపుడు కాపే కవి యైనాడు. ఇట్టి పెద్ద కాపుం బెంచుకొనుట మన ధర్మము.

ఆంధ్రప్రభచే నమృతంపురాశి యనిపించుకొని యాంధ్రలోకమున జాటబడినదీ పెద్దకాపు. ఆంధ్రుల కాదర్శమై కవిబ్రహ్మ తిక్కనం దలపించు నభినవ తిక్కన లభించె మనకు.

ఈకర్ణగీతాదులం జూడుడు! కర్ణానందములె వీనుల విందగుచు, మాటల పొందగుచు, సారస్వతాభిమానుల సరస నడయాడుచు సుధా మాధురీ గరిమ నందించుచున్నవీ పద్దెములు.

అంకితములోనే చక్కని పొంకము. "అహింసారణమని" ప్రారంభించినాఁడు.

స్వతంత్ర భారతమనుటలో "పూనవోయీ" ! మల్లెపూల దోసిళ్లు. పాడవోయీ! వీర భక్తిగీతాలు మన రాష్ట్రమనుటలో యాచనా దైన్య మెఱుఁగని యాంధ్రజాతి యింతదిగ జారునే యెంత వింతపుట్టె. "

"కర్ణా ! నీవఖిలార్థవేదివని పల్కం జెల్లదేమైన నాకర్ణింపందగు "-అభినవతిక్కన

"నీవు వృద్ధజనోపసేవివి ధర్మసం వేదివి తెలియంగ వినుము"- కవిబ్రహ్మ తిక్కన

వ. ఈసమర సముద్రంబు దరియ నీది నిన్నుం గనియెదఁ గాదేని సూర్ధ్వలోకంబునం -కవిబ్రహ్మ తిక్కన.

భయదంబగు సంగర సాగరంబునుజ్జ్వల భుజ శౌర్యనౌక నిరపాయగతిం దరియించి నిన్ను నవ్వల గనుగొందు గానియెడ స్వర్గమునం గనుగొందు మాధవా ! - అభినవ తిక్కన

కృతమెఱుకలో మిక్కుటంబగు తెలుఁగునుడికారమెఱుక. అందలి ఈభావములే నాభావములు.

మెచ్చునివా డెవ్వడు కల
డచ్చపు టొయ్యారమునకు నాదరువై వె
ల్గిచ్చిన మీకృతినీర్ష్యకు
మచ్చరమున కంజలించు మానిసి తక్కన్.

"మరుమ్రోయ న్గన తెల్గు వీణియల యుష్మద్రాష్ట్రగానమ్ము" ఆ పఱిగ పంటయనం దగు కావ్యమా సుధాసదనము అభినవతిక్కనా ! మీ యశమే ఆ సుధాసదనము.

ధన్యుడవోయి నీవు!

శ్రీ గవిని గోపాలకృష్ణయ్యచౌదరి

రాష్ట్రగానంబును రచిపుట్ట గానంబు, లొనరింపదే నీ తెలుంగునాడు
ఆత్మకథనుగాంచి యానందముప్పొంగ, కులుకదే నేటినీ తెలుఁగునాడు
పటిగపంటను గాంచి సరిగ ముత్తెముల పం, టనుచు మురియుగాదె తెనుగునాడు
"ధర్మ!! కృతినిగాంచి ధర్మమార్గంబును, నలవఱచు కొనదె తెలుగునాడు
ఈదృశ సుధామయ ప్రబంధ బంధురామశరణి సుధీవరులు మెచ్చ మంతుకెక్కి
యాంధ్రులకొక చైతన్య మొసంగినావు తెలుగుబాసకొక వెలుగు దెచ్చినావు

తెలుగు తల్లికి నోముల ఫలమ వీవు
జాతి కుజ్జీవ మొసగిన జేతవీవు
జీవితంబును సాహితీ సేవకొరకు
బదిలపరచినట్టి కళాతపస్వి వీవు
సాహితీలోకాన జతురుండవగుటచే, వభినవతిక్కన్నబిరుదు గంటి
కవులందు మేటివిగా నెంచబడుటచే, గనకాభిషేకంబు గాంచితీవు
అతులిత శేముషీ ప్రతిభోన్నతుడవౌట, గండపెండేరంబు గాంచితీవు
ఆంధ్రుల కందర కల్లారు ముద్దొటనా గజారోహణంబు గనితీవు
మేటిమన్ననలం గాంచి మెప్పుగొన్న నీ సుగుణ సుమగంధ ధునిన్ మునింగి
కమ్మ వంశంబు గాంచె నఖండకీర్తి, ఓ సుకవివర్య ! ధన్యుడవోయి ! నీవు

హితోక్తి
శ్రీ పిశుపాటి నారాయణశాస్త్రి

నీసత్కవితాచాతురి, నీసత్సంగతియు, నీ మనిషిత్వమ్మున్
వాసించు నితోధికముగ, శ్రీ సీతారామమూర్తి ! స్థిరతమకీర్తీ!
దక్కించె 'సభినవతిక్కన ' బిరుదంబు, యజ్వనిర్దుష్టమార్గైక దృష్టి,
చేకూర్చెఁ 'గనకాభిషేక' సన్మానంబు, సార్వభౌమాదేశ సంస్మరణము,
నెనయించె 'గండపెండెర' ధారణమ్ము, పితామహకల్పనాద్వైతనిష్ఠ,
యొదవించె 'భద్రగజోత్సవ' భాగ్యంబు, బాలసరస్వత్యుపాస్తి ఫలము,
ఓయి ! యీనాట నీదె పైచేయి! హాయి ! కృతము మఱవక, గర్వసంగతి నెఱుగక
సంప్రదాయమ్ము విడువక, స్వప్రతిభను, జాటగలవారె పైకి రాజాలువారు.

మహాకవి
శ్రీ జంపాల వేంకటనృసింహము

''జయన్తి తే సుకృతినో రససిద్ధాః కవీశ్వరాః,
నాస్తియేషాం యశఃకాయే జరామరణజం భయమ్.''

పఠన శ్రవణముల మూలము సహృదయాహ్లాద వికాసము లుప్పతిల్లజేయు రమ్యతర విరచనము కవిత్వము. ఆదికవుల మనఃకుసుమగుళుచ్ఛంబుల స్వభావముగ నుద్భవించి పొంగిపొరలి వారి ప్రతిభా విశేషంబున స్వచ్ఛత నంది స్రవించునమృతరసవాహిని. అది రసిక జనానుభవయోగ్యమై వారి బరవశుల జేయు మధుద్రవము. అది కవిజనుల పాలి కల్పలతిక.

కవి మనోవీధి నేదియేని వస్తువు ప్రవేశించెనేని ఆది సాటిలేని యలంకార విలసనములతో నూతన సౌందర్యమున వెలుంగుచు లోక సమ్మోదదాయి యగుచుండును. కవి ప్రతిభాకల్పిత భావనాత్మక ప్రపంచమే లోకోత్తర చమత్కార కారియగు కావ్యసృష్టి యందురు రసికవరులు.

ఆనందమయ విజ్ఞాన వికాసవిభవసంధాయియగు సత్కావ్య నిర్మాణకర్తృత్వ సామర్థ్య విశేష భాసురుడు కవి స్రష్టయ.

శిల్పి, చిత్ర కారాదుల రచనముల పోల్కి గాక ప్రళయాంతమున సయితము మొక్కపో శాశ్వతమై యలరారునది కవివరుసృష్టి కార్యమే.

గ్రంథారామ యదృచ్ఛా విహారమున వివిధ విషయ పల్లవఖాదియై రసపిపాసువులహృదయవిలసన క్షమగాన కళాకోవిదము కవికోకిలము.

నానావిధ బాధలకు విచారములకు నహంకారమునకు, గాణాచియై భారవహనమాత్ర ఫలప్రదాయియై యనేక మార్గముల నశ్వరమగు సామ్రాజ్యము నందిన ఘనతకు విఱ్ఱవీగు రాజునకంటే అధికతర సౌఖ్యానంద సంధాయియు, శాశ్వత యశస్కరమునగు కవితాసామ్రాజ్య భూషితుడగు కవిరాజు ధన్యతముడు.

" సుకవితా యద్యస్తి రాజ్యేనకిమ్"అనిరి బుధులు.

నానాసుమసమూహమునుండి మధురసము నాకర్షించి కొనివచ్చి కోశమున నింపి ప్రజానుభూతి కనువు చూపు మధుకరము పోల్కి దన భావనాబలంబున బహువస్త్వంతర్గత సూక్ష్మాతిసూక్ష్మ బహువిధరసబిందువుల నాకర్షించి కావ్య కోశముల బూరించి రసికజనానుభవ సాధ్యము గావించు మహోపకారి కవికిశోరుడు.

తత్తద్దేశ కాలానుభవములగు నాచారములు, జీవిత విధానములు సాంఘికార్ధిక రాజకీయాది పరిస్థితులు మున్నగు సమస్తాంశములు భావికాల

జనులహృత్ఫలకముల హత్తుకొనునట్లు రసోల్బణముగ ముద్రించు ముద్రాపకుడు కవివరేణ్యుడు.

అవసరానుసరణముగ దేశజాత్యభ్యున్నతికను ప్రబోధ సస్య ప్రవృద్ధికి మధుర రచనా రూపశామృతము జిలికించు సుధాకిరణుఁడు కవిశీత కిరణుడు.

ఇహపర సాధన మనోరధులయి వన వాసేంద్రియ దమనాది బహుక్లేశానుభూతి సాధ్యమైన తపఃఫల మును దాపసోత్తములు దూర్వాస విశ్వామిత్రాదులతి క్రోధాద్యంత శృత్రువర్గమునకు వశులై వ్యర్ధము గావింప నియ్యకొనరు. అట్లే సార్ధక జీవులగు కవి తాపసులును నతిశ్రమ సాధ్యమైన తమ కవిత్వఫలమును నిరర్ధకము గావించుకొన నిచ్చగింపరు. ఇచ్చగింతురో వ్యర్ధ శ్రము లగుగురు. అపప్రథ కవకాశ మిత్తురు. కవులు లోక క్షేమంకరులు.

చిరయశఃకాయులగు కవిరత్న కోటిలో వన్నెం జెలఁగు యమూల రత్నజాలము మన అభినవ తిక్కన. తుమ్మలకవి రసవత్కావ్యరచనా పటిష్టత్వమున నందెవేసిన చేయి.

ఆంధ్రజాతిని తన దివ్య వాగమృత రసస్రవంతుల ముంచి తేల్చి మేల్కొలిపిన జాతీయకవి సత్తముడు మన సీతారామమూర్తి చౌదరి.

"జగ మెరిగిన బాపనికి జందె మేల" అనినట్లే మహాకవి సహజ శాశ్వతయశ స్సంపన్నుడే,
కవిత్వ సామ్రాజ్య పీఠికా సంస్థితుడగు నీ మహాకవిని గజారోహణోత్సవ, కనకాభిషేక, గండపెండెర సమర్పణాది, సత్కారములచే ప్రోత్సహించి ఆంధ్రజాతి ఆత్మరసజ్ఞతను, కృతజ్ఞతను వెలువరించి స్వీయధర్మము నిర్వర్తించుకొనుటయే కాక లోకమునకు విధ్యుక్త ధర్మ నిర్వహణమున మార్గదర్శి యగుచున్నది. వాసినొసఁగుచున్నది. ఈ అభినవతిక్కన తుమ్మల సీతారామమూర్తి మహాకవి చిరాయురారోగ్య భాగ్య సంశోభితుడగుచు దన సహజలోకసేవాపరాయణతతోనే తత్కాలావళ్యకములగు శాంతిసహన సౌమ్యాది సద్విషయ సంశోభితోత్తమ రచనా పటిష్ఠత్వము వెలయించి తన దివ్యవాక్సుధాప్రవాహము నాంధజన హృదయ క్షేత్రముల వెల్లివిరియించి సద్భావ ఫలప్రాప్తి నందించుగాత.

ఇమ్మహాకవి సద్రచనా సామర్ధ్యమును, ఏతత్సత్కార హేతువగు నాంధ్రజాతి రసజ్ఞతయు భారత లోకమున కాదర్శప్రాయమై విలసిల్లుఁగాక.★

గ్రంథాలయ సేవాఫలము

శ్రీ పాతూరి నాగభూషణం

శ్రీ సీతారామమూర్తిగారు తమ చిన్ననాడు స్వగామమగు కావూరులో చదువుకు సరియగు సౌకర్యములేక సమీపగ్రామమైన చందవోలులో విద్య నభ్యసించుటకు ప్రయత్నించినారు. అచ్చటను దీనికి సరియగు అనుకూలము లభించనందున వీరు తమ చదువుకు స్వస్తి చెప్పవలసివచ్చినది. ఈ తరుణములో కావూరునందు శ్రీ సీతారామాంధ్ర గ్రంధాలయము వెలసినది. దీని స్థాపకులలో వీరును ఒకరుగ నుండినారు. ఏకదీక్షగా వీరు పదునైదేండ్లీ సంస్థను నిర్వహించారు. గ్రంథభాండాగారికుల ప్రధానధర్మమైన గ్రంథపరనమును వీరు చక్కగా నెరవేర్చి దీని ద్వారా భాషాజ్ఞానమును ప్రపంచజ్ఞానమును పెంపొందించుకొన్నారు. స్వయంకృషి ద్వారా మాతృభాషలో చక్కని పాండిత్యమును, రసవంతముగ కవిత్వము చెప్పగల నేర్పును సంపాదించి నారు. తాము నేర్చిన విద్యను సార్ధకము చేసికొనుటకై జాతీయోద్యమమునకు తమ జీవితము నంకితము చేసినారు. పూజ్య బాపూజీ బోధల కనుగుణ్యముగ తమ జీవితమును నడుపబూని కాంగ్రెసు సేవలో చిరకాలము పాల్గొన్నారు. మహాత్ముని కత్యంత ప్రియతమ మగు ఖద్దరుదీక్షను గైకొన్నారు. వారి జన్మస్థానమగు కావూరులో లోకమాన్య బాలగంగాధరతిలకు పేరిట నెలకొల్ప బడిన జాతీయపాఠశాలలో ఉపాధ్యాయులుగ కొంతకాలము పని చేసినారు. జాతీయతను ప్రోత్సహించునట్టియు, భారతీయ నాగరకతా ప్రశస్తిని చాటునట్టియు కవితల నల్లినారు. వీరి "రాష్ట్ర గానము" జాతీయతా వ్యాప్తికి గొప్పగా దోహదము చేసినది, లోక పూజ్యుడైన . గాంధీజీ ఆత్మకథను వీరు కావ్యముగనల్లి తమ కవితాప్రౌఢిమను చాటుకొన్నారు. కవిగా తమ కీర్తిని స్థిరపరచుకొన్నారు. వీరు తమ కావ్యములను ధనమున కాశించి యెవ్వరికిని కృతి నిచ్చియుండ లేదు, వీ

రిటీవల ప్రకటించిన''పెద్ద కాపు'' అను కృతిని గాంధీజీ ప్రియభక్తుడగు శ్రీ యెర్నేని సుబ్రహ్మణ్యము గారికి సమర్పించినారు. శ్రీ సుబ్రహ్మణ్యముగారితో వీరికి సన్నిహిత సంబంధము లేకున్నను నిర్మాణ కార్యక్రమముపట్లను దీక్షతో దీనిని నిర్వహించు కార్యకర్తలపట్లను వీరికిగల సహజమైన అభిమానమే వీరినీ పనికి పురికొల్పినది. నిజముగా వీరొనర్చిన యీ పని ఉభయ తారకమైనదిగ నేను భావించుచున్నాను.

యువకులుగా నున్నప్పుడు శ్రీ సీతారామమూర్తి గారు చేపట్టిన గ్రంథాలయ సేవయే వీరి అభివృద్ధికి కారణ మైనదని వీరి ముఖతః విని నేను అమితానందమును పొందినాను. నాడు గ్రంథపరనము ద్వారా తెలిసికొన్న ముఖ్యధర్మములను ఆచరణలో పెట్టి సంఘసేవకై కృషి సల్పుటకు వీరు పూనుకొన్నారు. స్వయంకృషి ద్వారా మానవుడెట్లు అభివృద్ధినంద గలడో వీరు తమ జీవితము ద్వారా నిరూపించినారు. వీరిని ప్రస్తుతపు స్థితికి తెచ్చినది కనకాభిషేకమున కర్హుడైన కవిగ నొనర్చినది గ్రంథాలయ సేవయే యని గ్రహించి ఆంధ్ర దేశములోని గ్రంథాలయ సేవకులందరు స్వయంకృషి ద్వారా తాము జ్ఞానవంతులై తమ జ్ఞానమును స్వార్థము కొరకుగాక సంఘపు మేలుకొరకుపయోగించి శ్రీ సీతారామమూర్తిగారి వలెనే ధన్యజీవు లయ్యెదరు గాక!

కవిజీవితము

శ్రీ సీతారామమూర్తిగారు గుంటూరుజిల్లా రేపల్లె తాలూకా, కావూరు గ్రామములో తుమ్మల నారయ్య- చెంచమ్మ అను పుణ్యదంపతులకు 25-12-1901 జన్మించినారు. అయిదు సంవత్సరముల బాల్యము ననుభవించి 1906 నవంబరులో ప్రాథమిక పాఠశాలలో చేరిరి. బ్రహ్మశ్రీ కావూరు శ్రీరాములుగారు అచటి గురువులు. ఆయన చదువులో, సౌజన్యమునందును పేరుగలవారు. ఆయనశిక్షణలో అయిదు సంవత్సరము లున్నారు మన కవిగారు. వాచకాల చదువే అచట ప్రధానము. కాని కవిగారికి వారి తండ్రిగారి కోరికపై శ్రీరాములుగారు ప్రత్యేకముగా ఇరువది, ముప్పది శతకాలు, భారతములోని నలచరిత్ర,

భాగవతములోని ప్రహ్లాద చరిత్ర, రుక్మిణీ కళ్యాణము, గజేంద్రమోక్షము, కుచేలోపాఖ్యానము బోధించిరి.

అమరము కొంత, ఆంధ్రనిఘంటుత్రయము వల్లిపించి ఏ పద్యమైనను మన కవిగారు రెండుసార్లు చదివి ఆనాడప్పగించువారు. వీరి తండ్రి నారయ్యగారు దేవభక్తి, ధర్మానురక్తి మున్నగు సుగుణంబులు మూర్తీ భవించిన పుణ్యపురుషులు. ఈయన చరిత్రలో నొకభాగమే మన కవిగారు రచించిన ధర్మజ్యోతి. ఈయనకు చదువురాదు, అక్షరములే రావు. కాని నిత్యము పురాణ శ్రవణము చేయుచు జ్ఞానము పాండిత్యము సంపాదించి ఇతరులు చదువుచుండగా తాను భారతాదుల కర్థము చెప్పుచూ పెద్ద పౌరాణికుడుగా నుండెడివాడు. ఈ విషయములో కవిగారిట్లు వర్ణించిరి.

"చదువుకయున్న నేమి బుధసత్తములుబ్బగ నర్థభావ సం
పద వికసింప భాగవత భారతముల్ వివరించు హృద్యముల్
తదమల కావ్యపద్యములు ధారణకగ్గము చేసి వేనవేల్
చదువు నతండు తచ్ఛ్రవణ సాహితి దుశ్శక మెట్టి వారికిన్.

కవిగారు ప్రాథమిక పాఠశాలలో చదువుకాలమున తండ్రి వీరిచే రాత్రి పూట భాగవతాదులు చదివించుచు తాను శ్రోతలకు వివరించుచు తన యిల్లొక పురాణ గోష్ఠిగా చేయువాడు. ఇచటనే కవిగారికి సాహిత్యవాసన అంటినది. 1911లో మన కవిగారు ప్రాథమిక పాఠశాలలోనున్న కాలమున కావూరు ప్రక్కనగల చెరుకుపల్లిలో సుప్రసిద్ధులగు కారెంపూడి రాజమన్నారు కవిగారు అవధానము చేసిరి. ఆ సభకు మన కవిగారును వెళ్లిరి, ఆనాటిసమస్యలలో "శునకమ్మయ్యెను విష్ణుదేవుడు హహా .... నత్తటిన్" అనునది యొకటి. అవధానిగారు త్రిపురాసుర సంహారకథకు దీనిని సంధించి "ఈశున కమ్మయ్యెను... అని చక్కగా పూరించిరి. ఈ యనుభవముతో చౌదరి గారు బడికి వచ్చి సాటివిద్యార్థులను గూర్చుండ బెట్టి ఈ సమస్యనే ఏదోవిధముగా పూరించి పద్యమును బూర్తి చేసిరి. ఆనాడే వీరికి కవితావాసన అంటినది.

సీతారామమూర్తి గారికి 1911 లో ప్రాథమిక విద్య ముగిసినది. తర్వాత ఏమి చేయవలయు నను విచారము కల్గినది తండ్రిగారికి. తెనాలి తాలూకా పెదపూడిలోనున్న తన యల్లుడు శ్రీ జాస్తి సుబ్బయ్యగారికి బిడ్డ నప్పగించినాడు. ఆ సుబ్బయ్యగారు గట్టిసాహిత్యముగల పౌరాణికుడు. వేదాంతవిద్యలో దిట్ట. సత్ప్రవర్తనకు పెట్టిన పేరు. వారిని గురించి కవిగారిట్లు వ్రాసిరి.

"ఈవిధి నాంధ్రవాణి భజియింపగ నాకు నెవండు ముందరన్
ద్రోవలనెల్ల జూపి కడుదోడ్పడె నగ్గురువర్యు సాహితీ
సేవధిదత్త్వవిన్నికరశేఖరు భూరియశోవిభాసి మా
బావను గొల్తు జాస్తికులపావనుఁ జల్లయ సుబ్బయాఖ్యునిన్"

ఆయన శిక్షణలో మనకవిగారు ఒక సంవత్సరముండిరి. అపుడు అమరము పూర్తి చేసిరి. మనుచరిత్ర, వసుచరిత్ర చదివిరి. సాహిత్యము గట్టిపడసాగినది. అప్పటికి కవిగారి వయస్సు 11 సంవత్సరములు. పెదపూడినుండి యింటికి వచ్చి వ్యవసాయపు పనులలో తండ్రికి చేదోడుగా నుండవలసి వచ్చెను. వారి మనస్సులో మాత్రము విద్యాసక్తి మెండగుచుండెను. తీరికచిక్కినపుడెల్ల భారతం చదువుకొనువారు, కవ్వితము వ్రాసెడివారు.1911-18 మధ్య 5, 6 శతకములు, నాలుగు హరికథలు, రెండు నాటకములు, ఒక జంగం కథ, ఒక ప్రబంధము వ్రాసిరి. ఆ పుస్తకములు తృప్తికరములు గాక అణగిపోయినవి. వ్రాతపతులు లేకపోలేదు. ఇవి యన్నియు పౌరాణికములు.

కవిగారికి సంస్కృతము చదువవలయునను, కోర్కె బలముగా కలిగినది. ఊరిలో చెప్పువారు లేరు. గ్రామాంతరము వెళ్ళినచో భోజనాదులెట్లు? ఆ ఖర్చుల భరించుటకు తండ్రి గారు జంకిరి. వారములు చేసికొనియైన చదువవలయునని కవిగారు సంకల్పించుకొనిరి. తండ్రితో చెప్పకుండ అంగలూరు వెళ్లి 1917 లో సంస్కృత పండితులైన శ్రీ దుగ్గిరాల పురుషోత్తం గారి నాశ్రయించిరి. వారు ఆదరించిరి. వారింటిలో తినుచు నాలుగు దినము లట నుండిరి. వారము సంపాదించుట చేతగాక మార్గాంతరము లేక 5 రోజులకు ఇంటికి తిరిగి వచ్చిరి.ఆ

సంవత్సరమే తండ్రి స్వర్గస్థుడు అయ్యెను. కవిగారికి వ్యవసాయభార మెక్కువయినది. విద్యాతృష్ణయు అట్లే అయినది. తనకు 4 మైళ్ళదూరముననున్న 'చందవోలు'లో మహాపండితులు మహాకవులగు తాడేపల్లి వెంకటప్పయ్య శాస్త్రి గారుండిరి. వారివద్ద చదువ కవిగారు నిశ్చయించుకొనిరి. తీరిక యేదీ? పగలంతయు పొలములో పనిచేసి రాత్రి పెందలకడ భోజనము చేసి చందవోలు వెళ్లువారు. పాఠము చెప్పించు కొని నిద్రించి తెల్లవారకముందే ఇల్లుచేరి కోతకో, కుప్పకో సిద్ధమయ్యెడివారు. శ్రీ శాస్త్రులుగారి శిక్షణలో ఒక వర్షము చదివారు. కాళిదాస త్రయము పూర్తిజేసినారు. శాస్త్రులుగారి శిక్ష చాల గొప్పది. కాబట్టి కవిగారు మంచి సాహిత్యము సంపాదించిరి. ఈ గురువుగారినిగూర్చి వారిట్లనిరి.

''ఏకశ్లోకరహస్యబోధనముచే నెవ్వాడు శిష్యున్ సుధీ
లోకాగ్రేసరుజేయు నవ్విబుధులు గొల్తున్ వెంకటప్పార్యు న
స్తోకశ్లోకమయూఖ రాజదఖిలాశున్ రామగాథామృతా
ఖ్యాక గ్రంధమతల్లి కాజనకు మద్గైర్వాణభాషాగురున్''

చందవోలు చదువు సాగక కవిగారు దిగులుపడుచుండ 1918లో కావూరున సీతా రామాంధ్రగ్రంథాలయము ఏర్పడినది. దాని స్థాపకులలో కవిగారు ఒకరు. పైగా భాండా గారికులు. రైతులకు తీరికగానుండు సమయమున నిత్యము గ్రంథాలయము తెఱచుచు అందలి పుస్తకములన్నియు చదువుచు తమ సాహిత్యమును వృద్ధి చేసికొనిరి.

ఇంతలో 1920 లో అసహాయోద్యమము వచ్చినది. కవిగారి జీవితము దాని కంకితమైనది. వారు గ్రామకాంగ్రెసు సంఘమునకు 'కార్యదర్శి' అయిరి. ఫిర్కాలోని కాంగ్రెసు ప్రచారకులలో వీరే ఆనాడు ప్రధానులు. 1920 నుండి 29 వరకు కవిగారు కేవలము కాంగ్రెసు సేవకులు. గుంటూరు జిల్లా కాంగ్రెసు సంఘములో ఆ పదిసంవత్సరములు వారు సభ్యులే. 1922 పన్నుల నిరాకరణలో జరిమానా శిక్షకూడ పొందిరి. 1924 నుండి 29 వరకు తమ గ్రామములోని తిలక్ జాతీయ పాఠశాలలో ఉపాధ్యాయులును.

1920 నుండి కాంగ్రెసు ప్రచారమున కుపయోగించు ఖండికలను పెక్కింటిని వ్రాసిరి. తిలక్ నిర్యాణముపై వ్రాసిన పద్యములు ఈ శాఖలో మొదటివి. రాట్నము, ఖద్దరు, గాంధి, అస్పృశ్యత, పంబాబు వధలు, దాసు, ఆంధ్రరత్నము, ఓట్లు, భారతమాత, మున్నగు పలుశీర్షికలతో ఈశాఖ ప్రారంభమై రానురాను కవిగారిని జాతీయకవిని చేసినది.

జాతీయ పాఠశాలలో పనిచేయుచు 1925లో "ఉభయభాషాప్రవీణ" పరీక్షకు ప్రయత్నములు సాగించిరి. 1930 లో అందు మొదటి తరగతిలో ఉత్తీర్ణులైరి. ఈ పరీక్ష కొరకు 1929లో చిట్టి గూడూరు (పర్ణశాల) లో నుండి బ్రహ్మశ్రీ దువ్వూరి వెంకటరమణ శాస్త్రిగారి యొద్ద వ్యాకరణ శాస్త్రము చదివిరి. వారినిగూర్చి ఆత్మకథలో నిట్లు వ్రాసిరి.

"శబ్దశాస్త్రాదిలక్షణ సంప్రదాయ
మెవ్వ డెఱిగించె నాకు నయ్యిద్ధచరితు
బ్రస్తుతించెద బుంభావపద్మజాత
రమణి దువ్వూరి వేంకటరమణశాస్త్రి!!

1918-30 మధ్య వీరు సాగించిన కవితలో ఒకశాఖ పౌరాణికము, మరియొక శాఖ జాతీయము, పౌరాణిక శాఖలో రామశతకము, రామలింగేశ్వర శతకము, నామదేవచరిత్ర, (హరికథ) మాహేంద్ర జననము (నాటకము) మున్నగునవి చేరును. జాతీయశాఖలో గాంధీ తారావళి మున్నగు ఖండికలు, ఆత్మార్పణ కావ్యము చేరును.

కవిగారు 1930 లో యూనివర్సిటీలపట్టము సంపాదించిన తరువాత గుంటూరు జిల్లా బోర్డులో పండితులైనారు. దుగ్గిరాల, బాపట్ల, నిడుబ్రోలు హైస్కూళ్లలో పనిచేసి ప్రకృతము అప్పికట్ల హైస్కూలులో పని చేయుచున్నారు.

1932లో వీరు తమ దైవమగు గాంధీ మహాత్ముని ఆత్మకథను పద్య కావ్యముగా వ్రాయ నారంభించిరి. 1933లో ఒక భాగము పూర్తి చేసి దానిని 1936 లో ప్రకటించిరి. అది భారత ప్రతిబింబమని శ్రీ రామలింగారెడ్డి వంటివారు

శ్లాఘించుట, రెండుమూడు విశ్వవిద్యాలయము లలో పాఠ్యమగుట అది కారణముగ వీరికి 'అభినవతిక్కన' బిరుదము వచ్చుటలోక మెఱుంగనిది కాదు.

1937 రాజాజీ మంత్రివర్గము హయాములో ఆంధ్రుల రాష్ట్ర వాంఛ వెల్లి విరిసినది. విజయవాడలో ప్రత్యేకాంధ్రమహాసభ జరిగినది. కవిగారు ఆ సభను జూచి ఆవేశమును పొందిరి. దాని ఫలితముగా "రాష్ట్రగాన" మను మహోజ్జ్వలకావ్యము బయల్వెడలినది. అద్దాని సౌందర్యము, సందేశము, ఉదాత్తత ఇపుడు వివరింప నవసరము లేదు. బెజవాడ సభకు ఆహ్వాన సంఘాధ్యక్షులై తరువాత మహాసభకు ఉపాధ్యక్షులై ఆంధ్రోద్యమమును నడిపిన శ్రీ చల్లపల్లి ప్రభువులు యార్లగడ్డ శివరామప్రసాదు బహద్దరుగారి రాష్ట్ర సేవకు మెచ్చి కవిగారి కావ్యము వారికి నంకితము చేసినారు. 1938 లో ప్రథమ ముద్రణమందిన ఈ కావ్యమిపుడు 6వ కూర్పునకు సిద్ధముగా నున్నదన ఆశ్చర్యపడ నక్కర లేదు. కవిగారికి వ్యాపారదృష్టి ఉన్నచో రాష్ట్రగానము ఈసారికి 6 కూర్పులు కాదు, 60 కూర్పులు పొంది యుండెడిది.

1940 లో కవిగారు తమ తండ్రి పాలించిన ఉదాత్తధర్మము నొక దానిని వర్ణించుచు 'ధర్మజ్యోతి' అను కావ్యమును రచించి 1942 లో ప్రచురించిరి. కవిగారి మిత్రులు దానయ్య గారు దాని కృతిపతులు. 1947లో దీనికి రెండవ ముద్రణ జరిగినది. ఇపుడీ కావ్యరాజము ఆంధ్ర విశ్వకళా పరిషత్తు వారి ఇంటరు పరీక్షకు పాఠ్యగ్రంథము.

1948 లో తన వేలుపగు బాపూజీ నిర్యాణములో కవిగారు క్రుంగిపోయిరి. ఆ దుఃఖా వేశములో, ఆ కారుచీకటిలో వారు వెలిగించిన జ్యోతియే అమరజ్యోతి. ఇది యెంత చిన్న కావ్యమో అంత ఉత్తమకావ్యము. దీనిలో కవిగారి కవితాతపస్సు పండినదని చెప్పుటలో సందేహము లేదు. "పూవుల తెప్పపైఁ గదలిపోయితివా " ఇత్యాది పద్యములు పాడుకొనుచు తెలుగు బిడ్డలందఱు నేడీ కావ్యమును సేవించుచున్నారు.

"వందలు వేలు పొత్తములు వాములు వాములు చేసినంతనే

పందెము గెల్చునా కవికి బొరకలోకపు ముద్రలేనిచో

తన కీ శరీరమిచ్చిన తల్లి చెంచమ్మగారి ఋణము తీర్చుటకై కవిగారీ కృతిని ఆమెకు పూజాపుష్పముగా సమర్పించుకొని ధన్యులైనారు.

శ్రీ చౌదరిగారు ఆత్మకథాది కావ్యములేగాక 1920 నుండి అనేక ఖండకావ్యములు గూడ వ్రాసిరి. అవి ఎప్పటి కప్పుడు సుప్రసిద్ధములైన 'భారతి' మున్నగు పత్రికలలో వెలువడుచు వచ్చినవి. ఏదో ఒక ధార్మికావేశము, నైతిక ప్రేరణలేనిచో మన కవిగారు కవిత్వము జోలికి పోరు. ఆ గుణములు వీరిఖండ కావ్యములలో విశేషించి కన్పడుచుండును. వీనిని గాలికి పోనీయకుండ ఒక ఆకృతికి దెచ్చుట సారస్వతమునకు లాభకారియనితలంచి 1913 లో 'పఱిగపంట' యను పేరుతో, 1918 లో 'పెద్దకాపు'అను పేరుతో తమ ఖండకావ్యములను సంపుటీకరించిరి.

తమ సారస్వతక్షేత్రములో పఱిగకంకులవలె చెదరి చెదరియున్న కవిత్వమును ఒక చోటికి చేర్చి పంటపండించిరి. కావున ఒక సంపుటము ''పఱిగపంట'అయినది. గ్రామ్యభాషాదూషితమై ఉదాత్తవస్తుశూన్యమై నేడు వెలువడుచున్న వెఱ్ఱికవిత్వాలను జూచి ''నాకుదిక్కు లేదా యని వాపోవుచున్న ఆంధ్రికి మేలిరక్షగ లేదా మంచిపంటగ జేసినారు కాబట్టి రెండవది ''పెగ్గకాపు'' అను పేరుతాల్చినది.

వీనిలో పఱిగపంటను నిడుబ్రోలు హైస్కూలునకు తనకున్న సంపద నెల్ల నర్పించిన కర్మయోగి శ్రీకొసరాజు లక్ష్మయ్యగారికి కాన్కగా నొసంగిరి. పెద్ద కాపును మహాత్ముని ప్రియశిష్యులు దండి సత్యాగ్రహయోధులు సేవావ్రతులునగు శ్రీ ఎర్నేని సుబ్రహ్మణ్యము గారికి నుడుగర గావించిరి.

కవిగారు తమకావ్యములను అంకితము చేయుటలో ఆదర్శప్రాయమైన మార్గము తొక్కినారు. వీరి కావ్యము ముద్రితమై వచ్చు వరకు అది ఎవరికి సమర్పింపబడినదో లోకమునకు తెలియదు. ఆ కృతిపతికే తెలియదు. ఆ కృతిపతి

ధనవంతుడు కానక్కర లేదు. దేశారాధకుడు, సేవాజీవి, సజ్జనుడు అయిన చాలును. ఈ సందర్భములో

"కృత మెఱుకచాలు నన్మ
న్మతికింపగు కబ్బమిచ్చి మణిగొంట జగ
ద్ధితశీలుండొదవ నయా
చితమ్ముగా నిడుదు నాసృజించిన కవితన్"

"నరునకు గబ్బమిచ్చుట యనాదృతకృత్యమటంచు సత్కవీ
శ్వరులు పురాతనుల్ నుడువు చంద మదేమొ రుచింప దింతయున్
సిరులకు నాసచెంది యొక చెన్నటి కిచ్చుట మచ్చగాని స్వా
ర్థరహితబుద్ధి నిద్ధగుణరాశి కొసంగిన దోసమున్నదా ?"

అను కవిగారిపల్కులు సత్కవులకు శిరోధార్యములు. ఇటు వంటి కవులు కవిత్వమువల్ల ఏమి సంపాదింపగలరు ? సంపాదింపవలయుననెడి కోరికయు ఆయనకు లేదు. పోనీ ఆయన సంపన్నుడా? కాదు. విలక్షణమైన ప్రకృతి. ఈ ప్రకృతి ఎచటనుండి వచ్చినది ? ఏ ప్రకృతియైనను నిష్కారణముగా ఊడిపడునా? తుదమొదలు లేని లేమిడిలో మునిగి యున్ననాడు చెలికాడు తనదగ్గర దాచిన పదివీసెల బంగారము కాచి కాచి ఇందులో కొంత నీవు పుచ్చుకొనుము బాబు" అని ఆ మిత్రుడెంత ప్రార్థించినను "నీ సొమ్ము నాకేల" యని తిరస్కరించిన నారయ్య కొడుకు గాడా మనకవి ? కావుననే "మాకున్ మాసంతతికిని ధర్మవ్యాసక్తియ సిరులకంటె నగ్రియ మగుతన్" అని చెప్పగలిగినాడు.

మనకవిగారు చక్కగ కవిత్వము చెప్పగలరని తెనుగువారందఱు ఎఱుంగుదురు. కాని ఆయన అవధాని యని, ఆశుకవి యని ఎంతమందికి తెలియును?

తెలియునట్లు ఈ రంగములో ఆయన విజృంభించ లేదు. కాని ఇరువది ముప్పది అవధానములుచేసి జయప్రదముగ నిర్వహించినారు. అవధానములలో

ఆశుకవిత్వముగూడ అనివార్యము గదా! అయినచో అప్పటి మన కవిగారి ఆశు వెట్లున్నదో చూతురా?

"ఈగోడ యిసుక సున్నము
యోగించిన వస్తువంచు యోజింపకు డీ
ప్రేగులు మూల్గెడి యనదల
మైగల రుధిరాస్థు లిట్లు మనకుం దోచున్"

అత్యద్భుతధారణాశక్తిగల వీరి కవధానము లేమి లెక్క ? ఆ ధారణచే వీరు తన పద్యములు గాని, ప్రాచీనకవుల పద్యములుగాని, వేలకు వేలు ఈ నాడప్పగించగలరు.

ప్రత్యేకముగ అయిదారు సభలలో మన కవిగారు ఆశుకవిత్వము నడిపిరి. 1947 లో శ్రీ భావనారాయణ స్వామివారి కళ్యాణోత్సవ సమయమున పొన్నూరులో జరిగిన సభలో గంటకు 120 పద్యముల చొప్పున రెండుగంటలపాటు కవితావర్షము కురిపించిరి. ఆ కవిత్వము వారి కావ్య కవిత్వమునకు ఏమాత్రము తీసిపోని బింకముతో పవిత్రతతో సాగినదనుటకు ఆనాటి సదస్యులగు పండితకవులే సాక్షి.

ప్రజాభ్యుదయమునకు ఉపయోగించు కవిత్వము వ్రాయువారికి లోక మెప్పుడును జోహారు లిచ్చుచుండును. కావుననే ఈ అభినవ తిక్కనగారికి 1989 లో నెల్లూరు వర్ధమాన సమాజము వారు శ్రీ రామలింగారెడ్డిగారి యాజమాన్యమున సమావిష్టమైన పేరోలగములో శ్రీ తిక్కవరపు రామిరెడ్డిగారు తిక్కన పేరుతో ఒసంగు బహుమానమును సమర్పించి సత్కరించిరి, 1942లో గుంటూరు జిల్లా అప్పికట్ల పరగణావారు శ్రీ జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరిగారు అధ్యక్షత వహించిన మహాసభలో వీరి కవితా సేవను కొనియాడి గౌరవించిరి. ఈ సందర్భమున వారు వెలువరించిన "అభినవతిక్కన సన్మానసంచిక " కవిగారి సౌజన్యమును కవితాప్రశస్తిని వేనోళ్ల చాటుచున్నది. మరియు 1944 లో ముక్త్యాల ప్రభువులు వీరిని ఆహ్వానించి శ్రీ వెంపటి పురుషోత్తం యం.ఎ. గారి పెద్దరికముతో

నేర్పడిన సభలో ఉదాత్తరీతిని సన్మానించిరి. ఆ వెంటనే నవ్య సాహిత్య పరిషదాహ్వాన సంఘము వారు శ్రీ కాటూరి వెంకటేశ్వరరావుగారి ఆధ్వర్యమున తెనాలిలో జరిగిన మహాసభలో అసంఖ్యాక విద్వత్ కవి బృందము మోల మన కవిగారి సాహితీ శక్తిని కొనియాడి గౌరవించిరి. అనంతరము 1948 లో కృష్ణామండలమందలి 'ముదునూరు' పౌరులు వీరిని ఆహ్వానించి సంభావించిరి.

ఇట్టి మెచ్చు పిలుపులు ఎన్నో వచ్చుచున్నను కవిగారి ఆరోగ్యము దుర్బలమైనదగుటచే వాని నన్నింటిని పాటింప లేకపోవుచున్నారు.

అది బలిష్ఠమే యైనచో వీరు ఇంక నెన్ని కావ్యములు సృష్టించి యుండెడివారో? అయినను కవిగారెట్లో ఓపిక చేసికొని ఆత్మకథను పూర్తిచేయుచున్నారు. రెండుమూడు వేల పద్యములతో అందలి భాగములు కొన్ని అముద్రితములై యున్నవి. ''ఇతడు నా యమూల్యసంపద, ఇతడు 'నా గౌరవపతాక'' అని తెల్గుజాతి, తెల్గు బాస సగర్వముగా చెప్పుకోదగిన యీ జాతీయకవిని , ఈ సాధుశీలుని విశాలాంధ్రము లోని ప్రజలందఱు నేడు కనకాభిషేకము గండపెండెరము, గజారోహణోత్సవము మున్నగు ఉదాత్తసత్కారములతో నర్చించి తమకర్తవ్యమును జేగీయ మానముగా నిర్వహించి ధన్యులగుచున్నారు. ఈ సన్మానసభకు ఆంధ్ర విశ్వకళా పరిషద్ ఉపాధ్యక్షులు, విమర్శక చక్రవర్తులు కవితావిశారదులు నగు డాక్టరు కట్టమంచి రామలింగారెడ్డి గారు అధ్యకక్షులుగా నుండుట, అందు కవిగారికి ''సువర్ణాంజలి'', ''మాతృహృదయము'' అను కావ్యములు వారి శిష్యులు సమర్పణ చేయుట కడుంగడు ప్రశంసనీయము.

జయంతి తే సుకృతినో
రససిద్ధాః కవీశ్వరాః''

అభినవతిక్కన కృతులు

శ్రీ కొండూరు వీరరాఘవాచార్యులు

"మఱు ప్రోయున్నద తెల్గు వీణియల యుష్మద్రాష్ట్రగానమీ కొరడాదెబ్బకు దద్దఱిల్లిపడి తెల్గుల్ మేలుకొన్నారహో ! పురుషోత్తంసుకథన్ రచించితిరి మా పుణ్యాలకుం బంటగా మఱవం జాలరు మీరు దేశమును ధర్మంబుగవిగ్రామణీ!"

తెలుగునాట నా యెఱింగిన మేటికవులలో శ్రీ సీతారామమూర్తి చౌదరిగా రొకరు. నా చిన్న "నాఁటనుండియు వీరికబ్బము లయ్యయ్యవి చూచుచునే యుంటిని. "మహేంద్రజన నాదులగు నా కబ్బములు" సూనూగు మీసాల ప్రాయములోనివి. ఇవియన్నియు వీను మిగిలినవి కావు గాని వీనియన్నింటను చెప్పఁదగ్గ గుణ మొక్కటి మాత్రమే. అది యీయన యొక మహాకవి కాగలడని సూచించునది. చౌదరి గారు "ఆత్మార్పణము"నో "ఆత్మకథ"నో వ్రాసినప్పుడు కాఁబోలును మా యిరువురికి నెయ్యము పొసగినది. అదిసుత నొకరికృతులతో నొకరికి పరిచితి పెరిగినది. ఆబాల్యారబ్దమగు చౌదరి గారి కవిత "ఇంతింతై వటు డింతయై" యనునట్లు నానాట బెంపు సెంది ఆయా కావ్యములలో క్రొంగొత్తపోకడల నలవఱచు కొని, తొలికవుల మేలిబాటల నాకళించుకొని యాయనకొక మహాకవి స్థానమును సంతరించినది. చౌదరిగారు ధన్యుడైనాడు. ఆ మహాకవిని గన్న యాంధ్ర దేశము, మాతృభాష ధన్యములైనవి.

కవి తనకున్న ఉత్తమాధమసంస్కారములను బట్టి కావ్యరచన మొనర్చుచుండును. ఆతని సంస్కారములకును, అభిరుచులకును బ్రకృతియు, బరిసరములును దోహదము గైసేయవచ్చును. అట్టియెడఁగవి తన సంస్కారములను బట్టియే కవితావస్తువు నెన్ను కొని దానిని కవితాశిల్పచిత్రిత

మొనర్చి లోకమున కందించును. ఒక తరగతి సంస్కారములుగల కవి వానిని భిన్నములయిన తీరున తన కైత వెలయింప జాలడు.

మనచౌదరి గారు ఉదాత్తమగు వీరరసమునకు బుట్టినిల్లయిన మేలివంగడములో బుట్టువు గన్నారు. దానికిఁగోడు ధర్మజ్యోతియై వన్నె కెక్కిన పితృపాదుల పాలనమున నాయనకు గల సహజోదారసంస్కారములు క్రొత్త చెలువమును గైసేసికొన్నవి. మేలిశీలము, ఉత్తమగుణములు, ఉదాత్త ప్రవర్తనము, సౌమ్యభావములు, సత్యధర్మనిష్ఠ, మను మార్గానుగమనము ఆయనకు బెట్టని నగలై చెలువమును దిద్దినవి. కావుననే వీరి పాత్రములును నట్టివయై జగద్వంద్యములగు గుణముల కిక్కలై ఆంధ్రజగతి నుఱ్ఱూత లూగించిన వందును. ఈయనకృతుల జదువునపుడీ యంశమును మనము మఱువరాదు.

బహుశః అవి చౌదరి గారికి కళత్రవియోగము సంభవించినదినములై యుండును. ఆంత నే యాయన "ఆత్మార్పణము"ను వ్రాసి ప్రియురాలి కప్పన చేసినాఁడు. ఇది వారి పేరెన్నికగన్న కృతులలో మొదటిది. ఆత్మార్పణము"లో వర్ణితమైనకథ భారతము శాంతిపర్వములోని లుబ్ద "కపోతోపాఖ్యానము". ఆ పిట్టకథకు వలయు మార్పులు, చేర్పులు నొనరించి కవిగారు విస్తరించి వ్రాసిరి. కళత్రము తోడి సంయోగ వియోగములను జవిసూచిన మనకవిగారు కపోతీ కపోతముల దుఃఖవృత్తాంతములను వర్ణించుటలో నాత్మచరితమును, ఆత్మానుభవమును వ్యక్తీకరింపక తప్ప లేదు. కపోతము కపోతి కొఱకు విలపించు పట్టున,

"కలిమిలేముల లోన భాగంబు గొనుచు
మంచి చెడ్డలలోన, బాల్పంచు కొనుచు
మెలగు నర్ధాంగి దూరమై తొలగెనేని
మగని కాధారమెవ్వరో మగువ ! చెపుమ"

అనుచున్నది. ఈ మాట దాంపత్య సారమును జుఱ్ఱని కవి యనిపింపజాలడు. ఇంకను ఆల్కగల యని నా భావమును సూచించుచు

"రమ్యకుసుమంబ నీవు సౌరభమ నేను
నిండు నెల వీవు పండు వెన్నెలను నేను
పదమ నీవు తదద్ద సంపదను నేను,

అని కపోతి యనుచున్నది. చౌదరి గారు పలువు రాంధ్ర కవులమార్గములను, కాళిదాసాది సంస్కృత కవుల తెరువులను పుణికి పుచ్చుకొన్నారు. కావున ఆయా కవులరీతుల ననుసరించియు దన కావ్యమును మహనీయము చేసికొన్నారు.

నెలతో వెన్నెల దొలగున్
జలదముతో నరుగు మెఱుపు చానలు తమ భ
ర్తల ననుగమించువారని
తెలిపెడిని విచేతనములు తెల్లముగాఁగన్

ఇది కాళిదాసుని "శశినా సహ యాతి కౌముదీ" అను శ్లోకము ననుగమించినది. బోయ కాహుతియైన నాథు నుద్దేశించి కపోతి సహగమనము చేయ నెంచి

నీ యొదలిలోన సగపాలు నిలిపిబోయ
కప్పనమ్మొనరింతె శేషాంగ మిట్లు
దీనఁగల్గునె పూర్ణాతిథేయ సుకృత
మతిథి కర్థాన్న మిడుట నాయంబె నాథ!

అని లోకోత్తరమగు 'హైందవసతీత్వవిశేషమును స్ఫుటీకరించుచున్నది. కర్షకుని లోకహిత పరాకాష్ఠను, దెల్పుటకు గవి బోయ కూడు వేడుట సదనుగా జేసికొని

తా దిన దేహియటంచను

పేదకు వడ్డింప నతిథి బృందమునంద
త్యాదరము నూప నెల్లర
కాదరులై యుండగ నితడు హాలికుడొక్కో,
ఎండకు వానకు జంకక
పండించిన ధాన్య మెల్ల బాతఱ లందున్
నిండించి తినుచు బెట్టుచు
నుండెడి కర్షకుడె ధన్యుడూహింపంగన్''

అనుచున్నాడు. ఇవి కేవలము స్వకులాభిమానమున వెలువరించిన పలుకులు గావు. కర్షకుని లోని యతిథి సేవాభావమున కీడైన వర్ణనమిది.
కవిగారి యీ కృతి యలతియలతి జాను తెనుగు పలుకులతో గులుకుచు వలపు లీనుమిటారి కత్తెవలె నడయాడినది. సంస్కృతభాషాటోపము నంతగా జూపక నిర్దుష్టమై సరళ గంభీరమైన శైలిలో నీ కావ్యము ముద్దుముచ్చటలు సూపుచు, వెలలేని నీతిరత్న ములను జదువరులకు బసదన మిచ్చుచున్నది. ఇందు కవికిగల శీలసంస్కారములు, ధర్మపరత ప్రతి పదమునందును గుబాళించెడిని.

శైలినిబట్టియు, గ్రమమునుబట్టియు దరువాత చెప్పదగినది 'ఆత్మకథ' ఇది లోకోత్తరుడగు గాంధి మహాత్ముని చరితము. కవికి వర్ణనీయములైన కథానికము లెన్నియో యుండగా దీనినే వస్తువుగా నెన్నుకొనుటలో గవికి గల ఉత్తమసంస్కారములే కారణమందును. సర్వరసములకు విహార స్థానములైన యితి వృత్తములున్నను కవి మనస్సున కవి నచ్చవాయెను. ఇందుకు గారణము 'విశ్వశ్రేయః కావ్యమే. ''ఆ యా యంశములనే కవి యిట్లు సూచించుచున్నాఁడు.

ఏ సూరినో పేరినో సుబ్బినో నిల్పి
పచ్చిసింగారంబు పల్కుకంటే
హేతువాదంబున కింతనిల్వగ లేక

బూతుల బుంగలై జాతివైర
ములకు మత ద్వేషముల కుపాధ్యాయులై
యౌ   దార్యమునకు దవ్వగుచు నీతి
రతుల కెంతయు రోత రాజేయునట్టి పు
రాణమ్ముల బూని వ్రాయుకంటె
కాసులకు దాసుడగుచు మ్రుక్కడిని బొగడి
కల్లకై తల నల్లుటకంటె నిట్టి
గుణగరిష్ఠుల దేశభక్తుల చరిత్ర
చెప్పుట జగద్ధితంబైన సేత గాదె?"

జగద్ధితమగు కార్యమును దలపెట్టిన కవికి గాంధీ చరితము వర్ణనీయమగుటలో వింతలేదు. మహనీయ గుణగరిష్ఠుల చరిత్రము లెందఱెంద ఱెన్ని భంగుల వర్ణించినను లోటులేదు. రామునివంటి లోకోత్తర నాయకుని చరిత్రమును సంస్కృతములో నెందరు కవులో వర్ణించి ధన్యులైనారు. మురారికవి "అనర్ఘ రాఘవ'మును వ్రాయుచు రామచరితమును పూర్వులు వ్రాసిరని విడిచిన "కవివాక్కులు ధన్యములగుట కిట్టి నాయకు డింకొకడు లేడుగదా !" యని సమాధానము చెప్పుకొన్నాడు. అట్లే జగద్ధితకీర్తియగు భారతజనకుని బ్రతుకు మనకింకి నెన్నదగినదైనది.

చౌదరిగారి భాష అచ్చమగు జాను తెలుగు. తిక్కనాదుల తెలుగు సొగసునకు మురిపెము గన్న కవి ఆ మార్గమునే పట్టి తన కైతను వెలయించి కబ్బముల సేతకు బూనుకొనుట లెస్స వేలుపుం బాస కైవసము తనకు వలసినంతయున్నను విచ్చలవిడిగా దానిని వాడుట కీయన యియ్యకొనడు. ఆయా అందమునే

"పండిత శ్రేణి వేలుపుం బాస మీది

తగులమున జేసి తెలుగును దెగడు నాడు
మాతృభాషను మన్నించి మనిపి నట్టి
వారి కర్పింతు మన్నమోవాకశతము''

అని సూచించినాఁడు. సాజమగు జాను తెనుగు పలుకుల కులుకు తిక్కన్నలోను, కొన్ని యెడల పోతన్న యందును, నన్నెచోడ మహాకవిలోను, కొందరు శివకవుల కబ్బములలోను మనము చూడగలము. ఆ యీ రహస్యమును తెలుగు కవిరాజు (శ్రీత్రిపురనేని రామస్వామి చౌదరి) కనిపించి తన కావ్యములను కమ్మని తెలుగు తీరు తీయములకు మేల్మి గీము లొనర్చుకొని, గీర్వాణభాషాటోపము తెలుగు కైతకున్న సౌజమగు సొగసును బోకార్చునని చాటియున్నాడు. తెలుగునాట నీబాట కిటీవల నీతడాచార్యుడనవచ్చును. ఈ రహస్యమును గ్రహించి వారి యనుచరులగు కొందఱీ నాడద్దానిని వృద్ధి పరచుచున్నారు. పదాఱణాల తెలుగువాడైన మన కవియు తెలుగు పొంకము, బింకము, జిగిబిగువులు సడలనీయక తేటగా కైతను దిద్ది తెలుగు దేవికి గూర్చు వాడై మెరసెను. ఈయన వచనములు తిక్కన వచనములం బోలియు, నీయన దేశీచ్ఛందములు తిక్కన దేశి పద్దెముల కుద్దియయ్యు నీయన నభినవతిక్కన నొనర్చి తెలుగుతల్లి ముద్దుమురిపెములు తీర్చినవి. శ్రీ కట్టమంచి రామలింగారెడ్డి గారి వంటి విమర్శక మూర్ధన్యులు "కవిగారూ ! మీకావ్యము ఆంధ్రభారతమునకు ప్రతిబింబము"' అని ఒక్క మాటలో కోటిమాటల వలను వెల్లడించినారన్న వీరి యతిశయమున కింకేమి గీటురాయి కావలెను? కవియు ''తెలుఁగు కవిత్వము వలుకుట తనకు తియ్య''మని మా తిక్కన యజ్వలు తొక్కిన త్రోవ కేను సమ్మతిపడెదన్ అని తిక్కన వెలుఁగు బాటలలో పయనించి కైత వెలయించినాఁడు. పోతన్నను బోలిన యీ సాత్వికాహంకార మెంత యింపు నింపుచున్నదో చూడుఁడు.

పుట్టెకొక్కబుద్ది పుట్టు జిహ్వకు నొక్క

రుచి జనించు నంట రూఢియైన

సరసు లెల్ల మెచ్చ వెలయింతు గైతలో

గమ్మదనము మత్కులమ్మునవలె"

కులములోవలె కమ్మదనమును కైతలోగూడ వెలయించుట యాయనకే చెల్లె! ఇట్టి ప్రతిన పూనియు నిర్దుష్టమగు కవిత్వము సెప్పజాలియు దనలోని వినయమునకు సూచకముగను ఎంతవారికైనను ప్రమాదము తప్పదనియును,

తప్పులేని కైత సెప్పెదనని గుండె

పైని జేయి వైచి పలుకజాలు

కవి యెవండు ? బుధులు కారుణ్యమూర్తులై

యుంట నాటసాగు చుండుగాని

అని పలికినాడు. ఇది యాయన సౌజన్యమునకు నిదర్శనము. గాంధీ జీవితములో నాయాయిరసములకు విహారయోగ్యత లేకున్నను వెలలేని నీతుల కది యిక్కయై వన్నెకెక్కును. ఉపదేశార్థము కావ్యమును బఠింప వలెనన్న నట్టి కావ్యములే మాననీయములు కాగలవు. బాలురనుండి వృద్ధుల వఱకును గావలసిన జీవితానుభవములు పురుషోత్తముడగు నీ మహనీయుని చరిత్రమునం దిమిడి యున్నవనుట పొల్లువోనిమాట.

గాంధీ దేవునికి జీవనసూత్రమగు నహింసకు, నీతికి నిక్కయైన యీ పద్యముంగనుడు.

సలిలంబు నీకు నీ గలిగినవానికి

నిష్ట మృష్టాన్నంబు నీగదయ్య

కేల్మోడ్పు నిడువానికిం భక్తిసంయుక్తి

జాగిల్లి జోహారు సలుపవయ్య

తృణకణం చేసి నీకిచ్చు పుణ్యాత్మున

కపరంజినాణె మీయంగదయ్య
కడగండ్ల నీకు దోడ్పడెడి వానికి నీశ
రీరమేగోసి యర్పింపవయ్య
ఇచ్చుచోనొండు దసగుణంబిచ్చు టొప్పు
గీడుగూర్చిన మేలుగల్గించు టురవు
చిత్తవాక్కర్మశుద్ధియై జేయు వీని
నెవ్వ డాతండ గెల్చుఁబో యిజ్జగంబు.
అనెడు గుజరాతి నీతిపద్యం బొకండు
నా మనంబున దద్దయు నాటుకొనియె
నందు ' గీడొనర్చిన మేలు నాచరింపు'
మన్న సూక్తి జీవనసూత్రమయ్యె నాకు.

ఇట్టి జీవనసూత్రములు కాదగ్గ సుద్దులిందు లెక్కకు మిక్కిలి.

"బొంకాడి యెఱుగనన్నెడు"
ప్రక్కనున్న వాని పలకను దిలకించి
నకలు వ్రాయు టెఱుఁగ నొకదినంబు"
"ఏక స్త్రీవ్రతచర్య ధర్మములలో నెచ్చంచు వ్రాయంబడెన్."
"అది ముద్రవోలె నామది నదికె"

ఈ తీరు చక్కట్లతో నిండిన యీ కబ్బము మహనీయనాయక గుణశోభితమై, సత్యాహింసాది దైవ గుణములను మప్పుచు వేదకాలమునాటి ముత్తైదువవలె జనవంద్యమై నెగడినది. ఆత్మార్పణములోని కవితకన్న నిందలి కవితలో, కవి నేర్పు శతాధికముగా పెరిగి ప్రాక్కవుల పోకడలతో నింపు సొంపుల నింపుచున్నది. ఈ కవిగారి ఆత్మకథ రెండు, మూడు భాగములు గూడ దరిదాపు

రెండు వేల పద్యములు వ్రాయబడి ముద్రిత స్థితిలో నున్నది. అనతికాలమున నదిగూడ తెలుగువారి చేతుల గైసేయగలదని యాశింతము.

ఇక తెలుఁగునాట వీను మిగిలిన వీరి మూడవ కృతి "రాష్ట్ర గానము' ముప్పదియేండ్లకు బైగా రాష్ట్రలబ్దికాందోళనము సేయుచుండియు గృతార్థులుగాని తెలుగువారిని బ్రబోధించుట కీకృతి బయలుదేరినది. ఇందు కవి సీసములను వృత్తములను నాశ్రయించి ఆంధ్రాభిమాన మిబ్బడి ముబ్బడి కాగా వే రీతుల భూతవర్తమాన కాలముల యాంధ్ర ప్రతిభను చాటును. కవికి గల పాండిత్య ప్రతిభలకీ గ్రంథము చక్కని యొఱపిడిరాయి యందును. గీర్వాణాంధ్రముల రెంటను గవి తన లేఖినిని విశృంఖలముగా వీర విహారము చేయించినాడు. సజీవములగు జాతీయములను సామెతలను వాడి ఆయాఘట్టముల బాఠకులను దన్మయుల నొనర్చి "ఆంద్రోహమ్మని పించుటలో నీ కబ్బమున కిదియే సాటి. ఆంధ్రత్వమును నిండుదనముతో చాటుట కీకబ్బమే తెలుగులకు మొదటిదనుట తెగువ కాదు. తెలుగుదల్లికి జోహారు పెట్టుచు

"నినుజూచి నినుబాడి నినుగొల్చువేళ నా
కనులాణి ముత్యాలగనులు గానగు నహో !
తెలుగుతల్లీ ! నీకు జోహారూ !"

అని తన్మయుడై తన యకృత్రిమాంధ్రాభిమానమును చాటుచున్నాడు. "తల్లి సంకెలలో దల్లడిల్లుచుండ నాకమైనను నరకంబుగాకయున్నె" అని వా పోయి "ఊచవోయిన సంతాన మేచునట్లు దీవనల్గురి యింపవే తెలుగుతల్లి!" అని వేడు నీయన తెనుగు భక్తియెంతిదో! తనకట్టు, తనజుట్టు, తనబొట్టు, తనదనుకొన్న దంతయు చౌదరి గారికి సమ్మతము. పెఱల యడుగులకు మడుగులొత్తుట, వారివేషభాషలకు గులాములగుట వీరికి రోత. కావుననే "ఆయ్యరు గూడకట్టు మనకక్కఱయే గుజరాతిటోపితో నెయ్యము లేనిచో బ్రతుక నేర మరబ్బుల లుంగి

పొత్తు లేద య్యెనయేని చక్కదనమన్నది సున్న. తెలుంగువానికీ దయ్యపువేస మేల? మనతాతల తండ్రుల కట్టు గిట్టదే!"

"అంధ్రుడ వైజన్మించితి
వాంధ్రుడవై యనుభవింపు మీ యుర్వీభవం
బాంధ్రుడవై మరణింపుము
ఆంధ్రత్వములేని బ్రతుకు నాసింపకుమా ! అనుచున్నాడు.

తెలుగువారు, ఏ శ్రోత్రియులో దక్క పెరలు మూతిమీదిమీసాలు గొరిగించు కొనుట యీయనకు చెప్పరాని తలనొప్పి. ముఖమునకు మీసాలే యందమని భావించు నీకవి

"మీసములేని మూతికవి మిత్రమనోహర కావ్య వాఙ్మయాభ్యాసము లేని పల్కు నవపల్లవ కోమల కన్యకా పదన్యాసము లేని కొంప లలనామధురాధర సంపుటీ సుధా గ్రాసములేని జీవితము గాదె గుణగ్రహణైక దృష్టికిన్ అని తనయభిమానమును జాటుచున్నాడు.

లేజవరాలి మోవికి, జిలేబికి, బాలరసాల మార్దవ శ్రీజనయిత్రికిన్, రుచులు చిందెడు తేనెయట యాంధ్రవాణి, ఆంధ్రవాణిమాట యటుండనిండు, రాష్ట్ర గానములోని యీకవివాణి మాత్ర మిట్టిదే. ఈయన ప్రాతవడినట్టి యాంధ్ర భూపతుల కథలు చదువుదొకసారి "కండలు కదలియాడ" అని, తెల్గులను మేల్కొలుపుచున్నాడు. కొమ్మదిరిగినవారలే కొలువు సేయ దిక్కు లొత్తిన మొనగాడు. తెలుగు వాడట. ఉత్తమోత్తమ ధర్మ మెందున్న దాని కొలువు మరగెడి వాడట తెలుగువాడు. ఆంధ్ర సంపత్తి నెంతగా కవిగ్రహించెనోచూడుడు. ఆంధ్ర శిల్పినిగూర్చి,

లాలిత్యలక్ష్మీవిలాస రంగమ్ముని
ల్పితి వజంతా చిత్ర లేఖనమ్ము

సవరించితివి శైవభువనంబు నెల్లొరా
కొండను మైనంపుటుండజేసి
వితలప్రభుని కోవెల కంబములమీఁదఁ
బలికింపగంటి సప్త స్వరాలు
ఒలికించి తౌర తిర్మలనాధు నగరిలో
వెలలేని సభ్యతా విలసనములు
భగవదన్వేషణార్ధమై పాటువడిన
యుత్తమతపస్వివై కళాయోగివైన
నీకు ఋణపడె రసలుబ్ధలోక మెల్ల
నాంధ్ర శిల్పీ ! చిరంజీవివయ్య!నీవు.

ఇందలి సీసములన్నియు సరళమైన నడక గలిగి పఠితకు రసభావముల సముద్దీప్తిని గలిగించుచున్నవి. తెలుగుబాస మీది తగులము ముమ్మరమయ్యు నవసరమైన పట్టుల సంస్కృత సమాస భూయస్త్వము నీయన విస్మరింపలేదు.

"దీపిత విక్రమాఢ్యము నదీనద శైలసముద కానన ద్వీప విశిష్ట విశ్వజగతీవలయ ప్రభుతా సమంచిత శ్రీపదనిష్ట మైకదుబసిద్ధివహించిన తెల్గుజాతికిన్ దాపరమైన యీ క సటుదైన్యము బాపగ లేరె సోదరుల్." -

పై సమాసము నన్నయ్య సమాసము వంటిది. నన్నయ్య పోలికలను మఱి చిన్నయ్య పోలికలను గూడ నీకవి కైవసము చేసికొన్నాడు. వేయేల ? చౌదరిగారికి రాష్ట్ర గానమను నీయొక్క కృతియే కవియశమును సంపాదింప జాలినదై నెగడెనన్న నిక్కమునకు తలవంపులు లేవు. ఈవి యాంధ్రాభిమానమును నుగ్గడించు నొక పద్యముతో నవ్వలికరుగుదము.

"ఎట్టి కఠోరదీక్షలు సహించితినో తొలుబొము నందు నీకెట్టి కదళంబు లెట్టి విరులిచ్చి సపర్య లొనర్చినాడనో పుట్టితి నీసుతుండనయి పోడిమి గంటిని తల్లి ! వీనికి ! బెట్టుము భిక్ష నీయనుగు బిడ్డడుగా నెపుడు జనింపగన్.

ఈ కృతినిబట్టి కవిజీవితవిశేషము లెన్నియేని వ్రాయవలిసి యున్నవి గాని వ్యాసవిస్తరభీతి యడ్డగించుచున్నది.

వీరి నాల్గవకృతి "ధర్మజ్యోతి" చౌదరి గారి తండ్రి నారయ్య గారు. చందవోలులోని యొక కోమటి ఆపత్సమయమున నారయ్యగారికి మూడు బంగరు ఇటికలను దాచబెట్టనిచ్చెను. సత్యధర్మపరాయణుడగు నారయ్యగారు కొంతకాలమునకు సెట్టికి మఱల 'నా బంగరు నంతటిని సమర్పించి బరువుతీరినదని సంభావించును. ఇది యిందలి యితివృత్తము. కలియుగములో నిది సంభావ్యమని మనము తలంపము. కాని నారయ్య గారివంటి సాధుసత్తముని విషయమున నిది చెల్లుబాటైనది. ఆయన లోకోత్తరాదర్శమును చాటినాడు, అట్టి నారయ్య గారి కడుపున బుట్టిన చౌదరి గారును ఆయనకుద్దియై పితృమార్గ గామియై ప్రకాశించినాడు. కావుననే కృతులు సమర్పించుటే గాని కృతిపతులవద్ద ధనముగొంట యీయన యెఱుగడు. ఈ కవికి గావలసినది కృత మెఱుక యొక్కటి మాత్రము.

"కృత మెఱుకచాలు నస్మ
న్మతికిం పదకబ్బ మిచ్చిమణిగొంట; జగ
ద్ధితశీలుం డొదవ నయా
చితముగ నేనిదుదు నాస్పజించిన కవితన్"

ఇది యెంతయు గొనియాడదగినసుగుణము. వాటి యాదర్శము గూడను. నరాంకితమును గూర్చి వీరి యభిమత మిట్టిది.

"నరునకు గబ్బమిచ్చుట యనాదృత కృత్యమటంచు సత్కవీశ్వరులు పురాతనుల్ నుడువు చంద మదేమొ రుచింప దెంతయు సిరులకు నాసచెంది యొక చెన్నటి కిచ్చుట మచ్చ గాని స్వార్థరహితబుద్ధి నిద్ధగుణరాశి కొసంగినన్ దోసమున్నదే !"

ఇదికూడ బుధజనోపాదేయ మందును. ధర్మజ్యోతిలో నలతిగా ప్రబంధచ్ఛాయలు పొసంగినవి. చందవోలువర్ణన మందును నయ్యై ఘట్టములను కృత నిర్మితి ప్రాబంధికుల ధోరణి ననుగమించినది.

విజయవాడవద్ద కృష్ణ కానకట్ట గట్టి కాలువలు త్రవ్వునపుడు చందవోలు సమీపమున నొడ్డెర వాండ్రు కాలువ త్రవ్వుచుండగా నందు వారికి బంగరు టచ్చుల నిక్షేపము దొరకినది. వారు సంతోషము మెయి తలకొక యచ్చు దీసికొని చందవోలు బేహారుల కమ్మ జూప నా బేహారు లచ్చు విత్తడి వన్నారు. పాప మొడ్డివాండ్రేమి చేయుదురు !

"పొరపాటుచే నొకప్పుడు వచ్చు గాక
నిరుపేదకొంపలో నిలుచునా లక్ష్మి?"

ఏల నిలుచును ? నిలువదు. కోమట్లు ఒడ్డెరలకు తలకు రెండు రూకలిచ్చి యచ్చుల నిముడ్చు కొన్నారు. ఈ సంగతి ప్రభుత్వమునకు దెలిసి పరీక్షకు బూను కొన్నపు డొకవైశ్యుడు మన నారయ్య గారివద్ద మూడచ్చులు దాచి పెట్టినాడు. నారయ్య ఆ లిబ్బిని మఱల వైశ్యున కిచ్చుచు నాతని కెన్నియో నీతులు గూడ మప్పినాడు.

"ఇచ్చునెడ మెచ్చు వేళల
నచ్చముగా గుణము చూతు రంచితచరితుల్
త్రచ్చెదరు కులమతంబులు
తెచ్చెదరున్ ఖలులు గ్రామదేశాంతరముల్."

ఇది పేదలసొమ్ము సుమీ ! యెదనుబ్బకు మస్మ దీయమే' యని కోమటికి గఱపి బీదస్థితిని గూర్చి నారయ్య గారు

ఆకటికి మ్రగ్గి చలి దెబ్బ కలమటించి
మొండిరోగాల కవమానములకు లోగి
నాగరకలోకమున కొక్క నవ్వు విసరి
పిలుచుచున్నాడు యము నహో పేదవాడు. అన్నారు.
''ఇది ముమ్మాటికిని సత్యము కాదా ?
''బానిసీడు గుడుచు పరమాన్నమున కంటే
నుచిత మిచ్చుకొలది నొదవు గంజి''
''కోవెలలో గంగానది
రేవులలో రామకోటిరేఖలలో లే
డే వాని బుద్ధికరుణకు
నావాలం బతని యంద హరి వసియించున్.

ఇవియెట్టి కఱడలో చూడుడు. సెట్టిగారి ముదుసలి పెండ్లమును వర్ణించు దిగువ పద్యములు శ్రీనాథుని యన్నపూర్ణావర్ణనమును జ్ఞప్తి కెలయించుచున్నవి.

చిఱుబంతి పసుపాడి సీమంతవీథి
గుఱిచేసి పెద్ద కుంకుమ బొట్టు నలది
ముత్యాలతాటంకముల నొప్పుదాల్చి
ప్రభలు చిమ్మెడు నడ్డబాస ధరించి
పాటపాడగ వెల్లబాఱిన కురుల
విరులతో జతగూర్చి వేనలిదీర్చి
చెంద్రికపూవన్నె చీరనుగట్టి
కరువునం బోసిన గఱువ తనంబొ

కరుడు గట్టినయట్టి కారుణ్యరసమొ
మేను దాల్చిన జగా మేలి శీలంబొ
తొలుమిన్కు నాటియైదువయో యనంగ
నెదుటనిల్పిన సెట్టి యిల్లాలు"

ముమ్మూర్తులా వేదకాలపునాటి ముత్తైదువనే తలపించుచున్నది. ఈ చిఱుకబ్బములోనే కవిచూపిన మేలితీరులు లెక్కకు మిక్కిలి. తెలుగునాట నింటింట గుబాళించు తాలింపును గవి యెంత కమ్మగా వర్ణించినాడో తిలకింపుడు.

హైయంగవీన దివ్యామోదబంధువై
  జీరక వాసనాశ్రీ బెనంగి
మెంతి కమ్మదనంబు నెంతేనిఁ జేపట్టి
  యింగువ నెత్తావి పొంగు లొలసి
వేపవలపుతో గలసి కస్తుంబటీ
  లలిత పల్లవపరిమళము నెనసి
మాషఖండ ఘుమంఘుమనుగూడి సర్షప
  గంధమ్ముతోడి సాంగత్య మంది
వంటయిలు వీడి వాడల వెంటజాగి
పౌరనాసాభితర్పణ కారి యగుచు
జవులు పుట్టించు తాలింపు సౌరభమ్ము"

ను ఎవ్వరేని వదలి పెట్టగలరా ? ఈ తాలింపువలె నీ కృతియు గమ్మదనాలు చిమ్ముచున్న దని యొక్క మాటచెప్పి యవ్వలి కరుగుచున్నాను.

ధర్మజ్యోతి వెలిగించిన పిమ్మట కవి మహోర్మింబోని కన్నీటితో సమరజ్యోతిని దర్శింపవలసి వచ్చినది. అమరజ్యోతి మహాత్ముని నిర్యాణమును

గూర్చి వాసిన కరుణఖని. మహాత్ముని బ్రతుకును వ్రాసిన కవి ఆయన మృతినిగూర్చి వ్రాయవలసివచ్చినందుకు పెల్లు వాపోయినాడు.

''శతజన్మార్జిత మామకీన సుకృతస్థానమ్ముగా నీ జగా
బ్రతుకున్ జాటెడి కావ్యమున్ సుకవితాప్రౌఢమ్ము నిర్మించి నా
బ్రతుకున్ ద్రోయదలంచు
కొంటి మును; పాపం బెద్ది యోపండి నీ
మృతిపై నేడు కృతిన్ రచించితి మహోర్మింబోని కన్నీటితో.

గాంధీ మహాత్ముని దలంచుకొన్నంతనే కవి కనాలోచితముగనే కవితాశక్తి యావేశించి మధురమో హనములగు పద్యములను వ్రాయించును గాబోలును.

నానాట సుపరిణతమైన కవితాప్రజ్ఞతో కివి యీ చిఱుకబ్బమును సుమనోహర మొనర్చినాడు. ఒక్క తెలుగునకేకాదు. ఉభయభాషలకు నిందు సముచిత ప్రాధాన్యము బొడకట్టును. అనర్గళమగు ధారతో గాంగనిదరమువలె నీ 'కవిత సాగిపోయినది. గాంధి మహాత్మునిలోని అయ్యై మహా గుణములను ప్రస్తావించుచు పాఠకుల కానందముతోబాటుపదేశమునుగూడ నీఖండ కావ్యము సేయు చున్నది. లోకోత్తరచరితుడగు గాంధీ దేవుని రామాదులతోజేర్చి పలుకుట యీ కవికి గిట్టదట.

''నిను రామాదుల జేర్చి మెత్తు రది మన్నింపన్ రిపు గ్రీవముల్
రణరంగమ్మున గోసి రక్తఝరిలో రామాదు లోలాడి రా
పనికిన్ నీకును లేదు పొత్తు
రిపుతన్ బాధించి విద్వేషి పై
నెనరుం జిమ్మెద వీవు చిక్కదు ప్రభూ నీ యోగ మెవ్వానికిన్''

అని యితరావతారములకన్న గాంధిలోని విశిష్టతను జాటుచున్నాడు. గాంధి రామరాజ్యము నాశించినాడు. అది యెట్టి రామరాజ్యమో కవి గారు వివరించి చెప్పుచున్నాడు.

"శంబుకువంటి సాధువుల జంపక సంపద లేమి యన్న భే
దంబులులేక సర్వజనతా సమతా సహజన్మతల్ నభ
క్చుంబులు గాగ శాంతిపరి శోభితమై నుతిగాంచు రామరా
జ్యంబున కాసచేసి చరితార్థత నందకమున్న సాగితే ?"

బ్రాహ్మణజాతివాడగు గోడ్సే గాంధిని జంపుట నుద్దేశించి

"బోయఁడు విప్రుడై భువనపూజ్యుని రాముని కీర్తినిల్ప రా
మాయణసృష్టి చేసి నుతులందె నొకా నొకనాడు; విప్రుడే
బోయతనమ్ము నంది ఋషి పుంగవు నేడు వధించె రామాసే
వాయజనార్ధచిత్తుందనవంగ డసమాఱ నిలజ్జల గ్రుంగఁగన్."

"కుల వర్గముల గ్రుళ్ళి కుమిలిన నీ మతం
బుద్ధరింపఁగఁ జక్కదిద్దు కతన
మాల కై మందారమాల కైసేసి నీ
దేవాలయముతల్పు తెఱచు కతన
పొగలతో సెగలతో బొగులు హిందూ ముస్లి
ముల కౌగిలింతలు వలచు కతన
పేదసాదుల నెత్రు పీల్చి గజ్జున ద్రేచు
సాహుల నదలింప సాగు కతన
ప్రజ నెదిర్చిననాడు మీ బ్రతుకు లేదు
లేదనుచు గిం ప్రభుల మందలించు కతన

కాల్చి తటరా ! జగత్త్రయీకర్మయోగి
లోకమూర్ధాభిషిక్తు గోడ్సే కిరాత !"

ఇట్టి పురుషోత్తముని జంపినజాతియే మరల దేశముపై ప్రభుత నెఱపి తరతమభావములతో భారతమును నవయింప జేయునా యని కవి భయమందుచున్నాడు.

"ఒడ్డారించి నినున్ వధించి కుటిలవ్యూహమ్ము పండించి మా
జడ్డల్ పోయెనటంచు ప్రేంఖణములన్ సారించి కజ్జాయముల్
లడ్డుల్ పంచిన మూ భారతము నేలన్ నేల దయ్యాలకే!
యడ్డంబాకయు లేని రంగమగు గాదా భావి యెట్లున్నదో.

గాంధి మరణానంతరము ఆయనకు గుళ్లుగోపురములను గట్టిస్వార్థమును సంపాదించుకొన జూచిన వారిని కవి గర్హించినాడు. బుద్ధుని యెముకలకు స్తూపములను గట్టి ఆయన మతమును "విదేశముల పాలు చేసిన వీరిచెయ్దములు కవికి పరితాపకారణములైనవి. ఈ కావ్యము గూడ మధుర గంభీరభావములను ప్రదర్శించుచు సాగిపోయినది. చివరకు గాంధీనిగూర్చి కవి యాశయ మిది.

"మనుజుడవు గావు నీవు కోమటివి గావు
బడలిపోయిన భారతీయుడవు గావు
కాపు గాంధివి లోకలోకముల వెల్గు
జూపు నిరవధికామరజ్యోతి వోయి !!

ఇది త్రికాలసత్యము. గాంధీ యేనాటికేని మరణింపక తీరదు. కాని ఆయన ఆదర్శములు మాత్రము అమృతములై యుగయుగమ్ముల వరకును లోకములకు వెలుగుబాటల జూపును.

ఇక కవిగారు నాడునాడు రచించిన ఖండ కృతులు పెక్కులు. వాని నన్నింటి నొక్కచో జేర్చి "పఱిగ పంట"యని యొక కబ్బముగను, ఆ "పెద్దకాపు" అని వేరొకగ్రంథముగను నచ్చొత్తించి నారు. ఈ ఖండకృతులనాంధ్రు లాయా పత్రికల యందప్పు డప్పుడే చదివియుందురు. చౌదరి గారు మహా కావ్యము మొదలుకొని ఖండ కావ్యము దనుకను ఏది వ్రాసినను వర్ణనీయ వస్తువును గన్నులకు గట్టినట్లు చిత్రించే రసభావముల రామణీయకముచేత పఠితల మానసముల నున్మీలింప గలరు.

పెద్ద కాపులో శివు నొకకర్షకునిగా భావించి కవి వర్ణించియున్నాడు. ఆ శివ కర్షకు డీతడు

చదలేటి నీటిసంపద రిత్తవోనీక
సిగముడి నానకట్టగ నమర్చి
యల జాహ్నచీవీ ముఖ్యములు చిన్న పెదకాల్వ
లఖిల భారతభూమి నల్లుకొల్పి
ముక్కారుపంటల ముద్దు టెక్కెంబన
గేలముమ్మొనల ముల్కోలనూది
మెడమువ్వపాటలో నొడలబుల్కలు రేగ
బసవన్న నసివాఱు పనికిబనిచి
యిల్లు వెండియు బంగారు విల్లుగాగ
బండి కై వ్రాలినజగమ్ము పంటపొలము
కావలికి ఘోర సర్పకంకణము గట్టు
శివుని మా పెద్ద కాపు నర్చింప రండు !

ఇందు శివునిలో బెద్దకాపుదన మెంతగా నచ్చున గుద్దినట్లంద మొందెనో చూడుడు. ఇందు 'కర్షుడు' 'ఆవేదన', 'కృత మెఱుక' మున్నగు ఖండములు మనోజ్ఞములు. తెలుగువారు తెలుఁగు కవుల నభిమానించి పూజింపమికిని

పెఱకవుల యడుగులకు మడుగు లొత్తుటకును గవి మిక్కిలి యేవగించుకొని యిట్లనుచున్నాడు.

"బెంగాలీ కృతికర్త పాదముల కర్పించున్నమస్కారము
 పొంగుం బారసి లేఖినీ విలసనంబు ల్చాచి రా వయ్య ! నా
బంగారంబ యటంచు నాంగ్లకవి నాహ్వానించు నేపాపమో !
రంగా! మెచ్చఁడు తెల్గు బిడ్డ కవిసమ్రాట్టు స్వదేశీయునిన్"

ఈ గుణ మాంధ్ర ప్రజానీకములో వేరుపురుగువలె పాదూనినట్టిది.దీనికి దిలోదకము లిచ్చినఁ గాని తెలుగువారు తెలుగు మీరరు.

పఱిగ పంటలో సంక్రాంతి, హంపీ క్షేత్రము, కూట వేదాంతులు, అనుతాపము, పలనాడు మున్నగునవి మానసమును చూఱలాడునవి. సంక్రాంతిపండుగ దినములలో

రేగటిపాలలో గ్రాగిమాగిన తీయ
తీయకప్పురభోగి పాయసంబు
చవులూరు కఱివేప చివురాకుతో గమ
గమలాడు పైర వంకాయకూర
తరుణ కుస్తుంబరీ దళమైత్రిమై నాల్క
త్రుప్పు దుల్చెడు నక్క దోసబజ్జి
క్రొత్త బెల్లపు దోడికోడలై మఱిగిన
మపదురు గుమ్మడి పండు ముదురు పులును
జిడ్డు దేఱిన వెన్నెలగడ్డ పెరుగు
గరగరికజాఱు ముంగారు చెఱకురసము
సంతరించితి విందుభోజనము సేయ
రండు రండని పిలిచె సంక్రమణలక్ష్మి."

ఇందు సంక్రాంతికి సిద్ధమగు నాయా భోజ్య పదార్థములు మఱపు వడక యెట్లొక్కచో జేరి చవులూరించుచున్నవో చూడుడు.

చౌదరిగారు తెలుగుదనమును వర్ణించు పట్టుల దన్మయులై జాను తెనుగుపదముల తియ్యం దనము మూరిబోవునట్లు కైత లల్లి తెలుగులను ఋణపడం జేసినారు. బీదలను, రైతులను గాంచిన యీయన మనస్సు కరగిపోవును. అద్భుతచరితములు కలిగి రచ్చ కెక్కలేక సుక్కిపోయిన దీనులను గాంచి వీరి కెంతయో సానుభూతి గలదు. ఆ విషయమున నాంగ్లకవి 'గే' ననుసరించును. పఱిగ పంటను లక్ష్మయ్యగారి కంకితమిచ్చుచు నాయంశమును ముద్దు ముద్దుగా సూచించినారు. వేయేల? గాంధీచరిత్ర కారుఁడగు నీకవి పెక్కువిషయముల నాయన కనుచరుడై యా మహనీయుని మహనీయగుణములకు గుదురై చెలువొందినాడు. సభ్యులు మెచ్చందగిన శీలము, శీలమునకుద్దియైన మధురకవితగల యీ కవి ధన్యుడు.

తెలుగుబాసయందు వీరు వెలయింపవలసిన సారస్వత భాగము లింకను బెక్కులున్నవి. 'గద్యం కవీనాం నికషం వదంతి', అని యభిజ్ఞులు వచించి యున్నారు. కొన్ని గద్యకృతులు, నవలలు, కథలు, నాటకములు, మున్నగునవి యల్లి తెలుగుతల్లి కర్పింపవలసిన బాధ్యత కవిగారిపై నున్నదని వక్కాణించుచున్నాను. ఆంధ్ర సాహితీరంగమున నన్ని భూమికలను నిర్వహించి మెప్పు వడయ వలసిన బాధ్యత నేటికవిపై నున్నది. షష్టిపూర్తి నాటికా కొఱత దీర్ప గలరని తలంతును.

కనకాభిషేక గండపెండేరాది మహాసమ్మానములకు నోచిన యీకర్షక కవి 'శతమానంభవతి' యను వైదికాశీస్సునకు బాత్రుడై యమూల్యమగు సారస్వతసేవ యొనర్చుచు దెలుగునాట వెలయ దెలుగుతల్లి మేల్మి దీవనల గురియించుగాక,

''జయతే సుకృతినో రసస్తిః కవీశ్వరాః''

నవరత్నహారము

విద్వాన్, శతావధాని, శ్రీభమిడిపాటి అయ్యప్పశాస్త్రి

శ్రీ స్వాతంత్ర్యమలంకరించినది లక్ష్మీ యోగ్యమై మేల్కి మై
వస్వైశ్వర్యము పొంగియాడు భరత ప్రాశస్త్యమెల్లందు వ
జ్ర స్వామ్యంబయి యాధిపత్యము మహాప్రాజ్ఞత్యమున్ గాంచె బో
ధస్వాభావికమౌ వివేకమణి సీతారామమూర్తీ ! సఖా !
వైర్యంతంబును గాంచి భారతమహీభాగ్యంబునున్ బెంచి, వై
డూర్వంబౌ సిరి ముచ్చటించి, యలనాడున్ నేడుగావ్యాత్మ సూ
ర్య ర్యమ్ణంబయి నృత్యమున్ గొనెను, విద్యానాథులెందైననున్
ధైర్యస్ఫూర్తిని నుంటదెల్పితివి సీతారామమూర్తీ! విభూ!
గోస్తన్యంబటు ద్రాక్షరీతి రుచిమేల్ కోల్ కాంచి నీకైత మే
మే స్తవ్యంబునుగాంచినామను కవీంద్రేప్సల్ నుడుల్ కాగ స్వా
ధిస్తుత్యంబగు వ్యాప్తి పొందినది నీతిన్ గానుకల్ "శత్రుజిత్
కస్తత్రేతి" పదంబుపాపినవి సీతారామమూర్తీ ! గుణీ !
పుత్రుల్ పెక్కురు భారతాంబికకు నింపు సొంపు బాటించి భా
ష్యత్రైగుణ్యమువోలెఁ బాండితియు రాజ్యాకాంక్ష శౌర్యం బహో
రాత్రం బాత్మ గుణించి వాక్సరణిమై రంజిల్లినావెందు ముద్
గత్రాణంబయి నీకలంబల సీతారామమూర్తీ ! ఘనా !
మతముల్ పెక్కులు నీతిమాత్రమొకటే మాన్యంబు కై సేసి భా
రతమాహాత్మ్యము నుద్ధరించుటకు బ్రారంభించి సాఫల్యమే
కతమున్ బొందుట గాంచినావు కవితాజ్ఞానర్తివై మించి సం
తతమోదమ్మును నింపినావు భువి సీతారామమూర్తీ ! బుధా !

మాన్య క్షేత్రము తుమ్మలాన్వయ మసామాన్య ప్రభావంబు ప్రా
ణిన్యాయాకృతి చౌదరి ప్రతిభవాణిన్ గమ్రరాజ్యాధి వా
క్వన్యాసాంబుధి భారతాభినవ తిక్కన్న ప్రచారంబు దీ
ప్తన్యస్తంబు గురూపదేశకత సీతారామమూర్తీ ! మణీ!
నీ త్యాగంబు మనః ప్రసన్నత పితృస్నిగ్ధుదు నారయ్య మే
లతం బలరించు మాతృమణి చెంచమ్మాంబ ధర్మంబులన్
నిత్యానంద మలంకరించినది వానిన్‌దమ్మిపూనోలె సాం
తత్యాకారముమై సిరిన్‌గొనెను సీతారామమూ ర్తీ ! ధనీ !
ప్రస్తావంబున నీవు పల్కినది శౌర్యస్ఫూర్తి భాసిల్లుచున్
వాస్తవ్యంబయి దేశ వైభవము సౌభాగ్యంబున్ బద్మనా
ళస్తుత్యంబగు సౌరభంబును మహోల్లాసంబునన్ హత్తి చి
త్తస్వస్తిన్ ప్రకటించి మించినది సీతారామమూ ర్తీ ! కవీ !
మౌల్యంబున్నతరాజ్యలక్ష్మికి మహామంత్రంబుదేశాప్తి, కౌ
క్తిల్యంబుత్త మధక్మమార్గమున, కుత్తీర్థంబు సర్వార్థ సా
కల్యస్వాభిసువర్ణ సంతతికి భాగ్య ప్రాపితామోద వా
త్సల్య శ్రీనవరత్నహారమిదె సీతారామమూర్తీ! కృతీ !

దేశసేవ

శ్రీ బాచిమంచి శ్రీహరిశాస్త్రి

ఆటంకమ్ముల వేల మాట లవి యేలా గట్టి గాన్ బేర్కొనన్
మా టంగ్టూరి ప్రకాశ సింహమునకున్ బట్టాభికిన్ నీవునున్
దీటౌవాఁడవు దేశసేవయెడ గంధేభంబుపై నెక్కుటన్
దాటన్ రాని ముదంబు మా కగును సీతారామ విద్వత్కవీ!

కవిజాతీయ జీవనానికి జీవగఱ్ఱ

శ్రీ కె.వి.సుబ్బయ్య, సంపాదకుడు, కాంగ్రెస్, సేవాదళ్

కవిత యొకగారడి. మానవులను వుత్సాహపరుసుంది; వుద్రేక పరుస్తుంది; వుషారు పుట్టిస్తుంది. నిరుత్సాహపరచగలదు. నిర్వీర్యులను జేయగలదు యేడ్పిస్తుంది, నవ్విస్తుంది. ఆనందపరవశం జేస్తుంది. దుఃఖాబ్ధిలో ముంచేస్తుంది. కవి చరిత్రకారుడు. కవి విజ్ఞానఖని. కవిత గమనము రెండు పాయలుగా యున్నది. స్వార్థాన్ని త్యజించి, పరార్థాన్ని కాంక్షించి, పీడిత ప్రజల వుద్ధరణకు, దోపిడీ సమాజ నిర్మూలనకు వుజ్జ్వలపాత్ర వహిస్తుంది ఒక పాయ. స్వార్థాపేక్షయే పరమాశయంగా పెట్టుకొని స్వీయప్రాబల్యమే జీవితలక్ష్యంగా యోచించి మానవహానికి, మారణహోమాగ్నికి దార్లు వేస్తుంది రెండవపాయ. ఒక్కమాటలో చెప్పుకోవాలంటే అభ్యుదయ అభ్యుదయ నిరోధశక్తులవలె పని జేస్తుంటాయి.. మా అభినవతిక్కన కవిత్వం అందు మొదటిపాయకు జెందినదని చెప్పుకొనుటకు గర్వించుచున్నాను. జాతీయ విప్లవంలో సామాజిక విప్లవంలో ప్రజాస్వామిక విప్లవ పోరాటాలలో కవుల కలాలు యెంతజోరుగా చిందితే విప్లవపోరాలు అంత వేగంగా పురోగమిస్తాయి. సోవియట్ రష్యా విప్లవవిజయానికి "టాల్ స్టాయ్" , "మాక్సిమ్ గోర్కీల" విప్లవరచనలే కదా కారణాలు. ఫ్రాన్సు ప్రజావిప్లవానికి కవిపుంగవులే కదా కారణం. ఐర్లండు జాతీయ విప్లవం కవీశ్వరుల విప్లవగీతికలతోనే కదా మొలకలెత్తింది. అంతవరకెందుకు. భారత జాతీయ విప్లవకవుల కలాలనుండి ప్రవహించిన విప్లవవాహిని గుండానే కదా విప్లవకారులు నడచింది. కాలప్రవాహాన్ననుసరించి కవిత నడుస్తుంది, నడవాలి. గతించిన చరిత్రలో కవిత్వం చాలా దార్లు తొక్కింది. యెవరు అధికారంలోవుంటే వారి వైపే నడచింది. రాజులను మెప్పించుట ద్వారా స్వంతలాభమును గడించుటకు కవిత్వమును అంకితం జేసినవారున్నారు.

పాలితవర్గపు ధోరణి యెలాగున్నా పాలకుల పాదసేవయే పరమావధిగా పెట్టుకొన్నారు కొందరుకవులు. అయితే అట్టికవులను ఈనాడు చెప్పుకొనేవారు లేనే లేరు. స్వార్ధాన్ని త్యజించి సమాజం కొరకు తమకలాన్ని చిలికించిన పోతనామాత్యునివంటి వారే ఈనాటికీ సంఘలో కొలువ బడుతున్నారు. అట్టి కవి పుంగవులనే ఈనాటి సమాజం కావాలంటున్నది. సంఘం కొరకు వారు సంఘంలోని ప్రజల కొరకు తమకలాన్ని సాగిపోనిస్తారు. ఈ విధంగా స్వార్ధాన్ని త్యజించిన కవికి గాని, రచయితకు గాని ప్రస్తుత సమాజంలో స్థానమున్నదా? ఒక్కొక్కప్పుడు అలాంటి వాళ్లకు పచ్చి మంచినీళ్లయినా పుడుతున్నాయా అనిపిస్తుంది. పదునెనిమిదవ శతాబ్దంలో ఆంగ్ల దేశపుకవుల, రచయితల దుర్భరావస్థకు ఈనాటి మన దేశపు వాయసగాంధ్ర, కవిపుంగవుల స్థితి తీసిపోదేమో. ఆరోజుల్లో ఒకడు ఓ కావ్యంవ్రాసినా పద్యంవ్రాసినా కథలల్లినా చదివేవాడు కనీసం వినేవాడైనా దొరికేవాడు కాదట, తాను వ్రాసిన కవితను చదివి వినిపించవలెనంటే కొంతరుసుము ముట్టజెప్పు కొని వినేవాడిని కొని తెచ్చుకొనవలెనట. అప్పులపాలై తుదకు తన చినిగిపోయిన కోటును అతుకు వేయించుకొన్నందుకుగూడ డబ్బు చెల్లింపలేక ఒక కవి దర్జీవానిచే ఖైదుచేయించ బడ్డాడట. సుప్రసిద్ధ ఆంగ్ల రచయిత శామ్యూల్ జాన్ సన్ 'పగటిపూట కాళ్లకువాడిన మేజోళ్లను రాత్రి పూట తలకు టోపీగా ధరించే వాడట.

ఈనాటి మన రచయితల విషయం ఆలోచిస్తే, ఒకడు వ్రాసినదానిని మరొకడు ఆనందించే రోజులు గతించాయి. ఒకరచనగాని, కవిత్వంగాని బాగు లేకపోతే విమర్శించడం, బాగుంటే ఈర్ష్యపడటం జరుగుతుంది. మరి యెవరికోసం వ్రాస్తున్నామో తెలియకుండా వుంది. కవిసన్మానాలంటూ నామమాత్రంగా జరుగుతున్నాయే గాని వాస్తవిక దృష్టితో విచారించినచో అవి సన్మానాలని నేనను. ఒకరికి సన్మానం జరుగుతుంటే మరొకడు ఈర్ష్య పడటం, విమర్శించడం, తద్వారా

సంకుచిత తత్వంతో సమాజమంతా లోపభూయిష్టమై పోవడమే కానవస్తున్నది. కాని సువిశాలభావాలు మచ్చునకైనా గానవచ్చుట లేదు. గౌరవ మర్యాదలు పూర్తిగా నశిస్తున్నాయి. వ్రాయసగానికి వ్యక్తిగతంగా గౌరవమర్యాదలు సంప్రాపించుట లేదు. ప్రసిద్ధ ఆంగ్ల రచయిత, జీవితచరిత్రకారుడునైన జేమ్సు బాస్వెల్ ను గురించి మెకాలే మహాశయు డేమన్నాడో చూడండి, ''బాస్వెల్ వ్రాసిన జాన్ జీవితము యెంత పేరుప్రతిష్టలు గడించి జీవితచరిత్రల 'కన్నింటికీ తలమాణిక్య మైనదో దాని రచనాకారుడైన బాస్వెల్ ను అంత నీచాతినీచంగా లోకులు చూస్తున్నారు. తుదకు ఆ గ్రంథ ప్రకాశకుడు సహితం '' రచయితను గురించి ఒక్క వాక్యమైనా వ్రాసియుండ లేదు.'' ఈనాటి మనకవుల, రచయితల స్థితిగూడా అట్లే యున్నదనుటలో సందేహం లేదు. ఎంత వున్నతకవియైతే అంత హెచ్చుమంది వ్యతిరేకులగు చున్నారు. ''కవిగానని ప్రదేశం రవి గాంచలేదు. కాని కవికి స్థానం లభించుట లేదు.'' కవి, రచయితకు, కళాకారునకు ఉన్నతస్థానం లభించనంతవరకు సమాజానికి మోక్షం లేదు. వీరు సమాజానికి విజ్ఞాన ప్రదాతలు. మానవలోకానికి జీవగఱ్ఱలు. వీరు లేని సమాజం ఊసర క్షేత్రమే, వీరు లోపించిన జాతి అజ్ఞాన కూపమే, వీరుండని దేశము సహారా యెడారియే, వీరే అజ్ఞానానికి శత్రువులు. ఆనందానికి పట్టు గొమ్మలు, వికాసానికి వెన్నెముకలు, ప్రజాస్వామిక వ్యవస్థలో వీరిదే ప్రధాన తాంబూలం. పరిణామసమాజంలో వీరే అభ్యుదయగాములు, జాతీయపోరాటాలలో విప్లవగీతిక వినిపించి విప్లవకారులను వుషారు పరిచేది వీరే. ప్రజలను వుద్రేకులను వుద్వేగులను జేసేది వీరే. అరాచక వాతావరణంలోనున్న ప్రజా సముదాయాలను చిచ్చిగొట్టి జోలపాట పాడగలిగేది వీరే. సమాజ బాధకులకు అభివృద్ధినిరోధశక్తులకు వీరి హృదయాలనుండి పొర్లుకవచ్చే విప్లవ గీతికలు యమపాశాలై తగుల్కొంటాయి. అభివృద్ధి కాముకులగు వీరి గీతాలు అమృతాన్నొలికిస్తాయి.

వీరిని పోషించుకోవడం, పెంచుకోవడం, బలపరచుకోవడం సమాజం వంతు. ముఖ్యంగా కొత్తగా స్వాతంత్ర్య పవనాల మధ్యకు ప్రవహించిన మనం వీరినెంతగానో వినియోగపరచు కోవాలి. సాధించుకొన్న స్వరాజ్యాన్ని సుస్థిరం జేసికొనుటకు, సర్వశ్రామికులను అందు సమాన భాగస్వాములుగా జేయుటకు, వీరి సహకారము యొక్క అవసరమెంతైనా గలదు. ఈ తరుణంలో మన విప్లవకవి, జాతీయకవి, ప్రజలకవి, శ్రీ సీతారామమూర్తి చౌదరిగారికి కనకాభిషేక మహోత్సవం మనమందరం జరుపుకోవటంయెంతైనా సముచితం. చౌదరిగారు రైతుబిడ్డ.అందుచే శ్రామికుల కష్టాలు ఆయనకు సుపరిచయాలు. మట్టి నుండి రత్నాలను వెలయించే రైతుల మధ్య నుండి వెలసిన ఈ రైతుకవి కలంనుండి వజ్రాలను రాల్చుతాడు. అవును. రైతులనుండి కవులు బయలు దేరాలి. కార్మికులనుండి గాయకు లుద్భవించాలి. కష్టజీవులనుండి కళోపాసకులుత్పన్నం గావాలి. శ్రామికులనుండి చిత్రకారులుద యించాలి. ఆనాడే సర్వ శ్రామిక జనావళికి విముక్తి, ఆనందం, వుత్సాహం. కవులకు ప్రజల ప్రోత్సాహం, ప్రజలకు కవుల సహకారం, ఈ రెండు అంశాలు అమలునందుంటేనే సమాజానికి అభివృద్ధి, వికాసం. ఇవి లేని సమాజం చచ్చిపోయిన దానికిందనే అంచనా వేయవలసి వస్తుంది. ఈ శుభ సమయంలో మన అభినవతిక్కన శ్రీతుమ్మల సీతారామమూర్తి గారికి నా హృదయపూర్వకాభివాదములు, నా భక్తి పూర్వక శ్రద్ధాంజలులు.★

అమరసృష్టి శ్రీ ధనేకుల బుచ్చి వేంకటకృష్ణచౌదరి

కవియు శిల్పియు నాయకగాయకులును
బ్రహ్మ సదృశులు సృష్టి ప్రపంచమందు
బ్రహ్మ సృష్టి చిరమ్ముగా బ్రదుక లేదు
సుకవిసృష్టి యమరముగా శోభ చెందు
ఆధునిక యుగధర్మమ్ము లరసి యరసి
తుమ్మల కవీశ్వరుఁడు మనోజ్ఞమ్ము గాగ
నాత్మకథ రాష్ట్రగానాది యమర సృష్టి
రచన మొనరించె దీని కాంధ్రమ్ము పొంగి
నేడు కనకాభి షేకింబు నెఱపుచుండ
సంతసమున నివాళు లొసంగుచుండ
కవికలములోని సత్తువ గాంచుచుండ
నెల్ల వారికి నుల్లమ్ము పల్లవించె

ఆవిష్కరణము
బాలసరస్వతి, శ్రీ కోట వీరాంజనేయశర్మ

జననమందినదాది నజ్ఞాతవనిని
గావ్యగానంబుసలిపి యఖండధార
బయన మొనరించు చదువరిబాటసారి
మానసము గుత్తగొను కోయిలా! నమోస్తు!
వర్ణ సంకరమైన కావ్యప్రపంచ
మందు నెన లేని ప్రతిభ వెన్నంటి నడువ
నంద అవునని మెచ్చ వర్ణాభిమాన
మమలుపఱపింపగల ప్రవక్తా ! జయోస్తు !
తెలుగు పలుకుల దీయని తేనెతేట
జాలువాఱగ గావ్యమ్ము సలిపి సతము
విశ్వకల్యాణభావంబు వెల్లి విరియు
నట్టి కవియోగి ! నీకు దీర్ఘాయురస్తు !!
నిన్ను గడుపున శారద కన్నదాది
సవతిబిడ్డల దుశ్చర్య సమసిపోయి
ప్రాఙ్మనోహరశోభతో బ్రదుకజొచ్చె
బుత్త్ర ధర్మంబు విడని నీ పూన్కి జేసి.
అక్షరజ్ఞాన మెఱుగని యట్టి వారి
కధికగారవమిచ్చి యనర్ధములను
దెచ్చికొన్నట్టి లోపము తీరిపోయె
గనకసుమముల నిన్ను నర్చనము సేయ.
ఎంతకాలంబుననుండియో హృదయమందు
గొట్టుమిట్టాడుచుండిన కోర్కి యిపుడు
మూర్తి గైకొన్నదని విని మురిసిపోవు
భావసుమమాల గళసీమ బరగు గాత !!

ప్రశంస

శ్రీ దండిపల్లి వేంకట సుబ్బశాస్త్రి

ఏ మహామహుని జాతీయతావేశమ్ము, 'రాష్ట్రగానమ్మున' రక్తి గాంచె
ఏ కవిరాజునమృతవాక్కులదొరగి, యాంధ్ర కవిత్వ మొయ్యారమందె
ఏ యున్న తాదర్శ నేపారు రుచులలో, 'నాత్మకథ' నవయుగాంక మయ్యె
ఏ ప్రతిభాశాలికృతుల నాంధ్ర క్షేత్ర, మణఁగిపోయిన శౌర్యమందుకొనియె
నతఁ 'డభినవతిక్కన' బిరుదాంచితుండు పండి తాగ్రేసరుడు, గద్యపద్యరచన
లం దమోఘసమర్థుడు లలితగుణుఁడు, స్నేహమయుఁడు తుమ్మల కవి శేఖరుండు.
పూజ్యుడైన సీతారామమూర్తికవికి, నాంధ్ర జనులు నేటికి కనకాభిషేక
ముత్సుకముతో గజారోహణోత్సవమ్ము, సలిపి భాషాభిమానమ్ము చాటినారు.
ఇది కవిలోక మెల్ల సుఖియించెడి యుత్సవ వేళ పూర్వసం
పదలను బొంది దేశమిక వర్ధిలి కావ్యకళాప్రసూనముల్
ప్రిదిలి సుగంధ బంధురత బెంపువహింప ప్రజాసమూహ మ
భ్యుదయవిధానము, దెలిసి ప్రోజ్జ్వల దాంధ్ర చరిత్ర నిల్పుతన్.

జేజే

శ్రీ యాచమనేని మాధవరావు

నీకు గనకాభి షేకంబు నెమ్మి జేయ
నున్న వా రన్న వార్తను విన్నయంత
నుబ్బె మానస మొకనాటి యొజ్జ వగుట
దుమ్మలాన్వయ వారాశితుహినకిరణ!

సందేశములు

శ్రీశ్రీశ్రీ ముక్త్యాల కుమార రాజా వారి కుమారుని జన్మదినోత్సవ సందర్భమున శ్రీ రాజావారు శ్రీ తుమ్మల సీతారామమూర్తిగారి నాహ్వానించి కవిసత్కారము గావించిరి. అప్పుడు జగ్గయ్యపేట స్థానికోన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయుడుగానున్న నాకు శ్రీ రాజావారు సన్మానసభాధ్యక్షతను కల్పించిరి. శ్రీ సీతారామమూర్తిగారికి, నాకును, తొలిపరిచయము గలిగినది యానాఁడే. అది 1944వ సంవత్సరమని జ్ఞాపకము. తదాది తిరిగి మేమిరువురము కలియవలెనని యాసించిన, నది సంభవించినది కాదు. అయినను మానసికముగా మాకిరువురకును నేదో యనుబంధము కలిగినది.

వీరి గ్రంథములను కొన్నింటిని చదివితిని. వీరాంధ్రకవితాప్రపంచమున నది తీయస్థానము నలంకరించిరనుటకు సందియము లేదు. అట్టి యీకవితల్లజుని నేను వర్ణింపబూనుట సాహసము, అయినను వారి కవితయం దొకయాకర్షణశక్తి యున్నదని మాత్రము చెప్పవలసి యున్నది. ఇట్టి శక్తికి వీరి సౌజన్య, సౌశీల్య, సౌహార్ద, నిర్మల మనఃప్రవృత్త్యాదికములే నిదానములై యున్నవి. శ్రీ చౌదరిగారు సజ్జనులు; సద్గుణరత్నసువర్ణ పేటికలయి యున్నవారు. ఇట్టి వీరికి నేడు కనకాభిషేకము గావించి విశాలాంధ్రము మురిసి ధన్యత నొందుచున్నది.

శ్రీ వెంపటి పురుషోత్తం, ఎం.ఏ.

శ్రీ సీతారామమూరిచౌదరిగారు కవి. అచ్చంగా తెలుగుకవి. అంటే చురుకైన బుద్ధి, మెత్తనిహృదయం కలవారు. కీర్తికి తగిన సరసత, విద్యకు తగిన వినయం వీరిని మహాకవిని చేశాయి. వీరి గానం రాష్ట్రవ్యాప్తి పొందింది. ఆ గీతామాధుర్యాన్ని ప్రజలు రుచి చూచి వీరిని సత్కరిస్తున్నారు చేతికి కాలికి బంగారు గొలుసులతో. వైద్యుణ్ణి కాబట్టి చెప్పుతున్నాను. అదే వీరికిప్పుడవసరం. వయోవృద్ధులలో లుప్తమైన ఓజశ్శక్తి సువర్ణ ప్రయోగం వల్ల పునః పరిపూర్ణమై వీరికి దీర్ఘ ఆయురారోగ్యములు కలిగిస్తుంది. దానివల్ల ఆంధ్ర సరస్వతికి నవీనాలంకారాలు కలుగుతాయని నా విశ్వాసం.

-శ్రీ గూడూరు నమశ్శివాయ

శ్రీ సీతారామమూర్తి చౌదరిగారి సిద్ధహస్తము ఆంధ్రలోకమునకు చిరపరిచితము. వారొనరించిన భాషాసేవ ఆంధ్రభారతికి అమూల్యాలంకారము. వారికృతులు నిద్రాణమైన జాతిని మేలుకొల్పిన అమూల్యవ్యాసభాండారములు. దీనిని గ్రహించి సత్కరించుభాగ్యము మా అప్పికట్ల వాసులకు తొలిసారిగా దక్కినది. ఈనాడు వారికి కనకాభిషేకాది మహోత్సవములు జరుపుట దేశీయులు తమ్ము దాము గౌరవించుకొనుటయే యగును. ఇట్టి మహాగౌరవమును పొందిన చౌదరిగారు నవ్యభారతములో దేశాభ్యుదయకర రసవత్ప్రబంధముల సమకూర్చి జాత్యుద్ధరణ జేయుదురుగాక.

-శ్రీ ఇనగంటి వేంకటప్పయ్య చౌదరి

సీతారామమూర్తిగారికి సన్మానమంటే, ఏ ఒక్క కవికో సన్మానం చేస్తున్నట్టుగాక ఒక ఆశయానికీ, ఒక నిజాయితీకీ ఒకధర్మానికి సన్మానం చేస్తున్నట్టుగా అనిపిస్తున్న ది. ఇందులో నాకు కూడా కొంతభాగం ముట్టుతుందేమో!

దేశంయొక్క, దేశ ప్రజల యొక్క జీవితచరిత్రల్లోని కష్టనిష్ఠురాలను తమవి చేసికొని ప్రగతి కొరకు మహాప్రస్థానం సాగిస్తున్న ఆంధకవిలోకంపట్ల ఆదరం వున్నదని ఈ సన్మానం ఋజువు చేస్తుందనుకొంటాను.

- శ్రీ ప్రయాగ

"అభినవ తిక్కన" బిరుదము నందిన శ్రీ తుమ్మల సీతారామమూర్తి చౌదరిగారి కిప్పట్టున నాంధ్రాళి యొనర్పబోవు స్వర్ణాభిషేకమహోత్సవము అత్యంత ముదావహము.

ఆంధ్రభాషాయోష కనుంగుబిడ్డడని పేర్గాంచి తజ్జనని కపారసేవ నొనరించిన యీ విద్వత్కవి పుంగవునికి జరుపు నీమహోత్సవము ఆంధ్రులకు కనులపండువ. కేవల మాంధ్రమాతనే యాంధ్ర ప్రజ యర్చించుకొనుచున్నదని నుడువుటలో నావంతయు నతిశయోక్తి లేదు. కవిగా రత్యల్ప వయసుననే ఆంధ్రగీర్వాణభాషలం దపార పాండితీ పటిమ నార్జించి తత్కవితా వాసనలచే తద్భాషాద్వయోప బృంహిత పదజాల విలసితంబులును, బహురమణీయంబులును, మృదు మధుర శైలిసంశోభితంబులును, నై చెలువొందు తెలుగుకబ్బముల పెక్కింటిని రచియించినారు.

వీరు తమ రాష్ట్రగానామృతస్రవంతిలో నాంధ్రాళి నోలలాడించి తన్మయుల నొనర్చి సరసమగు కవితల నల్లినారు.

పలు తెలంగుల వేష భాషాటోపాదిగాంభీర్య మిసుమంత యేని చెంతకు రానొల్లని యీ కర్షకలోక విద్వత్కవితల్లజుని శ్రీ వాణీ దేవత యాచంద్రార్కము రక్షించుగాత. -శ్రీ అయ్యంకి వేంకటరమణయ్య

సోదరా!

నవ్యభారతంలో అభ్యుదయపంథాలో ఉత్తమకావ్యాల్ని సృష్టించిననీకు యావదాంధ్ర ప్రజానీకం యీనాడు బ్రహ్మరథం పట్టడం, కనకాభిషేకం చేయడం నాకు గానే భావించుకుంటున్నా. ఎంచేతనంటే యిరవైయైదేళ్ళ సాహచర్యం, సౌహార్దం, ఆత్మీయతా నీకూ నాకూ పెన వేసుకుని వున్నప్పుడు సన్మానం నాకు గాక నీకా ?

- విద్వాన్, శ్రీ మల్లాది వేంకట కృష్ణయ్య

మా సీతారామమూర్తి

శ్రీ ఉప్పల నాగయ్యచౌదరి

ప్రాచీన అధునాతన శిష్టసంప్రదాయముల మేలికలయిక మా సీతారామమూర్తి. ప్రాచీనకవిత చాలవరకు అనుకరణప్రధానము. భాషాంతరీకరణ మిచట ప్రసిద్ధినందిన మార్గము. కవి పూర్వసృష్టి నుండి తనకొదవిన అనుభూతి బలమున నవ్యసృష్టి గావించి తన భావనాబలమును ప్రకటన సామర్థ్యమును సరికొత్త మార్గముల కదను తొక్కించి భాషా యోష కొక వింత విన్నాణము చేకూర్చును.

తిక్కయజ్వ విరాటోద్యోగ పర్వములలో, పోతన శ్రీకృష్ణలీలావర్ణనములో, శ్రీనాథుని హంసదౌత్యములో, పెద్దన్న వరూధినీ ప్రవర సంవాదములో కవితాకోకిలము ముద్దు ముద్దుగా
క్రోల్చినది.

ఆధునికకవులు పరువములో తమకొదవిన యొకానొక అనుభూతిని ప్రధాన వస్తువుగా స్వీకరించి తీయని తలంపులను, మాటలకందని వేదనలను

అవ్యక్తముగ రచింప బూని పాండితీ బలము చాలమినో, యౌవనోద్వేగమును చీల్చుకొని దూరముగా పోయి తనది కాదన్నట్లు ఆబ్జెక్టివ్ objective దృష్టితో తన అనుభూతిని తర్కించి చూడజాలిమి చేతనో తికమక పడుచు శిష్ట సంప్రదాయముల మీఱుచు నూతన రీతులు వెదకుచు కట్టుబాట్లకు గాసిల్లుచు బాధపడుచున్నారు. మనకు వీరిబాధలో పాలు, అనుభూతిలో మెరుగు, అవ్యక్త భావములలో ఆనందము గిలకరించి నట్లయి హృదయమునకు దగ్గరగా కాన్పించును. కాని ఈ యభిమానము యౌవనాంతములో మనలో క్రమముగా సన్నగిల్లును.

మరి ఆధునికులలో నింతకంటె విశిష్టమైన సర్వతోముఖమైన అనుభూతినందు కొన్న వారే జాతీయకవులు. జాతినలయించుచున్న బానిస తనమును భావనచేసికొని impersonal దృష్టి నలవరచుకొని జాతీయ జీవనములో మునిగి జాతీయనాయకులుగ, సంఘమున కగ్ర నాయకులుగ, సంస్కర్తలుగ, దాస్యపరాభూతమైన జాతికి చేదోడు వాదోడుగ నిల్చి నూతన సృష్టి చేసి జాతి కుజ్జీవనము కల్పించిన వీరి కవితాసంపద మనహృదయముల నాకర్షించి శాశ్వత స్థాయి నందుకొన్నది.

అభినవ తిక్కన ఆధునికులలో ఈ రెండవ తెగకు చెందినవాడు. ఇతడు ప్రాచీనులలో కవిత్రయమును దలపించును. ఇతని 'ఆత్మకథ' తిక్కన రీతుల నలవరుచుకొని ప్రాచీన ప్రపంచమున నూతనచరిత నుత్పన్నము గావించినది. రాష్ట్రగానము ఆంధ్ర జాతీయ జీవనమున విశిష్టస్థానము నందినది. భావకవులపోకడలు, బాధలు, అవ్యక్తభావములు ఇతనికి లేవు. తానొక ప్రవక్తగా నుండి ఎంతెంత క్లిష్ట సమస్యలనైనను కరతలామలకముగా వివరింపగల్గిన యోగి పుంగవుడు మన తుమ్మలకవి. ఆంధ్రులకు బహునాయకత్వమన్న అపవాదును ఆకళింపు చేసికొని అందులకు వీరిచ్చిన సమాధానమే యిందులకు తార్కాణము, రాష్ట్రసిద్ధికి రాయబారములు లాభింపవన్న ' పెద్ద కాపు ' లోని యితని యావేదన

మనకిపుడు వ్యక్తమగుట లేదా ? ఆంధ్రుల మగటిమి యీసవాలును స్వీకరించి అఖిలభారత కాంగ్రెసు పీఠము నెక్కలేదా ?

మన జాతిపితమగణమును విన్నపుడు ఈకవి రచించిన 'అమరజ్యోతి' భారత జాతి హృదయవీధుల వెలిగించిన అమరజ్యోతి, ఏది చెప్పదలచి, చెప్పుట చేతగాక మన మేద్చుచుందుమో అది కవి కదుసున్నితముగా శ్రవణ పేయముగా గానము చేయును గదా? భారతజాతి పితృవిహీనయై దిక్కుమాలి యేడ్చినది. చెనటియై మన యాశాజ్యోతి నార్పిన కిరాతుని వే విధముల నిరసించినది. నేల నాలుచెఱగుల నీమహామహుని మరణము వలన గలిగిన పరితాపమును గని గర్శించినది. కడకు ఆత్మోద్దీపనము నంది పోవుట యెచ్చిది, మనగాంధి మనలోనే కలడన్న వేదాంతార్థము స్మరించి అతడు వెల్లించిన అహింసా జ్యోతి నాదర్శముగా గొని శాంతించినది. జాతి జీవనమును సర్వతోముఖముగ తమ కవితలో ప్రతిబింబింపజేయువారు గదా జాతీయ కవులు, జాతి నలయించుచు మాటలకందక అవ్యక్తము లైన భావములను రమణీయముగా గానము చేసి జాతికి సంతృప్తి గూర్చి కర్తవ్యము చూపువారు కాక జాతీయ కవులన్న వేరే కలరా ? అరువదేండ్ల నుండి ఆంధ్రుల నలయించుచు ఆంధజాతి యేకైక లక్ష్యమైన రాష్ట్రవాంఛ నింత చక్కగా గానముచేసి ఆంద్రోద్యమమున కొక వింత విన్నాణము చేకూర్చుటయే గాక రాష్ట్ర నాయకుల కదుగదుగున నూతనాదేశముల నొసంగుచు మార్గదర్శియైన మన సీతారామమూర్తి ఋణము నాంధ్రజాతి యెన్నడీగ గలదని యెంతయో తపించి సాధించిన యీచిఱుత సన్మానమును జూచి సంతసింపని వారెవ్వరుందురు?

శతమానమ్.

శ్రీ ఏలేశ్వరాచార్యులు

చక్కదనాల చుక్కగ పసందుగ గందొగ మీటి సాటికై
తక్కల భర్మహర్మ్యముల యందున నిత్యవిహారమూని పే
రెక్కిన యట్టి మిదు కవనేందిర, నేడిటు పట్టపేన్గుపై
నెక్కు నటన్న నా చెలువమెంతొ ముదావహమయ్యెనయ్య; ఆ
తిక్కన నానుడుల్ - సొబగుతీరులు - సౌరులు - మీదుసొత్తుగా
దక్కిన నాటనుండియునుఁ దాము రచించిన ఖండకావ్యముల్
మొక్కలు వోని ధైర్యము - సముజ్జ్వల తేజము - తుష్టి పుష్టియుఃన్
జిక్కనిరక్తమున్ దెనుగుసీమను బారిచి తేటిచెన్; యశో
భాక్కులునైన యాంధ్రుల ప్రభావ వికాస విలాస హేల మీ
యక్కరబంతిలో, నిమిడి యక్షరమాయెను, కైతకన్నె మీ
యక్కున జగ్గునిగ్గు లెనయంగ విపంచిక మీటి మేటియై
'కొక్కురోకో' యటంచు బుధకోటిని మేల్కొనఁ జేసి సాహితిన్
మక్కువ గల్గు సజ్జనుల మాన్యత దా గనకాభిషిక్తయై
దిక్కులకెక్కె మీయశ ముదీర్ణముగా బదివేలకాలముల్
జక్కన శిల్పమట్ల - కవిచంద్రుల కావ్యవిభూతిభాతి - సొం
పెక్కును గాత ! మిమ్ము విజయేందిర కోరెడిగాత ! మీకు కు
మ్మక్కుగ విశ్వకర్మ 'శతమాన' మటం చనుగాత ! ధీమణీ !

ఉపహారము

శ్రీ బృందావనం రంగాచార్య

కమ్మనికైతలో మధురగానమొనర్చు కవీంద్రకోటిలో
కమ్మన నెందఱుండినను గాని - విశేషము చెప్పలేము మా
"తుమ్మల" యన్న నాంధ్రుల కదోవిధమైన ప్రపత్తి, రాష్ట్రగా
నమ్ములు దిగ్విదిక్కులను నాదమొనర్చిన నాటినుండియున్.

రాష్ట్ర గాయకుడు - సిద్ధాంతి శ్రీ అయినంపూడి ప్రసాదరావుచౌదరి
దానధర్మ త్యాగధని గోగినేని శ్రీ, వేంకటసుబ్బయ్య విబుధు నెదుట
జగ మెఱింగినదాత చల్లపల్ల్యధినేత, శివరామభూపతి శ్రేష్ఠునెదుట
ఆంధ్రాంగ్ల విద్యల నరసి శోధించిన, కట్టమంచి రెడ్డి శేఖరుని యెదుట
ఆంధ్రదేశంబునం దసమానపండిత, బిరుదు లందిన సత్కవీశు లెదుట
గండపెండేర కాంచన, కంకణాది శుభదచిహ్నాలతో బుధస్తుతుల తోడ
నొదవె గనకాభిషేకమహోత్సవంబు, రాష్ట్రగాయకునకు సీతరామకవికి.

సారవాక్కు   శ్రీ ముదిగొండ వీరభద్రమూర్తి

శీతారామాయిత జూ
టీతరళ స్వర్ధునీఘటి కనకాంభో
జాత మహనీయతేజము
సీతారామయకు నీకు సిరుల నొసగుతన్.

తిక్కన పోకడలం గల
చక్కని కవులందు నీవు జాణ వవుర ! స
మ్యక్కు సుమిత వనమధురిమ
చిక్కణకవితాభిరామ ! సీతారామా!

అన్నా తుమ్మలవంశవారినిధిచంద్రా ! నీకు బ్రహ్మయువౌ
పున్నెం బెన్ని తరాలనుండి పొదుపై పొందార దోగించెనో
ని న్నీనాడు; తెలుంగుగడ్డపయి నెన్నేండ్లయ్యెనో "యెక్కుతి
క్కన్నా ! యేన్గు" నటంచు బల్కిసుకవుల్, కై సేసె నే డాసిరుల్.

తిక్కన యే మెఱుంగు నను ధీవరు లుందురు నే నెఱుంగుదున్
దిక్కనయే మెఱుం గనెడి ధీనిధి వెంతయు సంతసించితిన్
దిక్కన తీర్చినట్లు నుడి దీర్చుట మాటలు కాదు గాని నీ
కొక్కని కబ్బె జాలవఱకుజ్జ్వల శక్తి గదయ్య సత్కవీ !

ఆత్మకథను వ్రాయ నవసర మగుచుండె
రాష్ట్రగాన మయ్యె రాజకీర్తి
కోరకున్న ఫలము గారవించుచునుండు
సారవాక్కులయిన సత్కవులను.

ఆశీర్వాదము

వైయాకరణభూషణ, బాలసరస్వతి, శ్రీ తాడేపల్లి సాంబమూర్తిశాస్త్రి

"శ్రీరాస్తాం ధీరాస్తాం
భూరాస్తా" మన్న సిద్ధములు తుమ్మల సీ
తారామమూర్తి చౌదరి !
యౌరా! "శతవర్ష మాయురాస్తాం భవతే"
కమ్మని పానకమ్ము వడిగట్టిన తేనియ సత్కవీశ్వరుల్
తుమ్మెదలై భ్రమించు నొకతోట యదేమది? 'రాష్ట్రగాన' మీ
తుమ్మల కమ్మ సత్కవి విధుండు కలమ్మును జేతదూయగా
నమ్మ సరస్వతమ్మ తనయందెల యందము గ్రుమ్మరించెఁగా !
శాంతికి బుట్టినిల్లు, కవిచాతురి మెట్టిన యిల్లు, కల్ల యొ
క్కింతయు గల్ల, భేషజ మదేమియు నాస్తి, సదాస్తికుండు, నా
శాంతవిశాలనిర్మలయశస్సుషమా శరదించుచంద్రికా
కాంతచరిత్రు డందు గలకాల మిదంవిధ గౌరవమ్ములన్.
దగ్గరవాడు మాకు, గవితా నవతా నవసృష్టికర్తయున్
దగ్గనివాడు లక్షణమునన్ గృతహస్తుడు, సద్విమర్శలన్
నెగ్గినవాడు కాకవి వినిగ్రహమందు, గవిత్వమందునన్
నిగ్గును దీయు, గక్కురితి నేరడు, మీరడు హద్దుపద్దులన్.
దీర్ఘాయురస్తు, భవతే, నవసత్కవిత్వ
సిద్ధాన్తమూల గురుణాం గురవే, కవీశే,
పూర్ణాయురస్తు భవతే శతవర్ష పూర్ణం
సంపూర్ణ సద్గుణగణ ప్రమితోత్సవాయ.

సఖా!

శ్రీ శేషాద్రిరమణ కవులు

కవితా సత్కళ సార్ధకంబుగనె నీ కావ్యేఘసంపత్తిచే
గవిలోకంబు నుతించె నీ సరళ వాక్కావ్య ప్రతానైక వై
భవముం జూచి త్రిలింగ దేశ లలిత ప్రాచీన విద్వత్కవి
స్తవనీయంబు భవత్కవిత్వ మది సీతారామమూర్తీ! సఖా!
ధారాశుద్ధి యుదారభావములు, గాధాకల్పన ప్రౌఢి నిం
డార వ్రాసిన గాంధిజీవితము లోనన్ దెగ్గ తెన్నుల్ చమ
త్కారమ్ముల్ ననుc దన్పె ఆంధ్రకవితాతత్త్వంబు నీసొమ్ము నీ
ధారాళంబగు, శయ్య అద్భుతము సీతారామమూర్తీ ! సఖా !
కలము బట్టితివేని కవితా విలాసినీ, శృంగారగరిమ చిత్రింపగలవు
పాఠముల్ చెప్పిన ప్రత్యాంధ్ర విద్యార్థి,హృదయ రాజ్యంబుల నేలగలవు
వ్రాయబూనిన రసవత్పద్య గద్యాదికృతులతో వాణి నర్చింప గలవు
తీర్ప నెంచిన భారతీ దివ్యతరమూర్తి, తీరుతీయములుగా దిద్దగలవు
అన్నిట సమర్ధుడవు కూర్పు నందు దిక్క
యజ్వతో సరియంచు నిన్నాంధ్ర కవులు
బేర్కొనుచు నున్న వారు నీ పెంపు వేఱె
పొగడగా నేల ఓ రామమూర్తి సుకవి !
కవిసన్మాన మహోత్సవంబునకు గాన్కల్ పంపి స్వర్ణాభిషే
కవిధిన్ బూజలొనర్చు భూపతులకున్ క్షామంబు వాటిల్లినన్
గవిరాజేంద్రుని గౌరవింపగ బ్రజల్ గైకొన్న భారంబు సం
స్తవనీయంబుగ దోచె నామదికి సీతారామమూర్తీ ! సఖా!

కవితాప్రపంచ భాస్కరుడైన రామలిం,గారెడ్డి యధ్యక్షుడై రహింప
ప్రజలు సారస్వత పరిణతబుద్ధులై స్వర్ణాభిషేకంబు సంతరింప
పండిత ప్రవరులు పద్య సుమంబు ల,ర్పించుచు నాశీర్వదించుచుండ
కవితారసజ్ఞులు గజమహోత్సవములో, నానందమున వెంట నరుగు దేర

తుమ్మలాన్వయ వార్ధివిధుండు సుకవి
జనవిధేయుండు సార సారస్వత ప్ర
సన్న హృదయుండు నేటి యుత్సవమునందు
వాఙ్మయోపాసకుల కుత్సవంబు గూర్చె.
నీకు జిరాయువు గృతు లనేకములన్ రచియించు నేర్పు సు
శ్రీకకవిత్వ వైభవము చేకురజేసి శతాయు విచ్చి వా
ణీకమలాసనుల్ తనిసి నిర్భర సౌఖ్యముఁ గూర్తు గాత; నీ
ప్రాకట కావ్యజాలములు భాషకు వన్నియఁ గూర్చుతన్ సఖా!

ప్రశంస

శ్రీ జి.జోసపుకవి

నీరచితాంధ్ర కావ్య రమణీయ హిరణ్మయ సౌధసీమ నిం
పారగ గీర్తికాంత యనయంబు చరించుచు జూపు మేటి సిం
గారపుభావ చిత్రముల కాంతి పరంపరలందు జిక్కు కొ
న్నారు కవీశులెల్లరు మనంబులు తన్మయమందిపోవగన్

విజయోత్సవము

శ్రీ వాసిరెడ్డి వేంకటసుబ్బయ్య

ప్రాయః ప్రస్తుతి ప్రాతముల్ రుచిరముల్ ప్రాచాం కవీనాం కృతి
చ్ఛాయా విభ్రమ గర్భితమ్ములు శ్రవస్సౌగమ్య సంభాషణ
వ్యాయామమ్ములు వర్ధిలున్ గృతకవిద్యాపాండితీభావనా
వైయర్థ్య ప్రతిపాదకమ్ములు భవ ద్వ్యాహార వైయాత్యముల్
అధునాతనాంధ్రకవితా
విధాన నిర్మాణచణకవిత్వమయోక్తి
ప్రథముడు సభాధిపతియై
కథించుచున్నాడికేమి కావలె నీకున్.
నన్నయ్యమాటల కున్న గౌరవ మాంధ్ర, పఠితల కెల్ల సంప్రాప్త మయ్యె
దెలుగు భారతములో దిక్కన్న నడచిన బాట, లాంధ్రుల రాచబాటలయ్యె
నెఱ్ఱన్న వాక్కలాహేవాకము త్రిలిఙ్గ జాతిపిల్లల కుగ్గుపోత లయ్యె
సూరన్న పలికెడు చొప్పు తెలుగునాటి, బాలబాలికల కభ్యాసమయ్యె
దెలుగు గవితపై మమత సంధిల్లె నంధ్ర
విశ్వవిద్యాలయములోని పిన్నవయసు
బాలకుల కెల్ల నెవ్వని పలుకుబడి న
తండె నిను బిరుదాడ నెవ్వండు వలయు.
పొగడుట పొగడించు కొనుట
యు గుణమ్ములు నేటి తెలుగు యుగము కవుల కీ
తెగులు మొదలంట నూచగ
దెగటార్చుట నీగుణమ్ము ధీరవిచారా !

సకల భారతవర్ష సమవాయి శ్రుతిగల్పి, రాగమాలాపించు రాష్ట్రగీతి
భారతీయకలాప్రపంచమ్మునెల్ల సుభిక్షమ్ముగా జేయు పెద్దకాపు
మీ దౌచు నెల్లకు మిగిలి ధర్మజ్యోతి, వెలిగించు భారతీయుల మనమ్ము
తెలుగుబిడ్డల త్యాగ విలసనశ్రీల వి, శ్వాదర్శమైన ఆత్మార్పణమ్ము.
గాంధిజీ ఆత్మకథ పద్యకవితనడపి
కవుల రచనా చమత్కృతి గనుపఱచితి
వీదృశంబగు సన్మాన మిపుడు పడయు
చుంటి నీ జనియే సార్థమో కవీంద్ర !
అతుకుల బొంతలల్లి కవితాంగనకున్ సరిక్రొత్త దుస్తు తె
చ్చితిమని వాడవాడకడ జేతులుద్రిప్పి యుపన్యసించుచున్
బ్రతికెడు శాంబరీకవుల బందరు వెల్లను దూరు పెత్తి క్రొ
త్త తెలుఁగుఁ గైతగాంధ్ర బిరుదమ్ములు డుల్చితివయ్య సత్కవీ !

సుకవుల కెద్దడి కాకవు
లకును సుభిక్షమగు నీ పొలమ్మున ద్వాదృ
క్సుకవులగన్న తెలుగుమా
త కడుపు చల్లనగు గావుతను నేడు మొదల్
కనకపు గండ పెండెరము కాలికిడం జలపల్లినేత వ
చ్చుననగ బెద్దనార్యకవిశూరుని పల్లకి బట్టి పెండెర
మ్ము నొసంగి యూళు లిచ్చిన ప్రభుం డల రాయలు జ్ఞప్తివచ్చెడున్
మనకవులుం గలాచతురిమం బ్రకటింతు రటంచు నెంచెదన్
కాకవి మూఢగుండెలకు గంపన మాంధ్రకవిత్వశక్తి కిం
డీక కులమ్ము కీరితికి డిండిమ మాప్తరసాయనమ్మునై

నీ కనకాభిషేకము మనీషులకున్ హృదయప్రియమ్ముగా
నో కవిముఖ్య ! నీకవిత కుజ్జ్వల దీప్తి ఘటించు గావుతన్.

త్రయి
కరుణశ్రీ

'కమ్మదనమ్ము మూర్తి గనగా, నవజాగృతి తోరణాలతో
గుమ్మయిపోయెరా తెలుగు గుమ్మములన్ని తదీయ రాష్ట్రగా
నమ్ము న - ఆంధ్రమాతచరణమ్ముల కర్చలొనర్చినాడు మా
'తుమ్మల' నేడు క్రొన్ననల దోయిలి కూతురు సేకరింపగన్.
నీ కనకాభిషేక మహనీయ మహోత్సవ మాంధ్ర సాహితీ
శ్రీకొక వింత శోభ విరచించెను లెమ్ము; భవద్యశోలతల్
ప్రాకును లెమ్ము స్వేచ్ఛమెయి భారతమెల్ల; రసప్రసన్నముల్
నీ కవితా ప్రసూనములు నింపును లెమ్ము సుగంధమాధురుల్.
నన్నయభట్టు ''శబ్దనటనమ్ములు'' తిక్కనయజ్వ ''యర్థ సం
పన్నత'' శంభుదాసుని ''ప్రబంధవిభూతి'' సమైక్యభావముం
గన్నవి నీయెడన్ తెలుగుగడ్డ భవత్కవితా త్రివేణిచే
కన్నులవిందుగా వెలయుగావుత పచ్చని పైరుపంటలన్.

మహాకవి
శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మ

అభినవతిక్కన బిరుదాంచితులును, మహాకవులును, బహుప్రబంధ నిర్మాతలును అయిన శ్రీ తుమ్మల సీతారామమూర్తి చౌదరిగారు తెలుగు సాహిత్యమునకు చేసిన సేవ అనల్పమయినది. వారి రచనలను జదివి యానందమునొందని యాంధ్రుండడని నా నమ్మకము. దేశాభిమానము నుద్దీపింపజేయు వారి పద్యరత్నములను తెలుగువారెన్నటికి మరచి పోలేరు. చదివిన కొలది రుచులు గొల్పి నోరూరింప జేయు రసగుళికలు వారి కావ్యఫలములు. అటువంటి మహాకవికి ఉచిత రీతిని సన్మానగౌరవము జరుగుట నా కధికానందము గలిగించినది. శ్రీ చౌదరిగారు ఆంధ్ర సాహిత్యమున కింకను

అధికమైన సేవ చేసి యశస్సు గడింప వలయునని, పరమేశ్వరుడు వారికి దీర్ఘాయురారోగ్యములు ప్రసాదింపవలయునని కోరుచున్నాను.

సఖా!

శ్రీరాయప్రోలు సుబ్బారావు

పొలముల్ పచ్చల సెజ్జలై ఋతునయంబుల్ సూప రాగిల్లి తా
రలు విచ్చేసెడి సంభమశ్రమతను ప్రస్వేద ముక్తామణుల్
కలయంపుల్ వడ నీ సుఖానుశయ సంక్రాంతి ప్రభాతంబులన్
తలిరాకొత్తుత నీమహాకవిత సీతారామ వాచాప్రతీ !

పృధివీకుశలాధ్వరమయ
మధురసగంధములు సస్య మంజరులను సం
గ్రధితమయినగతి సహజరు
చి ధామమాయె భవదమృతశీధూక్తి సఖా !

కవితాభినందనము

శ్రీ వింజమూరి శివరామారావు

ఎపుడొగాని - ఆమని వచ్చినపుడెగాని
వినబడదు కోయిల యెలుంగు; తెనుగునాట
నెడ తెగక మ్రోగు కవిగళమ్మిపుడు అందు
మురువు లొలుకు సీతారామమూర్తి పలుకు.
విమలాంధ్రోన్నత సన్ను తాశయము లే వేమారు భావార్థక
బ్దమనోజ్ఞమ్ముగ పద్యరీతి రసవత్కావ్యమ్ముగా రాష్ట్రగా
నము చేయున్ వినిపించు సర్వజన సన్మాన్యమ్ము బాపూచరి
త్రము ఈ సత్కవిదేశభక్తి నిజధర్మాసక్తి సామాన్యమా!
కవి సదా ద్రష్టయై, పురోగామియగుచు
విశ్వమునకు శ్రేయస్సు కల్పింపవలయు
కవిని ప్రజలే యధారీతి గౌరవింప
వలయు; ఆమాట సరియంచు తెలిసె నిపుడు.

శారదాచరణ మంజీరనాదము లుండ నడుగుదమ్మికి బైడియందె లేల
స్ఫిక ప్రభాసుమసౌకుమార్యము లుండనెమ్మేనికిన్ రాంకవమ్ము లేల
రసరాజ్యపట్టగౌరవమున్న మౌళికి నే లయా బంగారుపూలజల్లు
నెయ్యమార నీ నాలుక వెలవుకొన్న
భాగ్యశాలిని కివి విడంబనలె యైన
ఆంధ్ర రసికలోకము ప్రియమార నెరపు
నర్హ సత్కృతి సుకవీంద్ర ! అందికొనుము.
రమణీయార్థ సర స్వతీవదన నిర్యాతావ్యయామోదమున్
స్వమహారాజ్యరమోపగూహనముకన్న మిన్న మన్నించు నాం
ధ్ర మహీపాలుర నాటిదౌ రసిక తాధన్యత్వమా ! నీకు భ
ద్రమగున్, గావ్యకళా విలాస రతులారా ! మీకు గల్యాణమౌ.

రసరాజ్య మహాభిషేకము. - శ్రీ కాటూరి వేంకటేశ్వరరావు

పట్టు పేనుంగుపై, పైడిపల్లకులపై నూరేగితిని బారుబూరుమనుచు
దీనారటంకాల దీర్ఘమ్ము లాడి, రాజసపర్యలకు నంఘ్రిసాచినాడ
చక్రవర్తుల సహాసన ముండి, సహపంక్తి వడసితి భోజన భాజనముల
గురుడును బ్రగడనై, కూర్చుచుట్టమ్మునై భూపులతోనిచ్చి పుచ్చుకొటిం
నిగ్రహానుగ్రహములకు నేర్చి, కార్య
ఖడ్గముల కేన చాలిన కవిని; నేడు
కడుపు గక్కురితికి బలైబడులు, నచ్చు
కూటములు నెక్కితినటంచు గుతిలపడకు
నీవు పేదవైన, నీ కైత పేద గా
దన్న ! ఆభిజాత్యమున్న సాధ్వి;
ఆపె పేదయైన, అన్యభోగములు నీ
కెన్ని యున్న నీ వకించనుడవె
మకుటము లేల, అశ్వములు మత్తకరుల్ శిబికాదు లేల, సా
యక నివహమ్ము లేల, చతురంగబలమ్ములు నేల నీకు ? మా
ధుకణమృదూక్తి సంపదలలో హృదయమ్ముల నేలు లోక శా
సకుడవు నీ వసించు చిచాపకు నోపవు సింహపీఠముల్
అదె ! పరతంత్రము క్తమగు నాంధ్రమహిన్ నవజీవనోత్సవా
భ్యుదితులు నీ ప్రజల్ వికసితోత్పలమాలిక లూని, నల్లడల్
వెదకుచు నేగుదెంచిరి కవీ ! రసరాజ్యమహాభిషేక సం
పద నిను బూన్పగా; వరణమాల్యము మౌళి బరి గ్రహింపుమా.
గువకుత్తుక యౌచు గుండియల్ కరగించె నన్న! త్వద్రచిత మాత్మార్పణమ్ము
కనక తప్పెటలు, శంఖములు, కాహళ లౌచు నీ రాష్ట్రగానమ్ము నింగిముట్టె
అపురూపమైన మీ యయ్యధర్మచరిత్ర వెలిగించితివి కలివిహృతి యడగ
పరిగయేరిన నీదుపంట కుత్తుకబిం రసికుల కమృతసత్రమ్ము వెట్టె
ఆత్మకథ' స్పె' తిక్కన వైతి, నేడు ★పెద్దనకు నుద్ది వైతి, నీ పెంపటుండ
సుకవితాప్రియంభావుక, మకుటిలమ్ము
నాంధ్రజనుల రాసిక్యమ్ము నభినుతింతు.
గమనముల్ మదమంధరములు, సాజము లామె కేనుగు నెక్కి యూరేగ నేల